

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి



సోమవారం | 29-1-2018 | పేజీలు: 16 + 20 | వెల: రూ.5.00 | సంపుటి: 14 సంచిక: 198 | శ్రీహేవళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, మాఘమాసం, శుక్లపక్షం; తిథి: త్రయోదశి రా. 1.53 తదుపరి చతుర్దశి; నక్షత్రం: ఆర్ద్ర రా. 11.04 తదుపరి పునర్వసు; వర్జ్యం: ఉ. 9.11-10.36; దుర్ముహూర్తం: మ. 12.51-1.36; అమృతఘడియలు: మ. 2.10-3.35; రాహుకాలం: ఉ. 7.30-9.00; సూర్యోదయం: 6.52; సూర్యాస్తమయం: 6.06 | నిజామాబాద్ సిటీ*

Nizamabad | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Kakinada | Khammam | Kadapa | Ongole | Nallagonda | Bangalore and Chennai

బాహుబలి 'మాల్'

18 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంతో హైదరాబాద్‌లో లులూ కంపెనీ షాపింగ్ మాల్

ఆహారం, పండ్లు, కూరగాయల ప్రాసెసింగ్ యూనిట్లు

2500 కోట్ల పెట్టుబడులు.. 6000 మందికి ఉపాధి

మూడు నెలల్లో సీఎం కేసీఆర్ శంకుస్థాపన

1000 కోట్ల పెట్టుబడి పెట్టనున్న బీఆర్ శెట్టి గ్రూప్

హైదరాబాద్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి మెగా షాపింగ్ మాల్, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్, వైద్య పరికరాల తయారీ యూనిట్, ఫార్మా యూనిట్ రానున్నాయి. సుమారు రూ.3500 కోట్లతో ఆరు వేల మందికి ఉపాధి లభించనుంది. ఈ మేరకు నాలుగు ఒప్పందాలపై పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ సమక్షంలో సంతకాలు జరిగాయి. దావోస్ వెళ్లిన మంత్రి కేటీఆర్ బృందం తిరుగు ప్రయాణంలో ఆదివారం యూఏఈ చేరుకుంది. అక్కడ రాష్ట్ర ప్రభుత్వం తరఫున పరిశ్రమలు, ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్ ఈ ఒప్పందాలపై సంతకాలు చేశారు. వాటిలో ఒకటి డాక్టర్ బీఆర్ శెట్టి గ్రూపుతో కుదుర్చుకున్న ఒప్పందం. దీని ప్రకారం, ఈ గ్రూపు రాబోయే మూడు నుంచి ఐదేళ్లలో 1000 కోట్ల పెట్టుబడులు పెట్టనుంది. 20 ఎకరాల్లో ఫార్మాస్యూటికల్

మిగతా 5వ పేజీలో...



యూఏఈ పర్యటనలో మంత్రి కేటీఆర్ సమక్షంలో లులూ కంపెనీతో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకుంటున్న ఐటీ శాఖ అధికారులు



వరంగల్ రూరల్ జిల్లా గీసుకొండలో నిర్వహించిన సభలో మాట్లాడుతున్న టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

మహా కూటమి?

బీజేపీ, టీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా ఫ్రంట్

కాంగ్రెస్ పార్టీకి కూటమి నాయకత్వం

టీడీపీ, టీజేఏసీలను కలుపుకొందాం

లౌకిక వామపక్ష విశాల వేదిక యోచన

ఇతర పార్టీలే ముందు ప్రతిపాదించాలి

చొరవ తీసుకోరాదని కాంగ్రెస్ భావన

హైదరాబాద్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో వచ్చే ఎన్నికల నాటికి మహాకూటమి ఏర్పాటు కానుందా! కేంద్ర, రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న బీజేపీ, టీఆర్ఎస్‌లను గద్దె దించడమే లక్ష్యంగా ప్రతిపక్షాలన్నీ ఏకతాటిపైకి రానున్నాయా! ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ కూడా ఇందుకు సిద్ధంగానే ఉందా! అంటే.. రాష్ట్రంలో చోటుచేసుకుంటున్న పరిణామాలను బట్టి చూస్తే ఇది నిజమేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కాంగ్రెస్ అగ్రభాగాన ఉండేలా రాష్ట్రంలో మహాకూటమి ఏర్పాటు కానున్నట్లు, ఈ కూటమిలో సీపీఐ, సీపీఎం, టీడీపీ-టీఎస్ పార్టీలతోపాటు టీజేఏసీని కూడా భాగస్వాములను చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. టీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా కమ్యూనిస్టులతోపాటు కలిసివచ్చే పార్టీలతో పనిచేసేందుకు కాంగ్రెస్ కూడా సుముఖంగా ఉన్నట్లు ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అయితే కూటమి ప్రతిపాదనను తమకు తాముగా తీసుకురావద్దని, ఇతర పార్టీల నుంచి ఆ ప్రతిపాదన

మిగతా 6వ పేజీలో...

పోలీసులకు ఉపగ్రహ నేత్రం

అడవిలో ఎక్కడున్నా పట్టేస్తారు!

మావోయిస్టులపై అంతరిక్ష నిఘా

విద్రోహ శక్తులు, గంజాయి సాగుపైనా


ఇస్రోతో పోలీసు శాఖ ఒప్పందం

డ్రోన్ల కంటే తేలికైన పద్ధతని అంచనా



హైదరాబాద్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): అడవుల్లో మావోయిస్టుల కదలికలను తెలుసుకునేందుకు తెలంగాణ పోలీసులు భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) సేవలను వినియోగించుకోనున్నారు. మావోయిస్టుల కదలికలనే కాదు.. సంఘ విద్రోహ శక్తులు, గంజాయి వనాల వంటి వాటిని కూడా ఉపగ్రహాల సాయంతో గుర్తించనున్నారు! ఈ విషయంలో ఇస్రోతో జరిపిన ప్రాథమిక చర్చల్లో సానుకూల నిర్ణయం వెలువడినట్లు తెలిసింది. సరిహద్దు రాష్ట్రాల్లో ఇటీవలి కాలంలో మావోయిస్టు కదలికలు ఎక్కువగా ఉంటున్నాయి. పొరుగు రాష్ట్రాల్లో ఎలాంటి ఘటన జరిగినా రాష్ట్ర పోలీసులు అప్రమత్తమవ్వాల్సి వస్తోంది. రాష్ట్రంలో

మిగతా 5వ పేజీలో...



వయసు 36 టైటిల్ 20

యువ ఆటగాళ్లు ఒకటి, రెండు గ్రాండ్‌స్లామ్ టైటిళ్లకే పరిమితమవుతున్న వేళ.. 36 ఏళ్ల స్విస్ దిగ్గజం రోజర్ ఫెడరర్ గ్రాండ్‌స్లామ్‌ల దాహం తీరడంలేదు. మెల్‌బోర్న్ పార్క్‌లో మరోసారి జయకేతనం ఎగురవేసి కెరీర్‌లో 20వ గ్రాండ్‌స్లామ్ కిరీటాన్ని సగర్వంగా అందుకున్నాడు. ఫైనల్లో సిలిచ్‌ను చిత్తుచేసిన ఫెడెక్స్ ఓపెన్ ఎరాలో గ్రాండ్‌స్లామ్ నెగ్గిన రెండో అత్యధిక వయసున్న క్రీడాకారుడిగా నిలిచాడు.

15

అమెరికాలో.. సిద్దిపేట టెకీ

అనుమానాస్పద మృతి

2

మైనస్ 28 డిగ్రీల చలిలో తెలుగు విద్యార్థుల పాట్లు

గడ్డకట్టిన 'కిర్గిస్తాన్'

16

మళ్లీ నో కేష్

చేతులెత్తేస్తున్న బ్యాంకులు

నగదు నిల్వ చేసుకుంటున్న వ్యాపార వర్గాలు, ఆర్థిక సంస్థలు

తరుగుతున్న ఫిక్సెడ్ డిపాజిట్లు.. రియల్టీ వైపు చూస్తున్న జనం

పదిహేను నెలల కిందట నెలకొన్న దుర్భర పరిస్థితులు మళ్ళీ ఎదురవుతున్నాయి... బ్యాంకుల్లో నగదు కొరత సామాన్య ప్రజానీకాన్ని తీవ్ర ఇబ్బందుల్లోకి నెడుతోంది.. ఏటీఎంలలో నో కేష్ బోర్డులు వేలాడుతున్నాయి. చిన్న చిన్న లావాదేవీలైతే పరవాలేదు.. కానీ భారీ మొత్తంలో- కేష్ తీసుకోవాలని భావిస్తే -డబ్బు లేదంటూ బ్యాంకులు చేతులెత్తేస్తున్నాయి.



హైదరాబాద్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ కాప్రాలో చిరు వ్యాపారం నిర్వహిస్తున్న కేవీ రమేష్‌కు అదే ప్రాంతంలోని ఒక ప్రభుత్వ రంగ బ్యాంకులో ఖాతా ఉంది. నాలుగు లక్షల రూపాయల చెక్కు తీసుకొని నగదు కోసం బ్యాంకుకు వెళ్లిన రమేష్‌కు అనూహ్యమైన షాక్. నాలుగు లక్షల రూపాయల నగదు అడ్జెస్ట్ చేయడం కష్టమని

మిగతా 5వ పేజీలో...



బడ్జెట్ సమావేశాలు ఆరంభం కానున్న సందర్భంగా ఆదివారం పార్లమెంట్‌హౌస్‌లో జరిగిన అఖిలపక్ష భేటీలో సరదాగా ముచ్చటిస్తున్న ప్రధాని మోదీ, హోంమంత్రి రాజ్‌నాథ్, ఆర్థిక మంత్రి జైట్లీ, పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి అనంత్‌కుమార్

జయహో నారీ!

కుమార్తె.. పది మంది కొడుకులతో సమానం

పద్మ అవార్డులను ప్రక్షాళన చేశాం.. 'మన్ కీ బాత్'లో ప్రధాని మోదీ

తక్షణ తలాక్, ఓబీసీ బిల్లులపై చర్చ.. ఢిల్లీలో అఖిలపక్షం భేటీ

నేటి నుంచి పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు

16



యువకుడిని మింగిన ఎంఆర్ఐ మెషిన్

ముంబై ఆస్పత్రిలో దారుణం

సిబ్బంది నిర్లక్ష్యమే కారణమంటున్న మృతుడి బంధువులు

16



ఆధ్యాత్మిక పరిజ్ఞానం కలగాలంటే..



పరంజ్యోతి (Paramjyothi)

ఇద్దరు అవధూతలు సాయంసంధ్య వేళ పరాయి రాజ్యంలోకి ప్రవేశించారు. అంతలో వర్షం మొదలైంది. తలదాచుకుందామని చూస్తే ఒక పురాతన దేవాలయం కనిపించింది. అందులో కాలు పెట్టకముందే అది కుప్పకూలింది. రాజభటులు వీరిని ఆలయాన్ని కూల్చిన నేరం కింద నిర్బంధించారు. మర్నాడు రాజు ముందు నిలబెట్టి దేవాలయం కూలడానికి కారణం వారేనని ఆరోపణ చేశారు. రాజు గుడ్డిగా వారి మాటలు నమ్మి అవధూతలకు మరణశిక్ష విధించాడు. చివరిగా ఏదైనా చెప్పుకోవచ్చని వారితో అన్నాడు. వారిలో ఒక అవధూత.. 'నా హృదయం ఒక మందిరం. దీనిని పరమాత్మ తన ధ్యానం కోసం నిర్మించుకున్నాడు. మనిషి దేవుని కోసం అక్కడ మందిరం నిర్మించాడు. దానితో దేవునికి నేరుగా సంబంధం లేదు. మనిషి నిర్మించుకున్న ఆలయం కోసం దేవుడు నిర్మించుకున్న హృదయ మందిరం కూల్చేస్తారా?' అని ప్రశ్నించాడు. దీంతో రాజు పునరాలోచనలో పడ్డాడు. మందిరం మనిషికి అవసరమే. ఆ భౌతికమైన కట్టడంలోని భగవంతుని ముందు మనం నిలబడి.. మన హృదయస్థానంలోకి రావాల్సిందిగా ఆయన్ను ఆహ్వానిస్తాం. ఇదే ధర్మ సూక్ష్మం. మన పూజలో, తపస్సులో, ఆరాధనలో.. ప్రతి దాంట్లో ఈ ధర్మసూక్ష్మం ఉంటుంది. దానిని పట్టుకోకుండా పైపై మెరుగుల వెంట పడతాం. ప్రతి ఆధ్యాత్మిక సంప్రదాయంలో మనకు కనిపించని ప్రతీకలు, పరమార్థాలు ఉంటాయి. ఉదాహరణకు.. కార్తీక మాసంలో ఎన్ని దీపాలు, ఎన్ని చోట్ల వెలిగించామనే లెక్కల్లో మునిగిపోతాం తప్ప, మన అంతరంగంలోని ఆత్మ జ్యోతిని వెలిగించడాన్ని విస్మరిస్తాం. ఈ క్రమంలోనే చాలామంది తత్వజ్ఞానం, భక్తి లేకుండా యాంత్రికమైన ఆధ్యాత్మిక కార్యక్రమాలే ఆచరిస్తారు. లోతైన ఆధ్యాత్మిక పరిజ్ఞానం కలగాలంటే ధర్మ సూక్ష్మం తెలియాలి. అది బీజం వంటిది. అది మన హృదయంలో ఉంటే చాలు. ఎక్కడో ఒక చోట.. ఎప్పుడో ఒకసారి పరిపూర్ణత పొందుతాం.

-డాక్టర్ పి.భాస్కరయోగి

మేడారంలో గులాబీ జాతర

8 మంది టీఆర్ఎస్ ఎంపీలు, పలువురు ఎమ్మెల్యేల రాక

- జాతర ఏర్పాట్లపై డిప్యూటీ సీఎం సమీక్ష
- సమస్యలపై భక్తులతో మాటామంతి
- ఉమ్మడి వరంగల్ నేతలతో ఆత్మీయ సమ్మేళనం
- రాత్రి మేడారంలోనే బస.. ఏర్పాట్ల పరిశీలన
- మహాజాతరకు పోటెత్తిన భక్తులు..



గద్దె వద్ద మొక్కుతున్న ఎంపీలు బాల్క సుమన్, ప్రభాకర్‌రెడ్డి, గుత్తా , పొంగులేటి, బీబీ పాటిల్, సీతారాం నాయక్

భూపాలపల్లి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మేడారం జాతరలో గులాబీ సందడి నెలకొంది. ఆదివారం మేడారానికి డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి, 8మంది టీఆర్ఎస్ ఎంపీలు, పలువురు ఎమ్మెల్యేలు రావడంతో సందడి నెలకొంది. ఈ సందర్భంగా ఉమ్మడి వరంగ్ జిల్లాకు చెందిన ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులతో కడియం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీలు పసునూరి దయాకర్, సీతారాంనాయక్, ఎమ్మెల్యేలు చల్లా ధర్మారెడ్డి, కొండా సురేఖ, వినయ్‌భాస్కర్, ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, శంకర్‌నాయక్, ఎమ్మెల్సీలు కొండా మురళీధర్‌రావు, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, పూల రవీందర్, జడ్పీ చైర్‌పర్సన్ గద్దల పద్మ, కార్పొరేషన్ చైర్‌పర్సన్ గుండు సుధారాణి, రాజయ్యయాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సమ్మక్క, సారలమ్మ జాతర ప్రాశస్త్యంపై కడియం మాట్లాడారు. అనంతరం మేడారం జాతర అభివృద్ధి పనులు, భక్తులకు ఏర్పాటు చేస్తున్న సౌకర్యాలపై కడియం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జాతరలో జరుగుతున్న పారిశుధ్య పనుల తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఐటీడీఏ క్యాంపు కార్యాలయంలో జరిగిన సమీక్ష సమావేశంలో కడియం మాట్లాడుతూ.. జాతరలో మరుగుదొడ్ల నిర్వహణ సరిగా లేదన్నారు. కనీసం నల్లాలు కూడా బిగించలేదని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. భక్తుల నుంచి మరుగుదొడ్లు, తాగునీటి సమస్యపై అనేక ఫిర్యాదులు వస్తున్నాయని పేర్కొన్నారు. తక్షణం మరుగుదొడ్లను శుభ్రం చేయించి, ఎప్పటికప్పుడు నీట్‌గా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గద్దెల వద్ద భక్తుల తాకిడిని అదుపు చేయాలని పోలీసులకు సూచించారు. ట్రాఫిక్ నియంత్రణపై దృష్టి సారించాలని, భక్తులు ప్రశాంతంగా దర్శనం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే జాతర ఏర్పాట్లు, సమస్యలపై కడియం భక్తులను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. జంపన్నవాగు వరకు పలువురు జిల్లా నేతలు, భక్తులతో కలిసి నడిచారు. అంతకు ముందు సమ్మక్క, సారలమ్మ గద్దెల వద్ద ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాగా భక్తుల కోసం ఏర్పాటు చేసిన సౌకర్యాలను పరిశీలించేందుకు కడియం రాత్రి మేడారంలోనే బస చేశారు. కాగా ఎంపీలు విశేశ్వర్‌రెడ్డి, బాల్క సుమన్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, బీబీ పాటిల్, ప్రభాకర్‌రెడ్డి, గుత్తా సుఖేందర్‌రెడ్డి ప్రత్యేక హెలికాప్టర్‌లో మేడారం చేరుకొని వన దేవతలను దర్శించుకున్నారు. సెలవు రోజు కావడంతో ఆదివారం మేడారానికి భక్తులు పోటెత్తారు. జంపన్నవాగులో స్నానాలు చేసి, అమ్మవార్లకు మొక్కులు సమర్పించుకున్నారు.

నేడు మేడారానికి పగిడిద్ద రాజు

గుండాల, జనవరి 28 : పెళ్లికొడుకుగా పగిడిద్దరాజు ముస్తాబవుతున్నాడు! సమక్కకు తాళి కట్టేందుకు సోమవారం అంగరంగ వైభవంగా మేడారానికి బయలుదేరనున్నాడు! భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గుండాల మండలంలోని యాపలగడ్డకు చెందిన అరెం వంశీయులు పగిడిద్ద రాజును పెళ్లికొడుకుగా ముస్తాబు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఉదయం గడ్డిగుట్టపై ఉన్న పగిడిద్దరాజును, ఆలయానికి తరలించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అనంతరం తొట్టివాగు సమీపంలోని గద్దెలకు తరలిస్తారు. అక్కడి నుంచి 70 కిలోమీటర్లు కాలి నడకన మేడారానికి ప్రయాణించి, గద్దెలకు చేర్చుతారు. పగిడిద్దరాజు 31న మేడారానికి చేరడంతో జాతర మొదలవుతుంది. మరుసటి రోజు సమ్మక్కను చిలకలగుట్ట నుంచి మేడారం తీసుకువస్తారు. ఈ సందర్భంగా పోలీసులు మూడు రౌండ్లు గాల్లోకి కాల్పులు జరుపుతారు. ఫిబ్రవరి 2న సమ్మక్క-పగిడిద్దరాజుకు పెళ్లి తంతును తలపతులు, వడ్డెలు నిర్వహిస్తారు. అనంతరం నాగవెల్లి జాతరను నిర్వహిస్తారు. 3వ తేదీన దేవతలు వనప్రవేశం చేయడంతో జాతర ముగుస్తుంది.



సమ్మక్క గద్దె వద్ద మొక్కుతున్న కడియం శ్రీహరి



మల్లన్నకు బోనాలు సమర్పించడానికి వస్తున్న భక్తులు

మల్లన్నకు లష్కర్ బోనాలు

చేర్యాల, జనవరి 28: కొమరవెల్లి మల్లన్న దేవాలయం లష్కర్ భక్తులతో పోటెత్తింది. మల్లన్న బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం సికింద్రాబాక్‌కు చెందిన వేలాది మంది భక్తులు కొమురవెల్లికి వచ్చారు. కోనేటిలో పుణ్యస్నానమాచరించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో విక్రయించే కూరగాయలను కొనుగోలుచేసి, వాటిని నూతన మట్టికుండల్లో బోనాలుగా మల్లన్నకు నివేదించారు. పట్నాలు వేశారు. కోరిన కోర్కెలు ఈడేరాలంటూ ఆలయప్రాంగణంలోని గంగరేగుచెట్టుకు ముడుపులు కట్టారు భక్తుల రద్దీ అధికంగా ఉండడంతో క్యూలైన్లన్నీ కిక్కిరిసిపోయాయి. భక్తుల రద్దీ దృష్ట్యా ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకున్నారు.

ఆదివాసీల పోరు ఫలం.. మేడారం

- అప్పట్లో జాతర నిర్వహణ సల్వాయి దొర గుప్పిట్లో
- ఆదివాసీలపై ఆస్ట్రియన్ పరిశోధకుడు హెమన్‌డార్ఫ్ అధ్యయనం
- కొత్వాల్ బుచ్చయ్య పటేల్‌తో కలిసి న్యాయపోరాటం

వరంగల్ అర్బన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీలపై జరుగుతున్న అరాచకాలను నిరసించి సమ్మక్క, సారలమ్మలు కాకతీయులపైనే పోరాడారు. చివరికి తమ ప్రాణాలను కూడా పణంగా పెట్టి ఆదివాసీల పాలిట ఇలవేల్పులయ్యారు. మేడారం జాతర వెనుక కథ ఇది. చాలా మందికి తెలియని విషయం ఏమిటంటే.. జాతరను నిర్వహించుకునేందుకు కూడా ఆదివాసీలు నాలుగేళ్లపాటు గొప్ప పోరాటమే చేశారు. ఈ విషయంలో వారికి ఓ విదేశీయుడు అండగా నిలిచాడు. ఆదివాసీల కథనం ప్రకారం.. సమ్మక్కను తొలుత గుర్తించింది బయ్యక్కపేట వడ్డెలే! ఇపుడు జాతర జరుగుతున్న మేడానికి 15 కిలోమీటర్ల దూరంలో ఉంటుందీ గ్రామం. ఈ గ్రామ పరిసరాల్లో ఉన్న దేవరగుట్ట వద్దకు ఆవులను మేపేందుకు మేడయ్య, హనుమంతయ్య వెళ్లినప్పుడు వారు అక్కడ చిత్రమైన అనుభూతికి లోనయ్యారు. దీంతో దేవరగుట్ట మీద దేవతలు కొలువై ఉన్నారని భావించి అక్కడే చాలాకాలం జాతర నిర్వహించారు. కొంత కాలానికి బయ్యక్కపేటలో జాతర నిర్వహించే పూజారుల(వడ్డెలు)లో ఒకరు చనిపోగా, మరో పూజారి వృద్ధాప్యంతో కదల్లేని స్థితికొచ్చాడు. దీంతో అప్పటి కొత్వాల్, తాడ్వాయి మండలం కామారం గ్రామానికి చెందిన కొర్రైబెల్లి బుచ్చయ్య పటేల్ జాతర నిర్వహణ బాధ్యతలను మేడారం వడ్డెలకు అప్పగించారు. ఆ తర్వాత నాలుగు జాతలరను ఆయనే స్వయంగా నిర్వహించారు. ఇదంతా 1940కి ముందు మాట. జాతర నిర్వహణకు ఆయన ముందుగా పెట్టుబడి పెట్టి, తర్వాత హుండీల ద్వారా వచ్చిన డబ్బు తీసుకునేవాడు. కొన్నాళ్లకు ఆయన తప్పుకుని జాతర బాధ్యతను బయ్యక్కపేట వాసులకే అప్పగించాడు. కాగా ఆర్థికంగా బలహీనంగా ఉన్న బయ్యక్కపేట వడ్డెలు జాతర నిర్వహణ బాధ్యతను నిజాం సర్కారు ప్రతినిధి అయిన సల్వాయి దొర గుడిబండల లక్ష్మణ్‌రావుకు అప్పగించారు. ఆయన జాతరలో ఆదాయాన్నంతా తానే తీసుకునేవాడు. గిరిజన జీవితాలమీద సుదీర్ఘ అధ్యయనం చేసిన పరిశోధకుడు, ఆస్ట్రియన్ ఆంత్రోపాలజిస్టు హెమన్‌డార్ఫ్ ఈ విషయంలో ఆదివాసీలకు అండగా నిలిచాడు. కోత్వాల్ బుచ్చయ్య పటేల్‌తో కలిసి జాతర నిర్వహణ గిరిజనులకే చెందాలని తీవ్రంగా పోరాడాడు. న్యాయవాది జమలాపురం గోపాల్‌రావుతో గిరిజనుల తరపున కేసు దాఖలు చేయించారు. నాలుగేళ్ల తర్వాత 1944లో ఆదివాసీలకు అనుకూలంగా తీర్పు వచ్చింది. కాగా, సమ్మక్క జాతరలో అప్పట్లో కుండలనే హుండీలుగా వాడేవారు. మంగపేట మండలం కోమటిపల్లి నుంచి జాతరకు బెల్లం సరఫరా అయ్యేదని ఆదివాసీలు చెబుతున్నారు.

జాతరలో కాల్పుల వెనుక కథ

జాతరలో సమ్మక్క రాక సందర్భంగా పోలీస్ ఉన్నతాధికారి గాల్లోకి కాల్పులు జరపడం ఎప్పటి నుంచో ఆనవాయితీగా వస్తోంది. కొత్వాల్ బుచ్చయ్యపటేల్ నిర్వహణ బాధ్యతలు తీసుకున్నపుడు తన తుపాకీతో గాల్లోకి కాల్పులు జరిపేవాడు. నిర్వహణ లక్ష్మణ్‌రావు దొర చేతుల్లోకి వెళ్లిన తర్వాత రెండుసార్లు కాల్పులు జరిపించేవాడు. తాను జాతరకు వచ్చానని తెలిసేలా ఒక సారి, సమ్మక్క వచ్చినపుడు మరోసారి కాల్పులు జరిపించేవాడు.

చుట్టు పక్కల ఊళ్ల అభివృద్ధి జరగాలి

గిరిజనుల జీవితాలపై ప్రఖ్యాత పరిశోధకుడు హెమన్‌డార్ఫ్ సుదీర్ఘ అధ్యయనం చేశారు. నెలల తరబడి మా ఊర్లో ఉన్నారు. అప్పట్లో ఊళ్లోని ఉర్దూ పాఠశాల మదర్సా తాలిమాను హెమన్‌డార్ఫ్ అభివృద్ధి చేశారు. నేను 1990, 92, 94, 96 మేడారం జాతర ట్రస్ట్‌బోర్డు చైర్మన్‌గా పనిచేశాను. అప్పట్లో కొంత అభివృద్ధి జరిగినప్పటికీ ఇంకా ఎంతో జరగాల్సి ఉంది. కోట్లాది రూపాయలు భక్తుల సౌకర్యాల కోసమే ఖర్చు చేస్తున్నారు. చుట్టుపక్కల ఉన్న గ్రామాల అభివృద్ధిని కూడా పట్టించుకోవాలి.

- కొర్నైబెల్లి గోపాల్ రావు, బుచ్చయ్య పటేల్ మనమడు

శివరాత్రి 13.. కాదు 14..

- పంచాంగకర్తల్లో భిన్నాభిప్రాయాలు ..
- ఇంతకీ పండుగ ఎప్పుడు?
- జనాల్లో సందేహాలు.. సెలవు 13నే



సంక్రాంతి మాదిరే మహా శివరాత్రి పర్వదినం విషయంలోనూ అవే సందేహాలు! శివభక్తులు పరమ పవిత్రంగా జరుపుకొనే శివరాత్రి ఎప్పుడనే అంశంపై పంచాంగ కర్తల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొన్ని పంచాంగాల్లో శివరాత్రి ఫిబ్రవరి 13న అని, మరికొన్ని పంచాంగాల్లో 14న అని పేర్కొనడంతో.. ఏ రోజున శివరాత్రి జరుపుకోవాలనే అంశంపై ప్రజల్లో సందేహాలు ఉత్పన్నమవుతున్నాయి. దేశవ్యాప్తంగా ఉన్న శైవ క్షేత్రాల్లోనూ వేర్వేరు తేదీల్లో ఉత్సవాలు జరిపేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు శివరాత్రి పండుగ ఫిబ్రవరి 13న అని ఇప్పటికే అధికారికంగా ప్రకటించాయి. కాగా మాఘ బహుళ చతుర్దశి నాడు శివరాత్రిని జరుపుకోవడం సంప్రదాయం. ఫిబ్రవరి 13న రాత్రి 10:35 గంటల వరకు త్రయోదశి తిథి ఉంది. అప్పటి నుంచి 14వ తేదీ అర్ధరాత్రి 12:47 గంటల వరకు చతుర్దశి ఉంది. ఇదే అంశం పంచాంగకర్తల్లో భిన్న వాదనలకు తెరతీసింది. ప్రదోషకాలం అంటే సాయంసంధ్యా సమయంలో చతుర్దశి తిథి ఉండటం శివరాత్రి పర్వదినాన్ని నిర్ణయించేందుకు ప్రాతిపదిక అని, అర్ధరాత్రి సమయంలో లింగోద్భవం జరిగేవేళ కూడా చతుర్దశి తిథి ఉండాలని కొందరు పంచాంగకర్తలు, పండితులు అంటున్నారు. 13వ తేదీ రాత్రి 10.35 గంటల వరకు త్రయోదశి తిథే ఉన్నదని, ప్రదోష కాలంలో చతుర్దశి లేదు కాబట్టి ఆ రోజున శివరాత్రి పండుగ జరుపుకోవడం సరికాదని, అందువల్ల 14నే శివరాత్రి జరుపుకోవాలని కొందరు వాదిస్తున్నారు. ప్రదోషకాలం మాస శివరాత్రికి మాత్రమే ప్రధానమని, మహాశివరాత్రికి కాదని మరికొందరి వాదన. 14న లింగోద్భవ సమయంలో కొద్దిసేపే చతుర్దశి ఉన్నందున 13నే మహాశివరాత్రి జరుపుకోవాలని ఆ వర్గం స్పష్టం చేస్తోంది. పైగా 14న అర్ధరాత్రి సమయంలో చతుర్దశి వెళ్లిపోయి అమావాస్య వస్తుంది కాబట్టి, అమావాస్య స్పర్శతో వున్న రోజున శివరాత్రి జరుపుకోవడం మంచిది కాదని వారు అంటున్నారు. శ్రీశైలం దేవస్థానంతో పాటు రెండు తెలుగు రాష్ట్రాల్లోని పలు శైవక్షేత్రాల్లో 13న శివరాత్రి ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. తూర్పుగోదావరి జిల్లా పిఠాపురంలోని సుప్రసిద్ధ కుక్కుటేశ్వర స్వామి ఆలయంలో మాత్రం 14 శివరాత్రి జరుపుతున్నారు. కాశీతో పాటు పలు జ్యోతిర్లింగాల్లో కూడా 13నాడే శివరాత్రి జరుపుతున్నందున ఆ రోజూ ఉత్సవాలు నిర్వహించాలని మరో వర్గం వాదిస్తోంది.

శ్రీశైలంలో 13నే

"హేమాద్రి మతం ప్రకారం, పద్మపురాణంలోని మదనరత్నంలో చతుర్దశి తిథి రెండ్రోజులు నిశీధ వ్యాప్తి ఉంటే.. ముందురోజే శివరాత్రి జరపాలని చెప్పారు. కాశీలో 13 నాడే శివరాత్రి జరుపుతున్నారు. శ్రీశైలంలోనూ ఆ రోజే జరుపుతున్నాం"

- బుట్టే వీరభద్ర సిద్ధాంతి, శ్రీశైలం ఆస్థాన పంచాంగ కర్త

14నే జరుపుకోవాలి

"ప్రదోషకాలం త్రయోదశి తిథి ఉండడం శివరాత్రి పండుగ నిర్ణయించడానికి ప్రాతిపదిక. అంతే కాకుండా సాయం సంధ్య తర్వాత పది ఘడియల వరకు ఏ తిథి వుంటే ఆ రోజున ఆ తిథి ఉన్నట్టుగానే పరిగణించాలని ధర్మసింధు వంటి శాస్త్రాలు చెబుతున్నాయి. ఈ అంశాల దృష్ట్యా 14నే పండుగ జరుపుకోవాలి"

- మధుర బాల శంకర శర్మ, పంచాంగకర్త, రాజమండ్రి

ప్రదోష, లింగోద్భవాలు ముఖ్యం

"13వ తేదిన అర్ధరాత్రి లింగోద్భవ సమయంలో చతుర్దశి ఉన్నప్పటికీ ప్రదోషకాలంలో లేదు. ధర్మశాస్త్రాలు ప్రకారం 14వ తేదీనే మహాశివరాత్రి. ఇందుకు విరుద్ధంగా 13న శివరాత్రి అని నిర్ణయిస్తే అందుకు గల ప్రమాణాలు చూపాలని కోర్టులను ఆశ్రయిస్తాను. ప్రజలకు ఇబ్బంది కలుకుండా 13న కూడా అభిషేకాలు నిర్వహిస్తాం"

-చెరుకుపల్లి విశ్వనాథశర్మ, ఆస్థాన కల్యాణ బ్రహ్మ, కుక్కుటేశ్వరస్వామి దేవస్థానం, పిఠాపురం

ప్రదోషం ప్రధానం కాదు

"శివరాత్రి నిర్ణయానికి ప్రదోషకాలం కంటే లింగోద్భవ సమయమే ప్రధానం. 13వ తేదీ 10:35 గంటల నుంచే చతుర్దశి ఉంది. 14 నాడు అర్ధరాత్రి దాటాక కొద్దిసేపు మాత్రమే చతుర్దశి ఉన్నందున 13 నాడే శివరాత్రి జరపాలి. మా క్షేత్రంలో అదే రోజు ఉత్సవాలు నిర్వహిస్తున్నాం"

- సిహెచ్. శరత్ శర్మ, వేములవాడ శ్రీ రాజరాజేశ్వర దేవస్థానం ప్రధానార్చకులు

అమెరికాలో సిద్దిపేట టెకీ.. అనుమానాస్పద మృతి

సిద్దిపేట కల్చరల్, జనవరి 28: సిద్దిపేటకు చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీరు అమెరికాలో అనుమానాస్పద స్థితిలో మృతిచెందారు. స్థానిక మారుతి నగర్ కాలనీకి చెందిన వెంకన్నగారి శ్రీనివాసులు, రాణి దంపతుల చిన్న కుమారుడు కృష్ణ చైతన్య (28) నాలుగేళ్ల క్రితం కాగ్నిజెంట్ సంస్థలో ఆన్ సైట్ ఉద్యోగిగా అమెరికా వెళ్లారు. ఆయన ఇటీవలే డల్లాస్‌లోని సౌత్‌వెస్ట్ ఎయిర్‌లైన్స్‌లో చేరారు. ఓ పేయింగ్ గెస్ట్‌హౌస్‌లో ఉంటున్నారు. ఈ నెల 26న తల్లిదండ్రులతో ఫోన్‌లో మాట్లాడిన కృష్ణచైతన్య.. తనకు తలనొప్పిగా ఉందని, ఉదయం మాట్లాడతానని ఫోన్ పెట్టేశారు. ఈ నెల 27న అతను తన గది తలుపులు తెరవకపోవడంతో.. గెస్ట్‌హౌస్ నిర్వాహకులు పోలీసులకు సమాచారం అందించారు. తలుపులు తెరిచి లోనికి వెళ్లిన పోలీసులకు.. కృష్ణచైతన్య విగతజీవిగా కనిపించారు. కాగా.. కృష్ణచైతన్య బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతున్నట్లు తెలిసింది. ఆయన మరణానికి ఆ వ్యాధే కారణమా? లేక మరేవైనా కారణాలున్నాయా? అనేది తెలియాల్సి ఉంది. కాగా.. కృష్ణచైతన్య మృతదేహాన్ని త్వరగా భారత్‌కు తెప్పించేలా మంత్రి హరీశ్‌రావు ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు. ఈ విషయమై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్.. కాన్సులేట్ జనరల్ ఆఫ్ ఇండియా, భారత విదేశాంగ శాఖ కార్యదర్శికి లేఖ రాశారు. గురువారానికి మృతదేహాన్ని భారత్‌కు తరలిస్తామని ఎన్ఆర్ఐ విభాగం అధికారులు తెలిపారు.

తండ్రి, ఇద్దరు తమ్ముళ్ల దారుణ హత్య

అచ్చంపేట, ఉప్పునుంతల, జనవరి 28: ఆస్తి కోసం ఓ దుర్మార్గుడు.. కన్న తండ్రిని, రక్తం పంచుకుపుట్టిన తమ్ముళ్లను దారుణంగా హతమార్చిన ఉదంతమిది. ఈ సంఘటన నాగర్ కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండలం మామిళ్లపల్లిలో చోటుచేసుకుంది. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ కథనం ప్రకారం.. స్థానికులైన సామా భాస్కరయ్య, భూలక్ష్మమ్మ దంపతులకు ముగ్గురు కుమారులున్నారు. పెద్దవాడు మల్లేష్ జులాయిగా తిరుగుతూ.. మద్యానికి బానియ్యాడు. భాస్కరయ్య తన ముగ్గురు కుమారులతో కలిసి.. తనకున్న నాలుగెకరాల పొలంలో పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. చిన్న కుమారులు శ్రీశైలం(18), రామస్వామి (16) శనివారం రాత్రి పంటకు నీరు పెట్టేందుకు పొలానికి వెళ్లారు. అక్కడ కాపుకాసిన మల్లేష్.. బండరాళ్లతో మోది, వీరిద్దరినీ హతమార్చాడు. తర్వాత ఇంట్లో నిద్రిస్తున్న తండ్రిని పొలానికి తీసుకెళ్లి కడతేర్చాడు. నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు.

లోకం తీరు



బడ్జెట్‌కు అన్నీ సిద్ధమయ్యాయి ప్రధాని గారు..

ఉష్ణోగ్రతలు

కేంద్రం	కనిష్ఠం	గరిష్ఠం
ఆదిలాబాద్	06.3	31.5
రామగుండం	12.6	30.6
హైదరాబాద్	15.3	30.5
ఖమ్మం	17.0	32.0
నల్లగొండ	17.4	29.0

రాష్ట్రంలో కొనసాగుతున్న చలి

హైదరాబాద్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో చలి తీవ్రత కొనసాగుతోంది. ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా సాధారణం కంటే తక్కువగా రాత్రి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఆదిలాబాద్‌లో 6.3 డిగ్రీల మేర రాత్రి ఉష్ణోగ్రత నమోదైంది. భద్రాచలంలో 5డిగ్రీలు, హకీంపేట, ఖమ్మం, రామగుండంలో 3 డిగ్రీలు, హన్మకొండ, మెదక్‌లో 2 డిగ్రీలు, హైదరాబాద్, నల్లగొండ, నిజామాబాద్‌లో ఒక్కో డిగ్రీ మేర సాధారణం కంటే తక్కువగా రాత్రి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఆదిలాబాద్‌లో అక్కడక్కడా శీతల గాలులు వీస్తున్నాయి. కాగా, రాష్ట్రంలో రాగల నాలుగు రోజుల పాటు పొడి వాతావరణమే కొనసాగనుంది.



భారతీయ బాలికల కోసం పనిచేస్తా

భారత్ నుంచి లభించిన మద్దతు, ప్రేమ అపూర్వం. ఇందుకు ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలుపుతున్నా. నాకు మద్దతు తెలుపుతూ ఆ దేశం నుంచి లేఖలు వెల్లువెత్తుతున్నాయి. భారత్‌ను సందర్శించాలని ఉంది. అక్కడ బాలికల కోసం పనిచేస్తాను.

- పాక్ హక్కుల ఉద్యమకారిణి మలాలా (ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో..)



ఐరాసలో హిందీ ఎవరికి వచ్చు?

"ఐక్యరాజ్యసమితిలో మనం చేసే ప్రసంగం ద్వారా మన భావాలు వారికి అర్థం కావాలి. కానీ అక్కడ హిందీలో మాట్లాడితే ఎవరికి అర్థమవుతుంది. పి.చిదంబరం, ప్రణబ్ ముఖర్జీ లాంటి వారికి హిందీ రాదు. అలాంటివారిని భారత ప్రతినిధులుగా పంపిస్తే.. వారు హిందీలో ఎలా మాట్లాడతారు. ఐక్యరాజ్యసమితిలో హిందీని అధికారిక భాష చేస్తే సగం మందికి ఇది ప్రతికూలంగా మారుతుంది."

- కాంగ్రెస్ నేత శశి థరూర్

నేటి పెట్రో ధరలు (లీ.)

పెట్రోల్	డీజిల్
పాత ధర రూ.77.06	పాత ధర 69.37
కొత్త ధర రూ.77.13	కొత్త ధర 69.46
పెరుగుదల 0.07 పైసలు	పెరుగుదల 0.9 పైసలు



ఆకు కూరలతో గుండెపోటు దూరం

వాషింగ్టన్, జనవరి 28: ఆకు కూరలు ఆరోగ్యానికి ఎంతో మేలు. కంటి చూపు పెరిగేందుకు, మెదడు చురుగ్గా మారేందుకు శ్రేష్ఠమైనవి. అంతేకాదు, ఆకు కూరలతో శరీరంలో రక్త సరఫరా మెరుగై, రక్తపోటు తగ్గి గుండెపోటు వచ్చే ప్రమాదం 64శాతం తగ్గుతుందని తాజా అధ్యయనంలో తేలింది. అమెరికన్ స్ట్రోక్ అసోసియేషన్స్ ఇంటర్నేషనల్ స్ట్రోక్ కాన్ఫరెన్స్-2018లో శాస్త్రవేత్తలు దీనికి సంబంధించిన పరిశోధనను ప్రదర్శించారు.

ప్లాస్టిక్ బొమ్మలతో అనారోగ్యం!

లండన్, జనవరి 28: ప్లాస్టిక్ బొమ్మలు చేతులు మారితే పిల్లల్లో అనారోగ్యం వచ్చే ప్రమాదం ఉందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. ఒకరు వాడిన బొమ్మలను మరొకరు వాడితే ఇన్ఫెక్షన్లతో వ్యాధులు వచ్చే అవకాశం ఉందని యూకేలోని ప్లైమౌత్ వర్సిటీ పరిశోధకులు తెలిపారు. ప్లాస్టిక్ బొమ్మల తయారీలో అంతర్జాతీయ భద్రతా ప్రమాణాలు పాటించరని, అందువల్ల ప్లాస్టిక్ బొమ్మలకు దూరంగా ఉంటే మంచిదని సూచించారు.

కరెంట్‌పై మంత్రి తీర్మానం రాజ్యాంగ విరుద్ధం

▸ 24 గంటల సరఫరాలో రహస్య

ఎజెండా: పొన్నం



కరీంనగర్ అర్బన్, జనవరి 28: వ్యవసాయానికి 24 గంటల కరెంటు సరఫరాకు రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో అంగీకరించిన మంత్రి ఈటల రాజేందర్ కరీంనగర్‌లో శనివారం జరిగిన జిల్లా పరిషత్ సమావేశంలో విరుద్ధంగా తీర్మానం చేయించడం రాజ్యాంగ విరుద్ధమని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ అన్నారు. ఆదివారం కరీంనగర్‌లో పొన్నం విలేకరులతో మాట్లాడుతూ.. మంత్రి ద్వంద్వ వైఖరిపై గవర్నర్, ప్రభుత్వం స్పందించాలన్నారు. 24 గంటల కరెంటు వద్దంటూ ఆందోళన చేయాలని రైతులకు, ప్రజలకు ఐటీ మంత్రి కేటీఆర్ సూచించడం దురదృష్టకరమన్నారు. విద్యుత్ కొనుగోళ్లలో అవినీతి జరిగిందని, 24 గంటల సరఫరాలో రహస్య ఎజెండా ఉందన్నారు. ట్రాక్టర్ల పథకంలో కుంభకోణం జరిగిందని అధికార పార్టీ సభ్యులే ఆరోపించడం ప్రభుత్వ అవినీతికి నిదర్శనమన్నారు. వచ్చే ఎన్నికల్లో 107 సీట్లు గెలుస్తామన్న సీఎం కేసీఆర్ వలసలను ఎందుకు ప్రోత్సహిస్తున్నారని ప్రశ్నించారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో నాణ్యమైన వైద్యం

డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి ● రేవంత్‌కు అంత సీన్ లేదు: పోచారం ● కార్యకర్తలు అన్నదమ్ముల్లా ఉండాలి: ఈటల

ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్: రాష్ట్రంలోని అన్ని పీహెచ్‌సీలు, ఆస్పత్రుల్లో మౌలిక వసతులు కల్పించడంతో నాణ్యమైన వైద్య సేవలు అందుతున్నాయని ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి అన్నారు. పల్స్ పోలియో సందర్భంగా ఆదివారం హన్మకొండలోని ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో ఆయన చిన్నారులకు పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కేసీఆర్ కిట్ వల్ల ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల రేటు పెరిగిందన్నారు. సీఎం కేసీఆర్‌ను విమర్శించే అర్హత ఎమ్మెల్యే రేవంత్ రెడ్డికి లేదని రాష్ట్ర మంత్రి పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఆదివారం జగిత్యాల జిల్లా మెట్‌పల్లిలో రైతులకు 75 శాతం సబ్సిడీపై పసుపు ఉడకబెట్టే యంత్రాలు, పసుపు పాలిష్ చేసే యంత్రాలను పంపిణీ చేశారు. ఆ తర్వాత ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు నివాసంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఓటుకు నోటు వ్యవహారంలో అడ్డంగా దొరికిపోయిన రేవంత్‌రెడ్డి, మచ్చ లేకుండా పరిపాలన చేస్తున్న కేసీఆర్‌ను విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. రేవంత్ చేరికతో కాంగ్రెస్ మరింత పతనం కావడం ఖాయమన్నారు. మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో మల్లాపూర్ పోలీసులు ఎనిమిది మంది చెరుకు రైతులను అకారణంగా అరెస్టు చేయడాన్ని వ్యతిరేకిస్తూ మెట్‌పల్లిలో కాంగ్రెస్ నాయకులు కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం అంబేద్కర్ విగ్రహం వద్ద వినతి పత్రం ఉంచి నిరసన తెలిపారు. స్పైస్ పార్కు పనులు త్వరగా పూర్తి చేస్తామని మంత్రి పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. నిజామాబాద్ జిల్లా వేల్పూర్ మండలం పడగల్‌లో జరుగుతున్న స్పైస్ పార్కు నిర్మాణ పనులను ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం స్పైస్ పార్కు కోసం 30 కోట్ల రూపాయలు కేటాయించిందన్నారు. దీని కోసం కేంద్ర ప్రభుత్వం కూడా 20 కోట్ల రూపాయలను కేటాయించిందన్నారు. పసుపు రైతులు ఇతర ప్రాంతాలకు వెళ్లి అమ్ముకోకుండా ఈ పార్కులోనే అమ్మేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. టీఆర్‌ఎస్‌లోని పాత, కొత్త నాయకులు అన్నదమ్ముల వలె కలిసి మెలిసి ఉండాలని రాష్ట్ర మంత్రి ఈటల రాజేందర్ ఉద్బోధించారు. ఆయన సొంత మండలం.. వరంగల్ అర్బన్ జిల్లాలోని కమలాపూర్‌లో టీడీపీకి చెందిన పలువురు నాయకులు, ప్రజా ప్రతినిధులు ఆ పార్టీకి రాజీనామా చేశారు. మంత్రి ఈటల, ఎంపీ వినోద్ కుమార్ సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడారు.నియోజకవర్గంలో 99 శాతం టీఆర్‌ఎస్ కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులే ఉన్నారని చెప్పారు.



పోలియో చుక్కలు వేస్తున్న ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి

వర్గీకరణ బాధ్యత కేసీఆర్‌దే

▸ మంద కృష్ణ మాదిగ



రాజాపేట, జనవరి 28: పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ ప్రధాన ఎజెండాగా కేంద్రంపై ఒత్తిడి తెచ్చే బాధ్యత సీఎం కేసీఆర్ దేనని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట మండలం పారుపల్లి గ్రామంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్లమెంట్ సమావేశాల్లో కేంద్రంపై ఒత్తిడి పెంచేందుకు సోమవారం ఉదయం 11 గంటలకు సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో అఖిలపక్ష సమావేశం నిర్వహించనున్నామని, సమావేశానికి టీఆర్‌ఎస్‌ను సైతం ఆహ్వానించినట్లు తెలిపారు. మాదిగలకు మేలు చేస్తే గుర్తించుకుంటామని, కీడు చేస్తే ఎదురు తిరుగుతామని హెచ్చరించారు. సీఎం కేసీఆర్ పార్లమెంట్‌లో వందకు పైగా సమస్యలపై ఎంపీలతో బిల్లులు పెట్టించారని, ఎస్సీ వర్గీకరణపై మాత్రం ప్రస్తావించలేదన్నారు. మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు మాట్లాడుతూ మాదిగలను చిన్న చూపు చూడడం తగదని, కేసీఆర్ మాదిగలపై చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు హామీ ఇచ్చారని, వర్గీకరణ బాధ్యత ముఖ్యమంత్రిదేనని పేర్కొన్నారు.



కుటుంబ సభ్యులతో కలిసి నిరాహార దీక్ష చేస్తున్న భీమారం రైతులు

111 రోజులుగా రైతుల దీక్ష

▸ సాగు చేస్తున్నవారికి తెలియకుండానే ఇతరులకు పట్టాలు

▸ విచారణ జరిపి హక్కు కల్పించాలని డిమాండ్

మంచిర్యాల, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): తాము 70 ఏళ్లగా సేద్యం చేసుకుంటున్న భూములకు సంబంధించి తమకు పట్టా పాసు పుస్తకాలు మంజూరు చేయాలంటూ 111 రోజులుగా భీమారానికి చెందిన 13 మంది నిరుపేద రైతులు దీక్ష చేస్తున్నారు. మండలంలోని మద్దికల్ గ్రామ శివారులోని సర్వే నంబర్లు 736, 737, 740, 741, 742, 744, 754/1లలో తమకు చెందిన 32 ఎకరాల భూమికి ఇతర వ్యక్తులు పట్టాలు చేయించుకున్నారని అధికారులు ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యమని వారు చెబుతున్నారు. ఈ భూముల్లో తామే సేద్యం చేస్తున్నా తమకు ఎలాంటి హక్కూ లేకుండా పోయిందని, అందుకే కుటుంబ సభ్యులతో సహా దీక్షకు దిగామని తెలిపారు. పట్టాలు చేయించుకున్న వారు తమపై ఒత్తిడి తెస్తున్నారని, తమకు న్యాయం చేయాలని వారు కోరుతున్నారు. రెవెన్యూ అధికారుల అండతోనే అక్రమార్కులు వారి పేరిట పట్టాలు చేయించుకున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పాసు పుస్తకాలు మంజూరు చేయాలి



ఈ భూమిపై ప్రొసీడింగ్ కాపీలతోపాటు పట్టా పాసు పుస్తకాలు మంజూరు చేస్తేనే మాకు పూర్తి అధికారాలు సంక్రమిస్తాయి. అధికారులు స్పందించి మాకు న్యాయం చేయాలి.

– పెండ్యాల మధుకర్, రైతు

ప్రజా కోర్టు నిర్వహించాలి



తాతల కాలం నుంచి ఈ భూమిలోని పంటను అనుభవిస్తున్నాం. ఈ గ్రామంలో ఎవరిని అడిగినా ఈ భూములు మాకు చెందినవేనని చెబుతారు. అధికారులు ప్రజా కోర్టు నిర్వహించి ఈ భూములను తాము విక్రయించినట్టు నిరూపిస్తే భూములను వదులుకుంటాం.

– బొంతల లింగయ్య, రైతు

శీలం ఖరీదు 2.25 లక్షలు

▸ ప్రేమ పేరిట మోసపోయిన యువతి

▸ పెద్దల సమక్షంలో పంచాయితీ

▸ అబార్షన్‌కు అవకాశం లేక వెలుగులోకి

మంచిర్యాల క్రైం, జనవరి 28: అమ్మా నాన్నలేని ఒంటరి యువతిని ఓ వ్యక్తి ప్రేమ పేరిట మోసగించి, గర్భవతిని చేశాడు. న్యాయం కోసం పెద్ద మనుషుల వద్దకు వెళ్తే యువతి శీలానికి వెలకట్టారు. రూ.2.25 లక్షలు ఇప్పిస్తామని, అబార్షన్ చేయించుకోవాలని ఉచిత సలహా ఇచ్చారు. తీరా దవాఖానకు వెళ్తే అబార్షన్ సాధ్యం కాదని వైద్యులు చెప్పడంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. బాధితురాలి కథనం ప్రకారం.. మంచిర్యాల జిల్లా మందమర్రి మండలం రామకృష్ణాపూర్‌కు చెందిన యువతి (22) చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోయింది. మంచిర్యాలలోని భగవంతం వాడలో అద్దెకుంటూ, భవన నిర్మాణ కూలీగా పని చేస్తోంది. పట్టణంలోని ఎడ్లవాడకు చెందిన తాపీ మేస్త్రీ చౌదరి శంకర్ (25)తో పరిచయం ఏర్పడి, ప్రేమగా మారింది. పెళ్లిచేసుకుంటానని నమ్మించిన శంకర్, ఆమెను గర్భవతిని చేశాడు. పెళ్లి చేసుకోవాలని ఒత్తిడి తేవడంతో 5 నెలలుగా తప్పించుకు తిరుగుతున్నాడు. గట్టిగా నిలదీయడంతో పలువురు పెద్దమనుషుల సమక్షంలో పంచాయితీ నిర్వహించాడు. న్యాయం చేయాల్సిన పెద్దలు శంకర్‌కు వత్తాసు పలికి, యువతి శీలానికి వెల కట్టారు. రూ.2,25,000 ఇప్పిస్తామనీ, అబార్షన్ చేయించుకొని తన దారి తనను చూసుకొమ్మని చెప్పారు. మాట వినని ఆమెను భయపెట్టారు. మొదట రూ. లక్ష ఇప్పించారు. వాటిని తీసుకున్న ఆమె అబార్షన్ చేయించుకునేందుకు ఓ ఆసుపత్రికి వెళ్లింది. 8 నెలల గర్భం కావడంతో వైద్యులు అబార్షన్ చేసేందుకు నిరాకరించారు. దీంతో యువతి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

దివ్య విమాన రథంపై నృసింహుడు

▸ పాతగుట్టలో వైభవంగా వెండి గరుడ సేవ ▸ యాదాద్రిలో భక్తుల రద్దీ



యాదాద్రిలో లక్ష్మీనృసింహుడికి లక్ష పుష్పార్చన పూజలు, దర్శన క్యూ లైన్లలో బారులు తీరిన భక్తులు

యాదాద్రి టౌన్, జనవరి 28: వేద మంత్రాలు, భక్తజనుల ఆధ్యాత్మిక నినాదాలు, యువకుల, చిన్నారుల కేరింతలు.. సన్నాయి మేళాల నడుమ మహాలక్ష్మీ సమేతుడై లక్ష్మీనారసింహుడిని దివ్య విమాన రథంపై ఊరేగించారు. ఈ మహాద్భుత పర్వం ఆదివారం రాత్రి పాతగుట్ట ఆలయంలో జరిగింది. యాదాద్రి దేవస్థాన అనుబంధ ఆలయం పాతగుట్ట బ్రహ్మోత్సవాల్లో విశేష ఉత్సవమైన రథోత్సవం అత్యంత వైభవంగా సాగింది. అర్ధరాత్రి సమీపిస్తుండగా ఈ వేడుకలు అంగరంగ వైభవంగా కొనసాగాయి. బ్రహ్మోత్సవాల్లో ఆదివారం వెండి గరుడ సేవోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. పట్టువస్త్రాలు, బంగారు, ముత్యాల ఆభరణాలతో అలంకరించిన లక్ష్మీనరసింహులను తిరువీధుల్లో ఊరేగించి కల్యాణ మండపంపై అధిష్ఠింప చేశారు. మరోవైపు, వరుస సెలవులతో యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి సన్నిధి ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ధర్మ దర్శనానికి సుమారు 5 గంటల సమయం పట్టింది. ఏకాదశిని పురస్కరించుకొని స్వామికి లక్ష పుష్పార్చన పూజలు, స్వయంభువులకు, బాలాలయ కవచమూర్తులకు నిత్యోత్సవాలు సంప్రదాయరీతిలో కొనసాగాయి. స్వామికి ఆదివారం భక్తుల నుంచి 26 లక్షల 14 వేల 994 రూపాయల ఆదాయం సమకూరింది.

కుంటాల జలపాతంలో యువకుడి మృతి

నేరడిగొండ, జనవరి 28: ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ మండలంలోని కుంటాల జలపాతంలో కాలు జారిపడి హైదరాబాద్‌కు చెందిన ఇంజనీరింగ్ విద్యార్థి ఇంజమామ్ ఉల్ హఖ్ (21) మృతి చెందాడు. ఆదివారం పది మంది స్నేహితులు జలపాతం తిలకించేందుకు వచ్చారు. నాచును గమనించక జారి నీటి గుండంలో పడిపోయారు. ఈత రాక ఇంజమామ్ మునిగి పోయాడు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

చింతపల్లి, జనవరి 28: అప్పుల బాధతో ఓ కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. నల్లగొండ జిల్లా చింతపల్లి మండలం గడియా గౌరారం గ్రామానికి చెందిన షేక్ మౌలానా (68) 22 ఎకరాలు కౌలుకు తీసుకొని గత మూడేళ్లుగా బత్తాయి, పత్తి, మిరప సాగు చేస్తున్నాడు. అందుకుగాను రూ.6 లక్షల వరకు ప్రైవేట్ అప్పులు చేశాడు. రెండేళ్లుగా పంట దిగుబడి సరిగా రాకపోవడంతో మనస్తాపానికి గురయ్యాడు. శనివారం బత్తాయి తోటలో ఉరి వేసుకున్నాడు. ఆదివారం ఉదయం ఇంటికి రాక పోవడంతో పెద్ద కుమారుడు జానీ తోట వద్దకు వెళ్లి చూడగా ఉరి వేసుకొని ఉన్న తండ్రి మృతదేహం కనిపించింది.

విద్యార్థిని ఆత్మహత్య



వలిగొండ, జనవరి 28: కడుపునొప్పి భరించలేక నర్సింగ్ విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన యాదాద్రి జిల్లా వలిగొండ మండలంలో శనివారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని టేకుల సోమారం గ్రామానికి చెందిన చేగూరి యాదయ్య కుమార్తె మాధవి (18) నార్కట్‌పల్లిలోని కామినేని ఆసుపత్రిలో నర్సింగ్ కోర్సు (జీఎన్ఎం) చదువుతోంది. మూడు నెలలుగా ఆమె కడుపు నొప్పితో బాధపడుతోంది. శనివారం కడుపు నొప్పి రావటంతో భరించలేక క్రిమి సంహారక మందు తాగింది. కూలి పనికి వెళ్లిన తల్లిదండ్రులు తిరిగి ఇంటికి వచ్చే సరికి మాధవి అపస్మారక స్థితిలో ఉంది. కుటుంబ సభ్యులు వెంటనే భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో, హైదరాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె శనివారం అర్ధరాత్రి మృతిచెందింది.

సామాజిక చైతన్యం తెచ్చేదే కవిత్వం

● తెలంగాణ సాహిత్య అకాడమీ అధ్యక్షుడు నందిని సిధారెడ్డి

నిజామాబాద్ కల్చరల్, జనవరి 28: సాహిత్యకారులు తమ రచనల ద్వారా చైతన్యపరుస్తూ మంచి సమాజ నిర్మాణమే లక్ష్యంగా రచనలు అందిస్తారని తెలంగాణ సాహిత్య అకాడమీ అధ్యక్షుడు నందిని సిధారెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని నిఖిల్ సాయి హోటల్‌లో జరిగిన రామదాసి రాజారాం మహారాజ్ సాహిత్య పురస్కార ప్రధాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సాహిత్యకారులు కవిత్వంలో అన్ని రసాలను అందిస్తారని, అందులో కరుణరసం చాలా గొప్పదన్నారు. ప్రజలను చైతన్యపరుస్తూ కవులు రచనలు చేస్తారని, అందులో ఆర్ద్రత ఉంటేనే ప్రజల మధ్య నిలుస్తుందని పేర్కొన్నారు. రచనలో స్వరార్చన, సురార్చన ఉంటాయని, కవి తన ఆనందం కోసం చేసేది స్వరార్చనని, ప్రజలను చైతన్యపరిచే రచనలు సురార్చనలని పేర్కొన్నారు. ప్రతీ ఒక్క సాహితీపరుడు స్వరార్చన నుంచి సురార్చన వైపు మరలుతారన్నారు. మనిషితో మనిషికి సంబంధాలు తగ్గిపోతున్న నేటికాలంలో మనిషి ఔన్నత్యాన్ని తెలిపే విధంగా రచనలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. మనిషిలో దాగిఉన్న మానవత్వపు ధర్మమే దేవుడిగా బయటకు తీసుకువచ్చి, ప్రజలను జాగృతం చేసి, సమానసమాజ నిర్మాణానికి పాటుపడే విధంగా సాహిత్యకారులు కృషిచేయాలని పిలుపునిచ్చారు. ప్రతిఒక్కరికీ ప్రత్యక్ష దైవాలు తల్లిదండ్రులని, వారిని గౌరవిస్తూ బాగోగులు చూసినప్పుడే మనిషిలో దైవత్వం ద్విగుణీకృతమవుతుందన్నారు. తల్లిదండ్రుల పేరిట సాహిత్య పురస్కారాలను అందజేస్తున్న సురేష్ ఆత్మారాం మహారాజ్ అభినందనీయుడని పేర్కొన్నారు. అనంతరం వివిధ రంగాల్లో సేవలందించినందుకుగానూ నటేశ్వరశర్మ, ఏనుగుల నర్సింహారెడ్డి, దాస్యం సేనాధిపతి, వీపీ.చందన్‌రావు, శ్రీచరణ్, పాయల్ కోటగిర్కర్‌లకు నందిని సిధారెడ్డి చేతుల మీదుగా రామదాసి రాజారాం సాహితీ పురస్కారాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో బోధన్ స్పెషల్ జ్యుడీషియల్ న్యాయమూర్తి భరత్‌భూషణ్, తేజా ఆర్ట్స్ క్రియేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ రంగయ్య, నరాల సుధాకర్, పొద్దుటూరి మాధవీలత, మూడ నాగభూషణం గుప్త, సంజీవని అనుమదాశ్రమం సురేష్ ఆత్మారాం, డాక్టర్ త్రివేణి, కాసర్ల నరేష్, నర్సింహస్వామి, ఘనపురం దేవేందర్ పాల్గొన్నారు.



పురస్కారాలు అందుకుంటున్న దృశ్యం

అమెరికాలో తెలంగాణవాసి మృతి

▸ మృతదేహాన్ని రప్పించేందుకు సీఎస్ లేఖ

హైదరాబాద్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): అమెరికాలో మృతిచెందిన తెలంగాణ ప్రవాసి వెంకన్నగారి శ్రీనివాసచారి మృతదేహాన్ని స్వగ్రామానికి త్వరగా పంపేలా సహకరించాలని భారత రాయబార కార్యాలయాన్ని సీఎస్ ఎస్పీ సింగ్ ఓ లేఖలో కోరారు.

గిరిజనులకు 12 శాతం రిజర్వేషన్ ఇవ్వాలి: జైపాల్‌రెడ్డి



మహబూబ్‌నగర్ క్రీడలు, జనవరి 28: గిరిజనులకు 12 శాతం రిజర్వేషన్ కల్పిస్తామన్న మాట నిలబెట్టుకోవడంలో టీఆర్‌ఎస్ ప్రభుత్వం విఫలమైందని కేంద్ర మాజీ మంత్రి జైపాల్ రెడ్డి ఆరోపించారు. సంత్ సేవాల్ మహారాజ్ జయంతిని పురస్కరించుకొని గిరిజన సంఘం ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్ సమీపంలోని ఎండీసీఏ మైదానంలో రాష్ట్ర స్థాయి బంజారా క్రికెట్ క్రీమీలేయర్ లీడ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను జైపాల్‌రెడ్డి, రిటైర్డ్ అదనపు డీజీపీ డీటీ నాయక్ ప్రారంభించారు. అంతకు ముందు ఏర్పాటు చేసిన సమావేశంలో జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ లంబాడీలు అన్ని రంగాల్లో రాణించాలని పిలుపునిచ్చారు. గతంలో బీసీ (ఏ)లో ఉన్న వారిని కాంగ్రెస్ హయాంలో ఎస్టీ జాబితాలో చేర్పించినట్లు గుర్తు చేశారు. ఈ పోటీలకు రాష్ట్రం నలుమూలల నుంచి 36 జట్లు హాజరయ్యాయి.

గీత వృత్తిదారుల సమస్యలు పరిష్కరించాలి: చాడ

హైదరాబాద్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కల్లుగీత వృత్తిదారుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపాలని సీఎం కేసీఆర్‌ను సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. తాటి, కల్లు ఉత్పత్తుల విక్రయాలు, అభివృద్ధి కోసం పామ్ బోర్డును ఏర్పాటు చేయాలన్నారు. 560 జీవో ప్రకారం గీత సహకార సంఘాలకు వనం పెంచేందుకు కనీసం 10 ఎకరాల ప్రయివేటు భూమిని కేటాయించాలని కోరారు. ఈ విషయమై ఆదివారం సీఎంకు ఆయన బహిరంగ లేఖ రాశారు. చెట్టుపై నుంచి పడి మృతి చెందిన కార్మికుడి కుటుంబానికి రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియాతోపాటు, జీవనం కోసం రూ.10వేల నెలవారీ పింఛన్ ఇవ్వాలన్నారు. కాగా, దళితుల సమస్యలపై ఉద్యమాలు నిర్వహించేలా బలమైన ప్రజా సంఘంగా డీహెచ్‌పీఎస్(దళిత హక్కుల పోరాట సమితి) ఎదగాలని చాడ ఆకాంక్షించారు.



స్వామి వారి నిత్య కల్యాణంలో పాల్గొన్న భక్తులు



భద్రాద్రికి భక్తుల తాకిడి

▸ మూడు రోజుల్లో 95 వేల మంది రాక

భద్రాచలం, జనవరి 28 : భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయానికి భక్తుల తాకిడి పెరిగింది. తెలుగు రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయ పరిసరాలు, గోదావరి తీరంలో సందడి నెలకొంది. మూడు రోజుల్లోనే సుమారు 95 వేల మంది భక్తులు రామయ్యను దర్శించుకున్నారు. ఆర్జిత సేవల ద్వారా ఆలయానికి రూ.30.09 లక్షల ఆదాయం లభించింది. కాగా, ఆదివారం వేకువజాము నుంచే భక్తులు స్వామి వారి దర్శనం కోసం క్యూలైన్లో బారులుదీరారు. మూలవరులకు ఆదివారం నిర్వహించిన సువర్ణ పుష్పార్చనలో 115 జంటలు, నిత్య కల్యాణంలో 126 జంటలు పాల్గొన్నాయి. అలాగే, భీష్మ ఏకాదశిని పురస్కరించుకుని శ్రీ విష్ణు సహస్రనామ స్తోత్రం, విరాట్ పారాయణం నిర్వహించారు. ఈ సందర్భంగా దేవస్థానం స్థానాచార్యులు కేఈ స్థలశాయి మాట్లాడుతూ భీష్మ ఏకాదశి రోజున పారాయణం చేస్తే అద్భుత ఫలితం ఉంటుందని, సామూహికంగా చేసే పారాయణం వెయ్యి రెట్ల ఫలితాన్ని ప్రసాదిస్తుందన్నారు.

ఆ కాలేజీపై ఎందుకంత ప్రేమ?

▸ అసైన్డ్ భూమిపై తేల్చని అధికారులు

▸ ఫిర్యాదులు అందినా స్పందన కరువు

▸ మెదక్ ఇంజనీరింగ్ కాలేజీపై విచారణేదీ?

సిద్దిపేట/కొండపాక, జనవరి 28: సిద్దిపేట జిల్లా కొండపాక మండలం వెలికట్టలో అసైన్డ్ భూమిని అన్యాక్రాంతం చేశారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న మెదక్ ఇంజనీరింగ్ కళాశాలపై విచారణ చేయకపోవడం విమర్శలకు దారితీస్తోంది. రాజీవ్ రహదారి పక్కనే అత్యంత విలువైన ప్రభుత్వ స్థలం కళాశాల పరిధిలో ఉండడంపై ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది. దీనిపై మంత్రి హరీశ్‌రావు, సిద్దిపేట కలెక్టర్ వెంకట్రామరెడ్డి స్పందించి విచారణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అయితే ఒకటి రెండు రోజుల పాటు హడావుడి చేసిన అధికారులు తర్వాత విస్మరించారు. వాస్తవానికి కొండపాక మండల కేంద్రంలోని పట్టా భూమిలో కళాశాల భవనం, మరికొంత స్థలం ఉంటుంది. ఈ కళాశాల గేటుతోపాటు మైదానం, ఇతర స్థలం మాత్రం వెలికట్ట గ్రామ శివారులో ఉంది. ఇదంతా కూడా వెలికట్ట గ్రామ పరిధిలోని 271 సర్వే నంబర్‌కు సంబంధించిన అసైన్డ్ భూమి. కొన్నేళ్ల క్రితం పేదవాళ్లకు సాగు చేసుకునేందుకు ఈ భూమిని కేటాయించారు. అయితే అక్కడ ప్రస్తుతం మెదక్ ఇంజనీరింగ్ కళాశాల నిర్వహణ సాగుతోంది. సుమారు 10 ఎకరాల వరకు ప్రభుత్వ భూమి కళాశాల పరిధిలోనే ఉన్నట్లు అర్థమవుతోంది. దశాబ్ద క్రితం నుంచి సమస్యను నాన్చుతూ వస్తున్నారే తప్ప దానిపై చర్యలు తీసుకోవడం లేదు. ఈ భూ బాగోతంపై అధికారులకు ఫిర్యాదులందినా, చర్యలు తీసుకోకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ భూమి అన్యాక్రాంతమైతే చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రశ్నిస్తున్నారు. కళాశాల యాజమాన్యం ఆధీనంలో అసైన్డ్ భూమి ఉందన్న విషయం 'ఆంధ్రజ్యోతి'లో వచ్చినప్పటికీ అధికారులు అటు వైపు కన్నెత్తి కూడా చూడడం లేదని పేర్కొంటున్నారు. ఈ కాలేజీపై ఎందుకంత ప్రేమ చూపిస్తున్నారో అర్థం కావడం లేదని చెబుతున్నారు. దీనిపై తహసీల్దార్ ఆరీఫా స్పందిస్తూ కళాశాల యాజమాన్యం వారు హైకోర్టులో స్టే తెచ్చుకున్నారని, దీనిపై కోర్టుకు వెళతామని చెప్పుకొచ్చారు.



వెలికట్టలోని మెదక్ ఇంజనీరింగ్ కళాశాల పరిధిలో ఉన్న విలువైన ప్రభుత్వ స్థలం

వివిధ
సాహిత్య వేదిక vividha@andhrajyothy.com

బహిరంగలేఖ

స్వీయాభినందనకు దూరంగా నూటమూడేళ్ళు బతికిన కవి నికనోర్ పారా ఈ జనవరి 23న కనుమూసాడు. నియంతృత్వ పాలనలో సౌకర్యాలెక్కువై పోయి చిలీ ప్రజలు బద్ధకస్తులుగా మారుతున్నారని 1989 జూన్ నెలాఖరులో అగస్తో పినొచే సైనిక ప్రభుత్వం వారాంతపు సెలవలను నిరవధికంగా రద్దు చేసింది. అందుకు నిరసనగా రాసిన ఈ బహిరంగ లేఖను ప్రచురించి నందుకు లహోర్నదా పత్రికను నిషేదించారు. మూడున్నర నెలలపాటు పారా కు గృహ నిర్బంధం విధించగలిగారు.

కవిత్వీకరించి చెప్పదగిన జీవిత సత్యాలు ఎక్స్‌ట్రీమ్స్‌లో వున్నా ఇష్టపడే స్మైల్ గారు పారా బహిరంగలేఖకు అమెరికన్ కవి ఎలెన్ గిన్స్‌బర్గ్ చేసిన ఇంగ్లీషు అనువాదాన్ని అందించినందుకు ఆయనకు మరొక్కసారి సగౌరవంగా సాలూద్!

- తల్లావజ్ఝల శశిశేఖర్



1914 - 2018

యజమాన్ల వారూ
మేము అనగా చిలీ ప్రజలము
వలల్ని గాలి కొదిలేయదలుచుకున్నాం
తెరచాపల్ని మడిచేయాలనుకుంటున్నాం

* * *

శనివారం జులై ఒకటి అనే కాలండర్ అంకెలోకి
బాకొకదాన్ని దింపాలనుకుంటున్నాం
దాని పిడికొస మీదున్న రెప్పలేని కనుగుడ్డులో
నక్షత్రాలను కనుగొనాలనుకుంటున్నాం

* * *

ఎల్లప్పుడూ ఊరే సముద్రం
అలల తలపోతల్నీ నురగ వలువల్నీ విప్పేసుకోవడాన్ని
తీరంతో పాటు మేమూ నెమరేసుకోవాలనుకుంటున్నాం

* * *

మనుషులతో విసిగిపోయిన నేల
కాలి మునివేళ్ళ మీద నిలబడి
నింగిని ఉగ్గబట్టి ముద్దాడుతుంటే
తేమలో ఎర్రతేళ్ళమై పరుచుకోవాలనుకుంటున్నాం

* * *

మాళిగలు ఖాళీచేసి జొన్నలు పంచేయాలనుకుంటున్నాం
ఉప్పు కయ్యల మీంచి నల్లదుప్పుల్లా ఉరకాలనుకుంటున్నాం
డేగ ఈకలతో చెవిగులిమి వెలికితీయాలనుకుంటున్నాం
ఊరి బలశాలిని ఉలిక్కి లేపే ఈల వేయదలచుకున్నాం

* * *

కూడలి కంచుగంటని కంకర్రాయితో కొట్టి
వెలుతురులోకి విసురుకెళ్ళే గబ్బిలాలు
మగనాలి తలపుల్లా చెదరడాన్ని చూడాలనుకుంటున్నాం

* * *

ఖాళీ చేసిన సారా సీసాలోకి అగ్గిపుల్లంటించి
ఆకాశాన్ని దింపాలనుకుంటున్నాం

* * *

ఒకే ఒక్క ఇటుక లాగి గోడ మొత్తం కూల్చేసే
కిటుకు కనిపెట్టదలచుకున్నాం

* * *

రేపు ఆదివారం సాయంకాలం
మేమొదిలిన వేనవేల కాయితపు లాంతర్లు మబ్బుల్లో కలిసిపోవడం నీ కళ్ళబడితే

మా మానాన మమ్మల్ని బతకనిచ్చి నువ్వు సెలవుపుచ్చుకావాల్సింది బోయి
మా సెలవల్ని రద్దు చేసేందుకు
నువ్వేవడివి లాంటి పేలవమైన మాటలు
ఇక్కడ రాయనందుకు బిత్తర పోవద్దు
ఏవంటే ఊడిగాలకు సోమవారం నాడు కూడా
మేము రాబోడం లేదు

పనులన్నీ మానుకుని ఇంట్లోనే కూచున్న నా మేనగోడళ్ళతో కలిసి
అవిధేయుడు

■ **అకవి నికనోర్ పారా** *(జులై 1 , 1989)*

సానెట్ రచయితగా షేక్స్పియర్

జీవితం శాశ్వతం కాకపోయినా, విభిన్న కోణాలలో దర్శించిన జీవితానుభవాలను హృద్యంగా ఆవిష్కరించిన సాహిత్యం శాశ్వతంగా నిలిచిపోవడం గొప్ప ఆనందాన్నిచ్చే సత్యం. విశ్వసాహిత్యంలో ఒక ప్రత్యేకమైన స్థాయి, స్థానం కలిగిన మహారచయితలలో షేక్స్పియర్ పేరెన్నికగన్నవారు. షేక్స్పియర్ ప్రధానంగా గొప్ప నాటక రచయిత. వివిధ కథావస్తువుల మీద విషాదాంత, సుఖాంత, చారిత్రక, రొమాన్స్ నాటకాలను రసవత్తరంగా వ్రాసి ప్రసిద్ధి గాంచినవారు.

షేక్స్పియర్ ఈ నాటకాలతో పాటు 'వీనస్ అండ్ ఎడోనిస్', 'ది రేప్ ఆఫ్ లుక్రీస్', 'ది సానెట్స్' అనే మూడు కవితా గ్రంథాలను కూడా రచించారు. సానెట్ అనేది పద్నాలుగు పంక్తుల కవిత. దాని పుట్టుక ఇటలీలో. ఇటాలియన్ భాషలో 'సొనెట్టో' అనే పదం ఇంగ్లీషులో 'సానెట్' అయింది. ఇటాలియన్‌లో పెట్రార్క్ అనే కవి దానిని ప్రాచుర్యంలోకి తీసుకురావడంతో అది పెట్రార్కన్ సానెట్‌గా పిలువబడుతుండేది. మొదటి ఎనిమిది పంక్తులను ఆక్టేవ్ అనీ, ఆఖరి ఆరు పంక్తులను సెస్టెట్ అనీ పిలిచేవారు. హెన్రీ హోవర్డ్, మైకేల్ డ్రేటన్, శామ్యూల్ డానియల్ మొదలగు రచయితలు సానెట్ ఆకృతిలో కొన్ని మార్పులు చేశారు. దీనివల్ల నాలుగు పంక్తుల చరణాలు మూడు, రెండు పంక్తుల చరణం ఒకటి వుండటం జరిగింది. ఈ మార్పులతో కూడిన సానెట్ రూపాన్నే షేక్స్పియర్ కూడా స్వీకరించారు. దీనిని షేక్స్పిరియన్ లేదా ఎలిజబీతన్ సానెట్ అని వ్యవహరిస్తారు. పంక్తి తరువాత పంక్తిలో రైం స్కీమ్‌ను పాటిస్తారు.

సానెట్ పరిణామానికి దోహదం చేసినవారు ఎందరున్నా దానిని ఒక శక్తిమంతమైన, సౌందర్యశోభితమైన కవితారూపంగా తీర్చిదిద్దిన ఖ్యాతి షేక్స్పియర్‌కే దక్కుతుంది. వైయక్తిక అనుభూతి వ్యక్తీకరణకు సాధనంగా సానెట్ మంచి ప్రాచుర్యంలోకి రావడానికి షేక్స్పియర్ సానెట్స్ చాలా దోహదం చేశాయి. కోమలమైన అనుభూతుల్ని, భావోద్వేగాన్ని లలిత లలితమైన పదజాలంతో వ్యక్తీకరించడానికి సరైన మాధ్యమంగా సానెట్ స్థిరపడింది. చిరుచిరు పదాలతో రూపకాలంకార శోభితమైన భాషలో పుష్పసుకుమారమైన ప్రేమభావ వ్యక్తీకరణకు సానెట్‌ను మించిన కవితారూపం మరొకటి లేకపోయింది. ప్రాకృతిక సౌందర్యాన్ని, ప్రేమభావ లాలిత్యాన్ని కలిపి మనోజ్ఞమైన రచన చేయడానికి సానెట్‌లో వీలయింది. షేక్స్పిరియన్ సానెట్‌లో పై నాలుగు పంక్తులతో కూడిన మూడు చరణాల్లో విశదీకరించబడిన భావం లేదా అనుభూతి చివరి రెండు పంక్తులలో ఒక డిసైసివ్ ఇఫెక్ట్ సాధిస్తుంది.

షేక్స్పియర్ మొత్తం నూటాయాభైనాలుగు సానెట్లను వ్రాశారు. వానిలో మొదటి నూటాఇరవైఆరు సానెట్లు తన మిత్రుడిని ఉద్దేశించి వ్రాసినవి. చాలామంది ప్రసిద్ధులైన విమర్శకుల అభిప్రాయం- ఆ స్నేహితుడు సౌతాంప్టన్ ప్రభువని. ఆయన చాలా రూపసి. ఈ సానెట్లలో ప్రధాన విషయం: నీవు అపురూపమైన సౌందర్యవంతుడివి. కాలహరణం చేయకుండా వివాహమాడి పుత్రుల్ని కని, వారి ద్వారా నీ సౌందర్యాన్ని అజరామరం జేసికో.

వీనిలో తన మిత్రుడి యడల స్నేహభావాన్ని, ప్రేమాధిక్యతను వ్యక్తపరుస్తారు:

"అవిశ్రాంతంగా సాగే కాలం మోదాన్ని గూర్చే గ్రీష్మాన్ని
కర్కశ హేమంతానికి బలిజేసి రూపుమాపుతుంది"... 5
- అంటూ సున్నితంగా,

"మిత్రుడా! నీ వ్యక్తిత్వ అస్తిత్వ పరివ్యాప్తికి
నీవేమి చేయడం లేదు ... 13
- అంటూ ప్రస్ఫుటమైన వేదనతో,

"మహాంధకారంలో మణిప్రకాశంలా నీ మూర్తి
చీకటి రాత్రిని సౌందర్యవంతం చేస్తుంది" ... 27
- అంటూ గాఢమైన ఆనందాతిరేకంతో,

"మౌన మధురోహల, మనోజ్ఞమైన ఆలోచనల కొలువుకు
కాలగర్భంలో కలిసిపోయిన విషయాల కాహ్వానం పలికినపుడు" ... 30
- అంటూ నిర్వేదంతో,

"అన్నిటినీ నశింపజేసే సామ్రాజ్ఞి ప్రకృతి" ... 126
- అంటూ దుఃఖపుజీరతో మిళితమైన తాత్త్విక చింతనతో ఈ సానెట్లు సాగుతాయి.

నూటా ఇరవైయేడు నుండి నూటాయాభైరెండు వరకు సానెట్లన్నీ డార్క్ లేడీనుద్దేశించి వ్రాయబడినవి. ఈమె షేక్స్పియర్‌కు ప్రేయసనీ, ఆ తర్వాత సౌతాంప్టన్ ప్రభువు యడల ఆకర్షితురాలై ఆయనకు ప్రియురాలిగా ఉండిపోయిందనీ, ఆమె పేరు మేరీ ఫిటన్ అనీ విమర్శకుల అభిప్రాయం. ప్రేమిస్తూ ద్వేషించే, ద్వేషిస్తూ ప్రేమించే ద్వయీభూత భావసంపుటితో ఈ ఇరవై ఆరు సానెట్లు నిండి వుంటవి:

"నిజానికి నీవు నరకంలా నల్లని దానివి
కాళరాత్రిలా భయంకరివి" ... 147
- అంటూ నిరసన ప్రకటిస్తూ కూడా,

"భసిత వర్ణ తూర్పు దిశా కపోలాల మీద
ఉదయించే సూర్యబింబం కానీ,
దక్షిణ సంధ్యలో మెరిసే నిండు నక్షత్రం కానీ,
నీ ముఖబింబంలో మురిపించే వ్యధిత నేత్ర
సౌందర్యానికి సగం కూడా దీటు రావు" ... 132
- అంటూ పట్టరాని మోహాన్ని వ్యక్తపరుస్తారు.

నూటాయాభై మూడు, నూటయాభై నాలుగవ సానెట్లు ప్రేమదేవుడైన క్యుపిడ్ మీద వ్రాశారు.


సానెట్లలో ఆటోబయాగ్రఫికల్ ఎలిమెంట్ ఉందనీ, అవి స్వకీయ అనుభూతుల వ్యక్తీకరణ మాధ్యమాలనీ కాల్పనికవాద విమర్శకులు వర్డ్స్‌వర్త్, ఎ.డబ్ల్యు. ష్లెగల్, యఫ్.డబ్ల్యు. ష్లెగల్ అభిప్రాయపడతారు. అటువంటి అభిప్రాయాలనే స్విన్‌బర్న్, ఎమర్సన్, ఫర్నివాల్ వెలిబుచ్చారు. మెలాన్ లాంటి విమర్శకులు ఈ సానెట్లు ఆటోబయోగ్రఫికల్ కావని, ఊహాజనిత కవన ఖండికలని నమ్ముతారు. కార్లైల్ మధ్యేమార్గంగా- సానెట్స్ తప్పనిసరిగా వ్యక్తిగత భావాల వ్యక్తీకరణ రూపా లేనని, కానీ, అవి పూర్తిగా ఆటోబయాగ్రఫికల్ అనటం సమంజసం కాదనీ అంటారు. హెన్రీ బ్రౌన్ చిత్రమైన వ్యాఖ్య చేస్తారు: సానెట్స్‌లో షేక్స్పియర్ ప్రస్తావించినది తన స్నేహితుడి మధ్య, తన కవితా కన్యక మధ్య జరగవలసిన వివాహాన్ని గురించి అని.

సౌందర్యారాధన దైవీసంబంధమైన మహోద్వేగమని, అది మానవుని ఆత్మకు ఉన్నతమైన అస్తిత్వాన్ని ప్రసాదిస్తుందని, యౌవనాన్ని, సౌందర్యాన్ని, స్త్రీపురుష సంపర్కం ద్వారా విస్తరింపజేయటం మొదలుగాగల ప్లేటో భావాలను సానెట్లలో గుర్తించే విమర్శకులున్నారు. కాగా, ప్రఖ్యాత పండితుడు, విమర్శకుడు డౌడెన్ సానెట్లలోని అందమైన యువకుడు కవి యొక్క ఆదర్శవంతమైన స్వకీయతేనని, లేదా సౌంద ర్యతత్వ ఆత్మ అనీ అంటూ, ఎలిజబీతన్ కాలం నాటి సాంస్కృతిక పునరుజ్జీవన దశలో స్నేహోద్వేగం, ప్రేమోద్వేగం కంటే ఉన్నతమైనదని భావించడం జరిగిందంటారు. జె.ఇ.జి. మాంట్‌మొరెన్సీ ఒక ఎలిగారికల్ లేయర్‌ను గమనిస్తూ అందగాడైన ఆ యువకుడు పురుష ప్రకృతి అనీ, డార్క్‌లేడీ మృత్యువుకూ చెడుకూ సంకేతమనీ భావిస్తారు.

కవి, విమర్శకుడు కోలెరిడ్జి ఇవి ఒక పురుషుణ్ణి ఉద్దేశించి రాసినవి కావని, తన మనసులో వున్న ఒక ప్రేయసి యడల ప్రేమతో పెల్లుబికిన ప్రతిభావంతమైన వ్యక్తీకరణలని, క్లుప్తతలోకి ఆలోచనల అస్తిత్వాన్ని ఒదిగించడం జరిగిందని, లయ సోయగాన్ని, శబ్ద సారూప్యత సౌందర్యాన్ని ఒక సంగీత మాధురిలో సంగమింప జేయడం జరిగిందని గొప్పగా ప్రశంసిస్తారు. అలానే కాల్పనిక కవులలో అగ్రగణ్యుడైన జాన్‌కీట్స్ ఎవరూసాధించని సౌందర్యాలను షేక్స్పియర్ ప్రయత్నరహితంగా తన సానెట్లలో సాధించారని తన మెప్పును తెలియచేస్తారు.

వర్డ్స్‌వర్త్, మార్క్ పాటిసన్, విలియం హాజ్‌లిట్ లాంటి విమర్శకులు సానెట్లలో అస్పష్టత, అసహజత, ప్రతి విషయాన్ని విసుగుపుట్టించే విధంగా సాగదీయడం లాంటి దోషాలను ఎత్తి చూపుతారు. మాథ్యూ అర్నాల్డ్‌కు ఒక యువకుడి మీద, అనైతిక మనఃప్రవృత్తి కలిగిన డార్క్‌లేడీ మీద షేక్స్పియర్ చూపించే ప్రేమోద్వేగం ఆమోదయోగ్యం కాదు.

షేక్స్పియర్ తత్త్వాన్ని, మనఃప్రవృత్తిని, వ్యక్తిత్వాన్ని పరిగణనలోకి తీసుకోకుండా సానెట్స్‌లోని మూల తత్త్వాన్ని అర్థం చేసికోవడం అసంభవమౌతుంది. సూక్ష్మ పరిశీలనా దృష్టితో చూస్తే మొదటి నూటాయిరవైఆరు సానెట్లలో వ్యక్తమయ్యేది షేక్స్పియర్ అనంతమైన కళాత్మక సౌందర్యారాధన. ఆయన దృష్టిలో తన మిత్రుడు శుద్ధ సౌందర్య దర్శనానికి భౌతిక మాధ్యమం. భౌతిక మాధ్యమేదైనా కాలంచేసే నశింపుకు గురౌతుంది. అవిచ్ఛిన్నంగా ఆ సౌందర్యం కొనసాగేది సంతానయోగం ద్వారా; అందుకు వివాహం అవసరం. షేక్స్పియర్ ఆర్తి తన స్నేహితుని యడల కాదు, అతని సౌందర్యం అజరామరమవటం యడల. ఆయన కళాత్మక సౌందర్యారాధన, వేదన సానెట్లలోని శిల్ప సౌందర్యం, శైలీ మాధుర్యాల మహాప్రకాశంలో పంక్తి పంక్తిలో ద్యోతకమౌతాయి. అంచేతే శతాబ్దాలు గడచినా సాహితీ రసజ్ఞత కలిగిన పాఠకులను ప్రపంచవ్యాప్తంగా అవి అలరిస్తూనే ఉన్నాయి.



● **చేపూరు సుబ్బారావు**
99892 34505

లక్ష్మీనారాయణ జైని సాహితీ పురస్కారం

ఎన్. గోపి 'జలగీతం' దీర్ఘ కవితకు లక్ష రూపాయల నగదుతో లక్ష్మీనారాయణ జైని జాతీయ సాహితీ పురస్కారాన్ని ప్రకటించారు. ఈ పురస్కార ప్రదాన కార్యక్రమం జనవరి 29 సా.6గం.లకు హైదరాబాద్ రవీంద్రభారతి మొదటి అంతస్థులో జరుగనుంది. చైతన్య జైని, బి.చంద్రకుమార్, బిక్కి కృష్ణ, ఎ.ఎన్. జగన్నాథ శర్మ, మామిడి హరికృష్ణ తదితరులు పాల్గొంటారు.

- ప్రభాకర్ జైని

సాహిత్య స్వర్ణోత్సవం

తెలంగాణ సాహిత్య కళావేదిక ఆధ్వర్యంలో అమ్మంగి వేణు గోపాల్ సాహిత్య స్వర్ణోత్సవం, సప్తతి సందర్భంగా వివిధ గ్రంథాల ఆవిష్కరణ, అంకితోత్సవం ఫిబ్రవరి 3 మ.2.30గం.ల నుంచి సమావేశమందిరం, మొదటి అంతస్తు, రవీంద్ర భారతి, హైదరాబాద్ నందు జరుగుతుంది. ఈ సందర్భంగా పలు కార్యక్రమాలలో వేణు సంకోజు, ఏనుగు నరసింహారెడ్డి, అంపశయ్య నవీన్, బి. నరసింగరావు, నందిని సిధారెడ్డి, కె.వి. రమణాచారి తదితరులు పాల్గొంటారు.

- కె. గోవిందు

గేయకవితలకు ఆహ్వానం

గేయ కవితా సంకలనాన్ని ప్రచురించ దలిచాం. ఒక పేజీకి మించని ఐదు చరణాల పరిమితిగల గేయంతోపాటు సంక్షిప్త బయోడేటా, పాస్‌పోర్టు ఫోటోను పంపాలి. ఆఖరు తేది ఫిబ్రవరి 10. చిరునామా: సీరపాణి, పాలకొండ-532440, శ్రీకాకుళం జిల్లా, ఆం.ప్ర.కు గాని, seerapani49@gmail.com ఈమెయిల్‌కు గాని పంపవచ్చు. వివరాలకు: 6281319940.

- సీరపాణి

కన్యాశుల్కం నాటక ప్రదర్శన

ముమ్మనేని సుబ్బారావు 'సిద్ధార్థ కళాపీఠము' & పర్వతనేని బ్రహ్మయ్య సిద్ధార్థ కళాశాల, విజయవాడ సంయుక్త ఆధ్వర్యంలో నవ యువ ఆర్ట్స్ అసోసియేషన్, విజయనగరం వారిచే గురజాడ 'కన్యాశుల్కం' నాటక ప్రదర్శన జనవరి 28 సా.5.30ని.లకు పర్వతనేని బ్రహ్మయ్య సిద్ధార్థ కళాశాల, విజయవాడ ప్రాంగణంలో జరుగుతుంది.

- సిద్ధార్థ కళాపీఠము

చీమలు చెప్పే కథలే కావాలిప్పుడు!

ఏనుగు కాళ్ళ కింద నలిగిన చీమ గొంతు ఎలా ఉంటుంది? మనం ఎప్పుడూ విని ఉండం. నిజానికి వినాలనే ఆసక్తే ఉండదేమో! ఏనుగు ఘీంకారాల మధ్య చీమల గొంతులకు అక్షర రూపం ఇచ్చింది సుజాత గిడ్ల. అదే 'ఆంట్స్ అమాంగ్ ఎలిఫెంట్స్' పుస్తకం. ఆధునిక భారతదేశ నిర్మాణంలో ఒక అంటరాని కుటుంబం కథ ఇది. ఇటీవల అమెరికాలో పేరు మోసిన 'ఫెర్రాస్ స్ట్రాస్ అండ్ జిరో' పబ్లిషర్స్ ప్రచురించగా, 'హార్పర్ కాలిన్స్' పబ్లిషర్స్ మన దేశంలో పునర్ముద్రణ చేసారు. ఈ నెల జైపూర్‌లో జరగబోతున్న ప్రసిద్ధ సాహితీ సంరంభంలో సుజాత పాల్గొంటోంది. ప్రపంచవ్యాప్తంగా అత్యంత ప్రజాదరణ పొందిన, సంచలనాత్మకం అయిన ఆ పుస్తకం ఇప్పుడు మన ముందు ఉంది.


తెలంగాణ సాయుధ రాజకీయ అనుభవాల నేపథ్యంలో ఆ అనుభవాల పునాదిగా వర్తమాన పోరాటాలకు స్ఫూర్తిదాయకంగా మిగిలే రచనలు అరుదు. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత ప్రపంచ వ్యాప్తంగా జాతీయోద్యమ పోరాటాలు తీవ్రతరం అయ్యాయి. తెలంగాణలాగే లాటిన్ అమెరికా మూలవాసుల స్వాభిమాన పోరాటాలు సాయుధ రూపం తీసుకున్నాయి. ఈ పుస్తకం చదువుతుంటే సుజాత లాగా తన స్వగతాన్ని చరిత్రగా నిర్మించుకున్న ఒక గ్వాటిమాల ఆడబిడ్డ యాదికి వచ్చింది. ఆమె 'రిగబెర్తా మెంచూ', లాటిన్ అమెరికా మూలవాసి. వలస దండులా అమెరికాను ఆక్రమించిన చోరబాటు దారులు స్థానిక జాతులు అయిన రెడ్ ఇండియన్ తెగలను తుదముట్టానికి అంతం చేసారు. అమెరికా భూమి పొరల్లో ఆ ఆదిమవాసుల ఆక్రందనలకు, గ్వాటిమాల తేయాకు తోటల్లో వెట్టికీ వెలివేతలకీ చిరునామాగా మారిన బతుకులకు అక్షర రూపం రిగబెర్తా ఇచ్చింది. పంతొమ్మిది వందల ఎనభైల్లో ఆమె రాసిన 'ఐ రిగబెర్తో మెంచు' ప్రపంచ స్వగత సాహిత్యంలో ఒక సంచలనం.

మళ్ళీ నాలుగు దశాబ్దాల తర్వాత అంతటి శక్తిమంతమైన పుస్తకం ఇప్పుడు మన ముందు ఉంది. వలస పాలన నుంచి ఈ దేశం విముక్తం కావటమన్నది కేవలం రెండు జాతుల మధ్య, రెండు రంగుల మధ్య జరిగిన అధికార మార్పిడి మాత్రమే కావటంతో ప్రత్యామ్నాయ రాజకీయ నిర్మాణాలు ముందుకు వచ్చాయి. అవి తూర్పుకాల వసంత మేఘ ఘర్జనగా సిలుగురిలో మెరిసిన ఆలోచనలు. బస్తర్, శ్రీకాకుళం మీదుగా కోరుట్ల, జగిత్యాల, సిరిసిల్ల, తొలి-మలి దశ తెలంగాణ పోరాటంతో పదునెక్కి గోదావరి లోయ మీదుగా దండకారణ్యం దాకా సాగిన ఆ ప్రజా ప్రత్యామ్నాయ రాజకీయాల వెనక కొండపల్లి సీతారామయ్య, కె.జి సత్యమూర్తి ఉన్నారు. కె.జి. సత్యమూర్తి (శివసాగర్) మేనకోడలు సుజాత గిడ్ల ఇప్పుడు తన పూర్వీకుల చరిత్రకు ప్రాణం పోసింది.

సుజాత తన మూడు తరాల బతుకుని మూడు వందల పేజీలలో ఉంచింది. పది భాగాలుగా రాయబడిన ఈ పుస్తకంలో చిత్రితమైన జీవిత కథనంలో ఒక తరం విస్థాపితులు, మరో తరం బ్రిటిష్‌ఆర్మీలో సిపాయి, మరోతరం ఉమ్మడి వామపక్ష విప్లవంలోనూ తదనంతరం దళిత బహుజన రాజకీయాలలోనూ బతుకుని ప్రయోగశాలగా మార్చుకున్నవారు కనిపిస్తారు. ఒకరకంగా ఇది తెలంగాణ గడ్డమీద జరిగిన సాహిత్య, సాంస్కృతిక, విప్లవ చరిత్ర. దోపిడీ పీడన లేని సమాజం కోసం కలలుగన్న ఒక తరం తండ్లాట.

శివసాగర్ మేనకోడలు సుజాత తల్లిదండ్రులు ఇద్దరూ అధ్యాపకులు. ఖాజీపేటలో యాభై ఏళ్ళ కిందట జన్మించిన ఆమె నాడు కల్లోలిత ప్రాంతంగా పాలకులు ముద్రవేసిన వరంగల్ రీజినల్ ఇంజనీరింగ్ కళాశాలలో రాడికల్ విద్యార్థి కార్యాచరణలో భాగమైంది. శత్రు నిర్బంధాలను, జైలు జీవితాన్ని, మరెన్నో వివక్షలను ఎదుర్కొని ఎట్టకేలకు డిగ్రీతో అమెరికా వెళ్లి ప్రస్తుతం న్యూయార్క్ రైల్వేలో పనిచేస్తున్నది.





రెండువందల ఇరవై ఏండ్ల కింద భద్రాచలం అడవుల్లో నాగరికతకు ఆమడ దూరాన ప్రకృతితో మమేకమైన గూడేల మీద బ్రిటిష్ వలసవాద దురాక్రమణ జరిగింది. ఆ క్రమంలో వందలాది తెగలు చెల్లా చెదరయ్యాయి. ఆనాడు భద్రాచలం అడవుల్లో టేకు వనాల పెంపకం కోసం అడివిలో ఉన్న ఒక గిరిజన కుటుంబాన్ని బ్రిటిష్ పాలకులు తరిమితే వారు కృష్ణానదీ పరీవాహక ప్రాంతానికి వలసవచ్చి స్థిరపడ్డారు. వారే వెంకట స్వామి, అచ్చమ్మ. అలా కృష్ణా జిల్లా శంకరంపాడులో స్థిరపడిన ఆ కుటుంబం, స్థానికంగా జరిగిన ఒక ఆందోళనలో గాయపడి, ఊరికి సహాయంగా వచ్చిన కెనడియన్ మిషనరీల ప్రభావానికి లోనయ్యారు. అలా ఆ జంట వారసులు అనివార్యంగా క్రైస్తవులుగా, అందునా దళిత క్రైస్తవులుగా మారారు. గుడికీ బడికీ దూరంగా నెట్టివేయబడిన బతుకులకు మిషనరీలు కాస్త కూడు గుడ్డా నాలుగు అక్షరం ముక్కలూ నేర్పాయి. అలా ఖమ్మం ప్రాంతం నుంచి వలస వచ్చిన వాళ్ళ ఇంటిపేరు ఖంభంగా స్థిరపడిపోయింది. ఆ కుటుంబంలో నాలుగు అక్షరం ముక్కలు నేర్చుకున్నవాడు ప్రసన్నరావు మాష్టారు. రెండవ ప్రపంచ యుద్ధంలో పాల్గొన్న సైనికుడు ప్రసన్నరావు మాష్టారు. ఆయనకు సత్యమూర్తి, మంజుల, విలియం కెరీ... ముగ్గురు సంతానం. అందులో మంజుల పెద్ద కూతురు గిడ్ల సుజాత రాసుకున్న జ్ఞాపకాల శకలమే ఈ పుస్తకం.

ప్రసన్నరావు మాస్టారు రెండో ప్రపంచ యుద్ధంలో సైనికుడిగా ఆ తర్వాత బడిపంతులుగా, తల్లిలేని తన ముగ్గురు పిల్లల బతుకు భరోసా కోసం సాగించిన దళిత జీవితం ఈ పుస్తకంలో ఉంది. వందేళ్ళ కిందట గుంటూరు పరిసర ప్రాంతాల్లో మిషనరీల వితరణతో బడి వైపు మళ్ళి నాలుగు ముక్కలు నేర్చుకొన్న ఆయన పెద్ద కొడుకు సత్యమూర్తి ఇందులో కథానాయకుడు. గుడివాడ మురికివాడల్లో పాకీపని చేసుకునే కూలీల సాంస్కృతిక దళం కార్యక్షేత్రంగా మొదలైన ఆయన ప్రయాణం అరవయ్యో దశకంలో వరంగల్ ఫాతిమా సెయింట్ గాబ్రియల్ స్టూడెంట్ ఫెడరేషన్ నిర్మాణాలు; రైల్వేకార్మికుల, మొజంజాహీ మిల్లు బతుకుల మీదుగా గుత్తికొండ, నల్లమల, భద్రాచలం బస్తర్ దాకా విస్తరించింది.

ఈ పుస్తకంలో ప్రసన్నరావు, సత్యమూర్తి, మంజుల, ప్రభాకర రావు, రత్నమ్మ, విలియం కెరీ, సుజాత, అనిత, అబ్రహం, కొండపల్లి సీతారామయ్య, ద్రోణవల్లి అనసూయ, చంద్రశేఖర్, మాణిక్యరావు, బాపనయ్య అనుపమ లాంటి ఎందరి కథలో ఉన్నాయి. వాళ్ళు కేవలం వ్యక్తులే కాదు; తమ చుట్టూ ఉన్న దుఃఖాలను తమవిగా మార్చుకున్న అసామాన్య ప్రజలు. వారి జీవితమంత విస్తారమైన చరిత్ర ఇది. మార్క్సు ఆలోచనలు శిలాసదృశం కావనీ; దేశ కాలమాన పరిస్థితుల ప్రకారం ఆయా ప్రాంతీయ, దేశీయ ఆలోచనలు, తాత్త్విక చింతనలతో కలిపి మార్క్సు ఆలోచనలు పోరాట రూపాలుగా మారాలనీ కలలుగన్న ఒక స్వాప్నికుడి ప్రయాణం విషాదంగా ముగిసింది. మనకు శివసాగర్‌తో ఎంత మమేకత ఉన్నా సత్యమూర్తితో ఎంత రాజకీయ భిన్నాభిప్రాయం ఉన్నా, చరిత్ర గమనానికి ఆ తరం చేసిన త్యాగాల రూపం మీద కనీస మద్దతు ఉండి తీరాలి.

ఈ పుస్తకంలో కొన్ని విభేదించే అంశాలున్నాయి. కొన్ని అసంబద్ధమైన విషయాలు ఉన్నాయి. "సత్యమూర్తి తన పుట్టుక మూలంగానే వివక్ష అనుభవించాడు" అనడం, భూమయ్య కిష్టా గౌడ్‌లను పోరబాటుగా గిరిజనులు అనుకోవడం, "ప్రత్యేక తెలంగాణ ఉద్యమం ఉధృతంగా జరిగిన సందర్భంలో ఆంధ్రుల మీద దాడులు, అత్యాచారాలు జరిగాయి" వంటి వాక్యాలు మరొక్కసారి సరిచూసుకుంటే బాగుండేది. దానితో బాటు కొందరి వ్యక్తిగత జీవితాలలో ఉన్న ద్వంద విలువలు నిజమే అయినా, 'మహాకవుల తాగేసిన సీసాల వాసన కన్నా వారు రాసిన రాతల్లో విప్లవాలను పలవరించే ఔదార్యం' ఎందుకో సుజాత ఈ పుస్తకంలో చూపలేదని అనిపిస్తోంది. అయితే ఈ పుస్తకం ఒక కంప్యూటర్ ఇంజనీర్ రాయడం నిజంగా కత్తి మీద సాము లాంటిదే. ఇది కేవలం కథేనా? కాదు! ఈ దేశ నిర్మాణానికి కొన్ని తరాలు చేసిన త్యాగాల కథ. ఇది విస్మరించ కూడని మన అందరి కథ.

■ **గుఱ్ఱం సీతారాములు**
99516 61001

moon and cage

నేను పేదరికాన్ని ప్రేమించేదానను
పేదరికం కలగలసిన సహజత్వాన్ని ప్రేమించాను

నా మనసూ ఎంత పేదదంటే..
కేవలం ప్రేమికుడితో కలిసి జీవించాలనే తపన తప్ప
ఇంకేం కోరదు..!
ప్రపంచం రంగుల కలల్ని పరచి ఊరిస్తుంది
కానీ నేనెప్పుడూ బెణక లేదు

ఖాళీ గిన్నెలను..
ఇల్లులేని తనాన్ని
ఆఖరికి స్నానానికి చాటులేని తనాన్ని..
ఏ అడ్డుగోడలు లేకుండా ప్రేమించాను!


పేగులు మండుతాయని తెలిసినా
అనేకసార్లు గొడ్డుకారాన్నే తిన్నాను
నాలుక తిరగబడుతున్నా
మూడుచెక్కల్లోనే అమృతాన్ని గ్రోలాను

ఎన్నెన్నో ఆవురావురనే ఆకలిరాత్రుల్ని
కన్నీళ్ళతో జోకొట్టి కళ్ళను నిదురపుచ్చాను
నాలుక రుచులడిగినపుడల్లా...
ఎద్దుకూర కబాబ్‌లను వేయించుకుని తిన్నాను!
మడిగట్టుకున్న నీ మనసుకిది ఎన్నటికీ అర్థం కాదు

క్షమించు.. నువ్వు ఆఫర్ చేసే స్టార్లనో
అంతకుమించిన ఖరీదైన ఆతిథ్యాన్నో
నేను స్వీకరించలేను..

నాకు చందమామంటే చాలా ఇష్టం
పక్షం రోజుల్లో కూడబెట్టిందంతా
లోకంలో వెదజల్లి...
ఖాళీ అయిపోతాడు
అలాంటి మనసు వెదజల్లే వెన్నెల్నే ఆస్వాదిస్తాను!

నేన్నిన్ను దూరంగా ఉంచుతున్నానంటే
అది నా తప్పుకాదు
నువ్వు సంపాదించిన డబ్బును చూస్తే
నాకు చుట్టుకున్న పాముల కుప్ప గుర్తొస్తుంది



ఎందుకో ఈ లోకంలో నాకు
డబ్బును చూసినప్పుడు కలిగినంత అసహ్యం
మరెప్పుడూ కలగలేదు!

నువ్వు... ధనం పరిధి, పరిష్వంగం విడిచి
రాలేని బలహీనుడవని తెలుసు...
క్షమించు నేను బలహీనులను ప్రేమించలేను!

నీకో రహస్యం చెప్పనా...
స్వయంవరంలో..
పేదరికాన్ని శిరస్సున ధరించినవాడినే
నేను వరించాను

ఇప్పటికీ ఎప్పటికీ నేను పేదరికాన్నే ప్రేమిస్తాను!
పేదరికంలోనే మనసులుంటాయి..
జీవితముంటుంది
నీ కోట్లలోకి నేను అడుగుపెట్టలేను!
నీ కోటలోకి కూడా..!
నాది బీళ్లలో రేగ్గాయలేరుకుని ఆనందించే మనసు!
దాన్నలాగే ఉండనియ్!

■ **షాజహానా**

99% చిన్నారులకు పల్స్ పోలియో



చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న సీఎస్ ఎస్పీ సింగ్

హైదరాబాద్, జనవరి28(ఆంధ్రజ్యోతి): ఆదివారం చేపట్టిన పల్స్ పోలియో విజయవంతమైంది. రాష్ట్రవ్యాప్తంగా 99% మంది చిన్నారులకు తొలిరోజు పోలియో చుక్కలు వేశారు. 36,55,204 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయాలని లక్ష్యంగా పెట్టుకోగా ఆదివారం 36,22,931 మందికి వేసినట్లు అధికారులు తెలిపారు. ఆదివారం పోలియో చుక్కలు వేయించుకోని చిన్నారులకు సోమ, మంగళవారం ఇంటింటికీ తిరిగి ఆరోగ్య కార్యకర్తలు పోలియో చుక్కలు వేస్తారు. రెండో విడత పోలియో చుక్కల కార్యక్రమం మార్చి11న నిర్వహించనున్నారు.

ఇంటి నిర్మాణానికి 'ఉపాధి' నిధులు

- తెలంగాణకు ప్రయోజనం లేనట్లేనా?

హైదరాబాద్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): పేదల ఇంటి నిర్మాణానికి ఉపాధి హామీ పథకం నిధులు అందనున్నాయి. ఈ మేరకు ఉపాధి హామీ చట్టం షెడ్యూల్-1లో సవరణ చేశారు. పీఎంఏవై పథకంలో ఇళ్లు మంజూరై ఉపాధి జాబ్‌కార్డు కలిగిన లబ్ధిదారులు 90 రోజుల ఉపాధి పనిదినాలను ఇంటి నిర్మాణంలో వినియోగించుకోవచ్చు. రాష్ట్రంలో ఉపాధి కనీస వేతనం రూ.197. ఈ ప్రకారం పీఎంఏవై లబ్ధిదారులకు 90 రోజులకు రూ.17730 చెల్లిస్తారు. అయితే, దీని ప్రయోజనం తెలంగాణకు ఉండదని అధికారులంటున్నారు. డబుల్ బెడ్‌రూంను లబ్ధిదారులకు పూర్తి ఉచితంగానే ఇస్తున్నందున ఇంటి నిర్మాణానికి ఉపాధిహామీ నిధులు వినియోగించుకునే పరిస్థితి లేదంటున్నారు.

పాలమూరు నుంచే డిండికి నీరు

హైదరాబాద్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): డిండి ప్రాజెక్టుకు సంబంధించిన డిజైన్లు ఎట్టకేలకు సిద్ధమయ్యాయి. పాలమూరు ప్రాజెక్టులో అంతర్భాగమైన నార్లాపూర్ రిజర్వాయర్ నుంచి డిండికి నీటిని తరలిస్తారు. ఇందుకు సంబంధించిన డిజైన్లను వ్యాప్కోస్ రూపొందించగా, త్వరలో టెండర్లు ఆహ్వానిస్తారు. వ్యాప్కోస్ రూపొందించిన డిజైన్ ప్రకారం పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు ద్వారా లిఫ్టు చేసే నీటిలో కొంతభాగాన్ని నార్లాపూర్ తీసుకొచ్చి, అక్కడి నుంచి డిండి ప్రాజెక్టుకు తరలిస్తారు.

పోలీసు, రెవెన్యూ విభాగాల చొరవతోనే కేసుల పరిష్కారం: జైస్వాల్

జోగిపేట(సంగారెడ్డి జిల్లా), జనవరి 28: కోర్టుల్లో పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించేందుకు పోలీసు, రెవెన్యూ విభాగాలు చొరవ చూపాలని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎంఎస్‌కే జైస్వాల్ అభిప్రాయపడ్డారు. ఆదివారం సంగారెడ్డి జిల్లా జోగిపేటలో నూతన కోర్టు భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా స్థాయిలో కలెక్టర్, ఎస్పీలు తమ శాఖల్లో పెండింగ్ కేసులపై సిబ్బందితో చర్చించాలన్నారు. సంబంధిత న్యాయమూర్తులతో మాట్లాడి కేసుల పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. అలాగే, ప్రతి మూడో శనివారం పోలీసు విభాగం నుంచి కనీసం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారి, రెవెన్యూ అధికారులు తమ పరిధిలోని కోర్టులకు వెళ్లి, సంబంధిత న్యాయమూర్తితో సమావేశమవ్వాలని సూచించారు.

హామీల అమలుకు కేంద్రంపై ఒత్తిడి: జితేందర్

న్యూఢిల్లీ, జనవరి 28(ఆంధ్రజ్యోతి): హామీలను అమలు చేసేలా కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు టీఆర్ఎస్ కట్టుబడి ఉందని లోక్‌సభలో ఆ పార్టీ నేత, ఎంపీ జితేందర్‌రెడ్డి తెలిపారు. పార్లమెంటరీ వ్యవహారాల శాఖ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలో పాల్గొన్న తర్వాత ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఎన్డీఏ ప్రభుత్వం హామీలకే పరిమితమైందని, మూడున్నరేళ్లుగా సొంత ఆదాయంతోనే కేసీఆర్ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. విభజన హామీలపై తమ వాణి వినిపించామని, రాష్ట్రానికి పెద్దపీట వేస్తారని ఆశిస్తున్నామన్నారు.

చంచల్‌గూడ జైలు సూపరింటెండెంట్‌గా అర్జున్‌రావు

హైదరాబాద్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): చంచల్‌గూడ కేంద్ర కారాగార నూతన సూపరింటెండెంట్‌గా కె.అర్జున్‌రావు నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఆ స్థానంలో ఉన్న ఎన్.మురళీబాబును వరంగల్ కేంద్ర కారాగారానికి బదిలీ చేసింది. ఈ మేరకు శనివారం జీవో విడుదల చేసింది. ప్రస్తుతం కె.అర్జున్‌రావు చంచల్‌గూడ కేంద్ర కారాగారంలో డిప్యూటీ సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఖైదీల సంక్షేమం కోసం పాటుపడతానని, వారిలో సత్ప్రవర్తన కలిగేలా చర్యలు తీసుకుంటానని అర్జున్‌రావు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

డీపీసీలో నిర్ణయమైనా దక్కని పోస్టింగులు

హైదరాబాద్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): అన్ని అర్హతలు ఉండి.. డిపార్ట్‌మెంటల్ ప్రమోషన్ కమిటీ(డీపీసీ)లో ఖరారై కూడా పోస్టులు దక్కని వైనమిది. తెలంగాణ టౌన్ ప్లానింగ్ విభాగంలో అసిస్టెంట్ డైరెక్టర్ పోస్టులకు దిగువ స్థాయి వారికి పదోన్నతులు కల్పించేందుకు డిసెంబరులో డీపీసీ కమి టీ భేటీ అయింది. టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ కేడర్ నుంచి 11 మందికి, టౌన్ ప్లానింగ్ అసిస్టెంట్‌ల నుంచి 8 మందికి అసిస్టెంట్ డైరెక్టర్లుగా పదోన్నతులు కల్పించాలని నిర్ణయించింది. కొందరిపై కేసులు, అభ్యంతరాలు ఉండటంతో మిగిలిన 13 మందికి పదోన్నతులు కల్పించాలని నిర్ణయించారు. డిసెంబరు చివరి నాటికే వీరికి పోస్టింగులివ్వాలి. కానీ నెల గడుస్తున్నా పదోన్నతి పోస్టులు ఇవ్వకపోవడంతో ఆ ఉద్యోగులు ఆవేదన చెందుతున్నారు.

విత్తన, ధాన్యాల నిల్వకు నెదర్లాండ్ సాంకేతికత

హైదరాబాద్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): విత్తన, ఆహార ధాన్యాలను నిల్వ చేసేందుకు కావాల్సిన సాంకేతిక సహకారాన్ని తెలంగాణకు అందించేందుకు నెదర్లాండ్స్ ముందుకొచ్చింది. హైదరాబాద్‌లోని రాష్ట్ర విత్తన, సేంద్రియ ధ్రువీకరణ సంస్థ కార్యాలయాన్ని నెదర్లాండ్స్ బృందం ఆదివారం సందర్శించింది. ఈ సందర్భంగా విత్తన, ఆహార పదార్థాల నిల్వపై సహకారం అందించాలని వ్యవసాయశాఖ కార్యదర్శి పార్థసారథి కోరగా నెదర్లాండ్స్ బృందం అంగీక రించింది. నిల్వచేసిన ఆహార ధాన్యాల్లో అఫ్లోటాక్సిన్ అనే రసాయనం మొక్కజొన్న, వేరుశనగ తదితర ఆహార గింజలు/ఉత్పత్తులను కలుషితం చేసి కేన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులకు కారణమవుతోంది.

100% పెనాల్టీని ఉపసంహరించుకోవాలి

- తెలంగాణ అర్బన్ ఏరియా డెవలప్‌మెంట్ ఫోరం

హైదరాబాద్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రభుత్వ స్థలాల్లో, అర్బన్ ల్యాండ్ సీలింగ్, దేవాలయ, వక్ఫ్ భూముల్లో నివసిస్తున్న పేద, మధ్య తరగతి ప్రజల ఇళ్లపై 100% పెనాల్టీ విధించాలన్న నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని తెలంగాణ అర్బన్ ఏరియా డెవలప్‌మెంట్ ఫోరం డిమాండ్ చేసింది. ప్రభుత్వ, వక్ఫ్, దేవాదాయ భూములను అక్రమార్కులు కబ్జా చేస్తున్నా పట్టించుకోని ప్రభుత్వం సామాన్యుల గృహాలను లక్ష్యంగా చేసుకోవడం సరికాదని ఫోరం నేతలు డీజీ నరసింహారావు, కె.వేణుగోపాలరావు ఆదివారం తెలిపారు.

'స్థానిక సంస్థలకు అధికారాలు బదలాయించాలి'

హైదరాబాద్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): 73వ రాజ్యాంగ సవరణ ప్రకారం 29 అధికారాలు, విధులను స్థానిక సంస్థలకు కేటాయించాలని ఎంపీటీసీల సంఘం ప్రధానకార్యదర్శి ఉమ్మన్నగారి మనోహర్‌రెడ్డి కోరారు. చాలా రాష్ట్రాల్లో ఈ అధికారాలను పూర్తిస్థాయిలో బదలాయించారని, నాటి ఉమ్మడి ఏపీలో కొన్ని అంశాలను బదలాయించినా అమలు కావడం లేదన్నారు. నియోజకవర్గ అభివృద్ధి నిధుల కింద ఎంపీటీసీలకు ఏటా 20లక్షలు కేటాయించాలని కోరారు.

ప్రభుత్వ ఉద్యోగ సర్వీసు 20ఏళ్లు చేయాలి: సిలివేరు

బర్కత్‌పుర/హైదరాబాద్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగాల సర్వీసును 20ఏళ్లకు పరిమితం చేస్తే రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య పరిష్కారమవుతుందని యంగ్ ఇండియా యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు సిలివేరి ఉమాశంకర్ పేర్కొన్నారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ ఇంటికొక ఉద్యోగం అనే అంశంపై యువతలో అవగాహన కల్పిస్తున్నామని, సదస్సులు నిర్వహించి నిరుద్యోగుల మద్దతు కూడగడుతున్నామని చెప్పారు. నిరుద్యోగులకు న్యాయం చేసేలా తెలుగు రాష్ట్రాలు కృషి చేయాలని కోరారు.


పుస్తకం ముందు సెల్‌ఫోన్ బలాదూర్

- సీఎం కేసీఆర్ కూడా పుస్తక ప్రియుడే
- నాకు ఇష్టమైన పుస్తకం 'నీళ్లు-నిజాలు': హరీశ్
- ముగిసిన హైదరాబాద్ పుస్తక ప్రదర్శన

హైదరాబాద్ సిటీ/సంగారెడ్డి టౌన్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): పుస్తకం ముందు ఆధునిక ప్రపంచంలో ప్రతి ఒక్కరినీ శాసిస్తున్న సెల్‌ఫోన్ బలాదూర్ అనడానికి బుక్‌ఫెయిర్‌కు లభించిన స్పందనే నిదర్శనమని మంత్రి టి.హరీశ్‌రావు అన్నారు. ఎన్టీఆర్‌స్టేడియంలో ఆదివారం హైదరాబాద్ పుస్తక ప్రదర్శన ముగింపు సభలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ వైతాళికుల పేర్లతో పుస్తకోత్సవ ప్రాంగణాలు, వేదికలు, ద్వారాలు ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. సెల్‌ఫోన్లు వచ్చాక చేతిగడియారాలు, రేడియోలు, కెమెరాలు పోయాయని, పుస్తకం విలువ మాత్రం తగ్గలేదన్నారు. పుస్తక ప్రదర్శనను 31 జిల్లాలకు విస్తరించాలని సొసైటీ సభ్యులను కోరారు. సీఎం కేసీఆర్ కూడా పుస్తక ప్రియుడని, పుస్తకాలు ముఖ్యమంత్రిని నడిపిస్తే ఆయన మనల్ని నడిపిస్తున్నారని అభివర్ణించారు. విద్యాసాగర్‌రావు రచించిన "నీళ్లు-నిజాలు" పుస్తకం తనను అమితంగా ప్రభావితం చేసిందన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్ మాట్లాడుతూ.. తెలంగాణ సాధనలో పాటతోపాటు పుస్తకం కూడా క్రియాశీలక పాత్ర పోషించిందన్నారు. బుద్ధపూర్ణిమ ప్రాజెక్టు డైరెక్టర్ మల్లేపల్లి లక్ష్మయ్య మాట్లాడుతూ.. సమాజంతోపాటు తనను తాను అర్థం చేసుకునేందుకు తోడ్పడే ఏకైక సాధనం పుస్తక పఠనం అన్నారు. కాగా, చివరిరోజు కావడంతో ప్రాంగణమంతా పుస్తక ప్రియులతో కిక్కిరిసిపోయింది. 11 రోజుల బుక్‌ఫెయిర్‌కు దాదాపు 9.10 లక్షల మంది వచ్చారని అంచనా. సాహిత్యసమాలోచన చర్చలతోపాటు, పిల్లల్లో పఠనాశక్తిని పెంచేందుకు 25 రకాల కార్యక్రమాలు, పోటీలను బుక్‌ఫెయిర్ తరపున నిర్వహించినట్లు అధ్యక్షుడు జూలూరు గౌరీశంకర్ తెలిపారు.

మైనారిటీల సంక్షేమానికి పెద్దపీట

టీఆర్ఎస్ సర్కారు మైనారిటీల సంక్షేమానికి పెద్ద పీట వేస్తోందని మంత్రి హరీశ్‌రావు అన్నారు. సంగారెడ్డిలో ముస్లిం మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ ముస్లిం పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలన్న లక్ష్యంతో 206 ఇంగ్లిష్ మీడియం పాఠశాలలను సీఎం కేసీఆర్ ఏర్పాటు చేశారన్నారు. షాదీ ముబారక్ కింద 7 వేల మంది వధువులకు ఆర్థిక సాయం చేశామన్నారు. కాగా, సంగారెడ్డిలో జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ అంజన్‌గౌడ్ పదవీ విరమణ కార్యక్రమంలో మంత్రి హరీశ్ మాట్లాడుతూ.. గత పాలకుల నిర్లక్ష్యం వల్లే రాష్ట్రంలో విద్య, వైద్య రంగాలు నిర్వీర్యమయ్యాయన్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత రూ.262 కోట్లతో రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల భవనాలను నిర్మించి, మౌళిక సదుపాయాలు కల్పించామన్నారు.



ఎన్టీఆర్ గార్డెన్‌లో పుస్తక ప్రదర్శనలో పుస్తకాలను కొనుగోలు చేస్తున్న హరీశ్

ఏపీకి అన్ని నీళ్లెందుకు?

గోదావరి నుంచి తరలిస్తున్నారు.. కృష్ణా నీటివాటాలో కోత పెట్టాలి

- 512 నుంచి 150 టీఎంసీలకు తగ్గించాలి
- తెలంగాణకు 299 టీఎంసీల నుంచి 661 టీఎంసీలకు పెంచాలి
- ట్రైబ్యునల్‌లో వాదనకు తెలంగాణ సిద్ధం
- సమావేశాలు వచ్చే నెల 22కు వాయిదా



హైదరాబాద్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌కు కృష్ణా నీటి కోటాలో భారీగా కోత విధించాలని తెలంగాణ ప్రభుత్వం కోరుతోంది. ఏపీ సర్కారు గోదావరి నుంచి నీటిని కృష్ణా బేసిన్‌కు భారీగా తరలిస్తున్నందున ఆ కోత పెట్టాలంటూ బ్రిజేష్‌కుమార్ ట్రైబ్యునల్ ముందు వాదించాలని నిర్ణయించింది. ప్రస్తుతం ఏపీకి కేటాయించిన 512 టీఎంసీల్లో 362 టీఎంసీల కోత విధించి, 150 టీఎంసీలకు పరిమితం చేయాలని కోరనుంది. ఈ మేరకు ట్రైబ్యునల్‌లో సమర్పించడానికి ప్రత్యేక పత్రాన్ని రూపొందించింది. త్వరలో జరిగే ట్రైబ్యునల్ సమావేశాల్లో ఇరు రాష్ట్రాలూ తమ వాదనలు వినిపించడానికి సిద్ధమవుతున్నాయి. ఈ క్రమంలోనే.. తెలంగాణకు భారీగా నీటిని తగ్గించాలని కోరుతూ ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ట్రైబ్యునల్‌లో అఫిడవిట్ దాఖలు చేసింది. ఈ అఫిడవిట్‌లో తెలంగాణలోని భూముల్లో వరి పంట పండదని, ఒక వేళ పండించినా నీరు ఎక్కువగా అవసరం ఉంటుందని, తక్కువ దిగుబడి వస్తుందని ఏపీ తన అఫిడవిట్‌లో పేర్కొంది. ఆ అఫిడవిట్‌పై ఇప్పటికే కౌంటర్‌ను దాఖలు చేసిన తెలంగాణ ప్రభుత్వం.. ఏపీ వాదనలకు దీటుగా సమాధానం ఇవ్వాలని, ట్రైబ్యునల్‌లో బలంగా వాదించాలని నిర్ణయించింది. ఏపీకి నీటి కోటాను ఎందుకు తగ్గించాలో తగు సమాచారాన్ని సమర్పించనుంది.

45లో 43 టీఎంసీలివ్వాలి..

ఆంధ్రప్రదేశ్‌లో కృష్ణా నీటిపై ఆధారపడే ప్రాంతాలు తగ్గిపోతున్నాయని తెలంగాణ సర్కారు అంచనా వేస్తున్నది. ముఖ్యంగా గోదావరి నీటిని పట్టిసీమ ద్వారా కృష్ణాకు ఈ ఏడాది ఇప్పటికే సుమారు 100 టీఎంసీలే తరలించారు. పోలవరం ప్రాజెక్టులో భాగంగా పట్టిసీమను చేపట్టినట్టు ఏపీ ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. పోలవరం నిర్మాణం ఆలస్యం అవుతున్నందున దీనిని చేపట్టామని చెప్పారు. నిజానికి పోలవరం నుంచి కృష్ణా బేసిన్‌కు 80 టీఎంసీల నీటిని తరలించాల్సి ఉంది. అయితే ఇందులో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు 45 టీఎంసీలను, కర్నాటకకు 21 టీఎంసీలను మహారాష్ట్రకు 14 టీఎంసీలను కేటాయించాల్సి ఉంది. రాష్ట్ర విభజన జరిగినందున ఉమ్మడి రాష్ట్రానికి ఉద్దేశించిన 45 టీఎంసీలను రెండు రాష్ట్రాలూ పంచుకోవాల్సి ఉంటుంది. ఈ నిబంధన ప్రకారం ఈ 45 టీఎంసీల్లో 43 టీఎంసీలను, దాంతోపాటు మరింత కృష్ణా నీటిని తమ రాష్ట్రానికి కేటాయించాల్సి ఉంటుందని తెలంగాణ కోరనుంది.

- ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కృష్ణా నీటిని భారీగా ఇతర బేసిన్లకు మళ్లిస్తోందని సుమారు 350 టీఎంసీలను కృష్ణా బేసిన్‌లో కాకుండా పెన్నా వంటి ఇతర బేసిన్లకు తరలిస్తున్నారని వాదిస్తోంది.
- ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ట్రైబ్యునల్ 811 టీఎంసీల నికర జలాల్ని కేటాయించగా.. విభజన తర్వాత అందులో 512 టీఎంసీలను ఏపీ, 299 టీఎంసీల నీటిని తెలంగాణ వినియోగించుకుంటునాయి. అయితే ఈ కోటాలో మార్పులు కోరాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. కాగా.. ఈ నెల 31 నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకూ జరగాల్సిన ట్రైబ్యునల్ సమావేశాలు వాయిదా పడ్డాయి. వీటిని ఫిబ్రవరి 22వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు ట్రైబ్యునల్ నుంచి టి-సర్కారుకు సమాచారం అందింది.

టీఎస్‌కేసీ మెంటర్ల వెట్టిచాకిరీ!

- 12 ఏళ్లుగా పెరగని వేతనాలు
- రూ. 8 వేలతో సరిపెట్టిన సర్కారు
- ప్రతిపాదనలతో సరిపెట్టిన సీసీఈ

హైదరాబాద్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : వారంతా ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లోని తెలంగాణ స్కిల్ అండ్ నాలెడ్జ్ సెంటర్స్ (టీఎస్‌కేసీ) మెంటర్లు. విద్యార్థులకు ఉద్యోగానికి అవసరమైన స్కిల్స్ నేర్పిస్తుంటారు. వీరు ట్రైనింగ్ ఇచ్చిన విద్యార్థులు ఇప్పుడు ఉద్యోగాల్లో చేరి నెలకు కనీసం రూ. 20 వేలకు పైగా వేతనం పొందుతున్నారు. కానీ వీరికి మాత్రం 12 ఏళ్లుగా జీతాలు పెరగలేదు. దీంతో చాలీచాలని జీతాలతో కుటుంబాలు నెట్టుకురాలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వివరాలిలా ఉన్నాయి.. ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో చదివే విద్యార్థులకు ఉద్యోగం సాధించేందుకు అవసరమైన స్కిల్స్‌ను నేర్పించేందుకు 2006లో అప్పటి ప్రభుత్వం 131 డిగ్రీ కాలేజీల్లో తెలంగాణ స్కిల్ అండ్ నాలెడ్జ్ సెంటర్స్ (టీఎస్‌కేసీ)ను ఏర్పాటు చేసింది. ఇందు కోసం మెంటర్లను నియమించింది. అప్పట్లో రూ. 8 వేల చొప్పున వీరికి వేతనాలను ఖరారు చేసింది. మొదట్లో ఫైనల్ ఇయర్ విద్యార్థులకు శిక్షణ ఇవ్వగా ఆ తర్వాత మొదటి సంవత్సరం నుంచే శిక్షణ ఇప్పిస్తున్నారు. దీంతో మెంటర్లకు పనిభారం పెరిగింది కానీ.. వేతనం మాత్రం పెరగలేదు. వీరితో సమానంగా కాలేజీల్లో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు లెక్చరర్ల వేతనాన్ని ప్రభుత్వం రూ. 40,270కి పెంచింది. జూనియర్ కాలేజీలు, గురుకులాల కాంట్రాక్టు లెక్చరర్ల వేతనాలు, ఇతర ఉద్యోగుల వేతనాలను కూడా పెంచింది. ఈ నేపథ్యంలో తమ వేతనాలు కూడా పెరుగుతాయనే ఆశాభావం మెంటర్లు వ్యక్తం చేస్తున్నారు.



మంత్రి కేటీఆర్ సమక్షంలో బీఆర్ శెట్టి గ్రూప్‌తో ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న రాష్ట్ర అధికారులు

బాహుబలి 'మాల్'

(మొదటి పేజీ తరువాయి)

ఉత్పత్తులు, పరిశోధన, అభివృద్ధి రంగాల్లో యూనిట్లు ఏర్పాటు చేయనుంది. సుల్తాన్‌పూర్‌లోని మెడికల్ డివైజెస్ పార్కులో మరో 20 ఎకరాల విస్తీర్ణంలో వైద్య పరికరాల తయారీ యూనిట్‌లను స్థాపించనుంది. అలాగే, దాదాపు 50 ఎకరాల్లో మెడికల్ ఇంజనీరింగ్ కాలేజీలు, మరో 20 ఎకరాల్లో 500 పడకల సామర్థ్యంతో గ్రీన్‌ఫీల్డ్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిని ఏర్పాటు చేసేందుకు అంగీకారం కుదుర్చుకుంది. ఇక, ప్రపంచ ప్రఖ్యాత లులు గ్రూపు తెలంగాణలో రూ.2500 కోట్ల పెట్టుబడులు పెట్టనుంది. ఈ మేరకు మూడు ఎంవోయూలు కుదుర్చుకుంది. ఇందులో భాగంగా, 18 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో భారీ షాపింగ్ మాల్ ఏర్పాటు చేయనుంది. ఆహార శుద్ధి ప్లాంటుతోపాటు కూరగాయలు, పండ్ల ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేయనుంది. వీటి ద్వారా 6000 మందికి ఉపాధి కల్పించనుంది. మూడు నెలల్లోనే ముఖ్యమంత్రి కేసీఆర్ వీటికి శంకుస్థాపనలు చేయనున్నారు. ఈ సందర్భంగా లులు గ్రూపు చైర్మన్ యూసుఫ్ అలీ మాట్లాడుతూ, కొత్తగా ఏర్పడిన తెలంగాణలో తమ గ్రూపు సంస్థల యూనిట్లను విస్తరించేందుకు అవకాశం లభించడం విశేషమన్నారు. భూ కేటాయింపు ప్రక్రియ ప్రారంభమైందన్నారు. "తెలంగాణలో రిటైల్, ఆహార రంగంలో ప్రపంచస్థాయి ప్రమాణాలతో సౌకర్యాలను కోరుకుంటున్నాం. ప్రపంచ ప్రఖ్యాతి పొందిన లులు గ్రూపు తెలంగాణలో యూనిట్‌లు ఏర్పాటు చేయడానికి ముందుకు రావడం ముదావహం. ఆ యూనిట్‌లకు తెలంగాణ ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తుంది. భవిష్యత్‌లో మరిన్ని ప్రాజెక్టులతో విస్తరించేందుకు అవకాశాలు కల్పిస్తాం" అని మంత్రి కేటీఆర్ చెప్పారు. ఈ కార్యక్రమంలో లులు గ్రూపు సీఈవో షైఫీ రూపవాలా, ప్రతినిధులు అష్రఫ్ అలీ, సలీం, ఏవీ అనంత్ తదితరులు పాల్గొన్నారు.

కణ చికిత్సతో వ్యాధులకు తెర

- జీన్ సైలెన్సింగ్ ద్వారా సానుకూల ఫలితాలు
- జన్యు నియంత్రణలో కృత్రిమ ఆర్ఎన్ఏ కీలకం
- స్టెమ్‌సెల్ థెరపీని అభివృద్ధి చేసిన పరిశోధకులు
- అంతర్జాతీయ కణ కాంగ్రెస్‌లో శాస్త్రవేత్తల పరిశోధనా పత్రాలు
- స్టార్టప్స్ సద్వినియోగం చేసుకోవాలి: కేంద్ర మంత్రి సుజనాచౌదరి

ఇప్పటి దాకా శాస్త్రవేత్తలకు అంతుచిక్కని రకరకాల వ్యాధులకు జన్యుపరమైన నివారణకు శాస్త్రవేత్తలు చేస్తున్న పరిశోధనలు విజయవంతమవుతున్నాయి. జీన్ సైలెన్సింగ్, జీన్ బేస్డ్ స్టెమ్ సెల్ థెరపీ వంటి అనేక కొత్త చికిత్సా విధానాలు అందుబాటులోకి వస్తున్నాయి. హైదరాబాద్ శామీర్‌పేట్‌లోని లియోనియా హోలిస్టిక్ డిస్టినేషన్ రిసార్ట్‌లో జరుగుతున్న అంతర్జాతీయ కణ కాంగ్రెస్‌లో వీటికి సంబంధించిన అనేక అంశాలపై శాస్త్రవేత్తలు ఆదివారం తమ పరిశోధనాపత్రాలను సమర్పించారు. జన్యువులను ఆధారం చేసుకొని రకరకాల చికిత్సలు అందుబాటులోకి వస్తున్నాయి. 'కేన్సర్‌ను ఒక ఉదాహరణగా తీసుకుందాం. ప్రస్తుతం అందుబాటులో ఉన్న కేన్సర్ మందులు అందరికీ ఒకే రీతిలో పనిచేయవు. అంటే ఒకరికి 40% పనిచేస్తే మరొకరికి 70% పనిచేస్తాయి. ఒక వ్యక్తి జన్యుక్రమాన్ని కనుగొంటే ఆ కేన్సర్ మందు పనిచేస్తుందా? లేదా? అనే విషయం తెలుస్తుంది. దీనిని మరింత అభివృద్ధి చేసి ఆ వ్యక్తికి ఎలాంటి మందు కావాలనే విషయాన్ని కూడా తెలుసుకొంటే రకరకాల జబ్బులకు చికిత్స లభిస్తుంది. దీనినే జన్యుచికిత్స విధానం అంటున్నాం.' అని సీసీఎంబీ డైరెక్టర్ రాకేష్ మిశ్రా వివరించారు. తాము ఎలుకలపై చేసిన ప్రయోగాల్లో హంటింగ్‌టన్ వ్యాధిని జీన్‌సైలెన్సింగ్ పద్ధతి ద్వారా విజయవంతంగా అడ్డుకోగలిగామని డాక్టర్ క్లీవ్‌ల్యాండ్ 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధికి వెల్లడించారు. రొమ్ము కేన్సర్‌ను కలగజేసే జన్యువులు.. ఈ కేన్సర్ విషయంలో శాటిలైట్ ఆర్ఎన్ఏలు ఎలాంటి పాత్ర పోషిస్తాయనే విషయంపై ప్రొఫెసర్ ఇందర్ వర్మ ఒక పరిశోధనాపత్రాన్ని సమర్పించారు. జీన్ సైలెన్సింగ్ పద్ధతిలో కృత్రిమ ఆర్ఎన్ఏను శరీరంలోకి ప్రవేశపెడతారు. దీని ద్వారా ఒక వ్యాధికి కారణమైన జన్యువులను గుర్తించినపుడు.. వాటి కణవిభజనను కూడా తెలుసుకోవచ్చనేది డాక్టర్ క్లీవ్‌ల్యాండ్, డాక్టర్ ఇందర్ వర్మ వంటి శాస్త్రవేత్తల ప్రతిపాదన. దీనికి తోడు జన్యుఆధారిత స్టెమ్‌సెల్ థెరపీలనూ శాస్త్రవేత్తలు అభివృద్ధి చేస్తున్నారు. ఊపిరితిత్తులు దెబ్బతిన్నప్పుడు వచ్చే సమస్యలకు తైవాన్‌లోని నేషనల్ యాంగ్‌మింగ్ వర్సిటీకి చెందిన డాక్టర్ చియాంగ్ విన్ వ్యూ, ఆయన బృందం అభివృద్ధి చేసిన ప్రయోగాలు విజయవంతమయ్యాయి.

- స్పెషల్ డెస్క్

స్టార్టప్స్ సద్వినియోగం చేసుకోవాలి: సుజనా

యువ శాస్త్రవేత్తల వద్ద మంచి ఆలోచనలు ఉంటే.. వాటిని ముందుకు తీసుకువెళ్లటానికి తాము అన్నివిధాలా సహకరిస్తామని కేంద్ర శాస్త్ర, సాంకేతిక సహాయ మంత్రి సుజనా చౌదరి అన్నారు. అంతర్జాతీయ కణ కాంగ్రెస్‌కు ఆదివారం ఆయన హాజరై 'స్టార్టప్‌లు - కణశాస్త్రంలో అవకాశాలు' అనే అంశంపై ఆయన ప్రసంగించారు. స్టార్టప్ ఇండియా కార్యక్రమం కింద కేంద్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలను చేపట్టిందన్నారు. వాటిని ఉపయోగించుకోవటం వల్ల అనేక ప్రయోజనాలుంటాయన్నారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఆర్థిక అభివృద్ధి బోర్డు చైర్మన్ కృష్ణకిషోర్‌తో పాటుగా శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

పోలీసులకు ఉపగ్రహ నేత్రం

(మొదటి పేజీ తరువాయి)

ప్రస్తుతం మావోయిస్టు సమస్య పెద్దగా లేకపోయినా సమూలంగా నిర్మూలించడంపై దృష్టి సారించిన అధికారులు ఇస్రో సహకారం తీసుకుంటున్నారు. ఉపగ్రహ సహకారంతో అటవీ ప్రాంతంలో మావోయిస్టులు తలదాచుకునే ప్రాంతం, వారి సంభాషణలను పోలీసులు ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు అవకాశం ఉంటుంది. 2018ని 'టెక్నాలజీ సంవత్సరం'గా ప్రకటించిన ఉన్నతాధికారులు పోలీసింగ్‌లో టెక్నాలజీ వాడకానికి ఆకాశమే హద్దుగా మార్చుకుంటున్నారు.టీఎస్ కాప్ యాప్‌తో సమస్త సమాచారం దర్యాప్తుఅధికారి అరచేతిలోకి వస్తున్నా శాటిలైట్ సహకారం తీసుకోవడం వల్ల మరిన్ని జటిల సమస్యలకు పరిష్కారం లభిస్తుందని అధికారులు భావిస్తున్నారు. మరోవైపు గంజాయి సాగుపై నిఘా ఉంచేందుకూ ఉపగ్రహ సేవల్ని వినియోగించనున్నారు. ఉమ్మడి నిజామాబాద్, కరీంనగర్, వరంగల్, ఆదిలాబాద్, ఖమ్మం జిల్లాల్లో గంజాయి సాగవుతున్న ప్రాంతాలను గుర్తించి నేరుగా దాడులు చేసేందుకు రాష్ట్ర పోలీసులు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. ఇసుక తవ్వకాలు, అక్రమ మద్యంఅమ్మకాలు, పేకాట వంటి సంఘవిద్రోహ శక్తుల కదలికల్ని గుర్తించేందుకు శాటిలైట్ సేవల్ని వాడుకుంటే పోలీసులకు ఎదురే ఉండదనేది అధికారుల యోచన. దీనిపై పోలీసు అధికారులకు ఇస్రో శాస్త్రవేత్తలతో త్వరలో శిక్షణ ఇప్పించేందుకు సమాయత్తమవుతున్నారు.

మళ్లీ నో కేష్

(మొదటి పేజీ తరువాయి)



పార్కింగ్‌స్థలంగా మారిన తార్నాకలోని ఏటీఎం సెంటర్


క్యాషియర్ చెప్పడంతో మేనేజర్‌ను కలిశాడు. మేనేజర్ కూడా ఒకేసారి 4 లక్షల నగదు సర్దడం కష్టమని లక్షో రెండులక్షలో అయితే ప్రయత్నిస్తానని అనడంతో రమేష్ విస్మయానికి లోనయ్యాడు. నగదు లేదని మేనేజర్ ఇలా చేతులెత్తేసిన ఘటన రమేష్‌కు గతంలో ఎన్నడూ ఎదురు కాలేదు. ఇది ఒక రమేష్ అనుభవం మాత్రమే కాదు. అన్ని ప్రాంతాల్లోని బ్యాంకుల్లో తీవ్రమైన నగదు కొరత కనిపిస్తోంది. తమ ఖాతాలోని డబ్బు, తాము దాచుకున్న డబ్బు.. తమ అవసరానికి విత్‌డ్రా చేసుకోలేని విచిత్ర పరిస్థితిని ఖాతాదారులు ఎదుర్కొంటున్నారు. ఈ మధ్య కేంద్రం తీసుకురాదల్చిన ఎఫ్ఆర్‌డీఐ బిల్లు (ఫైనాన్షియల్ రిజల్యూషన్ అండ్ డిపాజిట్ ఇన్సూరెన్స్) వల్ల జరిగిన పెద్ద నష్టం ఏంటంటే- ఖాతాదారులు భయంతో తమ డబ్బు విత్‌డ్రా చేసేస్తుండడం! బ్యాంకుల్లో ఫిక్సెడ్ డిపాజిట్ చేసుకుంటే తమ డబ్బుకు సేఫ్ అనే పరిస్థితి ఇపుడు లేదని ప్రజలు గట్టిగా నమ్ముతున్నారు. ఎటూ డిపాజిట్ రేట్లు తగ్గించేశారు కాబట్టి ఎఫ్‌డీల్లో ఉంచడం వేస్టనే నిర్ణయానికొచ్చేస్తున్నారు. అనేక మంది కొద్దిపాటి స్థలమో లేక ఇల్లో కొనుక్కుంటే -దానికి భవిష్యత్తులో విలువైనా పెరుగుతుందని భావిస్తున్నవారే ఎక్కువ. ఇందుకోసం డబ్బులు తీసుకుందామని వెళితే అక్కడ కేష్ ఉండడం లేదు. నగదు లభ్యత తగ్గడం ప్రజల కాళ్ళూ చేతులూ కట్టేసినట్లవుతోంది.

ఎందుకిలా ?

దేశంలో చలామణిలో ఉన్న నగదులో పెద్ద నోట్ల వాటానే ఎక్కువ. అనధికార అంచనాల ప్రకారం దేశంలో మొత్తం 16 లక్షల కోట్ల రూపాయల వరకు కరెన్సీ చలామణిలో ఉండగా... అందులో 3.5 లక్షల కోట్ల రూపాయలు మాత్రమే 10, 50, 100, 200 నోట్ల రూపంలో చలామణిలో ఉంది. రూ.500, 2,000 డినామినేషన్‌లోని కరెన్సీ విలువ దాదాపు రూ. 12.5 లక్షల కోట్లు ఉండవచ్చని అంచనా. ఇందులో కేవలం 2,000 కరెన్సీ నోట్ల విలువనే రూ. 7.5 లక్షల కోట్లుంటుందని అంచనా. పైగా ఈ మొత్తంలో అధికారిక సమాచారం ప్రకారమే 2.5 లక్షల విలువజేసే పెద్ద కరెన్సీ నోట్లను ఆర్బీఐ బయటకు విడుదల చేయకుండా అట్టేపెట్టింది. అంటే నికరంగా బయట ఉండాల్సిన పెద్ద నోట్ల విలువ రూ. 10 లక్షల కోట్లనుకుందాం. అందులో కనీసం రూ. 5 లక్షల కోట్ల విలువజేసే రూ. 2,000 నోట్లు కూడా చలామణిలో ఉండాలి. మరీ ఈ మొత్తం చలామణిలోనే ఉందా? కొన్ని నెలలుగా బ్యాంకుల్లోకి వస్తున్న రూ. 2,000 నోట్లను కూడా మళ్లీ బయటకు విడుదల చేయకుండా నిలిపివేస్తున్నట్టుగా చెబుతున్నారు. ఆర్బీఐ సూచనల మేరకే ఇలా చేస్తున్నారు. పెద్ద నోట్ల రద్దు తర్వాత ఎటిఎంల్లో ఎడాపెడా కనిపించిన రూ. 2,000 నోట్లు ఇప్పుడు ఏటీఎంల్లోనూ కనిపించడం లేదు. దీని ప్రభావం నగదు లభ్యతపై కనిపిస్తోంది. కొన్ని నెలల క్రితమే ఆర్బీఐ రూ.2,000 నోట్ల ముద్రణను కూడా నిలిపివేసింది. 200, 50 నోట్ల ముద్రణపై దృష్టి సారించింది. సంపన్నులు, వ్యాపార సంస్థలు కూడా తమ దగ్గరున్న రూ.2వేల నోట్లను బయటకు తీయడం లేదు. ఈ అంశం కూడా నగదు లభ్యతపై ప్రభావం చూపిస్తోంది.

మార్కెట్లో రూ. 500 నోట్లు మాత్రమే విరివిగా కనిపిస్తున్నాయి. రూ. 200 నోట్లు చాలా తక్కువగా కనిపిస్తున్నాయి. వీటిని భారీగా చలామణిలోకి తెచ్చేందుకు ఏటీఎంల రీకాలిబ్రేషన్‌ను చేపట్టారు. ఈ తంతు పూర్తవడానికి ఇంకా సమయం పడుతుంది. ఇది నగదు లభ్యతపై ప్రభావం చూపిస్తోంది.

భవిష్యత్తులో మళ్ళీ రూ.1000 నోట్లు వస్తాయని, రూ .200 నోట్లు మరింత చలామణీలోకి తెస్తారని ప్రభుత్వ వర్గాల కథనం. ఏది జరిగినా- ప్రజల ఇబ్బందులు పెరుగుతూనే ఉన్నాయి... మోదీ ప్రభుత్వం విమర్శల పాలవుతూనే ఉంది.



'తలాపున పారే పాట' పుస్తక ముఖచిత్రం, (ఇన్‌సెట్లో) పుస్తక రచయిత పీ చంద్

వజ్జల శివకుమార్‌కు సదాశివుడి స్మారక అవార్డు

» 1న రవీంద్రభారతిలో ఆయన 12వ వర్ధంతి.. జీవిత పుస్తక ఆవిష్కరణ


సదాశివుడు (ఫైల్), అవార్డు గ్రహీత వజ్జల శివకుమార్,

గోదావరిఖని, జనవరి 28: 'తలాపున పారుతాంది గోదారి.. నీ చేను నీ చెలక ఎడారి..', 'ఏమున్నదక్కో.. ఏమున్నదక్కో..', 'పారాణి ఆరలేదు చెల్లెలా..', 'ఎన్నాళ్లు ఈ వెలివేత.. ఎన్నాళ్లు ఈ వలపోత..', 'ఊరవాడ వాడల్లో మన బతుకుల రాలు పూత..' లాంటి ఎన్నో ఉద్యమ గీతాలు, కవితలతో ప్రజానీకంలో చైతన్యం నింపిన ప్రజాకవి, రచయిత, గాయకుడు దివంగత మల్లావఝుల సదాశివుడు. ఆయన 12వ వర్ధంతి సందర్భంగా హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ కవి వజ్జల శివకుమార్‌కు సదాశివుడి స్మారక పురస్కారాన్ని అందజేస్తున్నారు. ఫిబ్రవరి 1 గురువారం హైదరాబాద్ రవీంద్ర భారతిలో సదాశివుడి 12వ వర్ధంతి సభ జరుగుతోంది. తెలంగాణ వికాస సమితి ఆధ్వర్యంలో జరగనున్న ఈ సభలో మంత్రి హరీశ్ రావు అవార్డును అందజేయనున్నారు. అలాగే.. సదాశివుడి జీవితంపై ప్రముఖ నవలారచయిత పి.చంద్ 'తలాపున పారేపాట' పేరుతో ఒక పుస్తకాన్ని రచించారు. వ్యక్తిగా సదాశివుడి గురించే కాకుండా అప్పటి సామాజిక, రాజకీయ, ఉద్యమ స్థితిగతులకు అద్దంపట్టే ఈ పుస్తకాన్ని కూడా ఇదే సభలో మంత్రి హరీశ్‌రావు, సాహిత్య అకాడమీ చైర్మన్ నందిని సిధారెడ్డి, ప్రముఖ కవి దేశపతి శ్రీనివాస్ ఆవిష్కరించనున్నారు.

ఇదీ నేపథ్యం..

రామగుండం మండలం ముర్మూర్‌లో సాంప్రదాయ బ్రాహ్మణ కుటుంబంలో పుట్టిన సదాశివుడు వృత్తిరీత్యా ఉపాధ్యాయుడు. అప్పటి సామాజిక పరిస్థితుల్లో విప్లవ మార్గం పట్టిన ఆయన.. రైతు కూలీ పోరాటాలు, యువజన సంఘాల నిర్మాణంలో కీలక పాత్ర పోషించారు. సామాజిక ఉద్యమాల్లో కొనసాగుతూనే ఉపాధ్యాయ సంఘాల నాయకత్వాన్ని కూడా నిర్వహించారు. మాట కంటే, ఊట కంటే పాట గొప్ప ఆయుధమని భావించి.. 20ఏళ్ల పాటు విప్లవ ఉద్యమంలో గీతాలను రచించారు. అంతేకాదు పాటలకు తానే సంగీతాన్ని సమకూర్చుకొని హృద్యంగా పాడగల గాయకుడు కూడా. ఇలా అన్ని రంగాలను మెప్పించిన సదాశివుడు ఉపాధ్యాయుడిగా కూడా అనేక అవార్డులను అందుకున్నారు. బొగ్గు బాయిల్లో కార్మికుల ఆకలిచావు తను చూసిన సదాశివుడు తన పాటలతో ఉద్యమ స్ఫూర్తిని పెంచగలిగారు. వరకట్న బాధితులు.. నేతన్నల ఉరితాళ్లు.. స్త్రీ హింస.. సంస్కరణ వాదం.. కార్పొరేట్ సంస్కృతి.. ఇలా అన్నింటిపై సదాశివుడు తన పాటలతో యుద్ధం చేశారు. ఆయన భౌతికంగా మరణించినా.. తన పాటలతో కలకాలంలో బతికే ఉన్నారు. కాగా.. సదాశివుడి స్మారక అవార్డులను ఇప్పటికే గూడ అంజన్న, గోరటి వెంకన్న, జయరాజ్, దేశపతి శ్రీనివాస్, విమలక్క, నందిని సిధారెడ్డి, నిసార్, మిట్టపల్లి సురేందర్, ఏపూరి సోమన్న, అంజయ్య అందుకున్నారు.

506, 507సెక్షన్ల చట్ట సవరణ అప్రజాస్వామికం: దత్తాత్రేయ

» టీఆర్ఎస్‌ది నియంతృత్వ పాలన: తమ్మినేని

హైదరాబాద్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ప్రతిపాదిత ఐపీసీ 506, 507 సెక్షన్ల చట్ట సవరణ అప్రజాస్వామికమని కేంద్ర మాజీమంత్రి, ఎంపీ బండారు దత్తాత్రేయ అన్నారు. ప్రజలు, ప్రతిపక్షాల గొంతునొక్కే ప్రయత్నమిది అని ఆరోపించారు. ఈ ప్రతిపాదనపై రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచన చేయాలని సూచించారు. ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. జాతీయ బీసీ కమిషన్ బిల్లు రాజ్యసభలో ఆమోదం కోసం, కాంగ్రెస్ నేత వీహెచ్, పార్టీ జాతీయ నాయకత్వంపై ఒత్తిడి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. కాగా, 506, 507 సెక్షన్లను నాన్‌బెయిలబుల్‌గా మార్చాలనుకోవడం టీఆర్ఎస్ ప్రభుత్వ నియంతృత్వ, ఫ్యూడల్ పాలనకు నిదర్శనమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు.

ఎస్సీ వర్గీకరణపై నేడు అఖిలపక్ష భేటీ: మందకృష్ణ

హైదరాబాద్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ కోసం సీఎం కేసీఆర్ అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లి కేంద్రంపై ఒత్తిడి తేవాలని డిమాండ్ చేస్తూ సోమవారం అఖిలపక్ష భేటీని నిర్వహిస్తున్నట్టు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ చెప్పారు. ఈ భేటీలో అఖిలపక్షాల నేతలు, ఇతర ప్రముఖులు పాల్గొంటారని ఆదివారం ఒకప్రకటనలో పేర్కొన్నారు.

14లక్షల ఉద్యోగాలు భర్తీ చేయాలి: ఆర్.కృష్ణయ్య

రాంనగర్/హైదరాబాద్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వంలోని వివిధ శాఖలు, సంస్థలలో ఖాళీగా ఉన్న 14లక్షల ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని కోరుతూ ప్రధాని మోదీకి బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ఆదివారం లేఖ రాశారు. లేఖలోని అంశాలను బీసీ భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన వివరించారు. కేంద్రంలో మొత్తం 56 లక్షల ఉద్యోగాలు ఉండగా ప్రస్తుతం 42 లక్షల మంది మాత్రమే పనిచేస్తున్నారని ఆయన తెలిపారు.

చంద్రబాబు తెలంగాణలో పర్యటించాలి

» టీడీపీ ఖమ్మం జిల్లా సమావేశంలో కార్యకర్తల డిమాండ్

ఖమ్మం, జనవరి 28(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ప్రజలు, కార్యకర్తల్లో టీడీపీ బలం చెక్కు చెదరలేదని, పార్టీ అధినేత చంద్రబాబు తెలంగాణలో పర్యటించి పార్టీని మరింత బలోపేతం చేయాలని ఖమ్మం జిల్లా కార్యకర్తలు కోరారు. రాష్ట్రంలో పార్టీ పరిస్థితి, గత వైభవం తెచ్చేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ఆదివారం పార్టీ జిల్లా కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో విస్తృత చర్చ జరిగింది. నాయకులు వెళ్లిపోయినా తాము జెండాను భుజాలపై మోస్తున్నామని, ఉన్న నాయకులు పార్టీ కోసం పనిచేయాలని కార్యకర్తలు విన్నవించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మయ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి హాజరైనమాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు, ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య తదితరుల ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నామ, సండ్ర మాట్లాడుతూ.. కార్యకర్తలకు అన్ని విధాలా అండగా ఉంటామని, పార్టీని సమష్టిగా బలోపేతం చేసుకుందామని చెప్పారు.



బహిరంగసభలో మాట్లాడుతున్న కోదండరాం

రైతు అన్నివిధాలా మోసపోతున్నాడు

» మరో కొత్త తరహా ఉద్యమం..14న ప్రకటన: కోదండరాం

» రైతు లేకుంటే రాజ్యమే లేదు: ఆర్.నారాయణమూర్తి

పరకాల(వరంగల్ రూరల్), జనవరి 28: రైతు అన్ని విధాలా మోసపోతున్నాడని, అతడు ఆత్మగౌరవంతో బతికే రోజు రావాలని టీజేఏసీ చైర్మన్ కోదండరాం అన్నారు. రైతుల సమస్యల ప్రాతిపదికన తెలంగాణ సమాజాన్ని జాగృతం చేస్తూ త్వరలో కొత్త తరహా ఉద్యమాన్ని ప్రకటిస్తానన్నారు. రైతు ఆత్మహత్యల నివారణ, లాభసాటి వ్యవసాయంపై విప్లవ సినిమాల దర్శక నిర్మాత, నటుడు ఆర్.నారాయణమూర్తితో కలిసి కోదండరాం వరంగల్ రూరల్ జిల్లా పరకాలలో ఆదివారం రైతు ప్రదర్శన, బహిరంగ సభ నిర్వహించారు. వ్యవసాయరంగ సమస్యలు-పరిష్కార మార్గాలు అనే అంశంపై వరంగల్ జిల్లా జేఏసీ ఆధ్వర్యంలో హన్మకొండలో జరిగిన సదస్సులోనూ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోదండరాం మాట్లాడుతూ.. రైతు ఆత్మహత్యలకు కారణాలు తెలుసుకునేందుకు నియోజకవర్గాల వారీగా నిర్వహించిన సర్వేలో వెల్లడైన వాస్తవాలు, బాధలు, కష్టాల ప్రాతిపదికన చేపట్టనున్న కార్యాచరణను 14న హైదరాబాద్‌లో ప్రకటిస్తామన్నారు. తెలంగాణ రాష్ట్రంలో 3,381 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నా ప్రభుత్వానికి చీమకుట్టినట్లయినా లేదన్నారు. ఆర్.నారాయణమూర్తి మాట్లాడుతూ.. రైతు లేకుంటే రాజ్యమే లేదని, రైతు ఆత్మహత్య చేసుకున్న రాజ్యం బాగుపడదన్నారు. రైతే రాజు అని పెద్ద పెద్ద మాటలు మాట్లాడే నాయకులు రైతులను పట్టించుకోవడం లేదన్నారు.

'మన కూరగాయలు'కు మార్కెట్ కమిటీ నిధులు

హైదరాబాద్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): రైతులు, వినియోగదారుల మధ్య దళారులను తగ్గించేందుకు చేపట్టిన 'మన కూరగాయలు' పథకం అమలుకు వ్యవసాయ మార్కెట్ కమిటీల నుంచి నిధులను సమకూర్చాలని మార్కెటింగ్ శాఖ నిర్ణయించింది. దీనికోసం చట్టానికి సవరణ తీసుకురానుంది. రెండేళ్లుగా ఉమ్మడి రంగారెడ్డి, మెదక్, మహబూబ్‌నగర్‌లో మన కూరగాయలు పథకం అమలవుతోంది. పథకంలో భాగంగా ఏజెన్సీలతో ఒప్పందాలు చేసుకోవాల్సి ఉండడం, నిధులు అవసరం కావడంతో పథకం అమలు నిబంధనలు, మార్గదర్శకాలతో ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

70కిపైగా స్థానాల్లో గెలుస్తాం

» ఎన్నికలు ఎప్పుడొచ్చినా అధికారం మాదే

» సీఎం కేసీఆర్‌కు సిగ్గు, శరం లేదు

» ఎమ్మెల్యే ధర్మారెడ్డి.. ఓ బ్రోకర్ : ఉత్తమ్

గీసుగొండ, జనవరి 28 (వరంగల్ రూరల్ జిల్లా) : రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు వచ్చినా 70కిపైగా అసెంబ్లీ స్థానాలు గెలుచుకుని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని పీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. వరంగల్ రూరల్ జిల్లా గీసుగొండ మండల కేంద్రంలో ఆదివారం రాత్రి పలు పార్టీలకు చెందిన నాయకులు ఉత్తమ్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక వంద రోజుల్లోనే రూ.2 లక్షల మేర రైతు రుణాలన్నీ మాఫీ చేస్తామని ప్రకటించారు. రాష్ట్రంలోని 70 లక్షల స్వయం సహాయక సంఘాలకు బ్యాంకులు ఇచ్చిన రుణాలపై వడ్డీని ప్రభుత్వమే చెల్లిస్తుందని వెల్లడించారు. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ సిగ్గు, శరం లేకుండా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. మిషన్ భగీరథ పేరిట కాంట్రాక్టర్లతో కుమ్మక్కై లక్షల కోట్లు దండుకుంటున్నారని ఆరోపించారు. కేబినెట్‌లో ఒక్క పదవీ ఇవ్వకుండా మహిళలను కించపరిచారన్నారు. పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఒక బ్రోకర్ మాదిరిగా పని చేస్తున్నాడని విమర్శించారు. పరుష పదజాలంతో మాట్లాడితే రెండేళ్ల జైలు శిక్ష విధిస్తామంటున్న కేసీఆర్‌ను ముందుగా జైలులో పెట్టాలన్నారు. కార్యక్రమంలో నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, మాజీ చీఫ్ విప్ గండ్ర వెంకటరమణారెడ్డి, నాయకులు నాయిని రాజేందర్‌రెడ్డి, జి.విజయరామరావు, దనసరి అనసూయ(సీతక్క), వేం నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు. కాగా, కాంగ్రెస్ నేతలకు టీపీసీసీ కోశాధికారి గూడూరు నారాయణరెడ్డి ఆదివారం విందు ఇచ్చారు. రెండోసారి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి టీపీసీసీ బాధ్యతలు చేపట్టిన సందర్భాన్ని పురస్కరించుకుని ఆయన ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ మేరకు రాష్ట్రంలో రాజకీయ పరిస్థితులపై నేతల మధ్య చర్చ జరిగింది.


వరంగల్ రూరల్ జిల్లా గీసుకొండలో నిర్వహించిన సభలో మాట్లాడుతున్న టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్

మహా కూటమి?

(మొదటి పేజీ తరువాయి)

వచ్చేదాకా వేచి చూడాలని కాంగ్రెస్ నేతలు భావిస్తున్నట్లు తెలుస్తోంది. కూటమి ప్రతిపాదనను తామే ముందుగా ప్రస్తావిస్తే సీట్ల సర్దుబాటులో ఇబ్బందులు తలెత్తుతాయని కాంగ్రెస్ పెద్దలు భావిస్తున్నట్లు ఆ పార్టీకి చెందిన ఓ నేత అభిప్రాయపడ్డారు. మొత్తమ్మీద.. ఉమ్మడి రాష్ట్రంలో 2009 ఎన్నికల్లో.. అప్పుడు అధికారంలో ఉన్న కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ఏర్పాటైన మహాకూటమి తరహాలోనే మళ్లీ కూటమి ఏర్పాటయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

ప్రత్యామ్నాయ రాజకీయ వేదికగా..

భావసారూప్యం ఉన్న వామపక్ష, లౌకిక, ప్రజాతంత్ర శక్తులతో జాతీయ స్థాయిలో ప్రత్యామ్నాయ రాజకీయ వేదికను ఏర్పాటు చేస్తామని విజయవాడలో నిర్వహించిన జాతీయ సమావేశాల్లో సీపీఐ తీర్మానించింది. జాతీయ పార్టీ నిర్ణయానికి అనుగుణంగానే తెలంగాణలో లౌకిక శక్తులతో కలిసి అధికార టీఆర్ఎస్‌ను గద్దె దింపుతామని సీపీఐ రాష్ట్ర నాయకత్వం చెబుతోంది. ఈ మేరకు రెండు ప్రధాన పార్టీల రాష్ట్ర అధ్యక్షులతో ఇప్పటికే చర్చలు జరిగినట్లు సీపీఐ అగ్రనేత ఒకరు చెప్పారు. ఈ వేదికతో పనిచేసేందుకు టీజేఏసీతో కూడా ప్రాథమిక అంగీకారానికి వచ్చినట్లు తెలుస్తోంది. టీజేఏసీ చైర్మన్ కోదండరాం ఇటీవల సీపీఐ రాష్ట్ర కార్యాలయంలో ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డితో సుదీర్ఘ మంతనాలు జరిపినట్లు సమాచారం. టీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా ఉన్న పార్టీలు, ప్రజా సంఘాలను కలుపుకొని వెళ్లడంపైనా చర్చించారు. ఈ సందర్భంగా టీడీపీతో కలిసి పనిచేసేందుకు తమకు అభ్యంతరం లేదని, వామపక్షాలు, టీడీపీ గతంలో మిత్రపక్షాలుగా కలిసి పోటీ చేసి అధికారంలోకి వచ్చాయని సురవరం గుర్తు చేసినట్లు సమాచారం. మరోవైపు లౌకిక పార్టీలతో పొత్తు పెట్టుకోవాలని సీపీఎం కూడా భావిస్తున్నట్లు తెలుస్తోంది. సీపీఎం కేంద్ర కమిటీ సమావేశంలో ఈ అంశంపై ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి తీర్మానాన్ని ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. రాష్ట్రంలో కాంగ్రెస్‌తో కలిసి పనిచేసేందుకు ఆ పార్టీ అభ్యంతరం చెప్పకపోవచ్చనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఎన్నికల సమయానికి సీపీఎం కూడా వేదికలో చేరుతుందని సీపీఐ ధీమాగా ఉంది. అయితే కాంగ్రెస్‌తో కలిసి పనిచేసేందుకు టీడీపీ ముందుకొస్తుందా, లేదా అన్నది చివరి నిమిషం దాకా తేలే అవకాశం లేదని భావిస్తున్నారు.

చెట్టుకు కారు ఢీ.. ముగ్గురు టెకీలు మృతి

» మరో యువకుడికి తీవ్రగాయాలు

చేవెళ్ల, జనవరి 28: ఆ స్నేహితుల ప్రయాణం తీవ్ర విషాదమైంది. కారు అదుపుతప్పి చెట్టుకు ఢీకొట్టడంతో అందులో ప్రయాణిస్తున్న నలుగురిలో ముగ్గురు అక్కడికక్కడే ప్రాణాలు విడిచారు. మరో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. మృతులంతా సాఫ్ట్‌వేర్ ఉద్యోగులే! రంగారెడ్డి జిల్లా చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని మీర్జాగూడ బస్‌స్టేజీ సమీపంలో ఆదివారం ఉదయం 6:30 గంటల ప్రాంతంలో ఈ ప్రమాదం సంభవించింది. ప్రవీణ్ (26) అర్జున్‌కుమార్ (25) శ్రావణ్ (28) హైదరాబాద్ ఉప్పల్‌లోని జెన్‌ప్యాక్ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నారు. డేవిడ్ జాన్సన్ (34) హైదరాబాద్‌లో ఓ మెడికల్ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. శ్రావణ్ కారులో వీరు తెల్లవారుజామున హైదరాబాద్ నుంచి వికారాబాద్‌కు బయలుదేరారు. మీర్జాగూడ బస్‌స్టేజీ దగ్గరకు వచ్చేసరికి కారు అదుపుతప్పి చెట్టును ఢీకొట్టడంతో ప్రవీణ్, అర్జున్ కుమార్, డేవిడ్‌జాన్సన్ మృతిచెందారు. శ్రావణ్‌కు తీవ్రగాయాలు కావడంతో ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు.


రోడ్డు ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

సత్రం.. భోజనం!

» భూములు పంచాయతీవి

» సత్రాలు కట్టించింది దాతలు


» దశాబ్దాలుగా భక్తులకు బస

» ఇప్పుడు కోట్లకు పెరిగిన ఆస్తులు

» అడ్డం తిరుగుతున్న వారసులు

» యాదాద్రిలో అధర్మం

యాదాద్రి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): తాతలు ధర్మ సత్రాలు కట్టించారు. ఇప్పుడు వారసులు వాటిని భోంచేస్తున్నారు. ఆ భూములు పంచాయతీవే. కానీ, వారసత్వం పేరిట సత్రాలను, భూములను లాక్కుని, వాటిలో వాణిజ్య భవనాలు కట్టుకుంటున్నారు. ధర్మసత్రాల పేరిట ప్రముఖ పుణ్యక్షేత్రం యాదాద్రిలో జరుగుతున్న అధర్మమిది. తెలంగాణ తిరుమలగా పేరొందిన నారసింహుడి సన్నిధిలో దశాబ్దాల కిందట దాతలు నిర్మించి స్వామివారికి సమర్పించిన ధర్మ సత్రాలు అన్యాక్రాంతమవుతున్నాయి. సత్రం నిర్మిస్తామంటూ ముందుకు వచ్చిన దాతలకు ఆ రోజుల్లో యాదగిరిగుట్ట పట్టణంలోని ప్రధాన రహదారి వెంట ఉచితంగా స్థలాలు కేటాయించారు. ప్రభుత్వం నుంచి స్థలాన్ని తీసుకున్న దాతలు సొంత నిధులతో భవనాలను నిర్మించారు. వాటిలో స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులకు బస సదుపాయాలు కల్పించేవారు. దాంతో, సత్రాల పేర్లను దాతల పేరిటే వ్యవహరిస్తూ వస్తున్నారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఆస్తుల రికార్డుల్లో కూడా దాతల పేరుతోనే అవి నమోదయ్యాయి. దశాబ్దాలు గడిచాయి. సత్రాల భూముల విలువ కోట్లకు పెరిగింది. పంచాయతీ రికార్డుల్లో సత్రాలు దాతల పేరుతో ఉండటాన్ని ఆసరాగా చేసుకుని.. వారి వారసులు తెరపైకి వస్తున్నారు. దాతల స్ఫూర్తికి విరుద్ధంగా భూములను చేజిక్కించుకుంటున్నారు. నిజానికి, స్థలాలు వారి పూర్వీకులవి కాకపోయినా.. వారి పేరుతో ఉన్న సత్రాలు తమ సొంతమనే వాదనలతో కోర్టు వ్యాజ్యాలు వేస్తున్నారు. మరికొన్నింటిని అన్యాక్రాంతం చేస్తున్నారు. ఇప్పటికే 20 వరకు ధర్మ సత్రాలను స్వాధీనం చేసుకున్నారు. నిజానికి, దేవాదాయ, ధర్మాదాయ శాఖ రికార్డుల ప్రకారం ధర్మసత్రాలు30కిపైగా ఉన్నాయి. వీటిని 1967లోనే ఆ శాఖ జారీ చేసిన గెజిట్ నోటిఫికేషన్‌లో ప్రకటించింది. సత్రాల వివరాలు నోటిఫై అయినా, వాటి రికార్డులను దేవాదాయ శాఖ సక్రమ పద్ధతిలో భద్రపరచలేదు. సత్రాలకు సంబంధించిన దానపూర్వక స్వాధీన పత్రాలను భద్రపరచడంలో దేవాదాయ, యాదాద్రి ఆలయ అధికారుల నిర్లక్ష్యం అక్రమార్కులకు కలిసి వచ్చింది. దేవాదాయ శాఖ అధికారులు వీటి పరిరక్షణకు చిత్తశుద్ధి ప్రదర్శించకపోవడంతో కొన్ని సత్రాలు వాణిజ్య భవనాలుగా రూపాంతరం చెందాయని ఆరోపిస్తున్నారు. యాదాద్రి నారసింహుడి సన్నిధిలో సత్రాలు ఉండగా.. పర్యవేక్షణ మాత్రం దేవాదాయ శాఖది. ఈ రెండు శాఖల మధ్య సమన్వయలోపం ఆక్రమణదారులకు వరంగా మారింది. ఈ నేపథ్యంలోనే సత్రాలను పరిరక్షించి.. భక్తులకు మెరుగైన సదుపాయాలు కల్పించడానికి చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.


వివాదంలో ఉన్న సత్రం స్థలం


బొడ్డుపల్లి శ్రీనివాస్ హత్య కేసు వివరాలు వెల్లడిస్తున్న నల్లగొండ ఎస్పీ శ్రీనివాసరావు

క్షణికావేశంతోనే శ్రీనివాస్ హత్య

» మిర్చి బండి వద్ద మొదలైన గొడవ వల్లే..

» హత్యలో కుట్ర, రాజకీయ కోణం లేదు

» నల్లగొండ ఎస్పీ శ్రీనివాసరావు వెల్లడి

» శ్రీనివాస్ బావమరిది ఆత్మహత్యాయత్నం

» హత్యపై ప్రభుత్వమే జవాబు చెప్పాలి: భట్టి

» టీఆర్ఎస్‌లో చేరనందుకే శ్రీనివాస్ హత్య: వీహెచ్

నల్లగొండ/నల్లగొండ క్రైం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): క్షణికావేశం కారణంగానే నల్లగొండ మునిసిపల్ చైర్‌పర్సన్ భర్త బొడ్డుపల్లి శ్రీనివాస్ హత్య జరిగిందని, ఇందులో ఎలాంటి కుట్ర, రాజకీయ కోణం లేవని జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు తెలిపారు. మిర్చి బండి వద్ద మొదలైన వివాదం మాటామాటా పెరిగి హత్యకు దారితీసిందని అన్నారు. ఈ కేసులో నిందితులను ఆదివారం మీడియా ఎదుట ప్రవేశపెట్టారు. మొత్తం 11మంది నిందితులు కాగా.. ఇందులో ముగ్గురు పరారీలో ఉన్నట్లు తెలిపారు. ఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. నిందితుల్లో ఒకరైన చింతకుంట్ల రాంబాబు ఈ నెల 24న పట్టణంలోని ఓ మిర్చి బండి నడిపే వ్యక్తితో గొడవపడ్డాడు. ఈ విషయమై స్థానిక కౌన్సిలర్ కుమారుడు మెరుగు గోపి.. రాంబాబును ప్రశ్నించడంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. గోపిపై రాంబాబు చేయి చేసుకోవడంతోపాటు మునిసిపల్ చైర్‌పర్సన్ భర్త అయిన బొడ్డుపల్లి శ్రీనివాస్‌ను కూడా అసభ్యపదజాలంతో దూషించాడు. అక్కడినుంచి వెళ్లిపోయిన గోపి.. ఈ విషయాన్ని శ్రీనివాస్‌కు ఫోన్‌చేసి చెప్పాడు. దీంతో శ్రీనివాస్.. మాతంగి మోహన్ అనే వ్యకితో కలిసి సంఘటన స్థలానికి వచ్చాడు. గొడవపై రాంబాబును ప్రశ్నించడంతో మాటామాటా పెరిగి ఘర్షణ జరిగింది. ఇద్దరూ పరస్పరం తోసుకోవడంతో పక్కనున్న మోరీలో పడ్డారు. ఈ క్రమంలో మాండ్ర మల్లేష్ అనే వ్యక్తి సిమెంట్ రాయితో శ్రీనివాస్ తలపై మోదాడు. దాంతో 'నీ అంతు చూస్తా' అంటూ శ్రీనివాస్ బెదిరించడంతో మరో లావుపాటి రాయిని అతని తలపై వేశాడు. వెంటనే రాంబాబు మరో రాయి తీసుకొని బలంగా వేశాడు. దీంతో శ్రీనివాస్ ప్రాణాలు వదలడంతో రాంబాబు, మల్లేష్‌తోపాటు సంఘటన స్థలంలో ఉన్న శరత్, భాష్పాక దుర్గయ్య, కత్తుల కల్యాణ్ సామ్రాట్, దామునూరి సతీష్, మాండ్ర మహేష్, మిట్టపల్లి సాయి, మాతంగి మోహన్‌లు అక్కడినుంచి పారిపోయినట్లు ఎస్పీ తెలిపారు. ఈ కేసును ఆరు బృందాలతో శోధించామని, శ్రీనివాస్‌తోపాటు మిగిలిన వారి గత 3నెలల కాల్ డేటాను పరిశీలించి.. ఇందులో రాజకీయ కోణం లేదని నిర్ధారణకు వచ్చామని పేర్కొన్నారు. శ్రీనివాస్‌పై 9 పోలీసు కేసులు, అందులో ఒక హత్య కేసు ఉండటంతో ఆయనకు గన్‌మెన్‌ను, వెపన్ లైసెన్స్ ఇచ్చేందుకు నిబంధనలు అంగీకరించవన్నారు.

ఎమ్మెల్యే వీరేశం నల్లగొండ నయీం: రాజగోపాల్‌రెడ్డి

తనకు ప్రాణహాని ఉందని శ్రీనివాస్ ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవటం వల్లే హత్య జరిగిందని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఈ హత్యకు ప్రభుత్వమే సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఆదివారం నల్లగొండలో మునిసిపల్ చైర్‌పర్సన్ బొడ్డుపల్లి లక్ష్మిని, శ్రీనివాస్ తల్లిని ఆయన పరామర్శించారు. కాగా, ఎమ్మెల్యే వేముల వీరేశం నల్లగొండ నయీంగా మారారని ఎమ్మెల్సీ కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఆరోపించారు. శ్రీనివాస్ హత్య వెనుక ఎమ్మెల్యే వేముల వీరేశంతోపాటు నల్లగొండ టీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంచర్ల భూపాల్‌రెడ్డి కూడా ఉన్నారని ఆరోపించారు. కాగా టీఆర్ఎస్‌లో చేరాల్సిందిగా శ్రీనివాస్‌పై ఎంత ఒత్తిడి తెచ్చినా చేరనందుకే హత్య చేశారని మాజీ ఎంపీ వి.హనుమంతరావు హైదరాబాద్‌లో ఆరోపించారు.

సీబీఐకి అప్పగించకపోతే ఆమరణ దీక్ష: లక్ష్మి

తన భర్త శ్రీనివాస్ మృతిపై విచారణను సీబీఐకి అప్పగించకపోతే ఆమరణ దీక్షకు దిగుతానని మునిసిపల్ చైర్‌పర్సన్ బొడ్డుపల్లి లక్ష్మి అన్నారు. ఆదివారం నల్లగొండలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. అధికార పార్టీ ఒత్తిడి మేరకే పోలీసులు వ్యవహరిస్తున్నారని, ఈ హత్యను మిర్చి బండి వద్ద జరిగిన గొడవగా చిత్రీకరించడం ఆవేదన కలిగిస్తోందన్నారు. రక్షణ కోసం తాము అనేక సార్లు పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆరోపించారు. కాగా, శ్రీనివాస్ హత్యతో మానసిక వేదనకు గురైన అతని బావమరిది చిట్టిమల్ల సతీష్ ఆదివారం ఆత్మహత్యాయత్నం చేశాడు. చైర్‌పర్సన్ ఇంటివద్దే ఒంటిపై కిరోసిన్ పోసుకొని.. నిప్పంటించుకునేందుకు యత్నించగా అక్కడున్నవారు వెంటనే అతనిపై నీళ్లు చల్లి అడ్డుకున్నారు.

'పత్తి' అంచనాలు తారుమారు

» 1.10 కోట్ల క్వింటాళ్లే మార్కెట్లకు రాక

» అందులో సీసీఐ కొన్నది 13 శాతమే..



హైదరాబాద్, గద్వాల జనవరి 28 (ఆంధ్రజ్యోతి): పత్తి దిగుబడిలో ప్రభుత్వ అంచనా తారుమారయ్యింది. ఈ ఏడాది రాష్ట్రంలో 47.73 లక్షల ఎకరాల్లో రైతులు పత్తి వేయగా 2.80 కోట్ల క్వింటాళ్ల దిగుబడి వస్తుందని ప్రభుత్వం అంచనా వేసింది. ఆ మేరకు కేంద్రానికి నివేదికలు కూడా పంపింది. కానీ.. రాష్ట్ర వ్యాప్తంగా పత్తి చేలు దాదాపు ఈడుపోయినా ఇప్పటికి కేవలం 1.10 కోట్ల క్వింటాళ్ల మేరకే మార్కెట్లకు అమ్మకానికి వచ్చింది. ఇక.. మార్కెట్‌కు వచ్చిన పత్తిలో సీసీఐ కేవలం 14.27 లక్షల క్వింటాళ్లే కొనుగోలు చేసింది. ప్రైవేటు ట్రేడర్లు 92.29 లక్షల క్వింటాళ్లను కొనుగోలు చేశారు. అంటే సీసీఐ కొన్నది 13శాతమే! కాగా, అకాల వర్షాలు, గులాబీ పురుగు ప్రభావంతో పత్తి దిగుబడి అంచనాలను అందుకోలేకపోయిందని వ్యవసాయ శాఖ వర్గాలు చెబుతున్నాయి. ఇక, పత్తి గింజలకు అంతర్జాతీయంగా ధర పెరగడంతో ఇక్కడి మార్కెట్‌లో పత్తి ధర మద్దతు ధరను మించిపోయింది. పత్తికి క్రమంగా ధరలు పెరుగుతుండడంతో రైతులు పత్తిని అమ్మకుండా మంచి ధర కోసం నిల్వ చేసుకున్నారని మార్కెటింగ్ శాఖ వర్గాలు అంటున్నాయి. అంచనాల మేరకు మార్కెట్లకు పత్తి అమ్మకానికి రాకపోవడానికి ఇదీ ఓ కారణమని అధికారులు చెబుతున్నారు.

1700 కోట్ల ఐటీ ఎగవేసిన పత్తి విత్తన కంపెనీలు

పత్తి విత్తన కంపెనీలు ఆరేళ్లుగా రూ.1700 కోట్ల ఆదాయపు పన్ను ఎగవేసినట్లు ఐటీ శాఖ గుర్తించింది. గద్వాల ప్రాంతంలోని రైతుల వద్ద భూములను లీజుకు తీసుకొని పత్తి విత్తన సాగు చేస్తున్నట్లు ఐటీశాఖకు పత్రాలు లభించాయి. వీటిని ఆధారంగా చేసుకొని ఐటీ అధికారులు మూడు రోజులుగా గద్వాలలో కాటన్ సీడ్ మిల్లుల్లో, నివాసాల్లో దాడులు నిర్వహిస్తున్నారు. విత్తన కంపెనీల వద్ద లభించిన లీజు పత్రాలకు, గద్వాలలో లభించిన పత్రాలకు పొంతన లేదని గుర్తించారు. కంపెనీలకు, రైతులకు మధ్యవర్తులుగా వ్యవహరిస్తున్న సీడ్ ఆర్గనైజర్లు కూడా ఆదాయ పన్ను ఎగ్గొడుతున్నారని ఐటీ శాఖ నిర్ధారణకు వచ్చింది.

వినూత్నం

బస్సుల్లో దివ్యాంగుల కోసమే కేటాయించిన సీట్లుంటాయి. ఆసుపత్రుల్లో ప్రత్యేక వసతులుంటాయి. ఉద్యోగాల్లో కోటాలు ఉంటాయి. కానీ వారి జీవిత భాగస్వామి ఎంపికలో మాత్రం అడుగడుగునా అడ్డంకులుంటాయి. వారి ఎగుడుదిగుడు బాటలో ఏడడుగుల ప్రయాణం వారి జీవితాలకు గగన కుసుమం. మరి అలాంటి కష్టసాధ్యమైన పనిని చిన్న వయసులోనే తలకెత్తుకొని దివ్యాంగుల నుదుట 'కల్యాణ తిలకం' దిద్దిస్తున్నారు 21 ఏళ్ల కోన కల్యాణి .



దివ్యాంగులకు.. కల్యాణ తిలకం!

అబ్బాయి అందగాడై ఉండొచ్చు... అయిదంకెల జీతం అందుకుంటూ ఉండొచ్చు.. కానీ అతను దివ్యాంగుడైతే మాత్రం పిల్లనిచ్చేందుకు చాలామంది ముందుకు రారు. అమ్మాయిల విషయంలోనూ అంతే! దివ్యాంగులకు తమ జీవిత భాగస్వామిని వెతుక్కోవటం అంత సులభం కాదు. ఈ లోటు తీర్చేందుకు.. దివ్యాంగుల కోసమే అందుబాటులోకి వచ్చిన తొలి ఆన్‌లైన్ వివాహ వేదిక - 'ఇన్‌క్లోవ్ యాప్'. ఈ యాప్ ప్రారంభించాక ఇప్పటివరకు దేశవ్యాప్తంగా మూడు వేల జంటలు ఒక్కటయ్యాయి.

నమ్మకం నిజమైంది...

కల్యాణి ముంబైలో వాణిజ్య, అర్థశాస్త్రాల్లో డిగ్రీ చదివేటప్పుడు ప్రాజెక్ట్ కోసం కొన్నాళ్లు బ్రెజిల్‌లోని బెలెమ్ నగరానికి వెళ్లింది. "ఓ రోజు రోడ్డుపైన ఒంటరిగా వెళుతున్నప్పుడు రౌడీ మూక నాపై దాడి చేసి, బ్యాగ్ లాక్కెళ్లింది. పాస్‌పోర్టు కూడా అందులోనే ఉంది. ఆ హఠాత్పరిణామానికి చాలా భయపడ్డాను. ఒంటరిగా ఉన్నా, పైగా భాష కూడా రాదు. ఆ సంఘటన నాకు చాలా నేర్పింది. ముఖ్యంగా జీవితం అంటే " అంటారు కల్యాణి. 'కాగితం ముక్క ఇచ్చేదే నా గుర్తింపా?' అనే ప్రశ్న ఆమెలో తలెత్తింది. మనసుకు నచ్చిన పని చేయాలని నిర్ణయించుకుంది. 'మనం తలపెట్టిన పని గురించి మనకేమీ తెలియకపోయినా ఫరవాలేదు. కానీ మనం ఆ పనికే అంటిపెట్టుకొని ఉంటే చాలు... అంతా మంచే జరుగుతుంది' అని అర్థం చేసుకున్నా. తరువాత ఇండియాకు తిరిగొచ్చి వాణిజ్యం, అర్థశాస్త్రంలో డిగ్రీ పట్టా పుచ్చుకుంది. బ్యాచ్ టాపర్‌గా నిలిచింది. క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌కు వెళితే బహుళ జాతి సంస్థలో మంచి జాబ్‌తో సెటిల్ కావొచ్చని స్నేహితులు నన్ను కోరేవారు. వారంతా మంచి ఉద్యోగాల్లో సెటిలయ్యారు. నేను కూడా అలానే సెటిలవ్వాలనుకున్నా. కానీ ఉద్యోగంలో చేరేముందు ఒకసారి టూర్‌కు వెళ్లాలనిపించింది. అక్కడే నా జీవితం మలుపు తిరిగింది' అంటారు కల్యాణి. హిమాలయాల్లో ట్రెక్కింగ్. 20 రోజుల్లో 14 వేల అడుగుల ఎత్తున శిఖరాలను ఎక్కాలి. ఆ ప్రయాణం ఆమె జీవిత గమ్యాన్ని మార్చేసింది. జీవితంలో పైకి ఎదగాలనే కోరికను హిమాలయాలు ఆమెలో రగిల్చాయి. చేతిలో చిల్లిగవ్వ లేకుండా, అనుభవం, ఎవ్వరి మద్దతు లేకుండా కూడా వ్యాపారం చేయవచ్చు అనే నమ్మకాన్నిచ్చాయి. ఆ ధైర్యంతోనే తిరిగొచ్చిన తరువాత కల్యాణి స్టార్టప్ ప్రారంభించింది. ఆమె నమ్మకం నిజమైంది.

కల్యాణి కూడా మొదట్లో అందరిలానే 'మ్యాచ్‌మేకింగ్ ఏజెన్సీ'ని ప్రారంభించాలనుకుంది. కానీ అప్పటికే మార్కెట్‌లో అలాంటి ఏజెన్సీలు పుట్టగొడుగుల్లా ఉన్నాయి. తన ప్రయత్నం విభిన్నంగా ఉండాలనుకుందామె. దివ్యాంగుల కోసం చదువు, ఉద్యోగాలు, ప్రయాణాల్లో సహకరించేందుకు రకరకాల కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు, కానీ వారికోసం వివాహ వేదికలు లేవని తన అధ్యయనంలో తెలుసుకుంది. అంతేకాదు ఐక్యరాజ్యసమితి నివేదిక ప్రకారం ఇండియాలో 8 కోట్ల మంది దివ్యాంగులు ఉంటే, అందులో ఐదు శాతం మందికి మాత్రమే పెళ్లిళ్లవుతున్నాయి. అంతే! కల్యాణి ఇంకేమీ ఆలోచించలేదు.

2014 జులైలో ముంబైలో 'వాంటెడ్ అంబ్రెల్లా' పేరుతో దివ్యాంగుల కోసమే ఆఫ్‌లైన్ వివాహ వేదికను ప్రారంభించింది. "సరైన జీవిత భాగస్వామిని ఎన్నుకునే అవకాశాన్ని కల్పించటంతో దానికి మంచి ఆదరణ లభించింది. దాంతో ఇనుమడించిన ఉత్సాహంతో ఆ సేవలను దేశవ్యాప్తంగా దివ్యాంగులందరికీ అందుబాటులోకి తేవాలని 2016 జనవరిలో 'ఇన్‌క్లోవ్' యాప్‌ను ప్రారంభించా. ఆ పేరు కూడా గమ్మత్తుగా పెట్టాం. 'ఇన్‌క్లూజివ్, లవ్' అనే పద బంధాన్ని కలిపి 'ఇన్‌క్లోవ్' అనే పేరును ఖరారు చేశాం. ఖర్చుల కోసం అవసరమైన రూ. 6 లక్షల నిధులను క్రౌడ్‌ఫండింగ్ ద్వారా సేకరించాం" అని కల్యాణి చెప్పుకొచ్చారు.



దివ్యాంగుల కల్యాణ వేదిక

సేవకు వ్యాపార కోణాన్ని జోడించి ఆమె చేసిన ప్రయోగం దివ్యాంగుల జీవితాల్లో కొత్త వెలుగులు తెచ్చింది. 'ఇన్‌క్లోవ్' యాప్ తోడు కోసం ఎదురు చూసే దివ్యాంగులందరినీ ఒక వేదికపైకి తెస్తోంది. ఇప్పటి వరకు 25 ఆఫ్‌లైన్ మీటింగ్‌లు ఏర్పాటు చేశారు. అందులో పాల్గొన్న దివ్యాంగులు తమ జీవిత భాగస్వాములను ఎంచుకున్నారు. అభిరుచులు కలిసిన వారితో పెళ్లిపీటలు ఎక్కారు. స్నేహితుల, బంధువుల సానుభూతిమీద ఆధారపడకుండా స్వయంగా తమ జీవిత భాగస్వాములను ఎంపిక చేసుకునే అవకాశం దివ్యాంగులలో ఆత్మగౌరవాన్ని పెంచింది. "మనిషి వ్యక్తిత్వానికన్నా రూపానికి ఇండియాలో ఉన్న డేటింగ్ యాప్‌లు ప్రాధాన్యం ఇస్తాయి. మొత్తం సమాచారాన్ని ఇస్తాయి. ఈ యాప్‌లో మాత్రం వధువు, వరుడికి సంబంధించి పలు కోణాల్లో సమాచారం అందుబాటులో ఉంటుంది. వయసు, ఆరోగ్య పరిస్థితి, ప్రాంతం వంటి వ్యక్తిగత వివరాలతో పాటు విద్య, ఉద్యోగం, అభిరుచులు, వారి ఆరోగ్య పరిస్థితి, వాడే పరికరాలు, జబ్బు తగ్గటానికి గల అవకాశాలు వంటి పలు వివరాలు న మోదు చేస్తారు. పర్సనల్ ఫోన్ నంబర్, ఇ-మెయిల్ ఇవ్వాల్సిన అవసరం లేకుండా యాప్ ద్వారానే చాట్ చేయవచ్చు. ఇద్దరికీ ఆసక్తి ఉంటే మాట్లాడుకునేందుకు ఆఫ్‌లైన్ మీటింగ్‌లు ఏర్పాటు చేస్తాం. దివ్యాంగులు కానివారు కూడా తమకు నచ్చిన వారిని ఎంపిక చేసుకునే అవకాశం ఉంది" అని కల్యాణి వివరించారు.

వధూవరుల వివరాలు గోప్యంగా ఉంచేందుకు, సైబర్ దాడుల ముప్పును నివారించేందుకు తగు జాగ్రత్తలు తీసుకున్నారు. స్క్రీన్‌షాట్లు తియ్యకుండా స్క్రీన్‌షాట్ ఆప్షన్ డిజేబుల్‌లో ఉంచారు. ఇమేజ్‌లు షేర్ చేయలేరు. ఫేక్ ప్రొఫైల్స్ చేరకుండా తగు జాగ్రత్తలు తీసుకున్నారు. దృష్టిలోపాలు ఉన్నవారు కూడా వినియోగించుకునేలా ఏర్పాట్లు చేశారు. వర్ణ అంధత్వం ఉన్నవారు ఫాంట్ సైజ్‌ను పెంచుకోవచ్చు. తెర రంగులను మార్చే సౌకర్యమూ ఉంది. పెళ్లి సంబంధాలకు మాత్రమే పరిమితమవకుండా దివ్యాంగులకు బహిరంగ ప్రదేశాల్లో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొనేలా ఆత్మవిశ్వాసాన్ని పెంచే కార్యక్రమాలను 'ఇన్‌క్లోవ్' చేపడుతోంది. దీన్ని ప్రపంచవ్యాప్తంగా ఉన్న దివ్యాంగులకు అందుబాటులోకి తీసుకురావాలనేది కల్యాణి లక్ష్యం. "అందుకే మేం వినియోగదారుల నుంచి రుసుం వసూలు చేస్తున్నాం" అంటారావిడ. వితంతువులకు పునర్వివాహం లాంటి సామాజిక సమస్యలకు కల్యాణి పరిష్కారం చూపాలనుకుంటోంది. దివ్యాంగుల నుదుట కల్యాణ తిలకం దిద్దుతూ తన పేరులో పొదువుకున్న కల్యాణి అనే పేరును ఆమె సార్థకం చేసుకుంటున్న తీరు ఎంతైనా అభినందనీయం.



హోమ్‌కేర్

ముందు జాగ్రత్తతో ఖర్చులకు అడ్డుకట్ట!

ఇంట్లో ఏసీలు, ఫ్రిజ్‌లు, కూలర్ల లాంటి రకరకాల వస్తువులను నిత్యం వాడుతుంటాం. అవి కొన్నిసార్లు పాడవుతాయి. సమయానికి రిపేరు చేసే వ్యక్తులు అందుబాటులో ఉండక నానా తంటాలు పడతాం. ఖర్చు ఎలాగూ తప్పదు. అయితే తరచూ వాటి పనితీరును పర్యవేక్షిస్తూ ఉంటే అకస్మాత్తుగా ఇలాంటి ఇబ్బందులు రాకుండా ఉంటాయి. పెద్ద మొత్తంలో ఖర్చు కాకుండా జాగ్రత్త పడొచ్చు.

ఎయిర్ ఫిల్టర్లు మార్చండి :
ప్రతిమూడు నెలలకోసారి ఏసీ ఫిల్టర్లు మార్చండి. ఇంట్లో ఎవ్వరికైనా అలర్జీ సమస్యలుంటే నెలకోసారి మార్చండి. ఇలా చేయటం వల్ల రిపేర్లు తగ్గటమే కాదు ఏసీ జీవితకాలం పెరుగుతుంది.



డ్రైనేజీ మార్గాలను శుభ్రం చేయండి :
మురుగు నీరు పోయే మార్గాల్లో అడ్డంకులు ఏర్పడితే నీరు నిలిచిపోతుంది. లీకవుతుంది. దీనివల్ల ఇంటి పునాదుల్లో పగుళ్ల రావటం, పురుగులు తయారవ్వటం, కలప సామానుకు చెదలు పట్టడం వంటివి జరుగుతాయి. కాబట్టి ఎప్పటికప్పుడు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి.

ఇంటి పగుళ్లను పరిశీలించండి :
ఇంటి గోడలు బీటలు వారుతుంటే గుర్తించి మొదట్లోనే వీటిని అరికట్టాలి. లేకపోతే నష్ట తీవ్రత పెరుగుతుంది. పగుళ్లను గుర్తించేందుకు తరచూ ఇంటిని పరిశీలించండి. సింక్ దగ్గర జాగ్రత్తగా గమనించండి.

చెట్ల కొమ్మలను నరకటం
తుపాను గాలులకు పెరట్లో పెరిగిన చెట్ల కొమ్మలు విరిగి ఇంటిమీద పడతాయి. కొన్నిసార్లు పక్కింటి మీద, కారు గ్యారేజ్‌పైన పడొచ్చు. ఇల్లు దెబ్బతింటుంది. కాబట్టి ముందే మేల్కోవాలి. ఏడాదికి ఒకసారి కొమ్మలు కత్తిరిస్తే ఈ నష్టాన్ని నివారించవచ్చు.

పునాదిని పరిశీలించండి
ఇంటి పునాదుల్లో ఏవైనా సమస్యలు తలెత్తితే రిపేరుకు ఖర్చు ఎక్కువ అవుతుంది. అంతేకాదు ఇల్లు అమ్మాలంటే మార్కెట్లో ధర పడిపోతుంది. దీన్ని నివారించాలంటే ఇంటి చుట్టూ మట్టిని ఏటవాలుగా పోస్తే కురిసిన వర్షపు నీరు పునాదిలోకి ఇంకకుండా త్వరగా బయటకు వెళ్లిపోతుంది. పునాదిలో పగుళ్లను గమనించాలి. పునాది కుంగిందేమో పరిశీలించి వెంటనే పునాదికి రిపేర్ చేయించాలి.

బ్యూటీ

పచ్చిపాల క్లెన్సర్

చర్మం మీద కంటికి కనిపించని దుమ్ము పేరుకుపోతుంది. దాన్ని తొలగించాలంటే క్లెన్సర్‌ను మించిన ఆయుధం లేదు. అయితే అందుకు రసాయనాలతో నిండిన క్లెన్సింగ్ ఉత్పత్తులు వాడడం కంటే కూడా... ఎటువంటి హాని కలిగించని పచ్చి పాలు వాడటం బెటర్. ఇవి మంచి క్లెన్సర్‌గా పనిచేస్తాయి. అదెలాగంటే... పచ్చిపాలలో దూదిని ముంచి ముఖాన్ని శుభ్రం చేసుకుంటే చర్మం తాజాగా ఉంటుంది.



చిట్కా

ఇంకు మరక పోవాలంటే...

దుస్తుల మీద పడిన ఇంకు మరకలు ఓ పట్టాన వదలవు. అలాగే అన్ని ఇంకు మరకలను ఒకే పద్ధతిలో వదలగొట్టలేము.

- బాల్‌పాయింట్ పెన్ మరకను వదిలించేందుకు ఆల్కహాల్‌ను వాడాలి. చిన్నమరక పడితే కింద పేపర్ టవల్‌ను ఉంచి మరక పైన ఆల్కహాల్ వేసి బాగా రుద్దాలి.
- మరక పెద్దదయితే.. ఆల్కహాల్ పోసిన చిన్న పాత్రలో మరకపడిన భాగాన్ని పావు గంట సేపు ఉంచితే మరక త్వరగా కరిగిపోతుంది. తరువాత చల్లని నీళ్లతో కడగాలి.
- ఇంక్ వల్ల కొన్ని మొండి మరకలు అవుతాయి. అలాంటప్పుడు దుస్తులపైన మరకపడిన భాగాన్ని చల్లటి నీళ్ల కింద బాగా కడగాలి. లిక్విడ్ డిటర్జెంట్ వేసిన వేడినీళ్లలో దుస్తులను గంటపాటు నానబెట్టి చేతితో రుద్దితే మరక పోతుంది.



- మొండి మరకలను వదలగొట్టేందుకు దుస్తులను రాత్రంతా నీటిలో నానబెట్టాలి. కొంచెం అమ్మోనియా ద్రావణం వేసి, సబ్బుతో ఉతికితే మరకలు సులభంగా పోతాయి. ఉతికిన దుస్తులను నీడలోనే ఆరేయాలి.



ఫస్ట్ లేడీ

'సౌండ్'తో ఆడుకుంటుంది!

'సౌండ్ ఇంజినీర్'... సినిమాల పోస్ట్‌ప్రొడక్షన్‌లో తరచూ వినిపించే పదం. తీరిక లేని పని ఒత్తిడులు... నిద్ర లేని రాత్రులు... వేళాపాళా లేని ఉద్యోగం ఇది. మగవారికే కష్టసాధ్యమనిపించే ఈ వృత్తిలో ఓ మహిళ నైపుణ్యంతో రాణిస్తోంది. సవాళ్లను అధిగమిస్తూ పదేళ్లుగా సత్తా చాటుతోంది. ఆమె పరి'శ్రమ'కు మెచ్చి ఇటీవల కేంద్ర ప్రభుత్వం 'ఫస్ట్ లేడీస్' అవార్డునిచ్చి సత్కరించింది. రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ సమక్షంలో ఈ పురస్కారం అందుకున్న సందర్భంగా హైదరాబాద్ యువతి, తెలుగు సినిమా ఇండస్ట్రీలో తొలి మహిళ ఆడియో ఇంజినీర్, మ్యుజీషియన్ సాజిదా ఖాన్ అంతరంగం ఆమె మాటల్లోనే...

ఇష్టపడి కష్టపడితే రంగమేదైనా రాణించవచ్చు. పదేళ్ల కిందట ఆడియో ఇంజినీర్‌గా ప్రయాణం మొదలుపెట్టినప్పుడు ఈ రంగంలో మహిళను నేనొక్కదాన్నే. తెలుగు సినీ పరిశ్రమలో అంతకముందు మహిళలెవరూ సౌండ్ ఇంజినీర్‌గా పనిచేయలేదు. దాంతో నా సామర్థ్యంపై చాలామందికి సందేహాలు వచ్చాయి. ఆరంభంలో ఇలాంటివి సాధారణమేనని అర్థం చేసుకున్నా. కానీ... ఆత్మవిశ్వాసం కోల్పోలేదు. ఒక్కసారి పని మొదలు పెట్టిన తరువాత నా ప్రతిభ చూసిన వారందరి సందేహాలు తొలగిపోయాయి. నాపై నమ్మకాన్ని పెంచాయి. క్రమశిక్షణ... కష్టపడి పనిచేసే తత్వం... ఇవే నన్ను మళ్లీ వెనక్కి తిరిగి చూసుకోకుండా చేశాయి.

❖ విభిన్నమైన కెరీర్...

హైదరాబాద్‌లోనే పుట్టి పెరిగిన నేను... బీఏ పూర్తయిన వెంటనే కెరీర్‌పై దృష్టి పెట్టాను. అయితే అందరిలా కాకుండా... ఎంతో కొంత భిన్నమైన వృత్తి చేపట్టాలన్నది నా కోరిక. అలా ఆలోచిస్తుంటే ఆకర్షించిందే 'ఆడియో ఇంజినీర్'. దాని కోసం హైదరాబాద్‌లోని లండన్ యూనివర్సిటీకి చెందిన 'ట్రినిటీ కాలేజీ'లో చేరాను. అందులో పియానో, వెస్ట్రన్ నొటేషన్ నేర్చుకున్నా. మల్టీమీడియా కోర్సు చేశాను. ఆ తరువాత సౌండ్ ఇంజినీర్‌గా ప్రస్థానం మొదలైంది. గీతాంజలి, ఎల్వీ, ఆర్‌ఎల్‌ఎంఎల్ ప్రొడక్షన్స్ తదితర స్టూడియోల్లో... అలాగే ఆర్పీ పట్నాయక్, చక్రి, లలిత్ సురేశ్, జీవన్ థామస్ వంటి సంగీత దర్శకుల వద్ద పనిచేశాను. మ్యుజీషియన్‌గా, ఆడియో ఇంజినీర్‌గా నైపుణ్యం పెంచుకున్నాను. ప్రస్తుతం ఈ రంగంలో నాకంటూ ఓ గుర్తింపు, ప్రోత్సాహం ఉన్నాయి. అవే ఎంతటి కష్టమైన పనైనా చేయగలనన్న ఆత్మవిశ్వాసాన్ని కలిగిస్తుంటాయి. అంతేకాదు... నేను 'హరి ఓం' సినిమాలో హీరోయిన్ నిషా కొఠారీకి, 'రాం రాబర్ట్ రహీం' అనే హైదరాబాద్ బేస్డ్ హిందీ మూవీలో హీరోయిన్‌కు డబ్బింగ్ కూడా చెప్పాను. చాలా కార్యక్రమాలకు వాయిస్‌ఓవర్ ఇచ్చాను.

❖ రాష్ట్రపతి నుంచి అవార్డు...

వృత్తిలో అంకితభావం... నైపుణ్యం... నన్ను ప్రత్యేకంగా నిలబెట్టాయి. దీన్ని గుర్తించిన కేంద్ర మహిళా శిశు సంక్షేమ శాఖ సాంకేతిక విభాగంలో 'ఫస్ట్ లేడీస్' అవార్డును నాకు ఇచ్చింది. ఈ పురస్కారం కోసం దేశవ్యాప్తంగా మొత్తం 110 మంది మహిళలను ఎంపిక చేయగా అందులో నేనూ ఉండటం ఎంతో గర్వకారణంగా ఉంది. ఈ నెల 20న ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ సమక్షంలో ఈ ప్రతిష్టాత్మక అవార్డు అందుకున్నాను. ఆ అనుభూతి మాటల్లో చెప్పలేను. మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి మేనకాగాంధీ తదితరులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. కేంద్రం తొలిసారిగా ఈ పురస్కారాలను ప్రదానం చేసింది. పురస్కారాలందుకున్న వారిలో బాలీవుడ్ తార ఐశ్వర్యారాయ్‌తో పాటు ఫైటర్ పైలెట్స్, నేవీ ఆఫీసర్స్, డాక్టర్లు, ఇంజినీర్లు, మ్యుజీషియన్లు, డ్యాన్సర్లు ఉన్నారు. అలాంటి వారందరితో కలసి వేదిక పంచుకోవడం ఓ మధుర జ్ఞాపకం. తెలుగు రాష్ట్రాల నుంచి క్రీడాకారిణులు సానియా మిర్జా, సైనా నెహ్వాల్, పీవీ సింధు, కరణం మల్లీశ్వరి తదితరులకు కూడా అవార్డులొచ్చాయి.


అవార్డు గ్రహీతలు

నాకు గతంలో కూడా 'ఫస్ట్ ఫిమేల్ మ్యూజిక్ టెక్నీషియన్ ఇన్ ఇండియా' కింద రాజీవ్‌గాంధీ ఎక్స్‌లెన్స్ అవార్డు (2015), 'ఫస్ట్ ఫిమేల్ ఆడియో ఇంజినీర్'గా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మారక్ సేవా రత్న అవార్డు (2016) వంటి వెన్నో వచ్చాయి. 'తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్'లో కూడా చోటు దక్కింది.

❖ సామాజిక సేవ...

కెరీర్ ఒక్కటే కాదు... సమాజానికి నా వంతుగా చేతనైన సాయం చేయాలనేది ఆలోచన. అందులో భాగంగానే వివిధ స్వచ్ఛంద సంస్థలతో కలసి పనిచేస్తున్నాను. 'సురక్షా మిషన్, ఫయాజ్ చారిటబుల్ ట్రస్ట్'లతో కలసి పిల్లల కోసం చేసే గ్రామీణ విద్య, ఆరోగ్యం తదితర సంక్షేమ కార్యక్రమాల్లో భాగస్వామ్యం పంచుకొంటున్నాను. అలాగే ఒంటరి మహిళలకు బియ్యం అందించడం, హెల్త్ క్యాంపులు నిర్వహించడం వంటివి చేస్తుంటాను.

❖ సంప్రదాయ సంగీతానికి ఊపిరి...

భవిష్యత్తులో ఒక ప్రొడక్షన్ హౌస్‌ను స్టార్ట్ చేయాలనుకొంటున్నాను. తద్వారా ప్రభుత్వంతో కలిసి ఆర్థిక స్తోమత లేని వారికి సంగీతం నేర్పించాలని భావిస్తున్నాను. అలాగే తెరమరుగైపోతున్న జానపద తదితర సంప్రదాయ సంగీతాలకి పూర్వ వైభవం తెచ్చేందుకు చేయగలిగినంత చేయడం మరో లక్ష్యం. ఈ దిశగా ప్రయత్నాలు ఇప్పటికే ప్రారంభించాను. ఈ రంగంలో ఎంతో శ్రమ ఉంటుంది. దాంతో పాటే ఒత్తిడీ ఉంటుంది. వీటన్నింటినీ తట్టుకుని ఓర్పుగా నిలబడే ప్రతిభావంతులకు ఇక్కడ కచ్చితంగా సక్సెస్ దక్కుతుంది.

• హనుమా


టెక్‌గురు



ఒక మనిషి ఆరోగ్యంగా ఉండాలంటే కావలసింది మంచి ఆహారం, శరీరానికి తగినంత వ్యాయామం. ఈ రెండూ సక్రమంగా లేకపోతే చిన్న వయస్సులోనే రోగాలు చుట్టుముడతాయి. అదృష్టవశాత్తు మన సమాజంలో ఈ మధ్య కాలంలో ఆరోగ్య స్పృహ పెరిగిన నేపథ్యంలో.. ఫిట్‌నెస్ ట్రాకర్ల లాంటి డివైజ్‌లు కూడా రోజువారీ యాక్టివిటీలను మానిటర్ చెయ్యడానికి ఉపయోగపడుతున్నాయి.

ఫిట్‌నెస్ ట్రాకర్లతో ఆరోగ్యం మన చేతిలో..





నల్లమోతు శ్రీధర్
fb.com/nallamothusridhar

టెక్ సందేహాలు

ట్రూకాలర్ ఎలా పనిచేస్తుంది?

మనకు తెలియని వాళ్లు కాల్ చేసినప్పుడు ట్రూ కాలర్ యాప్ వాళ్ల పేరు చూపిస్తుంది కదా! అదెలా సాధ్యపడుతుంది?

- విశ్వనాథ్, రామచంద్రాపురం




ట్రూ కాలర్ యాప్ తన సర్వర్లలో ఓ సెంట్రలైజ్డ్ డేటాబేస్‌ని నిర్వహిస్తుంది. ప్రపంచంలో ఉన్న అధిక శాతం కాంటాక్టులు అన్నీ దానిలో సేవ్ చెయ్యబడి ఉంటాయి. సహజంగా ఈ యాప్‌ని మన ఫోన్లో ఇన్‌స్టాల్ చేసుకున్నప్పుడు అది మన కాంటాక్ట్స్‌ని యాక్సెస్ చెయ్యడానికి మన అనుమతిని కోరుతుంది. మనం అనుమతించగానే మన ఫోన్లో మనం సేవ్ చేసుకున్న మన మిత్రులు, బంధువుల నెంబర్లు అన్నీ.. వారిని మనం ఏ పేరుతో సేవ్ చేసుకున్నామో అదే పేరుతో ట్రూకాలర్ డేటాబేస్‌లోకి అప్‌లోడ్ చేస్తుంది. ఇకపై మన కాంటాక్టుల్లో ఉన్న వ్యక్తులెవరైనా ఇతరులకి కాల్ చేసినప్పుడు వారి నెంబర్ అప్పటికే సేవ్ చెయ్యబడి లేకపోతే, మనం ఏ పేరుతో సేవ్ చేసుకున్నామో ఆ పేరు అవతలి వారికీ చూపించబడుతుంది. ఉదా.కి.. 1234 అనే నెంబర్‌ని మనం అన్న అని సేవ్ చేసుకుంటే ఆ 1234నెంబర్ వ్యక్తి ఇతరులకి ఫోన్ చేసినప్పుడు అతని పేరు వారికి అన్న అని చూపించబడుతుంది.

అలా యాక్సెస్ సాధ్యమేనా?

నేను ఎక్కువగా కంప్యూటర్ ముందు కూర్చుని వర్క్ చేస్తుంటాను. ఫోన్లో వచ్చిన కాల్స్, మెసేజ్‌లు, నోటిఫికేషన్లని డెస్క్‌టాప్ నుండి యాక్సెస్ చెయ్యడానికి కుదురుతుందా?

- మణికంఠ, ఉప్పాడ



ఆండ్రాయిడ్ ఫోన్లని వాడుతున్న వారికి ఇలా ఫోన్లో వచ్చిన కాల్స్ మెసేజ్‌లు, ఇతర నోటిఫికేషన్లని పొందడానికి 'పుష్ బుల్లెట్' అనే యాప్ ఉంటుంది. దీన్ని ఫోన్లో ఇన్‌స్టాల్ చేసుకుంటే.. మీ వైఫై నెట్‌వర్క్ ఆధారంగా ఫోన్‌ని నేరుగా మీ పిసి నుండే కంట్రోల్ చేసుకోవచ్చు.. మెసేజ్‌లను చదవొచ్చు, వాటికి రిప్లైలు ఇవ్వొచ్చు. అలాగే శాంసంగ్ ఫోన్లు వాడుతున్న వారు 'సైడ్ సింక్' అనే ప్రత్యేకమైన సాఫ్ట్‌వేర్‌ని పిసిలో ఇన్‌స్టాల్ చేసుకోవడం ద్వారా మీ ఫోన్ స్క్రీన్‌ని యధాతథంగా కంప్యూటర్ మీద చూడొచ్చు. నేరుగా కంప్యూటర్ మీదే ఆపరేట్ చేయొచ్చు. వీటితో పాటు 'ఎయిర్‌డ్రాయిడ్' అనే యాప్‌ని వాడడం ద్వారా కూడా మీ ఫోన్లోని ఫొటోలు, వీడియోలు, మెసేజ్‌ల వంటి వాటిని నేరుగా కంప్యూటర్ నుండి వాడుకోవచ్చు. దాదాపు వీటిలో అన్నీ ఉచితంగానే లభిస్తుంటాయి. అదనపు ఆప్షన్లు కావాలంటే కొంత మొత్తం చెల్లించి పెయిడ్ వెర్షన్ కొనుగోలు చేయాల్సి ఉంటుంది.

ఆండ్రాయిడ్ ఫోన్లలో పార్టీషన్లా?

ఆండ్రాయిడ్ ఫోన్లలో రకరకాల పార్టీషన్లు ఉంటాయంటారు, వాటి గురించి చెప్తారా?

- రామకృష్ణ, నెల్లూరు



మన ఫోన్లో ఇంటర్నల్ స్టోరేజ్‌లో బూట్, సిస్టమ్, రికవరీ, డేటా, క్యాచే, మిస్‌లీనియస్ అనే వేర్వేరు పార్టీషన్లు ఉంటాయి. బూట్ అనే పార్టీషన్లో కెర్నల్, ర్యామ్ డిస్క్ ఉంటారు. ఫోన్ బూట్ అవడానికి ఇది అవసరం అవుతుంది. ఈ పార్టీషన్ లేకపోతే ఫోన్ బూట్ కూడా అవదు. ఇక సిస్టమ్ అనే పార్టీషన్‌లో మొత్తం ఆపరేటింగ్ సిస్టమ్ నిక్షిప్తమై ఉంటుంది. ఫోన్ ఆన్ చెయ్యగానే మనకు కన్పించే హోమ్ స్క్రీన్, ఫోన్లో ఇన్‌స్టాల్ చెయ్యబడి ఉండే డీఫాల్ట్ అప్లికేషన్ల లాంటివన్నీ దీనిలోనే ఉంటాయి. రికవరీ మోడ్‌లోకి వెళ్లి ఈ సిస్టమ్ పార్టీషన్‌ని చెరిపి వేసి కొత్త 'రామ్' లను ఇన్‌స్టాల్ చేసుకోవచ్చు. పార్టీషన్లని చెరిపి వేయడానికీ, కొత్త రామ్‌లను ఫ్లాష్ చేయడానికీ, ఇతర అడ్వాన్స్‌డ్ పనులను చెయ్యడానికి రికవరీ పార్టీషన్ అనేది అవసరం అవుతూ ఉంటుంది. ఇక మనం ఫోన్లో ఇన్‌స్టాల్ చేసుకునే ఫేస్‌బుక్, వాట్సప్ వంటి యాప్స్ అన్నీ 'డేటా' అనే పార్టీషన్‌లో సేవ్ అవుతాయి. మనం వివిధ యాప్స్‌ని ఓపెన్ చేసి క్లోజ్ చేసేటప్పుడు టెంపరరీ డేటా మొత్తం క్యాచే అనే పార్టీషన్‌లో భద్రపరచబడుతుంది. వివిధ రకాల సిస్టమ్ సెట్టింగులు 'మిస్‌లీనియస్' అనే పార్టీషన్‌లో ఉంటాయి.

మీ టెక్ సందేహాలకు సమాధానాల కోసం navya@andhrajyothy.com

లైఫ్ లెసన్





జీవితమే ముళ్ల కిరీటం!

పట్టుకునే కొద్దీ గుప్పిటలోంచి జారిపోయేదే విజయం. క్లియోపాత్ర జీవితమే అందుకు ఉదాహరణ.

ఈజిప్టులో క్రీ. పూ. 69లో రాజవంశంలో పుట్టింది క్లియోపాత్ర. ఆమె తండ్రి ఈజిప్టు రాజు 12వ టాలెమీ. ఓసారి రోమన్లు టాలెమీని బందీ చేసి ఈజిప్టుని ఆక్రమించారు. దాంతో అతని పెద్ద కూతురు, క్లియోపాత్ర అక్క - బెరినైస్ - రోమన్ల కాళ్లు పట్టుకొని సామంతరాణి అయ్యింది.

తాను నాన్నను మోసం చేసినట్లు తన చెల్లెలు తనకు పక్కలో బల్లెమవుతుందేమోనని బెరినైస్‌కి భయం. అందుకే సోదరిని అంతఃపురానికి కట్టిపడేసి కట్టుదిట్టం చేసింది. అంతలో రోమన్ల భిక్షతో టాలెమీ తిరిగి రాజయ్యాడు. గద్దె ఎక్కుతూనే పెద్ద కూతురు తలని అడ్డంగా నరికించాడు.

అప్పటికి క్లియోపాత్ర వయసు 15 ఏళ్లు.

తన కళ్లెదుటే - తండ్రి - అక్కల మధ్య సాగిన రాజకీయ చదరంగాన్ని కళ్లారా చూసింది. భయపడలేదు. తానెప్పుడు రాణి అవుతానా అని కలలు కంది. తండ్రి ముందు మాత్రం తనకు ఆ ఆలోచనే లేనట్లు నటించింది. లేకుంటే అక్కకు పట్టిన గతి తనకూ తప్పదు. కానీ అదను కోసం ఎదురు చూసింది.

అప్పట్లో రోమన్‌సైన్యం ఈజిప్టులో కవాతు చేసేది. ఆ సమయంలోనే రోమన్ యోధుడు, కండలు తిరిగిన వీరుడు, అందగాడు మార్క్ ఆంటోనిని ప్రేమించింది- క్లియోపాత్ర. కానీ తన మనసు విప్పి చెప్పే సందర్భం మాత్రం రాలేదు.

అప్పటికి క్లియోపాత్ర వయసు 16.

క్రీ.పూ. 51లో 12వ టాలెమీ మరణించాడు. రాణి కావడానికి క్లియోపాత్రకి మార్గం క్లియరైంది. కానీ ఏం లాభం? రోమన్ల సామంత రాణిగా అధికారపీఠం ఎక్కాలి, పైగా తన తమ్ముడు 13వ టాలెమీని పెళ్లి చేసుకొని పాలనా పగ్గాలు ఇవ్వాలి. అది ఆనాటి ఈజిప్షియన్ రాజవంశ ఆచారం. తమ రక్తం కలుషితం కాకూడదని వారు అక్కా - తమ్ముళ్ల పెళ్లిళ్లు చేసుకొనేవారు. సింహాసనాన్ని మరొకరితో పంచుకోవడం క్లియోపాత్రకి నచ్చలేదు. తమ్ముడు తమ్ముడే. ఆట ఆటే.

అప్పటికి క్లియోపాత్ర వయసు 18.

తమ్ముణ్ణి వివాహమాడి తాను రాణై, అతడు రాజై పాలన ప్రారంభించింది. కానీ పెత్తనమంతా తనదే కావాలి. అందుకే

తమ్ముణ్ని నిర్దాక్షిణ్యంగా అణచివేసింది. ఈజిప్టు అంతా తనకే కావాలి. అందుకే రోమన్లపైనే ఎదురు తిరిగింది. కానీ ఇది కాస్తా బెడిసికొట్టింది. 2 వేల గుర్రాల రోమన్ సైనిక దళాలు క్లియోపాత్రను గద్దెదించాయి. పైగా తమ్ముడికి సకల అధికారాలూ అందాయి.


> తన కళ్లెదుటే - తండ్రి - అక్కల మధ్య సాగిన రాజకీయ చదరంగాన్ని కళ్లారా చూసింది. భయపడలేదు. తానెప్పుడు రాణి అవుతానా అని కలలు కంది. తండ్రి ముందు మాత్రం తనకు ఆ ఆలోచనే లేనట్లు నటించింది. లేకుంటే అక్కకు పట్టిన గతి తనకూ తప్పదు. కానీ అదను కోసం ఎదురు చూసింది.

అనుకొన్నది ఒకటి... అయ్యింది మరొకటి.

ఇపుడామె బానిసగా బతకాలి. అదామెకి నచ్చలేదు. దాంతో తన అనుచరులతో కలిసి ఈజిప్టుని వదిలి పారిపోయింది. రాజ్యాన్ని భోగాన్ని వదిలి ఎడారుల్లో, ఎర్రసముద్ర తీరంలో, కొండల్లో, లోయల్లో భీకర వాతావరణంలో తిండి తిప్పలు లేకుండా గడిపింది. ఓటమిని అంగీకరించే వ్యక్తికాదామె. నెగ్గడం కోసం అవసరమైతే తగ్గాలి. అందుకే నేరుగా రోమన్ అధినేత జులియస్ సీజర్‌నే పట్టుకోవాలనుకొంది. కానీ ఎలా? ఓ పన్నాగంవేసింది.

తన సహచరులను ఓ అందమైన తివాచీ తెమ్మంది. అందులో ఆమె పడుకొంది. చాపలా అందులో తనను చుట్టమంది. జులియస్ సీజర్ వద్దకు తీసుకెళ్లి నేలపై తివాచీని ఉంచమంది. అంతే - ఒక్కో పొరనూ విప్పుకొంటూ సీజర్ కాళ్లదగ్గర పడింది మోకాళ్లపై మోకరిల్లింది. ఆ సౌందర్యరాశిని చూసేసరికి సీజర్ పరవశుడైపోయాడు. ఆమె అందానికి బానిసైపోయాడు. ఆమె చెప్పిన మాటలకు తల ఆడించాడు. టాలెమీ యుద్ధం ప్రకటించాడు. అలా తన తమ్ముడు అలియాస్ భర్త ఓడిపోయేలా, చివరకు మరణించేలా చేసింది క్లియోపాత్ర. అప్పటికి క్లియోపాత్ర వయసు 22. ఇప్పుడు ఆమె ఈజిప్టు అధినేత్రి. సామంతరాణి కాదు. రోమన్ చక్రవర్తి సీజర్‌కి సహచరరాణి, భార్య కూడా! అప్పుడే తెలుసుకొంది. తన తొలి ప్రియుడు ఆంటోనీ ఎవరో కాదు - తన భర్త సీజర్‌కి కుడి భుజం అని! క్రీ. పూ. 44లో సీజర్‌ని కుట్రదారులు చంపేశారు. రోమన్ ప్రాంతానికి ఆంటోనీ రాజయ్యాడు. సైనిక సాయం కావాలంటూ ఈజిప్టు రాణి క్లియోపాత్రాకి కబురంపాడు. 14 ఏళ్ల కిందటి తన ప్రియుడు - తనంతట తానే స్నేహహస్తం సాచాడు. అందుకే మెరిసిపోతున్న వెండి రంగు తెడ్లతో, సువర్ణ తాపడాలతో, జిగేల్‌మనే అలంకరణలతో, సంగీత మేళాలతో, లెక్కలేనన్ని బహుమతులతో, పిల్లంగ్రోవి వాద్యకారులతో కూడిన ఓడలో వెళ్లింది. ఓడదిగి రతీదేవిలా నడిచి ఆంటోని ఎదుట నిలిచింది.

రెప్పపాటు కాలంలో ఆమెకు పరవశుడైపోయాడు. జీవితాంతమూ ఆమెకు బానిసైపోయాడు. ఆ ఆనందం ఎక్కువ రోజులు లేదు. ఆంతరంగిక శత్రువులు ఆంటోనీపై పగబట్టారు. చేసేది లేక ఆంటోని కత్తితో తనను తాను పొడుచుకొని - రక్తపు ధారలతో ప్రియురాలి కడకు చేరాడు ఆమె ఒడిలో కన్నుమూశాడు. ప్రియుడు లేనిదే జీవితం లేదనుకొంది. తాచుపాముచే తన వక్షస్థలంపై కాటు వేయించుకొని కన్నుమూసింది - క్లియోపాత్ర. అప్పటికి ఆమె వయసు 39. అలసట తప్ప ఏం మిగిలింది క్లియోపాత్రకి-!



● ఆకెళ్ల రాఘవేంద్ర

అవునా!

ఆ గది.. 68 ఏళ్ల సీక్రెట్!

అమెరికాలోని ఓ ప్రాంతం..... అందరూ ఉదయం నిద్ర లేచే టైమ్ సమయం అది. బ్రిటనీ బుష్ కూడా ఇంకా నిద్రావస్థలోనే ఉంది. 'ధబ్' అని శబ్దం. వారి కార్ గ్యారేజ్ నుంచి వచ్చిందది. అమెరికన్ల ఇళ్లల్లో ఇలాంటి గ్యారేజ్‌లు సాధారణమే! వెంటనే పరిగెత్తారు. ఏమైందా అని చూస్తే, నేల అంతా బద్దలై ఉంది. కిందేమో మరో గది... ఏవేవో సామాన్లు. హాలీవుడ్ సినిమాల్లో చూస్తూ ఉంటాం కదా! ఇందులో అంత వింతేముందని అనుకోవచ్చు. కానీ, అసలు విషయమేమిటంటే ఇది ఉన్నట్లు యజమానులకు తెలీదు. వారికి ఇల్లు అమ్మిన రియల్ ఎస్టేట్ ఏజెంట్లకూ తెలీదట. ఇంటి డాక్యుమెంట్లలో ఏమైనా మిస్ అయ్యామా? అని వెతికితే అసలు ఆ గది గురించి ప్రస్తావనే లేదట! అందులో హెయిర్ బ్రష్‌లు, పిల్లల ఆటవస్తువులు ఉన్నాయి. మొత్తం అంతా గందరగోళంగా ఉంది. అన్నట్లు ఓ ఉత్తరం కూడా ఉందండోయ్! ఈ ఇంటిని 1950లో నిర్మిస్తే, 70వ దశకంలో రీమోడలింగ్ చేశారు. అప్పుడు కూడా ఈ రహస్యం బయటపడలేదట.

ఇంకో విషయం, ఈ రహస్య గది కింద మరొకటి ఉండచ్చని అనుమానిస్తోంది బుష్ ఫ్యామిలీ. ప్రస్తుతం గ్యారేజ్‌ను శుభ్రం చేసే పనిలో కుటుంబసభ్యులు నిమగ్నమై ఉన్నారు.







జీపీఎస్... నిండాముంచింది!

"ఇన్ 400 మీటర్స్ టర్న్ రైట్, 'ఎగ్జిట్ ది రౌండ్ ఎబౌట్'... ఇలా మ్యాప్‌లో 'గూగుల్ తల్లి' చెబుతూ ఉంటే దూసుకెళ్లిపోవడం ఇప్పటి ట్రెండ్! మ్యాప్స్‌లోకి వెళ్లి సోర్స్, డెస్టినేషన్ టైప్ చేయడం నేవిగేషన్ ఆన్ చేయడం... ఇక ఎవర్నీ అడిగే పనిలేదు. ఎక్కడికి వెళ్లాలన్నా ఇప్పుడు జీపీఎస్ కావాల్సిందే! అంతలా దాని మీద ఆధారపడిపోయాం! సరిగ్గా వాషింగ్టన్‌కు చెందిన ముగ్గురు స్నేహితులూ ఇదే ఆలోచించి తప్పులో..సారీ నీళ్లల్లో కాలేశారు. విషయమేమిటంటే, ఈ ముగ్గురూ లాంగ్ రైడ్‌కు వెళదామనుకున్నారు. అందుకే తెలిసిన వ్యక్తి నుంచి ఎస్‌యూవీ కారును తీసుకొని ప్రయాణాన్ని ప్రారంభించారు. నేవిగేషన్ ఆన్ చేశారు. రయ్‌మని వెళుతున్నారు. రైట్, లెఫ్ట్ ఇలా ఏం చెబుతున్నా మరో ఆలోచన లేకుండా స్టీరింగ్ తిప్పేస్తున్నాడు డ్రైవర్ ఏమాత్రం సందేహం లేకుండా! అలాగే ఫాలో అయిపోయి, కారును ఓ సరస్సులోకి తీసుకెళ్లిపోయాడు. అసలే చలికాలం. నీటిలో చెయ్యిపెడితే ఐస్ అయిపోవడం ఖాయం. వాళ్ల అదృష్టం కొద్దీ కారు పూర్తిగా మునిగిపోలేదు. ఆ ముగ్గురికీ ఏమీ కాలేదు. బతుకుజీవుడా! అనుకుంటూ బయటపడ్డారు. సో... జీపీఎస్‌ను గుడ్డిగా నమ్మకూడదని ఈ ఘటన రుజువు చేసింది. ఇది జరిగిన వారం రోజుల తర్వాత కారును సరస్సులోంచి వెలికి తీయడంతో ఈ వార్త ప్రపంచానికి తెలిసింది. ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న అంశాల్లో ఇదొకటి!

కౌన్సెలింగ్ కార్నర్

మధుమేహం పూర్వీకులకు ఉంటే వచ్చేస్తుందా?



- డి. క్రాంతికుమార్, రాజమండ్రి

● డాక్టర్ పి.సరస్వతి

నవ్య సకల

నువ్వున్న చోటే నేను



నవ జీవన గీతం



● బమ్మెర

డైలీ సుడోకు - 90

		1		7		3	9	
9					2			
	2		4	3		5		
			8	2				
7		8				4		6
				4	6			
		5		1	4		7	
			5					4
	9	3		8		6		


ఎలా పూరించాలి?

ప్రతి బాక్స్‌లోనూ 9 గళ్లు ఉంటాయి.

నిలువుగానూ, అడ్డంగానూ ప్రతి లైనులోనూ 1 నుంచి 9 వరకు అంకెలను పూరించాలి.

ఒకసారి పూరించిన అంకెను తిరిగి వాడకూడదు.

సుడోకు- 89 సమాధానం



ఇంట్లో చేయండి!

వైఫై నెట్‌వర్క్ చోరీ అవుతోందా?



టెక్ టిప్

ఫోన్ వాడటం తగ్గించాలంటే!



టెక్ ఈజీ

ఇక పేటీఎం డెబిట్ కార్డులు



నయా గ్యాడ్జెట్

ఆటాడేస్తున్న 'ఎక్స్‌బాక్స్ ఒన్ ఎక్స్'



నయా ఫీచర్

డాటా రికవరీకి బ్యాకప్ ఫైల్

ఇలా చేయాలి!



నవ్య చిత్రజ్యోతి
ఆంధ్రజ్యోతి
సోమవారం • 29 జనవరి 2018


లావణ్య త్రిపాఠి, సాయిధరమ్‌తేజ్, ప్రభాస్, వినాయక్

ఎక్కడికి పిలిస్తే అక్కడికి వస్తా

- ప్రభాస్

"నా లైఫ్‌లో 'యోగి' సినిమాకు ఎంజాయ్ చేసినట్లు ఏ సినిమాకూ ఎంజాయ్ చెయ్యలేదు. వినాయక్‌గారు కష్టం తెలియకుండా పనిచేయిస్తారని రాజమౌళిగారితో చెప్పా. సక్సెస్ కావాలంటే సుఖానికి అలవాటు పడకూడదు.. కష్టపడాలి" అని ప్రభాస్ అన్నారు. సాయిధరమ్ తేజ్ కథానాయకుడిగా వి.వి.వినాయక్ దర్శకత్వం వహిస్తున్న 'ఇంటిలిజెంట్' చిత్రంలో మొదటి పాటను ఆదివారం ప్రభాస్ విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ "చిరంజీవిగారి 'చమక్కు చమక్కు చాం' పాటంటే నాకు చాలా ఇష్టం. ఆయన పాటల్లో ది బెస్ట్ సాంగ్ అది. ఆ పాటకు సాయిధరమ్ తేజ్ ఎలా డాన్స్ చేశాడో అని ఎదురుచూస్తున్నా. టీజర్ విడుదల కోసం వినాయక్‌గారు మోహమాటంగా అడిగారు. ఆయన ఒక్క మెసేజ్ పెడితే ఎక్కడికంటే అక్కడికి వచ్చేస్తా. ఈ చిత్రం ఆయనకు పెద్ద హిట్ కావాలి" అని అన్నారు. వినాయక్ మాట్లాడుతూ "స్నేహానికి నిలువెత్తు నిదర్శనం ప్రభాస్. అతనిలాంటి వ్యక్తి పరిశ్రమలో ఉండటం చాలా అరుదు. నేను ఎవర్నీ ఏదీ అడగను, ప్రభాస్‌కి ఫోన్ చేసిన విషయం చెప్పగానే 'ఎక్కడికి రమ్మంటే అక్కడికి వస్తా' అని... వెంటనే రావడం, టీజర్‌లో తేజుని చూసి చిరంజీవిగారిలా ఉన్నాడని అంటుంటే చాలా ఆనందంగా ఉంది" అని అన్నారు. "లెట్స్ డు... పాటను ప్రభాస్ చేతుల మీదుగా విడుదల చెయ్యడం ఆనందంగా ఉంది. వచ్చే నెల 9న సినిమాను విడుదల చేస్తాం" అని నిర్మాత సి.కల్యాణ్ అన్నారు. సాయిధరమ్ తేజ్, లావణ్య త్రిపాఠి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

రాత ఎలా ఉంటే అలాగే జరుగుతుంది

- మోహన్‌బాబు


లక్ష్మీ మంచు, శ్రియ, విష్ణు, సుబ్బిరామిరెడ్డి, నిర్మల, మోహన్‌బాబు, మదన్

డా.మోహన్‌బాబు కీలక పాత్ర పోషిస్తూ, లక్ష్మీప్రసన్న పిక్చర్స్ పతాకంపై నిర్మించిన చిత్రం 'గాయత్రి'. విష్ణు, శ్రియ జంటగా నటించారు. మదన్ రామిగాని దర్శకుడు. ఎస్.ఎస్.తమన్ సంగీతం అందించారు. ఆదివారం హైదరాబాద్ లో పాటల్ని విడుదల చేశారు. మోహన్‌బాబు ఆడియో సీడీలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ "సినిమా అనేది కష్టమైన వ్యాపారం. కష్టపడి తియ్య డం వరకే మా పని. జయాపజయాలు భగవంతుడి రాతను బట్టి ఉంటాయి. మాకు తెలిసిన వ్యాపారం ఇదొక్కటే. సినిమా 'ఇలా తీశాం.. అలా తీశాం' అనే మాటలు లేకుండా ఎంత సౌమ్యంగా ఉంటే అంత అనుగ్రహం భగవంతుడి నుంచి లభిస్తుంది. విర్రవీగినప్పుడు మాత్రం దేవుడు ఒక్క తొక్కు తొక్కుతాడు. ఇన్నేళ్ల కెరీర్‌లో ఎన్నో ఎత్తుపల్లాలు చూశాను. విజయం వచ్చినప్పుడు విర్రవీగలేదు. అపజయం వచ్చినప్పుడు కుంగిపోలేదు. ఐదు సినిమాలు హిట్టై ఒక్క సినిమా ఫ్లాప్ అయితే ఆ అయిదు సినిమాల క్రెడిట్ పోతుంది. నాకు సినీ జీవితాన్ని ప్రసాదించిన దాసరి నారాయణరావుగారు నా చేత ఎన్నో పాత్రలు చేయించారు. ఆయనెంత గొప్ప దర్శకుడో ఈ జనరేషన్‌కు తెలీదు. ఆయన నేర్పించిన డైలాగ్‌లతోనే శభాష్ అనిపించుకుంటున్నా. ఎన్టీఆర్‌గారి తర్వాత అంత గొప్పగా డైలాగ్ చెప్పగలిగిన నటుడు మోహన్‌బాబు అన్న గుర్తింపు నాకు వచ్చిందంటే ఆ క్రెడిట్ దాసరిగారికే దక్కుతుంది. నాకు క్రమశిక్షణ అంటే నాకు ప్రాణం. అన్నీ టైమ్‌కి జరగాలనుకుంటా. మనమంతా కూలీలం. అందుకే సమయపాలన పాటించాలి. ఇక సినిమా విషయానికొస్తే... మదన్ బాగా తీశాడు. అయినప్పటికీ చాలామంది దర్శకులకు ఒకటికి పదిసార్లు చూపించి, అవసరమైన చోట రీషూట్ చేసి మంచి సినిమాగా మలిచాం. సర్వేశ్ మురారి ఫొటోగ్రఫీ, రత్నబాబు డైలాగ్‌లు హైలైట్‌గా నిలుస్తాయి. నాకు మంచి హిట్ ఇచ్చేందుకు టెక్నీషియన్లు అంతా చాలా కష్టపడ్డారు. నాతో యాక్ట్ చెయ్యడం చాలా కష్టం. ఇందులో ఫ్లాష్‌బ్యాక్ సీన్‌లో నటించే టప్పుడు ఎక్కడా డౌన్ కాకుండా విష్ణు నాతో సమానంగా యాక్ట్ చేశాడు. అతని నటనలో ఏమాత్రం తేడా కనిపిం చినా ఆ సీన్ మొత్తం పాడైపోయేది. విష్ణు, శ్రియ కంట తడిపెట్టించేలా నటించారు. శ్రియ పోషించిన పాత్రను ఈ జనరేషన్‌లో ఏ హీరోయిన్ చెయ్యలేదు. తమన్ పాటలు ఆకట్టుకుంటాయి. వచ్చే నెల 9న సినిమాను విడుదల చేస్తాం" అని అన్నారు. "ఇందులో కీలకమైన పాత్ర పోషించా. మొదట ఆ పాత్రకు నన్ను అనుకోలేదు. చివరకు మంచి పాత్ర నాకు దక్కింది" అని విష్ణు తెలిపారు. గిరిబాబు, కోట శ్రీనివాసరావు, తనికెళ్ల భరణి, బి.గోపాల్, బ్రహ్మానందం, వరప్రసాద్, టి.సుబ్బిరామిరెడ్డి, రఘురామరాజు, చాముండీశ్వరీనాథ్, లక్ష్మీప్రసన్న, శ్రియ, మనోజ్, అనసూయ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.


అమీ జాక్సన్

రోజ్... రోజ్... రోజా పువ్వా!

రోజా పువ్వు ఎవరు? రాఘవేంద్రరావు తీసిన 'అల్లరి ప్రియుడు'లో అయితే రమ్యక్రిష్ణే. రియల్ లైఫ్‌లో మాత్రం బ్రిటన్ బ్యూటీ అమీ జాక్సన్ అలవాట్లు వింటే రోజా పువ్వు అనాల్సిందే. రోజ్ ఫ్లేవర్డ్‌ఫుడ్ ఏదైనా అమీ ముందుంచితే చిటికెలో గుటుక్కుమని లాగించేస్తారు! "ఏదైనా... రోజ్ ఫ్లేవర్డ్‌లో ఉన్నది ఏదైనా నాకిష్టమే" అంటున్నారామె. అంతే కాదు... ఆమె గురించి ఎవరికీ తెలియని ఇంకో రెండు విషయాలు చెప్పారు. "నా చిన్నప్పుడు హాలీవుడ్ హీరో 'రాక్' అంటే పడి చచ్చేదాన్ని. అతడిపై నాకు క్రష్ ఉండేది. అలాగే, నాకు సఫారీలో సవారీ ఎంతిష్టమో! నేనెంత బిజీగా ఉన్నప్పటికీ ఏడాదిలో ఒక్కసారైనా సఫారీ సవారీకి వెళ్లాల్సిందే" అని అమీ పేర్కొన్నారు. సినిమాల విషయానికి వస్తే... రజనీకాంత్ సరసన అమీ నటించిన '2.ఓ' ఏప్రిల్‌లో ప్రేక్షకుల ముందుకు రానుంది.


కృష్ణంరాజు, శ్రీకాంత్

జనాలతో జాగ్రత్త!

శ్రీకాంత్, యజ్ఞశెట్టి జంటగా కరణం బాబ్జీ దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'ఆపరేషన్ 2019'. బివేర్ ఆఫ్ పబ్లిక్ అన్నది ఉపశీర్షిక. అలివేలు నిర్మాత. ఇటీవల ఈ చిత్రం ట్రైలర్ ను కృష్ణంరాజు విడుదల చేశారు. 'ఆపరేషన్ దుర్యోధన' చిత్రంలా ఈ సినిమా కూడా పెద్ద హిట్ కావాలి' అని ఆయన అన్నారు. శ్రీకాంత్ మాట్లాడుతూ "మెంటల్ పోలీస్' తర్వాత కరణం బాబ్జీతో చేస్తున్న రెండో చిత్రమిది. రాజకీయ నేపథ్యంలో సాగే కథ. చక్కని పాటలు కుదిరాయి" అని అన్నారు. "ఫిబ్రవరి 6 వరకూ చేసే షెడ్యూల్‌తో షూటింగ్ పూర్తవుతుంది" అని దర్శకనిర్మాతలు చెప్పారు.

పల్లెటూరి పిల్లగాడు


నారా రోహిత్

పల్లెటూరి పిల్లగాడిగా నారా రోహిత్ కనిపించనున్నారు. ఆయన హీరోగా ఈ.ఎం.వి.ఈ స్టూడియోస్ పతాకంపై కొత్త చిత్రం రూపొందనుంది. ఎస్.డి.చక్రవర్తి దర్శకుడిగా పరిచయం కానున్నారు. మార్చి నుంచి రెగ్యులర్ షూటింగ్ ఉంటుంది. వడ్డేపల్లి సత్యనారాయణ సమర్పిస్తున్నారు. నారా రోహిత్ పాత్ర చిత్రణ, గెటప్ టిపికల్‌గా ఉంటాయని దర్శకుడు చెప్పారు. "ప్రస్తుతం మా 'హౌరాబ్రిడ్జి' విడుదల పనుల్లో బిజీగా ఉన్నాం. అవి పూర్తికాగానే ఈ సినిమాకు సంబంధించిన నటీనటులను, సాంకేతిక నిపుణులను వెల్లడిస్తాం" అని సమర్పకుడు అన్నారు.

మిల్కీబ్యూటీకి చేదు అనుభవం




సినీ నటి తమన్నాకు చేదు అనుభవం ఎదురైంది. హైదరాబాద్‌లోని నారాయణగూడలో ఆదివారం ఓ జ్యువెలరీ షోరూమ్ ప్రారంభోత్సవానికి తమన్నా వెళ్లారు. ఆమె అభిమానులతో సెల్ఫీ తీసుకుంటున్న తరుణంలో అక్కడ గుమిగూడిన జనాల నుంచి ఒక యువకుడు ఆమెపై బూటు విసిరాడు. అయితే అది తమన్నాకు కాకుండా పక్కనున్న సేల్స్‌మ్యాన్‌కు తగిలింది. బూటు విసిరిన వ్యక్తిని ముషీరాబాద్‌కి చెందిన కరీముల్లాగా గుర్తించారు. పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకుని విచారించారు. తాను తమన్నాకు వీరాభిమానినని, ఆమె తెలుగులో సినిమాలు చేయడం లేదనే కోపంతో ఇలా చేశానని కరీముల్లా చెప్పినట్టు సమాచారం.

ఎందుకు? ఏమిటి?


నందు, పునర్నవి

నందు, నోయల్, పునర్నవి కీలక పాత్రధారులుగా రూపొందుతున్న చిత్రం 'ఎందుకో ఏమో'. కోటి వద్దినేని దర్శకత్వంలో మాలతి వద్దినేని నిర్మిస్తున్నారు. ఆదివారం వి.వి.వినాయక్ చేతుల మీదుగా ఈ చిత్రం ట్రైలర్‌ను విడుదల చేశారు. దర్శకుడు మాట్లాడుతూ "కమర్షియల్ హంగులతో తెరకెక్కిన ట్రయాంగిల్ లవ్‌స్టోరీ ఇది. ప్రస్తుతం సెన్సార్ కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఫిబ్రవరి మొదటివారంలో పాటల్ని, నెలాఖరులో సినిమాను విడుదల చేస్తాం" అని అన్నారు.

కుటుంబ కథతో...


హేమలత

శ్రీకాంత్, హేమలత జంటగా సుహాసిని, సుమన్, భానుచందర్ కీలక పాత్రధారులుగా వి.ఎస్.ఫణీంద్ర దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'నిన్నే చూస్తూ'. హేమలతా రెడ్డి నిర్మాత. హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో రెండో షెడ్యూల్ జరుగుతోంది. "చక్కని కుటుంబ కథతో రూపొందుతున్న చిత్రమిది. సుహాసిని, సుమన్, భానుచందర్‌గారి పాత్రలు కీలకం. త్వరలో సినిమాను విడుదల చేస్తాం" అని నిర్మాత తెలిపారు.

2018 ఆస్కార్స్

జయహో మహిళ!


మేరీ జే. బ్లిజ్


రాచెల్


మహిళలకు ఏం తక్కువ! దర్శకత్వం చేయలేరా? కెమెరా కంటితో చిత్రాన్ని చూడలేరా? మగవాళ్లే ఆ పనులు చేయగలరా? ఎప్పుడూ ఆ అవార్డులు వాళ్లే అందుకోవాలా? 'మేమూ అందుకుంటాం... మాలోనూ ప్రతిభ ఉంద'ంటూ 2018 ఆస్కార్స్‌లో కొందరు మహిళలు పోటీ పడుతున్నారు. మరికొందరు చరిత్ర సృష్టించడానికి సిద్ధమవుతున్నారు. వారితో పాటు అరుదైన ఘనతకు సిద్ధమవుతోన్న వ్యక్తులూ.. వారి వివరాలు


గ్రెటా గ్రేవిగ్

- ఛాయాగ్రహణం విభాగంలో నామినేషన్ అందుకున్న తొలి మహిళ రాచెల్ మెర్రిసన్ ('మడ్‌బౌండ్'). ఓ సూపర్‌హీరో చిత్రానికి 'బెస్ట్ అడాప్టెడ్ స్క్రీన్‌ప్లే' విభాగంలో నామినేషన్ రావడం ఇదే తొలిసారి. 'లోగన్'కి ఆ ఘనత దక్కింది. డీ రీస్ ఇదే విభాగంలో నామినేషన్ దక్కించుకున్న తొలి నల్లజాతీయురాలిగా చరిత్ర సృష్టించారు.
- సహాయ నటి, ఒరిజినల్ సాంగ్ విభాగాల్లో ఒకే ఏడాది, ఒకే చిత్రాని (మైటీ రివర్)కి నామినేషన్ సాధించిన వ్యక్తిగా, మహిళగా మేరీ జే. బ్లిజ్ చరిత్ర సృష్టించారు.


మెరిల్ స్ట్రీప్

- ఫస్ట్ ఫీచర్ ఫిల్మ్‌కి రచన, దర్శకత్వం, చిత్రం విభాగాల్లో నామినేషన్ అందుకున్న మూడో వ్యక్తి జోర్డాన్ పీలే ('గెట్ అవుట్'). ఈ ఘనత సాధించిన తొలి నల్లజాతీయుడు కూడా! ఈయన ఆఫ్రో-అమెరికన్.
- ఆస్కార్ చరిత్రలో ఉత్తమ దర్శకత్వం విభాగంలో నామినేషన్ అందుకున్న ఐదో మహిళ గ్రెటా గ్రేవిగ్ ('లేడీ బర్డ్'). జోర్డాన్ పీలే ('గెట్ అవుట్') ఐదో నల్లజాతీయ దర్శకుడు.
- ఓ మహిళ దర్శకత్వం వహించిన చిత్రం ఉత్తమ విభాగంలో పోటీ పడడం ఇది పదమూడోసారి! ఆ చిత్రం పేరూ... 'లేడీ బర్డ్'యే.
- సహాయ నటిగా ఆక్టావియా స్పెన్సర్ ఇప్పటివరకూ అందుకున్న ఆస్కార్స్ నామినేషన్స్ సంఖ్య మూడు. ఆల్రెడీ ఈమెకు ఒక ఆస్కార్ ('ది హెల్ప్'కి) వచ్చింది.
- 'ది పోస్ట్' చిత్రంలో నటనకు గాను ఉత్తమ నటి విభాగంలో పోటీ పడుతున్న మెరిల్ స్ట్రీప్‌కి ఇది 21వ నామినేషన్. ఎక్కువ నామినేషన్స్ సాధించిన మహిళ ఆమె. గత 20 నామినేషన్స్‌లో రెండుసార్లు నటిగా, ఒకసారి సహాయనటిగా ఆస్కార్స్ అందుకున్నారు.
- 'కాల్ మి బై యువర్ నేమ్' హీరో తిమోతీ చల్మెట్ ఉత్తమ నటుడిగా ఆస్కార్ అందుకుంటే... అతిపిన్న వయసులో ఈ ఘనత సాధించిన నటుడిగా చరిత్ర సృష్టిస్తాడు. ఇప్పుడతని వయసు 22 ఏళ్లు. సహాయ నటుడిగా నామినేషన్ సాధించిన అత్యధిక వయస్కుడు క్రిస్టోఫర్ ప్లమ్మర్. 88 ఏళ్ల వయసులో ఆయన ఈ విభాగంలో పోటీ పడుతున్నారు.


'లోగన్'లో ఓ దృశ్యం

సంగీతమే నా ప్రపంచం


మహతి స్వరసాగర్

"నేను కంపోజ్ చేసిన పాటల్ని ప్రేక్షకులు మళ్లీ మళ్లీ వినాలి, పదే పదే పాడుకోవాలన్నదే నా ఆశ. ఆ లక్ష్యంతోనే స్వరాలందిస్తున్నాను. అందులో భాగమే 'ఛలో' పాటలు" అని మణిశర్మ తనయుడు మహతి స్వరసాగర్ అన్నారు. నాగశౌర్య, రష్మిక మండన్నా జంటగా నటించిన 'ఛలో' చిత్రానికి ఆయన సంగీతం అందించారు. వెంకీ కుడుముల దర్శకత్వంలో ఉషా మల్పూరి నిర్మించిన ఈ చిత్రం వచ్చే నెల 2న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా సంగీత దర్శకుడు మహతి స్వరసాగర్ శనివారం విలేకర్లతో మాట్లాడారు. ఆ విశేషాలివి...

'ఛలో' సినిమాలో 'చూసీ చూడంగానే' పాటను అందరూ నచ్చిందంటున్నారు. మిగిలిన పాటలకు స్పందన బావుంది. ఈ చిత్రంతో అవకాశాలు పెరుగతాయనే నమ్మకం ఉంది. అన్ని రకాల చిత్రాలకు సంగీతం ఇవ్వగలను. పర్సనల్‌గా ప్రేమ కథాచిత్రాలకు సంగీతం ఇవ్వడం ఇష్టం. ప్రోగ్రామర్‌గా చాలా సినిమాలకు పనిచేశా. నాన్నగారితోపాటు కీరవాణి గారు, కల్యాణి మాలిక్‌గారు వంటి సంగీత దర్శకుల దగ్గర ప్రోగ్రామర్‌గా చాలా చిత్రాలకు పనిచేశా. నాన్నగారు మెలోడీకి పెట్టింది పేరు. ఆయనను నేను అనుసరించకూడదు. ఆయనకు నేపథ్య సంగీతంలో మంచి పేరుంది. నాకూ ఆయనలా పేరు తెచ్చుకోవాలని ఉంది. ట్యూన్ చెయ్యడం కంటే నేపథ్య సంగీతం అందించడమే సవాల్‌గా భావిస్తా. సంగీత దర్శకుడికి లిరిక్స్ మీద అవగాహన ఉంటేనే సరైన పాటల్ని ఇవ్వగలం అని నమ్ముతా. మొదట్లో నటన మీద ఆసక్తి ఉండేది. పలు ప్రయత్నాలూ చేశా. కానీ సంగీతమే ప్రపంచమని తక్కువ సమయంలో తెలుసుకున్నా. అప్పటి నుంచీ సంగీతం పట్ల మరింత మమకారం పెరిగింది. ప్రస్తుతం కన్నడలో 'కుమారి 21 ఎఫ్' చిత్రానికి సంగీతం అందిస్తున్నా.

ప్రేమలో అన్నీ చిక్కులే..


జి.వి.ప్రకాశ్, నిక్కీ

జి.వి.ప్రకాశ్, నిక్కీ గల్రాని జంటగా నటించిన ఓ తమిళ చిత్రం 'చెన్నై చిన్నోడు' టైటిల్‌తో తెలుగు ప్రేక్షకుల ముందుకు రానుంది. 'వీడి లవ్‌లో అన్నీ చిక్కులే' అన్నది ఉపశీర్షిక. ఎం. రాజేశ్. దర్శకుడు. యశ్వంత్ సాయికుమార్ సమర్పణలో వి.జయంత్ కుమార్ తెలుగులో అనువదిస్తున్నారు. ఆదివారం ఫిల్మ్ చాంబర్‌లో ఈ చిత్రం టీజర్, ఫస్ట్‌లుక్‌ను కె.వి.వి.సత్యనారాయణ ఆవిష్కరించారు. నిర్మాత మాట్లాడుతూ "కడుపుబ్బ నవ్వించే కామెడీ ఎంటర్‌టైనర్ ఇది. జి.వి.ప్రకాశ్ చక్కని నటనతోపాటు అద్భుతమైన బాణీలిచ్చారు. త్వరలో సినిమా ను విడుదల చేస్తాం" అని తెలిపారు.

బంగ్లాలో పాటలు

ఏకే 9 స్టూడియోస్ ఫిలిమ్స్ సమర్పణలో అజయ్‌కౌండిన్య హీరోగా నటించి, దర్శకత్వం వహించిన 'ఎన్ హెచ్47లో భూత్ బంగ్లా' పాటలు హైదరాబాద్‌లో శనివారం రాత్రి విడుదలయ్యాయి. టీఆర్ఎస్ నేత ఠాగూర్ బాలాజీ సింగ్, బీజేపీ నేత వి.ఆంజనేయులు ఆడియో సీడీలను ఆవిష్కరించారు. సినిమా పెద్ద హిట్ కావాలని అతిథులు ఆకాంక్షించారు. ఇందులో నాలుగు పాటలు ఉన్నాయని సంగీత దర్శకుడు చైతన్యరాజ చెప్పారు. సినిమా బాగా వచ్చిందని నిర్మాతలు ఆంజనేయులు కొమ్మ గోని, రాసంబట్టి అరుణాచలం గౌడ్, సహ నిర్మాతలు మారం రాజేష్‌కుమార్, బుగ్గారపు రమేశ్‌బాబు చెప్పారు. సంధ్య, అనూష నాయికలు.


సంధ్య, అజయ్, అనూష

ఆంధ్రజ్యోతి

బిజినెస్

11 నిజామాబాద్ • సోమవారం 29 జనవరి 2018

ఐకియా వ్యవస్థాపకుడు ఇంగ్వర్ కంప్రాడ్ కన్నుమూత

స్టాక్‌హోమ్ : స్వీడన్‌కు చెందిన అంతర్జాతీయ ఫర్నీచర్ దిగ్గజం 'ఐకియా' వ్యవస్థాపకుడు ఇంగ్వర్ కంప్రాడ్ (91) ఆదివారం నాడు కన్నుమూశారు. స్వీడన్‌లోని స్మాలాండ్ ప్రాంతంలోని తన ఇంట్లోనే ఆయన తుది శ్వాస విడిచారు. చిన్నతనంలో ఇంటింటికి తిరుగుతూ అగ్గిపెట్టెలు, పెన్సిల్స్ విక్రయించిన ఇంగ్వర్ 17 సంవత్సరాల వయస్సులో 'ఐకియా' కంపెనీని ఏర్పాటు చేసి ప్రపంచంలోని మేటి ఫర్నీచర్ కంపెనీల్లో ఒకటిగా తీర్చిదిద్దారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా 29కి పైగా దేశాల్లో ఐకియాకు 350కి పైగా స్టోర్లు ఉన్నాయి. కాగా భారత మార్కెట్లోకి ఈ మధ్యనే అడుగుపెట్టిన ఐకియా తొలి స్టోర్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేస్తోంది.ఈ ఏడాదే ఈ స్టోర్ లాంఛనంగా ప్రారంభం కానుంది.



andhrajyothibusiness@gmail.com

భారత సంపన్నులకు దావోస్‌లో బంపర్ ఆఫర్

క్యాష్ వాల్ట్స్, బిట్‌కాయిన్స్ వ్యాపార భాగస్వామ్యం



దావోస్/జ్యూరిచ్: 'ఎప్పుడూ చేసే వ్యాపారమే చేస్తే మజా ఏముంది? క్యాష్ వాల్ట్స్, బిట్స్‌కాయిన్స్ లాంటి క్రిప్టోకరెన్సీల్లో కలిసి వ్యాపారం చేద్దాం. భద్రతకు భద్రత, లాభాలకు లాభాలు'... గత వారం స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యుఇఎఫ్) సదస్సుకు వెళ్లిన కొంత మంది భారత సంపన్నులకు అక్కడి వ్యాపార, పారిశ్రామిక ప్రముఖులు చేసిన ఆఫర్ ఇది. స్విట్జర్లాండ్‌లో ఇప్పుడీ వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లుతోంది. ఈ సేవలు అందించే వ్యాపార సంస్థలు తమ కార్యకలాపాలను భారత్‌కు కూడా విస్తరించాలని భావిస్తున్నాయి. అందులో భాగంగానే దావోస్‌లో జరిగిన డబ్ల్యుఇఎఫ్ సదస్సుకు వచ్చిన భారత సంపన్న వర్గాలకు ఈ ఆఫర్ చేసినట్టు తెలుస్తోంది. కొంత మంది క్రిప్టోకరెన్సీ వ్యాపారులు దావోస్ సదస్సుకు అధికారికంగా హాజరైతే మరికొందరు మాత్రం అనధికారికంగా హాజరయ్యారు. 'మా వ్యాపారాల్లో ఇన్వెస్ట్ చేసినా సరే లేదా భాగస్వాములుగా చేరినా సరే' అని వీరంతా భారత సంపన్నులకు ఆఫర్ చేసినట్టు సమాచారం. మన దేశంలో బిట్‌కాయిన్స్‌కిగానీ, క్యాష్ వాల్ట్స్‌కుగానీ ఇప్పటి వరకు అనుమతి లేదు. దీంతో డబ్ల్యుఇఎఫ్ సదస్సుకు హాజరైన భారత సంపన్నులెవరూ దీనిపై అధికారికంగా నోరు మెదపడం లేదు. సంపన్న భారతీయులతో పాటు ప్రవాస భారతీయులు, రష్యా, జర్మనీ, చైనా దేశాలకు చెందిన సంపన్నులకూ ఈ వ్యాపారులు ఈ ఆఫర్ చేసినట్టు సమాచారం.

క్యాష్ వాల్ట్స్ అంటే?

స్విట్జర్లాండ్‌లో అనేక బ్యాంకులు ఇప్పటికే క్యాష్ వాల్ట్స్ (భారీ పరిమాణంలో ఉండే నేల మాళిగలు) సేవలు అందిస్తున్నాయి. సాధారణ బ్యాంకు లాకర్లలో దాచుకున్నట్టు వీటిల్లోనూ నగదు, బంగారం, డాటా, అపురూపమైన చిత్ర పటాలు, విగ్రహాలు వంటి వాటిని దాచుకోవచ్చు. స్విస్ మంచు పర్వతాలు లేదా మైదానాల్లో లోతైన కందకాలు తవ్వి భారీ పరిమాణంలో ఈ క్యాష్ వాల్ట్స్ ఏర్పాటు చేశారు. అనేక లేయర్లతో పటిష్ఠమైన రక్షణ వ్యవస్థతో ఇవి ఉన్నాయి. వీటి వివరాలు కనుక్కోవడం అంత తేలిక కాదు. ఇటీవల స్విస్ బ్యాంకు ఖాతాల గుట్టు రట్టవుతోంది. దీంతో ఈ బ్యాంకుల్లో తమ అక్రమ సంపాదన దాచుకున్న అక్రమార్కుల్లో చాలా మంది తమ నిధులు, ఇతర విలువైన సంపదలను ఈ క్యాష్ వాల్ట్స్‌కు తరలిస్తున్నట్టు ఇప్పటికే వార్తలు వస్తున్నాయి.

బిట్‌కాయిన్స్‌లో మదుపు చేయవచ్చా?

బిట్‌కాయిన్స్ వంటి క్రిప్టోకరెన్సీకి ఇటీవల డిమాండ్ పెరుగుతోది. ఏ దేశంలోనూ వీటికి ఇప్పటి వరకు చట్ట బద్దత లేదు. అయినా ఆన్‌లైన్‌లో వీటి ట్రేడింగ్ చురుగ్గా జరుగుతోంది. గత నాలుగేళ్లలో బిట్స్‌కాయిన్స్ ధర 12 రెట్లు పెరిగింది. బిట్‌కాయిన్స్ కొంప ముంచుతాయని ఐఎంఎఫ్‌తో పాటు అనేక మంది ఆర్థికవేత్తలు హెచ్చరించినా నెటిజన్లు వినిపించుకోవడం లేదు. రోజురోజుకీ పెరిగిపోతున్న బిట్‌కాయిన్స్ ధర చూసి, ఆలస్యం చేస్తే మిస్సవుతామనే ఆశతో అనేక మంది నెటిజన్లు వాటిని కొనుగోలు చేస్తున్నారు. అమెరికా ఆర్థిక మంత్రి స్టీవెన్ నుచిన్ అయితే వీటి ద్వారా అక్రమ వ్యాపారాలను అనుమతించేది లేదని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో క్రిప్టోకరెన్సీ వ్యాపారులు తమ వ్యాపార సామ్రాజ్యాన్ని భారత్‌కు కూడా పెద్ద ఎత్తున విస్తరించాలని యోచించడం విశేషం. ప్రభుత్వం వెంటనే దీనికి చెక్‌పెట్టకపోతే అమాయక ఇన్వెస్టర్లు భారీగా నష్టపోయే ప్రమాదం ఉంది.

చిన్న షేర్లతో జర జాగ్రత్త..

- స్మాల్, మిడ్‌క్యాప్‌లో బుడగ తయారవుతోంది..
- ప్రముఖ బ్యాంకర్ ఉదయ్ కోటక్ హెచ్చరిక



దావోస్: ప్రధాన కంపెనీలతో పోలిస్తే చిన్న, మధ్య స్థాయి సంస్థల షేర్లు మెరుగైన రిటర్నులు పంచుతున్నప్పటికీ వాటి వాల్యుయేషన్స్‌లో బబుల్ (బుడగ) తయారవుతోందని ప్రముఖ బ్యాంకర్ ఉదయ్ కోటక్ హెచ్చరించారు. దేశీ, విదేశీ పెట్టుబడుల దన్నుతో స్టాక్ మార్కెట్లు ఆర్థిక వ్యవస్థలో స్థితిగతుల కంటే మెరుగైన పనితీరు కనబరుస్తున్నాయన్నారు. దావోస్‌లో జరిగిన వరల్డ్ ఎకనమిక్ ఫోరం (డబ్ల్యుఇఎఫ్) సమావేశాల్లో పిటిఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో కోటక్ మాట్లాడుతూ.. రిటైల్ మదుపర్ల పొదుపు సొమ్మును ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేసే ట్రెండ్ మంచి పరిణామమే అయినప్పటికీ స్మాల్, మిడ్ క్యాప్ షేర్లతో జాగ్రత్తగా ఉండాలన్నారు. పాలన ప్రమాణాలు బాగున్న కంపెనీల్లోనే పెట్టుబడులు పెట్టాలని ఆయన సూచించారు.

సమతుల్యత పాటించాలి..

దేశ ప్రయోజనాలు, అంతర్జాతీయ సంబంధాల మధ్య సమతుల్యత అవసరమని కోటక్ అభిప్రాయపడ్డారు. ఈ విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వైఖరిని చూస్తే.. స్థానికులకు ఉద్యోగావకాశాలు పెంచడంపై ఆయన ప్రధానంగా దృష్టిసారించారని, పన్నుల కోతతో ఆ దేశంలో ఉద్యోగాల కల్పన అనూహ్యంగా పెరిగిందన్నారు. మన దేశంలోనూ ఉద్యోగాల కల్పన పెంచేందుకు తక్షణ చర్యలు అవసరమని కోటక్ అన్నారు.


పుంజుకుంటున్న కార్పొరేట్ రంగం

దేశీయ కార్పొరేట్ రంగం మళ్లీ పుంజుకుంటోందని కోటక్ అన్నారు. మా బ్యాంకుల పనితీరునే గమనిస్తే.. లాభాలు బాగా పెరిగాయని, రుణ వృద్ధి మెరుగవుతోందన్నారు. ఇక స్థూల ఆర్థికాంశాల పరంగా మాత్రం సవాళ్లు పెరుగుతున్నాయని అన్నారు. ఉదాహరణకు అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరల పెరుగుదలతో కరెంట్ ఖాతా లోటుతోపాటు ద్రవ్యలోటు అదుపుతప్పే ప్రమాదం ఏర్పడిందన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ద్రవ్యలోటు జిడిపిలో 3.4 శాతంగా ఉండవచ్చని, వచ్చే ఆర్థిక సంవత్సరంలో కేంద్రం 3.2 శాతానికి కట్టడి చేయవచ్చని కోటక్ అంచనా వేశారు.

పన్నుల్లో అనిశ్చితి వద్దు..

జైట్లీకి అమెరికన్ కార్పొరేట్ల విన్నపం

వాషింగ్టన్: ఈ వారం పార్లమెంట్‌లో బడ్జెట్ ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీకి అమెరికా పారిశ్రామికవర్గాలు కూడా తమ విన్నపాలను సమర్పించాయి. బహుళజాతి సంస్థలు (ఎంఎన్‌సి), సంస్థాగత పెట్టుబడిదారులకు వర్తించే పన్ను నిబంధనల్లో అనిశ్చితి తగ్గించాలని వారు కోరారు. తద్వారా భారత మార్కెట్లోకి మరిన్ని విదేశీ పెట్టుబడులు వచ్చే అవకాశం ఉంటుందని వారు అన్నారు.



మ్యాట్ మినహాయించాలి: నాస్కామ్

ఫారిన్ టాక్స్ క్రెడిట్ నిబంధనలను సమూలంగా మార్చాలంటున్న నాస్కామ్.. ఐటి సంస్థలకు కనీస ప్రత్యామ్నాయ పన్ను (మ్యాట్) నుంచి మినహాయింపు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరింది. అలాగే దేశీయ, విదేశీ స్టార్టప్ ఇన్వెస్టర్లపై భిన్న పన్ను విధింపు విధానానికి స్వస్తి పలకాలని బడ్జెట్ కోర్కెల చిట్టాలో విన్నవించుకుంది.

ఎలక్ట్రిక్ వాహనాలకు పన్ను ప్రోత్సాహకాలు

దేశంలో ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహించేందుకు ఈసారి బడ్జెట్‌లో జైట్లీ భారీగా పన్ను రాయితీలు ప్రకటించే అవకాశం ఉంది. ఈ విభాగ వెహికిల్స్‌పై జిఎస్‌టిని ప్రస్తుతమున్న 12 శాతం నుంచి 5 శాతానికి తగ్గించవచ్చని అంచనాలున్నాయి. అంతేకాకుండా ఎలక్ట్రిక్ వాహనం కొనుగోలుపై ఆదాయం పన్ను ప్రయోజనాలు సైతం లభించే అవకాశాల్లేకపోలేవని ఇండస్ట్రీ వర్గాలంటున్నాయి.

గత ఏడాది రూ.3.87 లక్షల కోట్లు

- కార్పొరేట్ రంగంలో ఎం అండ్ ఎ, ప్రైవేట్ ఈక్విటీ ఒప్పందాల విలువ



న్యూఢిల్లీ: గత ఏడాది భారత కార్పొరేట్ రంగంలో 6,050 కోట్ల డాలర్ల (రూ.3.87 లక్షల కోట్లు) విలువైన విలీనాలు, కొనుగోళ్లు (ఎం అండ్ ఎ), ప్రైవేట్ ఈక్విటీ (పిఇ) డీల్స్ జరిగాయని గ్రాంట్ థోర్నట్ తాజా నివేదిక వెల్లడించింది. గత సంవత్సరం 1,147 ఎం అండ్ ఎ, పిఇ డీల్స్ కుదిరాయని, 2016లో 5,785 కోట్ల డాలర్ల విలువైన 1,485 ఒప్పందాలు నమోదయ్యాయని తెలిపింది.

- గత ఏడాదిలో 4000 కోట్ల డాలర్ల విలువైన 411 విలీన, కొనుగోళ్ల ఒప్పందాలు జరిగాయి. 2015లో ఆల్‌టైం గరిష్ఠాన్ని నమోదు చేసుకున్న డీల్స్ క్రమంగా తగ్గుముఖం పడుతున్నాయి.
- ఎం అండ్ ఎ డీల్స్‌లో టెలికాం రంగందే అధిక వాటా. కనీసం 10 కోట్ల డాలర్ల కంటే అధిక మొత్తంలో 6 ఒప్పందాలు నమోదయ్యాయి. వీటన్నింటి విలువ 2,500 కోట్ల డాలర్లు. మొత్తం విలీన, కొనుగోలు ఒప్పందాల్లో 60 శాతం వీటిదే.

6నెలల గరిష్ఠానికి పి-నోట్ పెట్టుబడులు

దేశీయ క్యాపిటల్ మార్కెట్లోకి పార్టిసిపేటరీ నోట్ల (పి-నోట్) రూపంలో వచ్చిన పెట్టుబడులు ఆరు నెలల గరిష్ఠానికి చేరుకున్నాయి. గత ఏడాది డిసెంబర్‌లో పి-నోట్ ఇన్వెస్ట్‌మెంట్లు రూ.1,52,243 కోట్లకు పెరిగాయి. నవంబర్‌లో రూ.1,28,639 కోట్లుగా నమోదయ్యాయి. సెబి వద్ద రిజిస్ట్రేషన్ చేసుకున్న ఫారిన్ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్‌పిఐ) జారీ చేసే పి నోట్‌ల ద్వారా విదేశీయులు దేశీయ క్యాపిటల్ మార్కెట్లో పెట్టుబడులు పెడుతుంటారు.

విస్తరణ బాటలో మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్

- ఈ ఏడాదిలో మరో 40 షోరూమ్‌లు
- హైదరాబాద్‌లో ఒకే రోజు రెండు షోరూమ్‌ల ప్రారంభం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ప్రముఖ బంగారు ఆభరణాల విక్రయ సంస్థ మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ పెద్ద ఎత్తున షోరూమ్‌లను విస్తరించే సన్నాహాల్లో ఉంది. ప్రస్తుతం మలబార్‌కు 209 షోరూమ్‌లున్నాయి. వీటిలో 91 దేశంలో, 118 విదేశాల్లో ఉన్నాయి. ఆదివారంనాడు హైదరాబాద్‌లోని హిమాయత్‌నగర్‌లో ఒకటి, కొండాపూర్‌లో మరో షోరూమ్‌ను సంస్థ ప్రారంభించింది. ఈ ఏడాదిలో మరో 40 షోరూమ్‌లను ప్రారంభించనున్నామని, వీటితో మొత్తం షోరూమ్‌ల సంఖ్య 250 దాటుతుందని మలబార్ గ్రూప్ ఎండి (భారత కార్యకలాపాలు) ఓ అషర్ తెలిపారు. గత ఏడాదిలో 27 షోరూమ్‌లను ప్రారంభించినట్టు చెప్పారు. విస్తరణలో భాగంగా యుఎస్, శ్రీలంక, బ్రూనై, బంగ్లాదేశ్ వంటి దేశాల్లో షోరూమ్‌లను మలబార్ ప్రారంభించనుంది. దేశీయంగా కేరళ, తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ, మహారాష్ట్ర, బెంగాల్‌లో, విదేశాల్లో సౌదీ అరేబియా, ఖతార్, యుఎఇలో సంస్థకు ఆభరణాల తయారీ యూనిట్లు ఉన్నాయి. రానున్న కాలంలో మరిన్ని ఆభరణాల తయారీ యూనిట్లను ఏర్పాటు చేయాలని సంస్థ యోచిస్తోంది. తమ స్టోర్లు, మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్ల ద్వారా పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నామని అషర్ తెలిపారు. రానున్న కాలంలో తెలంగాణలోని కరీంనగర్, నిజామాబాద్, ఖమ్మంలోనూ షోరూమ్‌లను ఏర్పాటు చేయనుంది. కాగా కొత్త షోరూమ్‌ల ప్రారంభం సందర్భంగా 30 వేల రూపాయల విలువైన బంగారం కొనుగోలు చేసిన కస్టమర్లకు స్పెషల్ గోల్డ్ కాయిన్‌ను మలబార్ ఇస్తోంది. వచ్చే నెల 11వ తేదీ వరకు ఈ ఆఫర్ హైదరాబాద్‌లోని అన్ని మలబార్ స్టోర్లలో అందుబాటులో ఉంటుందని కంపెనీ తెలిపింది. హిమాయత్ నగర్ షోరూమ్ ప్రారంభ కార్యక్రమంలో మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ బ్రాండ్ అంబాసిడర్ తమన్నా, ఎంఎల్ఎ చింతా రామచంద్రారెడ్డి, మలబార్ గ్రూప్ చైర్మన్ ఎంపి అహమ్మద్ పాల్గొన్నారు.



హైదరాబాద్‌లోని హిమాయత్‌నగర్ షోరూమ్ ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న నటి తమన్నా, ఎంపి అహమ్మద్, ఒ అషర్

మార్కెట్ దిశను నిర్దేశించేవి ఆ రెండే..

మార్కెట్ నాడి

"ఈ వారం మార్కెట్‌కు అత్యంత కీలకం కానుంది. 2018-19 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌ను ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ గురువారం ప్రవేశపెట్టనున్నారు. జనవరి రెండో వారంలో మొదలైన కార్పొరేట్ ఆర్థిక ఫలితాల సందడి ఈ వారం కూడా కొనసాగటమే కాకుండా మార్కెట్ ట్రెండ్‌ను నిర్దేశించనున్నాయి."



విజయ్ సింఘానియా
డైరెక్టర్, ట్రేడ్‌స్మార్ట్ ఆన్‌లైన్

అంతర్జాతీయంగా క్రూడాయిల్ బ్యారల్ ధరలు 71 డాలర్లకు చేరుకోవటం రానున్న రోజుల్లో మార్కెట్ సెంటిమెంట్‌ను ప్రభావితం చేయనుంది. బడ్జెట్‌లో మౌలిక సదుపాయాల కల్పనా రంగానికి పెద్దపీట వేయటమే కాకుండా ఆదాయ పన్ను సహా పరోక్ష పన్నుల్లో మార్పులు, చేర్పులు ఉండే అవకాశం ఉందని ఇన్వెస్టర్లు అంచనా వేస్తున్నారు. అంతర్జాతీయ కంపెనీలకు దీటుగా దేశీ కంపెనీలు గట్టి పోటీనిచ్చేందుకు కార్పొరేట్ టాక్స్ రేట్లను తగ్గించాలని ఆర్థికవేత్తలు కోరుతున్నారు. జిఎస్‌టి రేట్లను 12 నుంచి 6 శాతానికి తగ్గించే అవకాశం ఉందని పారిశ్రామిక వర్గాలు అంచనా వేస్తున్నాయి. మరోవైపు స్టాంప్‌డ్యూటీని జిఎస్‌టి పరిధిలోకి తీసుకురావాలని కోరుతున్నాయి. అన్ని అనుమతులకు సింగిల్ విండో క్లియరెన్స్‌లు, తొలిసారిగా ఇల్లు కొనుగోలు చేసే వారికి అదనపు పన్ను ప్రోత్సాహకాలు ఉంటాయని అంచనా వేస్తున్నారు. పన్ను స్లాబులను క్రమబద్ధీకరించటమే కాకుండా సెస్ తగ్గింపు లేదా తొలగించాలని ఆటోమొబైల్ పరిశ్రమ కోరుతోంది.

ఈ వారం ఫలితాలివే...

సోమవారం నాడు హెచ్‌డిఎఫ్‌సి, ఐడిఎఫ్‌సి, టెక్ మహీంద్రా ఆర్థిక ఫలితాలను ప్రకటించనుండగా, మంగళవారం నాడు ఇండియన్ ఆయిల్, బుధవారం.. ఐసిఐసిఐ బ్యాంక్, ఎల్ అండ్ టి, ఎన్‌టిపిసి, వేదాంత, శుక్రవారం.. బజాజ్ ఆటో, హిండాల్కో ఇండస్ట్రీస్ ఫలితాలను ప్రకటించనున్నాయి.

అంతర్జాతీయ సంఘటనలు

జనవరి నెలకు గాను భారత పారిశ్రామిక రంగానికి సంబంధించి నెలవారీ సర్వేను మార్కిట్ ఎకనామిక్స్ గురువారం విడుదల చేయనుంది. యుఎస్ ఫెడ్ రిజర్వ్.. ఫెడరల్ ఓపెన్ మార్కెట్ కమిటీ (ఎఫ్ఒఎంసి) రెండు రోజుల ద్రవ్యపరపతి విధాన సమావేశాలు మంగళవారం నిర్వహించనుంది.

టెక్నికల్స్ ఇవే...

గతవారం భారత వొలటిలిటీ ఇండెక్స్ (ఇండియా విఐఎక్స్) 25.25 శాతం పెరిగింది. ప్రస్తుతం నిఫ్టీ హ్యాంగింగ్ మ్యాన్ క్యాండ్ ఆఫ్ ఫార్మేషన్‌లో ఉండటంతో పరుగుకు బ్రేక్ ఇచ్చినట్లు కనిపిస్తోంది. ఒత్తిడి కారణంగా సెల్ (విక్రయ) సంకేతాలను సూచిస్తోంది. రానున్న రెండు రోజులు నెగిటివ్ ధోరణితో సైడ్‌వేస్‌లో ట్రేడయ్యే అవకాశాలున్నాయి.

బడ్జెట్‌తోనే దిశ

ఆస్ట్రో గైడ్



డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

గరిష్ఠ స్థాయిల్లో అప్రమత్తం

(జనవరి 29-ఫిబ్రవరి 2 తేదీల మధ్య వారానికి)

గత వారం నిఫ్టీ : 11070 (+175)

నిఫ్టీ గత వారం 10881-1110 పాయింట్ల మధ్యన కదలాడి 175 పాయింట్ల లాభంతో 11070 వద్ద పాజిటివ్‌గా ముగిసింది. బుధవారంనాడు 52 వారాల గరిష్ఠ స్థాయిని కూడా తాకింది. వరుసగా ఎనిమిదో వారంలో కూడా మార్కెట్ లాభాలతో క్లోజయింది. ఈ వారంలో కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ పార్లమెంటుకు సమర్పించనున్న బడ్జెట్ ఆధారంగా తదుపరి దశ ఉంటుంది.

- స్వల్పకాలిక, మధ్యకాలిక, దీర్ఘకాలిక దృక్పథాలు మూడింటిలోనూ నిఫ్టీ బుల్లిష్‌గా ఉంది. 10700 కన్నా దిగువన ముగిసినప్పుడే బేరిష్ అవుతుంది.
- 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 10726, 10492, 10317, 9984 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి.
- ప్రస్తుతం నిఫ్టీ అన్ని డిఎంఎలకన్నా పైన ట్రేడవుతోంది. నిఫ్టీ 200 డిఎంఏ కన్నా పైన ఉండడం 50 డిఎంఏ 200 డిఎంఏ కన్నా పైకి రావడం (గోల్డెన్ క్రాస్) దీర్ఘకాలిక ట్రెండ్ బుల్లిష్‌గా ఉందనేందుకు సంకేతం.

బ్రేకౌట్ స్థాయి : 11200
బ్రేక్‌డౌన్ స్థాయి : 10850
నిరోధ స్థాయిలు : 11225, 11300, 11375 (11150 పైన బుల్లిష్)
మద్దతు స్థాయిలు : 10925, 10850, 10775 (11000 దిగువన బేరిష్)

ఇన్వెస్టర్లకు సూచన

వారం ప్రారంభ స్థాయి అత్యంత కీలకం. ఇండెక్స్ గత వారం ప్రారంభ స్థాయి కన్నా పైన ట్రేడవుతూ ఉంటే లాంగ్ పొజిషన్లను పరిశీలించవచ్చు.

ద్వితీయార్ధం మెరుగు (సోమవారానికి)

తిథి: మాఘ శుద్ధ త్రయోదశి

నక్షత్రం : ఆర్ద్ర

ఆశ్లేష, జ్యేష్ఠ, రేవతి నక్షత్ర జాతకులు, కర్కాటక, వృశ్చిక రాశుల వారు అప్రమత్తంగా ఉండాలి.

ట్రెండ్ మార్పు వేళలు : 12.23

ధోరణి : గ్రహగతులను బట్టి మెరుగ్గా ప్రారంభమై 9.45 వరకు అదే ధోరణిలో ట్రేడవుతూ తదుపరి ఒంటి గంట వరకు నిస్తేజంగా ట్రేడ్ కావచ్చు. ఆ తర్వాత మళ్లీ 3.05 వరకు మెరుగ్గా ట్రేడవుతూ చివరిలో నిస్తేజంగా మారే ఆస్కారం ఉంది.

ట్రేడింగ్ వ్యూహం...

నిఫ్టీ ఫ్యూచర్స్ 9.45 సమయానికి ప్రారంభ స్థాయి/సగటు (ఎటిపి) కన్నా దిగువన ట్రేడవుతుంటే తగు స్టాప్‌లాస్‌తో షార్ట్ పొజిషన్లు తీసుకుని ఒంటిగంట సమయానికి క్లోజ్ చేసుకోవాలి. 1.15 తర్వాత ఎటిపి కన్నా పైకి వస్తే లాంగ్ పొజిషన్లు తీసుకుని 3 గంటల సమయానికి క్లోజ్ చేసుకోవాలి.

ఇంట్రాడే ట్రేడింగ్‌కు ప్రారంభ స్థాయి కీలకం. అంతకన్నా దిగువన మాత్రమే షార్ట్ పొజిషన్లు శ్రేయస్కరం.

నిరోధ స్థాయిలు : 11110, 11145
మద్దతు స్థాయిలు : 11030, 11000

గమనిక : ఇది పూర్తిగా ఆస్ట్రోటెక్నికల్ అంశాల ఆధారంగా ఇచ్చిన సూచన. మార్కెట్ వాస్తవిక కదలికల ఆధారంగా నిర్ణయాలు తీసుకోవాలి.

గ్రహగతులివే..

- మిథునంలోని ఆర్ద్ర పాదం 2 నుంచి సింహంలోని పూర్వ ఫల్గుణి పాదం 1 మధ్యలో చంద్ర సంచారం
- మకరంలోని శ్రవణం పాదం 2-3 మధ్యలో రవి సంచారం
- మకరంలోని ఉత్తరాషాఢ పాదం 2-3 మధ్యలో బుధ సంచారం
- మకరంలోని శ్రవణం పాదం 3 నుంచి ధనిష్ఠ పాదం 1 మధ్యలో శుక్ర సంచారం
- వృశ్చికంలోని అనూరాధ పాదం 2-3 మధ్యలో కుజ సంచారం
- ధనుస్సులోని మూల పాదం 4లో కర్కాటక నవాంశలో శని సంచారం
- తులలోని విశాఖ పాదం 3లో మీన నవాంశలో బృహస్పతి సంచారం
- మకరంలో రాహువు, కర్కాటకంలో కేతువు కర్కాటక, మకర నవాంశల్లో సంచారం

అడుగంటిన కేజీ-డి6 గ్యాస్ ఉత్పత్తి

- క్యు3లో 4.9 ఎంఎంఎస్‌సిఎండిగా నమోదు

న్యూఢిల్లీ: కృష్ణా గోదావరి బేసిన్‌లో రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు చెందిన కేజీ-డి6 సహజవాయువు క్షేత్రంలో ఇంధన ఉత్పత్తి కనిష్ఠ స్థాయికి తగ్గింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో డిసెంబర్‌తో ముగిసిన మూడు నెలల కాలానికి (క్యు3) కేజీ-డి6 ఉత్పత్తి 4.9 మిలియన్ స్టాండర్డ్ క్యూబిక్ మీటర్స్ పర్ డే(ఎంఎంఎస్‌సిఎండి)కు పడిపోయిందని ఇన్వెస్టర్ల ప్రజెంటేషన్‌లో రిలయన్స్ తెలిపింది. ఏప్రిల్ 2009లో ఈ క్షేత్రం నుంచి ఉత్పత్తి ప్రారంభించినప్పటి నుంచి కంపెనీకిదే కనిష్ఠ స్థాయి ఉత్పత్తి. కేజీ బేసిన్‌లోని ధీరూభాయ్-1 (డి1), డి3 క్షేత్రాల్లోని ఏడు బావులతోపాటు ఎంఎ ఆయిల్ అండ్ గ్యాస్ క్షేత్రంలోని మూడు బావుల నుంచి 4.9 ఎంఎంఎస్‌సిఎండి గ్యాస్‌ను ఉత్పత్తి చేసినట్లు తెలిపింది. బావుల్లోకి నీరు, ఇసుక చేరడం ఇందుకు కారణమని సంస్థ వెల్లడించింది. క్యు3లో ఎంఎ బ్లాక్ నుంచి రోజుకు 2,042 పీపాల ముడి చమురును సైతం ఉత్పత్తి చేసినట్లు ఆర్ఐఎల్ తెలిపింది. రెండో త్రైమాసికం(క్యు2)లో గ్యాస్ ఉత్పత్తి 5.4 ఎంఎంఎస్‌సిఎండిగా, చమురు ఉత్పత్తి రోజుకు 2,073 పీపాలుగా నమోదైంది. గత ఆర్థిక సంవత్సరంలో మూడో త్రైమాసికానికి రోజువారీ గ్యాస్ అండ్ ఆయిల్ ప్రొడక్షన్ 7.5 ఎంఎంఎస్‌సిఎండి, 3,329 బ్యారెళ్లుగా ఉంది.

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	77.00	విజయవాడ	84.00
కరీంనగర్	79.00	గుంటూరు	84.00
వరంగల్	77.00	ఒంగోలు	86.00
మహబూబ్‌నగర్	77.00	చిత్తూరు	68.00
కర్నూలు	77.00	నెల్లూరు	78.00
విశాఖపట్నం	78.00	అనంతపురం	70.00
గోదావరి	83.00		

రిటైల్ (ఒక గుడ్డు) ధర రూ. 4.40 — నెక్ (100 గుడ్లు)



హైదరాబాద్	380.00	చిత్తూరు	383.00
వరంగల్	382.00	చెన్నై	390.00
విజయవాడ	380.00	నమక్కల్	375.00
గోదావరి	380.00	బెంగళూరు	380.00
విశాఖపట్నం	402.00	ముంబై	425.00

గరిష్ఠ స్థాయిల వద్ద అప్రమత్తం

టెక్ వ్యూ





నిఫ్టీ గత వారం అప్‌ట్రెండ్‌ను కొనసాగిస్తూ 11100 పాయింట్ల స్థాయిలకు చేరుకుని మైనర్ కరెక్షన్‌ను చవిచూసింది. చివరకు వారం గరిష్ఠ స్థాయిలో క్లోజయి సానుకూల ట్రెండ్‌ను కనబరిచింది. చివరి మూడు ట్రేడింగ్ సెషన్లలో కన్సాలిడేషన్‌ను చవిచూసింది. టెక్నికల్‌గా ట్రెండ్ పొజిషన్‌లో ఎలాంటి మార్పు లేదా డైరెక్షన్‌ను సూచించలేదు. ఎనిమిది వారాలుగా పటిష్ఠమైన ర్యాలీని కనబరుస్తూ వచ్చిన నిఫ్టీ ఇంకా అప్‌ట్రెండ్‌లోనే సాగుతోంది. ఓవర్‌బాట్ పొజిషన్‌లో కొనసాగుతుండటంతో రానున్న కొద్ది రోజుల్లో టెక్నికల్ కరెక్షన్‌ను సూచిస్తోంది. ప్రధాన నిరోధ స్థాయిలైన 11100 పాయింట్ల వద్ద నిలదొక్కుకుంటేనే అప్‌ట్రెండ్‌ను సూచిస్తుంది.

బుల్లిష్ స్థాయిలు : నిఫ్టీకి తదుపరి నిరోధం 11100 పాయింట్లు. ఇక్కడ పరీక్షను ఎదుర్కొనే అవకాశం ఉంది. ఈ స్థాయిలకు ఎగువన క్లోజయితే కొత్త గరిష్ఠ స్థాయిల్లోకి అడుగు పెట్టవచ్చు. తదుపరి మానసిక అవధి స్థాయి 11200, 11300. తదుపరి దిశను తీసుకునే ముందు ఇక్కడ స్వల్ప కన్సాలిడేషన్‌కు అవకాశం ఉంది.

బేరిష్ స్థాయిలు : నిరోధ స్థాయిలైన 11100 వద్ద నిలదొక్కుకుంటే పాజిటివ్ ట్రెండ్‌ను సూచిస్తుంది. కరెక్షన్‌ను లోనయితే 11000 వద్ద మద్దతు స్థాయిలుంటాయి. ఇక్కడ స్వల్పకాలిక కరెక్షన్‌ను సూచిస్తుంది.

బ్యాంక్ నిఫ్టీ : ప్రస్తుత స్థాయిలైన 27500 వద్ద నిలదొక్కుకోలేకపోతే స్వల్పకాలిక బలహీనతను సూచిస్తుంది. తదుపరి మద్దతు స్థాయిలు 27000.

స్వల్పకాలిక వ్యూహం : గరిష్ఠ స్థాయిల వద్ద కరెక్షన్‌కు అవకాశం ఉండటంతో స్వల్పకాలిక ట్రేడర్లు.. స్వల్పకాలిక బై పొజిషన్లకు దూరంగా ఉండటం మంచిది.

సోమవారం స్థాయిలు..
నిరోధం : 11230, 11300
మద్దతు : 11160, 11080

పాటర్న్...

11200 వద్ద అడ్డంగా కనిపిస్తున్న రెసిస్టెన్స్ ట్రెండ్‌లైన్ దగ్గర నిరోధం ఉంది. ఏటవాలుగా ఎగువకు కనిపిస్తున్న సపోర్ట్ ట్రెండ్ లైన్ కన్నా ఇండెక్స్ చాలా పైన ఉండడం ట్రెండ్‌లో సానుకూలతను సూచిస్తోంది. గతంలో ఏర్పడిన బాటమ్ 11000 కన్నా దిగజారినప్పుడే స్వల్పకాలిక కరెక్షన్‌కు ఆస్కారం ఉంటుంది. స్వల్పకాలిక 20 డిఎంఎకన్నా మార్కెట్ చాలా పైన ఉంది.

టైమ్ : ఈ సూచిక ప్రకారం బుధవారం తదుపరి రివర్సల్ ఉంది.

హిందుస్తాన్ యూనిలీవర్ (రూ.1371) - కొనుగోలు స్థాయిలకు చేరువలో..

రూ.1370 ఎగువన అప్‌ట్రెండ్	మొదటి నిరోధం రూ.1410	రెండో నిరోధం రూ.1460
రూ.1340 దిగువన డౌన్‌ట్రెండ్	మొదటి మద్దతు రూ.1300	రెండో మద్దతు రూ.1260

■ వాసిరాజు సుందర్ రాజా
www.sundartrends.in



జైట్లీ మెరిపిస్తారా.. మురిపిస్తారా!

వచ్చే కేంద్ర బడ్జెట్ ఎలా ఉండబోతోంది? వ్యక్తిగత పన్ను చెల్లింపుదారులు, మదుపరులు ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ నుంచి ఏమి ఆశిస్తున్నారు? అనే విషయాలను క్లియర్ టాక్స్ ఫౌండర్, సిఇఒ అర్చిత్ గుప్తా వివరిస్తున్నారు..



పరిమిత వనరులతో సంక్షేమం-అభివృద్ధి మధ్య సమన్వయం సాధించడం ఏ ఆర్థిక మంత్రికైనా సవాలే. ఫిబ్రవరి 1న ప్రవేశ పెట్టే బడ్జెట్‌లోనూ ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ఈ సవాల్‌ను ఎదుర్కొంటున్నారు. దీనికి తోడు ఈ సంవత్సరం కొన్ని బిజెపి పాలిత రాష్ట్రాల అసెంబ్లీలకు ఎన్నికలు జరగబోతున్నాయి. మరోవైపు 2017లో జిడిపి వృద్ధి రేటుకు బ్రేక్ వేసిన పెద్ద నోట్ల రద్దు, జిఎస్‌టికి సంబంధించి ఇంకా కొన్ని సమస్యలు ఆర్థిక వ్యవస్థను వేధిస్తున్నాయి. అయినా సరే 2018-19 ఆర్థిక సంవత్సర బడ్జెట్ నుంచి ఇన్వెస్టర్లు ఈ కింది మార్పులు ఆశిస్తున్నారు.


సెక్షన్ 80సి పరిమితి పెంపు

ప్రస్తుతం నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్లు, టాక్స్ సేవింగ్ ఫిక్స్‌డ్ డిపాజిట్లు, పిపిఎఫ్, ఇఎల్ఎస్ఎస్ వంటి పొదుపు పథకాల్లో పెట్టే పెట్టుబడులకు సెక్షన్ 80 సి కింద ఏటా రూ.1.5 లక్షల వరకు మినహాయింపు ఉంది. గత సంవత్సరమే దీన్ని రూ.లక్ష నుంచి రూ.1.5 లక్షలకు పెంచారు. ఈ ఏడాది బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి జైట్లీ ఈ పరిమితిని రూ.2 లక్షలకు పెంచే అవకాశం ఉంది. దీంతో అదనంగా మరో రూ.50,000 మొత్తాన్ని ఇన్వెస్టర్లు బంగారం లాంటి ఆస్తులకు బదులు, ఆస్తుల కల్పనకు దోహదం చేసే ఆర్థిక ఆస్తుల్లో మదుపు చేసేందుకు వీలవుతుంది.

మరింత ఆకర్షణీయంగా ఇఎల్ఎస్ఎస్..

ప్రస్తుతం ఎక్కువ మంది ఇన్వెస్టర్లు సెక్షన్ 80సి కింద చేసే పెట్టుబడుల్లో ఎక్కువ భాగం ఏ మాత్రం రిస్క్ లేని ప్రజా భవిష్య నిధి (పిపిఎఫ్) పథకంలో ఇన్వెస్ట్ చేస్తున్నారు. కొద్దిపాటి రిస్క్‌కు సిద్ధపడే ఇన్వెస్టర్లు మాత్రం మ్యూచువల్ ఫండ్ సంస్థలు అందించే ఈక్విటీ ఆధారిత పొదుపు పథకాల్లో (ఇఎల్ఎస్ఎస్) మదుపు చేస్తున్నారు.

స్టాక్ మార్కెట్ బాగుంటే.. ఈ పథకాలు మంచి రాబడులిస్తాయి. మిగతా టాక్స్ సేవింగ్ పెట్టుబడులతో పోలిస్తే వీటి లాకిన్ పీరియడ్ మూడేళ్లు మాత్రమే. సెక్షన్ 80సి పెట్టుబడుల పరిమితిని మరో 50,000 రూపాయలకు పెంచితే అందులో ఎక్కువ భాగం ఇఎల్ఎస్ఎస్ పథకాల ద్వారా క్యాపిటల్ మార్కెట్‌కు వచ్చే అవకాశం ఉంది. దీనివల్ల మ్యూచువల్ ఫండ్స్ ద్వారా ఈక్విటీ పెట్టుబడులు మరింత ఊపందుకుంటాయి.



రుణ పత్రాలపై ఎస్‌టిటి మినహాయింపు..

దీర్ఘకాలిక ఈక్విటీ పెట్టుబడులతో పోలిస్తే ప్రస్తుతం బాండ్లు, రుణ పత్రాల్లో పెట్టుబడులు పన్ను పొదుపు రీత్యా అంత ఆకర్షణీయంగా లేవు. స్వల్పకాలిక మూలధన లాభాల పన్ను (ఎస్‌టిసిజి) వీటిల్లో పెట్టుబడులకు ఉన్న మరో ప్రతికూలత. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని బాండ్లు, రుణ పత్రాలను కూడా సెక్యూరిటీస్ ట్రాన్సాక్షన్ ట్యాక్స్ (ఎస్‌టిటి) పరిధిలోకి తెచ్చే అవకాశం ఉంది. అదే జరిగితే ఈ పెట్టుబడులకూ దీర్ఘకాలిక మూలధన లాభాల (ఎల్‌టిసిజి) పన్ను నుంచి మినహాయింపు లభిస్తుంది. అప్పుడు వీటిల్లో పెట్టుబడులు మరింత ఆకర్షణీయంగా మారి దేశంలో రుణపత్రాల మార్కెట్ మరింత ఊపందుకునే అవకాశం ఉంది.

స్టాక్ మార్కెట్ లాభాలపై ఎల్‌టిసిజి పన్ను..

ప్రస్తుతం ఏదైనా లిస్టెడ్ కంపెనీ షేర్లు కొని ఏడాది తర్వాత అమ్ముకుంటే వచ్చే లాభాలపై ఎలాంటి పన్ను చెల్లించాల్సిన అవసరం లేదు. అదే కొన్న ఏడాది తర్వాత అమ్ముకంటే వచ్చే లాభాలపై స్వల్పకాలిక మూలధన లాభాల (ఎస్‌టిసిజి) పన్ను కింద 15 శాతం పన్నుగా చెల్లించాలి. వచ్చే కేంద్ర బడ్జెట్‌లో ఈ తేడాను తొలగించి దీర్ఘకాలిక ఈక్విటీ లాభాలపైనా పన్ను విధించే అవకాశం ఉంది. ఎస్‌టిసిజి కాల పరిమితిని కూడా ఏడాది నుంచి మూడేళ్లకు పెంచుతారని మార్కెట్‌వర్గాల అంచనా. ఇదే జరిగితే స్టాక్ మార్కెట్ కుదుపునకు లోనయ్యే అవకాశం ఉంది. దానికి తోడు పెద్దగా రిస్క్ తీసుకోలేని ఇన్వెస్టర్లు, ఈక్విటీ పెట్టుబడులపై పూర్తిగా వెనక్కి తగ్గే అవకాశం ఉంది.

తొలిసారి ఇల్లు కొనేవారికి..

మరో ఐదేళ్లలో దేశంలో అందరికీ సొంతిల్లు సమకూర్చాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ లక్ష్యం సాకారం కావాలంటే తొలిసారి సొంతిల్లు కొనే వారికి మరిన్ని పన్ను రాయితీలు కల్పించాలి. ఇందుకోసం 2016-17 ఆర్థిక సంవత్సరానికి ప్రకటించినట్టు రూ.50 లక్షల వరకు ధర ఉండే ఇళ్లు, ఫ్లాట్లు కొనేవారికి, ఏటా మరో రూ.50,000 వరకు పన్ను మినహాయింపు ప్రకటించే అవకాశం ఉంది.

ఆర్థిక వ్యవస్థ గాడిన పడుతోందని ప్రభుత్వం చెబుతోంది. అయితే ధరల సెగతో మధ్య తరగతి ప్రజల ఆదాయం ఇంకా గొర్రె తోక బెత్తెడే అన్నట్టు ఉంది. వ్యవసాయంతోపాటు గ్రామీణ ఆర్థిక రంగం 'సాయం' కోసం ఎదురు చూస్తున్నాయి. 2019 లోక్‌సభ ఎన్నికల్లో ఎన్‌డిఎ మళ్లీ అధికారం చేపట్టాలంటే జైట్లీ ఈ బడ్జెట్ నుంచే చర్యలు ప్రారంభించాలి. ఈ విషయాలను పరిగణనలోకి తీసుకుంటే వచ్చే కేంద్ర బడ్జెట్ పెట్టుబడులతో పాటు, ప్రభుత్వ ఖర్చులకూ పెద్దపీట వేసే అవకాశం ఉంది.



హావెల్స్ ఇండియా

షేర్‌షాట్

హావెల్స్ ఇండియా ప్రముఖ ఎలక్ట్రికల్ గూడ్స్ కంపెనీ. పవర్ డిస్ట్రిబ్యూషన్ పరికరాల తయారీలో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు ఉంది. పారిశ్రామిక, గృహావసరాలకు వినియోగించే సర్క్యూట్ ప్రొటెక్షన్ పరికరాలు, కేబుల్స్, వైర్స్, మోటార్స్, ఫ్యాన్స్, మాడ్యులర్ స్విచ్‌లు, హోం అప్లయెన్సెస్, ఎలక్ట్రికల్ వాటర్ హీటర్లు, పవర్ కెపాసిటర్లు, సిఎఫ్ఎల్ ల్యాంప్స్‌తో పాటు పారిశ్రామిక, వాణిజ్య, గృహావసరాలకు అవసరాలకు ఉపయోగించే ల్యుమినరీస్‌ను తయారు చేస్తోంది. డజను ప్లాంట్లను కలిగి ఉన్న ఈ కంపెనీ ప్రపంచవ్యాప్తంగా 40 దేశాల మార్కెట్లలో తన ముద్రను కలిగి ఉంది. 40 శాఖలతో మొత్తం 7,575 డీలర్ నెట్‌వర్క్‌ను దేశవ్యాప్తంగా కలిగి ఉంది. ఇవికాకుండా హావెల్స్ గెలాక్సీ పేరుతో ఎక్స్‌క్లూజివ్ బ్రాండ్ షాపులను నిర్వహిస్తోంది. డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్‌ను వరుసగా పెంచుకోవటంతో పాటు కొత్త ప్రాంతాలకు విస్తరించటంలో దృష్టి పెట్టినందున సమీప భవిష్యత్తులో రెవెన్యూను పెంచుకోవటం సులభం అవుతుంది. ఎలక్ట్రికల్ కన్స్యూమర్ డ్యూరబుల్స్ ద్వారా 22 శాతం, స్విచ్‌గేర్స్ ద్వారా 23 శాతం, లైటింగ్, ఫిక్చర్స్ ద్వారా 16 శాతం, కేబుల్స్ ద్వారా 39 శాతం రెవెన్యూ వస్తోంది. 2016-17 ఆర్థిక సంవత్సరంలో రాబడిలో 14 శాతం మేర వృద్ధిని సాధించింది. 2016లో సిల్వేనియాలో పెట్టుబడులను వెనక్కు తీసుకున్న హావెల్స్.. లాయిడ్ ఎలక్ట్రికల్స్‌ను కొనుగోలు చేసింది. దీంతో కన్స్యూమర్ డ్యూరబుల్స్‌లోని వైట్ గూడ్స్ విభాగంలోకి ప్రవేశించినట్లైంది. లాయిడ్స్ దేశవ్యాప్తంగా నెట్‌వర్క్‌తో పాటు మంచి బ్రాండ్ గుర్తింపును కూడా కలిగి ఉంది. ఎయిర్ కండీషనర్స్, రిఫ్రిజిరేటర్లు, వాటర్ హీటర్స్, టెలివిజన్ తదితర గృహోపకరణాల రంగంలో ఉన్న లాయిడ్స్ టేకోవర్‌తో హావెల్స్ ఎలక్ట్రికల్ కన్స్యూమర్ రంగంలోని అన్ని విభాగాలకు విస్తరించినట్లైంది. రాబడిలో 3-4 శాతం మేర ప్రకటనల మీద వెచ్చిస్తుండటంతో బ్రాండ్ ప్రమోషన్‌తో పాటు వృద్ధి రేటును పెంచుకోవటానికి వీలైంది. పట్టణీకరణ, అందరికీ గృహాలు, 100 శాతం విద్యుదీకరణ, పెరుగుతున్న మధ్యతరగతి వర్గం, బ్రాండెడ్ గృహోపకరణాలపై ఆసక్తి వంటి అంశాలు కంపెనీకి సమీప భవిష్యత్తులో సానుకూలాంశాలు. గత ఐదేళ్లుగా సగటున ఏటా 11 శాతం రెవెన్యూ వృద్ధి రేటు, 12 శాతం స్థూల లాభ మార్జిన్లు, 16 శాతం నికర లాభ మార్జిన్లలో వృద్ధి రేటును సాధిస్తూ వస్తోంది.

ఫండమెంటల్స్

గత వారం హావెల్స్ మూడో త్రైమాసిక ఫలితాలను ప్రకటించింది. రూ.1,965.77 కోట్ల రాబడిని సాధించింది. గత ఏడాది ఇదే కాలంతో పోల్చితే 21.19 శాతం అధికం. ఈ కాలంలో కన్స్యూమర్ డ్యూరబుల్స్ విభాగం రాబడి 26 శాతం పెరగగా, లైటింగ్, ఫిక్చర్స్ రాబడి 21 శాతం పెరిగింది. స్థూల లాభం 15.2 శాతం పెరిగి రూ.253.70 కోట్లకు చేరుకుంది. నికర లాభం 27.06 శాతం వృద్ధితో రూ.194.36 కోట్లకు పెరిగింది. స్థూల లాభ మార్జిన్లు స్విచ్‌గేర్ విభాగం 21 శాతం, కేబుల్స్ 37 శాతం, లైటింగ్ 17 శాతం, ఎలక్ట్రికల్ కన్స్యూమర్ డ్యూరబుల్స్ 25 శాతం చొప్పున పెరిగాయి. కాగా లాయిడ్ కన్స్యూమర్ వ్యాపారం 16 శాతం మేర వృద్ధితో రూ.290 కోట్ల రాబడిని, రూ.48 కోట్ల స్థూల లాభాన్ని సాధించింది. 2020 నాటికి నిర్వహణ లాభ మార్జిన్లు అదనంగా 3 శాతం మేర పెరుగుతాయని అంచనా. రిటర్న్ ఆన్ ఈక్విటీ 15 శాతం మేర ఉంది. ఈ షేరులో 2016 డిసెంబరులో 138 ఫండ్స్ మదుపు చేసి ఉండగా 2017 డిసెంబరు నాటికి 214 ఫండ్స్ మదుపు చేశాయి. మొత్తం 25.03 శాతం వాటా ఎఫ్ఐఐల చేతిలో ఉండగా 3.48 శాతం వాటా మ్యూచువల్ ఫండ్స్ చేతిలో ఉంది.

టెక్నికల్స్

గత వారం ఈ షేరు భారీ వాల్యూమ్స్‌తో ఆల్‌టైమ్ గరిష్ఠ స్థాయిలో క్లోజైంది. గత ఐదేళ్ల అప్‌వార్డ్ చానల్‌కు ఎగువన స్థిరంగా రెండు నెలలుగా ట్రేడవుతూ ఉండటంతో పాటు మరో 37 వారాల అప్‌వార్డ్ చానల్ నుంచి బయటపడటానికి సిద్ధంగా ఉంది. తొమ్మిది వారాల ఓ నీల్ కప్ అండ్ హ్యాండిల్ బ్రేకౌట్ కూడా జరిగింది. స్వల్ప, దీర్ఘకాల మూవింగ్ సగటులకు ఎగువన ట్రేడవుతోంది. రిలేటివ్ ప్రైస్ గత ఎనిమిది నెలలుగా మెరుగుపడుతూ 63 స్థాయికి చేరుకుంది. 50 వారాల సగటు వాల్యూమ్స్ కన్నా ఎక్కువగా గత వారం నమోదు అవడం ద్వారా అక్యుములేషన్ భారీగా జరుగుతోంది. ఆర్ఎస్ఐలో ట్రయాంగిల్ బ్రేకౌట్‌తో పాటు బుల్లిష్ జోన్‌లో ఉంది. ట్రెండ్ బలాన్ని తెలిపే ఎడిఎక్స్ కూడా ఎగువ ముఖంగా 20 స్థాయిలో ఉంది. ఈ షేరును వచ్చే వారం రూ.570 నుంచి రూ.600 మధ్యన కొనుగోలు చేయవచ్చు. టెక్నికల్ స్టాప్‌లాస్ రూ.505. స్వల్పకాలిక లక్ష్యం రూ.680 - రూ.710. వచ్చే 12 నుంచి 18 నెలల కాలంలో ఈ షేరు లక్ష్యం రూ.960.

టి బ్రహ్మచారి, హెడ్, అసోసియేషన్ ఆఫ్ టెక్నికల్ మార్కెట్ ఎనలిస్ట్, హైదరాబాద్ చాప్టర్, tbchary@gmail.com

మాక్స్ లైఫ్ 'ఆన్‌లైన్ సేవింగ్స్ ప్లాన్'

మాక్స్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ సరికొత్త ఆన్‌లైన్ యులిప్ పాలసీ తీసుకొచ్చింది. డిజిటల్ టెక్నాలజీని ఎక్కువగా ఉపయోగిస్తున్న వారిని దృష్టిలో ఉంచుకుని కంపెనీ 'మాక్స్ లైఫ్ ఆన్‌లైన్ సేవింగ్స్ ప్లాన్' పేరుతో ఈ పాలసీ ప్రారంభించింది. ఆయా వ్యక్తుల భవిష్యత్ ఆర్థిక లక్ష్యాలతోపాటు జీవితంలోని వివిధ దశల్లో ఎదురయ్యే ఆర్థిక అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ పాలసీని రూపొందించినట్టు కంపెనీ పేర్కొంది. ఈ పథకం వెల్త్ సొల్యూషన్, చైల్డ్ సొల్యూషన్ పేరుతో రెండు వేరియంట్స్‌లో లభిస్తుంది. పాలసీ గడువు ఐదేళ్ల నుంచి 30 సంవత్సరాలు. 18 నుంచి 60 సంవత్సరాల మధ్య వయస్కులు ఈ యూలిప్ పథకంలో చేరవచ్చు. చైల్డ్ సొల్యూషన్ వేరియంట్ పాలసీ గడువులో పాలసీ తీసుకున్న వ్యక్తి చనిపోతే భవిష్యత్ ప్రీమియం చెల్లింపుల నుంచి పూర్తి మినహాయింపు లభించడంతో పాటు పాలసీ కవరయ్యే పిల్లలకు పాలసీలో హామీ ఇచ్చిన అన్ని ఆర్థిక ప్రయోజనాలు అందజేస్తారు.

కోటక్ సెక్యూరిటీస్ 'వాట్సప్' ట్రేడింగ్

దేశీయ బ్రోకరేజ్ సంస్థ కోటక్ సెక్యూరిటీస్ తన ఖాతాదారుల కోసం 'వాట్సప్' ఆధారిత ట్రేడింగ్ సదుపాయాన్ని అందుబాటులోకి తెచ్చింది. చాయ్ టు ట్రేడ్ పేరుతో కంపెనీ ఈ సదుపాయాన్ని ప్రారంభించింది. ఈ సంస్థ ఇప్పటికే తన ఖాతాదారులకు వాట్సప్ ద్వారా కొన్ని సేవలు అందిస్తోంది. ఇప్పుడు కొత్తగా ట్రేడింగ్ కూడాప్రారంభించింది. ఇప్పటికే ఉన్న కంపెనీ యాప్, వెబ్‌సైట్, డీలర్లను కాల్ చేయడం ద్వారా జరిపే ట్రేడింగ్‌తోపాటు కొత్తగా వాట్సప్ ద్వారా కూడా ఖాతాదారులు ట్రేడింగ్ చేయవచ్చు.

సీనియర్స్ కోసం మ్యూచువల్ ఫండ్స్

పదవీ విరమణ (రిటైర్‌మెంట్) తర్వాత ఎవరికీ రెగ్యులర్ రాబడి ఉండదు. సంపాదించుకునేటప్పుడు దాచుకున్న డబ్బునే జాగ్రత్తగా వాడుకోవాలి. మిగులు నిధులు ఉన్నా, రాబడులు తక్కువైనా, అసలుకు ధోకా లేకుండా క్రమం తప్పకుండా స్థిర ఆదాయాన్ని ఇచ్చే పెట్టుబడి పథకాల్లో జాగ్రత్తగా పెట్టుబడి పెట్టాలి. ప్రస్తుతం ఈ అవసరాలన్నీ తీర్చే పెట్టుబడి అవకాశాలు చాలా తక్కువ. ఈ విషయాలను దృష్టిలో ఉంచుకునే సీనియర్ సిటిజన్ల మనీ మేనేజ్‌మెంట్ పెద్ద సవాల్ అంటుంటారు.



యాన్యుటీ పథకాల ద్వారా స్థిరమైన మొత్తంలో పెన్షన్‌కు హామీ ఉంటుంది. అయితే ఈ పథకాలపై రాబడులు చాలా తక్కువ. దీంతో ఈ పథకాలపై ఎక్కువ మంది పెద్దగా ఆసక్తి చూపరు. ఫిక్స్‌డ్ డిపాజిట్లపై రాబడులు తక్కువైనా, వార్షిక వడ్డీ ఆదాయం రూ.10,000 దాటితే పన్ను పోటు తప్పదు. ఇంకా వేరే పెట్టుబడి పథకాలేమైనా చూద్దామంటే లాక్ ఇన్ పీరియన్ అడ్డంకి. ముది వయసులో ఉన్న డబ్బుల్లో పైసా లాక్ ఇన్ పీరియడ్ ఉన్న పెట్టుబడుల్లో పెట్టడం ఏ మాత్రం మంచిది కాదు. సీనియర్ సిటిజన్లు ఎదుర్కొనే ఈ సమస్యలకు మ్యూచువల్ ఫండ్స్ పథకాల్లో పెట్టుబడి సరైన పరిష్కారంగా చెప్పవచ్చు. ఈ పథకాల్లో పెట్టుబడులకు తగినంత రక్షణతోపాటు రాబడులూ ఉంటాయి. పన్నుల భారం పెద్దగా ఉండదు. ఎప్పుడైనా పెట్టుబడులను వెనక్కి తీసుకునే అవకాశమూ ఉంటుంది.

డెట్ పథకాలు

పెట్టుబడులకు భద్రతతోపాటు అవసరమైనప్పుడు వెనక్కి తీసుకునేందుకు లిక్విడ్ లేదా స్వల్పకాలిక రుణ పథకాలు ఎంచుకోవాలి. వీటిపై వడ్డీ రేటు బ్యాంకుల ఫిక్స్‌డ్ డిపాజిట్లు, పొదుపు ఖాతా కంటే ఎక్కువ. మూడేళ్ల లోపు ఎప్పుడు కావాలంటే అపుడు పెట్టుబడులు అవసరమనుకునే వ్యక్తులు ఈ పథకాలను ఎంచుకోవచ్చు. మ్యూచువల్ ఫండ్ సంస్థలు ఈ పథకాల ద్వారా సమీకరించిన నిధులను మనీ మార్కెట్ ఇన్‌స్ట్రుమెంట్స్, సర్టిఫికెట్స్ ఆఫ్ డిపాజిట్స్, ట్రెజరీ బిల్స్, కమర్షియల్ పేపర్లు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు, కంపెనీల రుణ పత్రాలవంటి స్వల్ప కాలిక పెట్టుబడి సాధనాల్లో పెట్టుబడి పెడుతుంటాయి. లిక్విడ్ ఫండ్స్ 91 రోజులకు మించని పెట్టుబడి పథకాల్లో ఇన్వెస్ట్ చేస్తాయి. షార్ట్ టర్మ్ మ్యూచువల్ ఫండ్స్ పథకాలు మాత్రం ఆరు నుంచి నాలుగేళ్ల మెచ్యూరిటీ ఉండే పెట్టుబడి పథకాల్లో పెట్టుబడి పెడతాయి. వీటిలో లిక్విడ్ ఫండ్స్‌లో పెట్టుబడులు అత్యంత సురక్షితం.

ఈక్విటీ పథకాలు

పెట్టిన పెట్టుబడులను మూడేళ్లకు పైగా కదిలించే యోచన లేకపోతే మ్యూచువల్ ఫండ్స్ ఆఫర్ చేసే ఈక్విటీ పథకాలను ఎంచుకోవడం మంచిది. ఎంఎఫ్‌లు ఈ నిధులను ఈక్విటీ మార్కెట్‌లో ఇన్వెస్ట్ చేస్తాయి. వీటిపై రాబడులు మార్కెట్ ఆధారంగానే ఉంటాయి. బంగారం, బ్యాంక్ ఫిక్స్‌డ్ డిపాజిట్లు, చిన్న పొదుపు పథకాలతో పోలిస్తే దీర్ఘకాలంలో ఈ పథకాలపై రాబడులు ఎక్కువ. ఈక్విటీ పెట్టుబడులకు ఉండే రిస్కు ఈక్విటీ పథకాల్లో పెట్టుబడులకు ఉంటుందనే విషయం మర్చిపోవద్దు. అయితే మూడేళ్లకు మించి ఈ పథకాల్లో పెట్టుబడులు ఉంచితే మార్కెట్ ఆటుపోట్లను తట్టుకుని మంచి రాబడులు పొందవచ్చు. ఒకేసారి కాకుండా మార్కెట్‌లో దిద్దుబాటు వచ్చినపుడల్లా ఈ పథకాల యూనిట్లు కొనుగోలు చేయడం మంచిది.

ఎప్పుడైనా రిడీమ్ చేసుకోవచ్చు

లిక్విడ్ పథకాల్లో పెట్టుబడులను అవసరమైతే ఒక్క రోజులోనే వెనక్కి తీసుకోవచ్చు. ఈ పథకాల్లో లాక్ ఇన్ పీరియడ్ గానీ, ఎగ్జిట్ లోడ్ గానీ ఉండవు. ఈక్విటీ పథకాల నుంచీ ఎప్పుడైనా యూనిట్లను రిడీమ్ చేసుకోవచ్చు. కాకపోతే ఏడాదిలోపు యూనిట్లను రిడీమ్ చేస్తే ఒక శాతం ఎగ్జిట్ లోడ్ పడుతుంది. ఎగ్జిట్ లోడ్, ఖర్చులపై నిర్ధారణకు వచ్చాకే మ్యూచువల్ ఫండ్స్ యూనిట్లు రిడీమ్ చేసుకోవాలి.

రుణ పథకాల లాభాలపై పన్ను

ఏ ఇతర పెట్టుబడి సాధనాలతో పోల్చినా మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులతో పన్ను ప్రయోజనాలు ఎక్కువ. లిక్విడ్ ఫండ్స్‌తోపాటు అన్ని రకాల డెట్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసినా ఇదే పరిస్థితి. మూడేళ్ల కంటే తక్కువ కాలం ఉంచి పెట్టుబడులు విక్రయించడం ద్వారా వచ్చే లాభాలపై స్వల్పకాలిక మూలధన లాభాల పన్ను (ఎస్‌టిజిసి) చెల్లించాలి. మూడేళ్లకు మించి ఉంచి అమ్మితే వచ్చే లాభాలు దీర్ఘకాలిక మూలధన లాభాల (ఎల్‌టిజిసి) పరిధిలోకి వస్తాయి. ఎస్‌టిజిసి ఆయా వ్యక్తుల ఆదాయ శ్లాబు ప్రకారం, ఎల్‌టిజిసి ఇండెక్సేషన్ బెనిఫిట్‌తో కలిసి 20.6 శాతం చొప్పున విధిస్తారు.

ఈక్విటీ పథకాలపై పన్ను లేదు

రాబడుల పరంగానేకాకుండా పన్ను ప్రయోజనాల రీత్యా చూసినా ఈక్విటీ పథకాలు ఆకర్షణీయంగా కనిపిస్తాయి. ఈ పథకాల్లో పెట్టుబడులను ఏడాదికిపైగా ఉంచి అమ్మగా వచ్చే లాభాలపై ఎలాంటి పన్ను ఉండదు. గత 12 నెలల్లో అనేక ఈక్విటీ పథకాలు ఎలాంటి పన్ను పోటు లేకుండా ఇన్వెస్టర్లకు 30 నుంచి 50 శాతం రాబడులు పంచాయి.

పెట్టుబడుల ఖర్చులు

ఏదైనా మ్యూచువల్ ఫండ్ పథకంలో ఇన్వెస్ట్ చేసే ముందు ఎగ్జిట్ లోడ్, ఖర్చులు నిష్పత్తి తెలుసుకోవాలి. చాలా మంది ఏజెంట్లు ఈ విషయాలు పూర్తిగా వెల్లడించకుండా మ్యూచువల్ ఫండ్స్ పథకాలను మార్కెట్ చేస్తుంటారు. ఇందుకు మ్యూచువల్ ఫండ్స్ సంస్థల నుంచి వారికి ఫీజు ముడుతుంది. బ్యాంక్‌బజార్ కూడా కొద్దిపాటి ఫీజు తీసుకునే మ్యూచువల్ ఫండ్ సంస్థల యూనిట్లను మార్కెట్ చేస్తుంది. కాకపోతే అందుకు ప్రతిగా మంచి రాబడులు ఇచ్చే పథకాలనే ఇన్వెస్టర్ల ముందు ఉంచుతుంది. ఈ పథకాల రోజువారీ ఎన్ఎవి ఎప్పటికప్పుడు డాష్‌బోర్డులో చెక్ చేసుకోవచ్చు. మ్యూచువల్ ఫండ్స్ గురించి మీకు పూర్తిగా తెలుసనుకుంటే డైరెక్ట్ ప్లాన్లను ఎంచుకోవడం మంచిది. దీనివల్ల ఖర్చుల నిష్పత్తి తగ్గుతుంది. అయితే ఒక్కోసారి నష్టపోయే ప్రమాదమూ ఉంది.

స్వల్పకాలానికైనా, దీర్ఘకాలానికైనా ఏ ఇతర పెట్టుబడులతో పోల్చినా, మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులు ఏ విధంగా చూసినా ఎక్కువ ప్రయోజనాలు సమకూరుస్తాయి. సీనియర్ సిటిజన్లకైతే పెట్టుబడుల భద్రతతో పాటు, తేలిగ్గా వెనక్కి తీసుకునే అవకాశం, పన్ను ప్రయోజనాలు కల్పిస్తాయి.



■ **అదిల్ షెట్టి**, సిఇఒ, బ్యాంక్ బజార్





తేళ్లు కుట్టని దర్గా

'గోడ మీద బొమ్మ.. గొలుసుల బొమ్మ.. వచ్చిపోయే వారికి వడ్డించు బొమ్మ'.. అనగానే 'తేలు' ఠక్కుమని గుర్తొస్తుంది. వచ్చిపోయే వారికే వడ్డించే ఆ గొలుసుల బొమ్మలు.. ఉత్తరప్రదేశ్‌లోని అమ్రోహాలో ఉన్న సయ్యద్ హుస్సేన్ షర్ఫుద్దీన్ షా విలాయత్ దర్గాలో మాత్రం అసలు కుట్టనే కుట్టవు. సయ్యద్ హుస్సేన్ షర్ఫుద్దీన్ షా.. 13వ శతాబ్దానికి చెందిన సూఫీ సాధువు. ఇరాన్ నుంచి భారత దేశానికి వచ్చి స్థిరపడ్డారు. ఉత్తరభారతదేశంలో తొలి ఉర్దూ కవిగా కూడా ఆయనకు పేరుంది. భక్తులు ఆయన్ను దాదాషా విలాయత్‌గా వ్యవహరిస్తారు. ఆయన దర్గాకొచ్చేవారు ఆ ప్రాంగణంలో ఉండే తేళ్లను చేతిమీద వేసుకుని కదిలించినా.. పట్టు

ని-దర్శనం
Nidarshanam

కున్నా.. వాటిని ఏం చేసినా అవి కుట్టవు. కొంతమంది ఆ తేళ్లను ఇంటికి కూడా పట్టుకెళ్తారు. అయితే, అందుకు దర్గా నిర్వాహకుల అనుమతి కావాలి. ఒక నిర్ణీత తేదీ చెప్పి అప్పటిదాకా వాటిని ఉంచుకోవచ్చు. తర్వాత తెచ్చి దర్గాలో వదిలేయాలి. ఆ తేదీ దాకా తేళ్లు వారి ఇంట్లో కూడా కుట్టవని.. ఆ తేదీ దాటినా ఇంట్లోనే ఉంచుకుంటే మాత్రం కుడతాయని చెబుతారు.

ఎందుకిలా?

దాదాషా దర్గా ప్రాంగణంలో తేళ్లు కుట్టకపోవడం ఆయన మహిమేనని భక్తులు విశ్వసిస్తారు. అందుకు నిదర్శనంగా ఒక కథ చెబుతారు. అదేంటంటే.. దాదాషా ఇరాన్ నుంచి అమ్రోహా ప్రాంతానికి వచ్చినప్పుడు.. అప్పటికే అక్కడ ఉన్న హజ్రత్ ఖ్వాజా గెసో దరాజ్ రహమతుల్లా అలే ఆయనకు నీటితో నిండిన కప్పు ఒకటి పంపించారు. 'నా వల్ల ఈ ప్రాంతం ఇప్పటికే ఆధ్యాత్మికతతో నిండిపోయింది' అని దాని అర్థం. ఆ కప్పును చూసిన దాదా షా చిరునవ్వు నవ్వి.. దాంట్లో ఒక గులాబీ పువ్వు పెట్టి వెనక్కి పంపించారట. అప్పుడు హజ్రత్ ఖ్వాజా.. 'నీ ప్రాంగణంలో తేళ్లుంటాయి' అని సమాధానం పంపగా.. 'అవి ఎవరినీ కుట్టవు' అని దాదాషా అన్నారట. అందుకే ఆ ప్రాంగణంలో ఇప్పటికీ తేళ్లు కుట్టవని నమ్మిక.



అబ్బ.. పురుష్!

అమ్మాయిలకు మించి మేకప్‌లో అబ్బాయిలు

మేన్లీ లుక్‌లో అమ్మాయిలు.. జపాన్‌లో 'జెండర్‌లెస్' ట్రెండ్



టోక్యో వీధుల్లో 'నువ్వు ఎవరు' అని అడిగితే.. 'జెండర్ లెస్' అని బదులిచ్చే కుర్రాళ్లు చాలామందే కనిపిస్తారు.. పెదాలు తడి చేసుకుంటూ! ముఖానికి ఫౌండేషన్ వేసుకుని..పెదాలకు లిప్‌స్టిక్..హెయిర్‌కు డై అప్లై చేసి.. కళ్లకు ఐ షాడో, బుగ్గలకు బ్లష్‌తో వయ్యారంగా నడిచే అబ్బాయిలు జపాన్‌లో పెరిగిపోతున్నారు. దీనినే 'జెండర్‌లెస్ స్టైల్' అని పిలుస్తున్నారు. 'మేం గే కాదు. ట్రాన్స్‌జెండర్స్ అంతకంటే కాదు. మగాళ్లుగా పుట్టినా..మా మనసుకు నచ్చిన, మా శరీరానికి తగిన డ్రెస్సులు వేసుకుంటున్నాం. అమ్మాయిలు మా జీన్స్, టీషర్టులు వేసుకుంటుంటే..మేం మేకప్ వేసుకుని స్కర్టుల్లో తిరగకూడదా? మాకు ఎలాంటి జెండర్ లేదు' అని చెబుతున్నారు ప్రముఖ మోడల్ యూచెల్!

అబ్బాయిల బ్యాగుల్లో మేకప్ కిట్స్

టోక్యోలో చాలామంది అబ్బాయిల దగ్గర కాస్మెటిక్స్ ప్రొడక్ట్స్ కనిపిస్తున్నాయి. మాయిశ్చరైజర్లు, ఫౌండేషన్, పౌడర్, బ్లష్, ఐ షాడో, ఐ లైనర్ పెన్సిల్స్, లిప్ లైనర్స్, మస్కారా, లిప్‌స్టిక్ ఇలా సకల సౌందర్య సాధనాలనూ పర్సుల్లో పెట్టుకుని తిరుగుతున్నారు. అమ్మాయిల్లా మ్యాచింగ్ డ్రెస్సులు, గోళ్ల రంగులు వేసుకుని సరికొత్తగా కనిపిస్తున్నారు. మరోవైపు చొక్కా మడతపెట్టి, కండలు చూపిస్తూ..మేన్లీ లుక్‌లో కనిపించడానికి అమ్మాయిలు ప్రయత్నిస్తున్నారు. చూడ్డానికి అమ్మాయిల్లా ఉన్నా తమకు పురుష దుస్తుల్లోనే సౌకర్యంగా ఉంటుందంటున్నారు జెండర్‌లెస్ గాళ్స్! నిజానికి జపాన్ నాటకాల్లో పురుష పాత్రలను స్త్రీలు, స్త్రీ పాత్రలను పురుషులు ధరించే సంప్రదాయం ఉంది. అంతేకాదు క్రాస్ డ్రెస్సింగ్ క్లబ్‌లు కూడా జపాన్‌లో చాలా ఉన్నాయి. ఒత్తిడి నుంచి బయటపడటానికి పురుషులు స్త్రీ దుస్తులు ధరించి అలంకరించుకునే సంస్కృతి 20వ శతాబ్దం నుంచి ఉంది. తాజా జెండర్‌లెస్ కల్చర్‌కు కూడా అదే ప్రేరణ కావొచ్చని ఫ్యాషన్ రంగ నిపుణులు భావిస్తున్నారు.

మహిళలను సెక్స్ ఆబ్జెక్ట్స్‌గా చూడరు

జెండర్‌లెస్ పురుషులు మహిళలతో స్నేహంగా ఉంటారు. వారితో గౌరవంగా ప్రవర్తిస్తారు. తోటి పురుష సమాజం పిరికివాళ్లు అని హేళన చేసినా పట్టించుకోరు. మహిళలను సెక్స్ ఆబ్జెక్ట్స్‌గా చూడరు. 'ప్రేమను పంచడమే నిజమైన మగతనం.. మహిళలపై దాడులు చేయడం కాదు' అని నినదిస్తున్నారు జపాన్ జెండర్‌లెస్ మెన్! తమ పిల్లలను చూసుకోవడానికి, ఆప్యాయతలు పంచడానికి పురుషులు ఇంట్లోనే ఉండే 'హౌస్ హస్బెండ్' ట్రెండ్ కూడా జపాన్‌లో ఇటీవల మొదలైంది. పుట్టుకతో మీరు ఎవరైనాసరే మనసుకు నచ్చిన విధంగా దుస్తులు వేసుకోండి.. అంటున్నారు జపాన్ ఫ్యాషన్ లవర్స్! 'మగాళ్లు మేకప్ వేసుకోకూడదని ఎక్కడా లేదు. మనసుకు నచ్చేదే ఫ్యాషన్' అంటున్న టోక్యో జెండర్‌లెస్ యూత్ మాటలు సంచలనం సృష్టిస్తున్నాయి.

-సెంట్రల్ డెస్క్



మన్మథుడు సినిమాలో నాగార్జున కళ్లకు లిప్‌స్టిక్ వేసుకుంటాడు. జబర్దస్త్‌లో ఆంటీ వేషాల్లోనే అంకుల్స్ పాపులర్ అయ్యారు. ఇదంతా నటన వరకే! కానీ జపాన్‌లో పరిస్థితి అలా లేదు! కుర్రాళ్లు మేకప్ రూమ్‌లోకి వెళ్తే రెండు గంటలకుగాని బయటకు రావడం లేదు. రోజూ అమ్మాయిలకు మించి ముస్తాబవుతున్నారు. గాళ్ లుక్‌లో ఫొటోలకు ఫోజులిస్తూ పొంగిపోతున్నారు. అబ్బాయిలయ్యుండి లిప్‌స్టిక్ లేంట్రా? అంటే.. 'ప్లీజ్..మేం మగాళ్లం కాదు. ఆడపిల్లలం కూడా కాదు. మాకు ఏ జెండర్ లేదు' అని బదులిస్తున్నారు. పైగా ఫ్యాషన్లన్నీ అమ్మాయిలకేనా? అబ్బాయిలు స్కర్టులు వేసుకోకూడదా? అని ప్రశ్నిస్తున్నారు. మరోవైపు అమ్మాయిలు మేన్లీ లుక్‌లో ఫ్యాషన్ షోలలో అదరగొడుతున్నారు. జపాన్ ఫ్యాషన్ ప్రపంచంలో ఈ 'జెండర్‌లెస్ స్టైల్' సంచలనం సృష్టిస్తోంది.



దోమలకూ కుటుంబ నియంత్రణ

లార్వా దశలోనే నాశనం చేసే కొత్త విధానం


'జన్యు' మగ దోమతో సంతానానికి చెక్.. భారత సంతతి శాస్త్రవేత్త ఘనత



దోమ కాటుకు మలేరియా, డెంగ్యూ, చికున్ గున్యా, జికా వంటి వివిధ రకాల జ్వరాల బారిన పడుతుంటాం. వీటికి చికిత్సలు చేయించుకుంటున్నాం తప్ప.. దోమల పని పట్టడం లేదు. ఆడ దోమలే జ్వరాలు, వ్యాధులకు కారకాలు. అందుకే వాటిని లక్ష్యంగా చేసుకొని సుశాంత కే బెహురా అనే భారత సంతతి శాస్త్రవేత్త నేతృత్వంలోని బృందం దోమల భరతం పట్టేందుకు సరికొత్త జన్యు అణువులను (జన్యుసవరణ) కలిగిన మగ దోమలను అభివృద్ధి చేశారు. డెంగ్యూకు కారణమయ్యే 'ఏడెస్ ఈజిప్టీ' అనే ఒక జాతి ఆడ దోమలను అంతమొందించేందుకు సిద్ధమయ్యారు. ల్యాబ్ వాతావరణంలో దోమల సంతానాన్ని అడ్డుకొనే జన్యువును మగ దోమలో ప్రవేశపెట్టి వాటిని వదిలిపెడుతున్నారు. దాంతో ఆ మగ దోమ.. ఆడ దోమతో సంపర్కం చెందినప్పుడు ఆ జన్యువు ఆడ దోమలోకి చేరుతుంది. పొదిగే గుడ్లు కూడా ఆ జన్యువును కలిగి ఉంటాయి. గుడ్ల దశ నుంచి లార్వా దశకు చేరుకోగానే ఆ జన్యువు దాన్ని క్షీణింపజేసి ప్యూపాగా మారకుండా అడ్డుకుంటుంది. తర్వాత పూర్తిగా నాశనం చేస్తుంది.


జన్యుసవరణ చేసిన దోమలే ఎందుకు?

- మామూలుగా దోమల్ని పని కట్టుకొని చంపడం సాధ్యం కాదు. వాటిని చంపకపోతే రోగాలను ఆపలేం.
- అదే జన్యు సవరణ చేసిన మగ దోమలైతేనే దోమల సంతానోత్పత్తిని అడ్డుకోగలవు.
- ఒక తరం దోమల పుట్టుకను ఈ 'జన్యు' దోమలు అడ్డుకోగలవు. దీంతో పర్యావరణానికి హాని అంతగా ఉండదని అమెరికాలోని మిస్సోరీ వర్సిటీ శాస్త్రవేత్తలు తెలిపారు.



మామూలు దోమల పుట్టుక తీరు

'జన్యు అణువుల (జీఎం)' దోమ ఎలా పనిచేస్తుందంటే..



శరీరంలోని అవయవాలు బయటకు కనిపిస్తాయ్!

సీటీ స్కాన్, ఎమ్మారై చిత్రాలను ఒక రిపోర్టులో చూడాలి. దాన్ని బట్టే వైద్యులు రోగ నిర్ధారణ చేస్తారు. అయితే.. శరీరంలోని లోపలి భాగాలను శరీరంపైనే చూస్తే ఎలా ఉంటుంది? అదెలా సాధ్యం అనుకుంటున్నారా? కెనడాలోని యూనివర్సిటీ ఆఫ్ అల్బెర్టా శాస్త్రవేత్తలు దాన్ని సుసాధ్యం చేసి చూపించారు. 'ఆగుమెంటెడ్ రియాలిటీ(ఏఆర్)'తో 'ప్రాజెక్టు డీఆర్' అనే వ్యవస్థను అభివృద్ధి చేసి సీటీ స్కాన్, ఎమ్మారై డేటాను బట్టి శరీర అంతర్గత నిర్మాణాన్ని శరీరంపై చూపించి వహ్వా! అనిపించారు. రోగి శరీరంపై మార్కింగ్ పాయింట్లు ఏర్పాటు చేసి, ఇన్‌ఫ్రారెడ్ కెమెరాలతో మోషన్ ట్రాకింగ్ వ్యవస్థను కూడా అభివృద్ధి చేశారు. అంటే.. శరీరం వంకలు తిరిగినా.. దానికి తగ్గట్టే శరీరంలోని అవయవాలు మన కళ్ల ముందు ఆవిష్కృతమవుతాయి. (ఉదాహరణకు శరీరం ముందుభాగాన్ని చూపినపుడు ముందు భాగంలోని ఎముకలు, గుండె, జీర్ణాశయం కనబడుతాయి. శరీరాన్ని తిప్పుతూ వీపు భాగాన్ని చూపినపుడు వెనుకభాగంలోని ఎముకలు కనబడుతాయన్న మాట.) అంతేకాదు, కేవలం రక్తనాళాలు చూడాలంటే రక్తనాళాలు.. ఊపిరితిత్తులు మాత్రమే చూడాలంటే ఆ ఒక్క అవయవమే కనబడేలా పరిశోధకులు ఈ వ్యవస్థను రూపొందించారు. అంతర్గత నిర్మాణ బోధనకు, ఫిజియోథెరపీకి, లాప్రోస్కోపిక్ సర్జరీకి, శస్త్రచికిత్స ప్రణాళికకు ఏఆర్ వ్యవస్థ ఉపయుక్తంగా పనిచేస్తుందని శాస్త్రవేత్తలు తెలిపారు.





విదేశాల్లో వ్యాపార యోగం

- యోగా ఉపకరణాలకు పెరుగుతున్న డిమాండ్

ప్రపంచానికి ఆరోగ్య యోగాన్ని అందించిన ఘనత భారత్‌కే దక్కుతుంది. అనేక దేశాల్లో భారతీయ యోగ శాస్త్రాన్ని అభ్యసిస్తున్నారు. యోగ విద్యను సాధన చేసి జీవితాన్ని ఆస్వాదిస్తున్నారు. ఈ నేపథ్యంలో యోగా ఉపకరణాలు, పరికరాలకు విదేశాల్లో డిమాండ్ పెరుగుతోంది. ఆస్ట్రేలియా, కెనడా సహా అనేక దేశాల్లో యోగా మార్కెట్ వేగంగా విస్తరిస్తోందని అంబికా యోగా కుటీర్ ప్రధాన కార్యదర్శి రామచంద్ర సర్వే పేర్కొన్నారు. 'నేతి పాత్ర' అనే గుండ్రని సంప్రదాయ పాత్రకు డిమాండ్ విపరీతంగా ఉందని తెలిపారు. గత నెల్లో ఆస్ట్రేలియాకు వెయ్యి, కెనడాకు 800 నేతి పాత్రలు సరఫరా చేశామని వెల్లడించారు. విదేశాల్లో రకరకాల ఎలర్జీలతో బాధపడేవారు యోగాతో ఆరోగ్యాన్ని పొందుతున్నారని ఆయన చెప్పారు. అంబికా యోగా కుటీర్‌కు ప్రపంచ వ్యాప్తంగా 91 శాఖలున్నాయి. యోగా, ఆయుర్వేదాలతో దీర్ఘకాలిక రోగాలకు ఈ సంస్థ చికిత్సను అందిస్తోంది. ఆరోగ్య కేంద్రాలు, ఆశ్రమాలు, స్కూళ్లు, అంగన్వాడీలలో యోగ శిక్షణను తప్పనిసరి చేయాలని మహారాష్ట్ర ప్రభుత్వానికి సూచించింది. దీంతోబాటు యోగా శిక్షణ కేంద్రాలు ఎన్ని ఉన్నా.. ఒకే బోధనా పద్ధతి ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరింది.

రేప్‌లకు స్కర్టులతో సంబంధం ఏంటి?

నిండా కప్పుకున్నా జరుగుతున్న అత్యాచారాలు

బెల్జియంలో రేప్ బాధితుల దుస్తుల ప్రదర్శన



అత్యాచారాలకు, మహిళల వస్త్రధారణకు ముడిపెట్టే నేతలు, పోలీసు అధికారులకు కొదవ లేదు. మహిళలు రెచ్చగొట్టే పొట్టి దుస్తులు ధరించడం వల్లే రేప్‌లు జరుగుతున్నాయని అబూ ఆజ్మీ వంటి నేతలు గతంలో నోరు పారేసుకున్నారు. విదేశీ మహిళలు విమానాశ్రయాల్లో స్కర్టులు ధరించవద్దని సలహా ఇచ్చిన నేతలూ ఉన్నారు. అలాంటి వారికి కనువిప్పు కలిగేలా బెల్జియంలో ఓ ప్రదర్శన నిర్వహిస్తున్నారు. అత్యాచారం జరిగినప్పుడు బాధితులు ధరించిన దుస్తుల నమూనాలను బ్రస్సెల్స్‌లోని కమ్యూనిటీ సెంటర్‌లో ప్రదర్శిస్తున్నారు. రేప్‌కు వస్త్రధారణకు సంబంధం లేదని నినదిస్తున్నారు. ఈ ప్రదర్శనలో మూడేళ్ల పసిపాప టీషర్ట్ ఉండడం కలచి వేస్తోంది. మరి ఏ రెచ్చగొట్టే దుస్తులు వేసుకున్నారని పసిపిల్లలపై అఘాయిత్యాలు జరుగుతున్నాయి? అని ప్రశ్నిస్తోంది మహిళా లోకం! 'డ్రెస్సింగ్ వల్లే రేప్‌లు జరుగుతున్నాయన్న ప్రచారాలను సవాల్ చేయడానికే ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశాం' అని నిర్వాహకురాలు లీష్‌బెత్ కేన్స్ పేర్కొన్నారు.



కోర్సు కొత్తగా.. మారుతోంది ఇంజనీరింగ్

- జాబ్ మార్కెట్‌కు సరిపోయే స్కిల్స్ ఉండటం లేదు..
- పరిశ్రమ కోరుకుంటున్న సామర్థ్యాలు అసలు లేవు..
- పరిశ్రమ అవసరాలకు, సిలబస్‌కు మధ్య గ్యాప్ ఉంటోంది..



ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్లు, కోర్సు విషయంలో తరచుగా వినిపించే మాటలు. దేశంలో ఏటా లక్షల మంది ఇంజనీరింగ్ పూర్తి చేస్తున్నప్పటికీ.. అందులో పరిశ్రమలు ఆశిస్తున్న నైపుణ్యం గల వారు కొద్దిమందే ఉంటున్నారు. ఈ నేపథ్యంలో దశాబ్దాలుగా ఒకే తరహాలో కొనసాగుతున్న ఇంజనీరింగ్ కరిక్యులమ్‌లో మార్పులకు రంగం సిద్ధమైంది. మారుతున్న పరిస్థితులను పరిగణనలోకి తీసుకొని స్కిల్డ్ మ్యాన్‌పవర్‌ను రూపొందించడంతోపాటు పరిశ్రమలు, జాబ్ మార్కెట్ కోరుకుంటున్న నైపుణ్యాలను, ఆధునిక సాంకేతిక సామర్థ్యాలను పెంపొందించే విధంగా ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఏఐసీటీఈ).. ఇంజనీరింగ్ కోర్సు కరిక్యులమ్‌లో భారీ మార్పులు చేసింది.

కరిక్యులమ్ రూపకల్పనకు ఏఐసీటీఈ గత రెండేళ్లుగా కృషి చేస్తోంది. ఇందుకు ఐఐటీ ప్రొఫెసర్లు, నిపుణులు, పరిశ్రమ వర్గాలతో సబ్జెక్ట్‌ల వారీగా ఉప కమిటీలను ఏర్పాటు చేసింది. క్షేత్రస్థాయి పరిస్థితులను అధ్యయనం చేశాకే కమిటీలు ఇచ్చిన సూచల మేరకు థియరీ కంటే ప్రాక్టికల్స్‌కు ప్రాధాన్యం ఇచ్చేలా, పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా ఉండేలా ఇంజనీరింగ్ కరిక్యులమ్‌లో ఏఐసీటీఈ మార్పులు చేర్పులు చేసింది. అంతేకాకుండా విద్యార్థుల్లో ఉద్యోగ నైపుణ్యాలను పెంపొందించే అంశం మీద కూడా ప్రధానంగా దృష్టి సారించింది. సక్సెస్‌ఫుల్ ఇంజనీర్‌గా నిలవాలంటే టెక్నికల్ నాలెడ్జ్‌తోపాటు సామాజిక స్పృహ అవసరం అనే అంశానికి కూడా ఏఐసీటీఈ ప్రాధాన్యం ఇచ్చింది.

ప్రాక్టికల్స్‌కు ప్రాధాన్యం.. నిరంతరం సమీక్ష

ఇంజనీరింగ్ డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులు ఇండస్ట్రీ రెడీగా ఉండటం లేదనే వాదన పరిశ్రమ వర్గాల నుంచి తరచుగా వినిపిస్తుంది. ప్రాజెక్ట్ వర్క్ మినహాయిస్తే ఇంజనీరింగ్ కోర్సులో విద్యార్థులకు ప్రాక్టికల్ నైపుణ్యాలు లభించే పరిస్థితి చాలా తక్కువ. ఈ నేపథ్యంలో ప్రాక్టికల్స్‌కు ప్రాధాన్యం ఇచ్చేలా కరిక్యులమ్‌ను సవరించారు. అంతేకాకుండా పరిస్థితులకు అనుగుణంగా ఏఐసీటీఈ కరిక్యులమ్‌ను నిరంతరం సమీక్షిస్తుంది. ఆ మేరకు అవసరమైన మార్పులు, చేర్పులు చేస్తుంది. ఏటా కరిక్యులమ్‌లో చేయాల్సిన మార్పులు, చేర్పులపై చర్చించడానికి వీలుగా ప్రతి యూనివర్సిటీ ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించింది.

క్రెడిట్స్ 220 నుంచి 160కి

ఇంజనీరింగ్ కోర్సులో ఇప్పటిదాకా థియరీకి 220 క్రెడిట్స్ ఉండగా.. సవరించిన కరిక్యులమ్‌లో దాన్ని 160కి తగ్గించింది. అందులో 14 క్రెడిట్లు సమ్మర్ ఇంటర్న్‌షిప్ ద్వారా సంపాదించాల్సి ఉంటుంది. ఈ మేరకు 150 నుంచి 160 క్రెడిట్లు సాధిస్తే.. ఇంజనీరింగ్ డిగ్రీకి అర్హతగా పరిగణిస్తారు. అదనంగా 20 క్రెడిట్స్ పూర్తిచేస్తే.. ఆనర్స్‌తో కూడిన ఇంజనీరింగ్ డిగ్రీ (అడిషనల్ మైనర్ ఇంజనీరింగ్)కి అర్హులవుతారు.

ఇంజనీరింగ్‌లో పీజీ కోర్సులో మోడల్ కరిక్యులమ్‌లో 68 క్రెడిట్స్ ఉంటాయి. ఈ మేరకు పీజీలో 18 స్పెషలైజేషన్స్‌ను ఆవిష్కరించారు. ఎంబీఏ / పీజీడీఎం కోర్సులకు కనీస క్రెడిట్స్ 102గా నిర్ణయించారు.

ఇంటర్న్‌షిప్ తప్పనిసరి

సవరించిన పాఠ్య ప్రణాళిక ప్రకారం ప్రాక్టికల్ అసైన్‌మెంట్స్‌కు పెద్దపీట వేశారు. ఈ క్రమంలో ప్రతి విద్యార్థికి సమ్మర్ ఇంటర్న్‌షిప్ తప్పనిసరి. ఈ మేరకు విద్యార్థులు సంబంధిత పరిశ్రమలో విధిగా రెండు నుంచి మూడు నెలలపాటు ఇంటర్న్‌షిప్ చేయాలి. సదరు ఉద్యోగం కోసం పరిశ్రమలు, జాబ్ మార్కెట్ ఆశిస్తున్న నైపుణ్యాలను విద్యార్థులు సముపార్జించుకోవాలన్న లక్ష్యంతో ఈ అంశాన్ని ప్రవేశపెట్టారు. ఇంటర్న్‌షిప్స్ ద్వారా ప్రాక్టికల్ ఎక్స్‌పోజర్, రియల్ టైం ఎక్స్‌పీరియన్స్ లభిస్తుంది. తరగతి గదుల్లో బోధించిన అంశాలను వాస్తవ పరిస్థితులకు అన్వయించగలిగే అవకాశం వస్తుంది. సంబంధించిన రంగంలోని ఆధునిక ధోరణులపై అవగాహన ఏర్పడుతుంది.

కాలేజీలు కూడా

- కరికుల్యమ్‌తోపాటు ఇంజనీరింగ్, ఫార్మసీ కాలేజీలు పాటించాల్సిన కొన్ని నిబంధనలను కూడా ఏఐసీటీఈ విడుదల చేసింది. వాటిలో ప్రధానమైనవి..
- గత ఐదేళ్లలో మొత్తం సీట్లలో భర్తీ అయిన సీట్ల సంఖ్య 30 శాతంలోపు ఉంటే ఆ కాలేజీలో సీట్లను 50 శాతానికి కుదిస్తారు.
- ఇంజనీరింగ్ కాలేజీలో ఐదు డివిజన్లు, 300 సీట్లకు మాత్రమే అనుమతిస్తారు.
- బీ ఫార్మసీ కాలేజీలో రెండు డివిజన్లు, 120 సీట్లకు మాత్రమే అనుమతిస్తారు.
- ఫ్యాకల్టీ నిష్పత్తి బీటెక్‌లో 1:20, బీఫార్మసీలో 1:15గా ఉండాలి.
- విజిటింగ్ ఫ్యాకల్టీల సంఖ్య 10 శాతంలోపే ఉండాలి.
- విజిటింగ్ ఫ్యాకల్టీకి పీజీ / పీహెచ్‌డీతోపాటు ఇండస్ట్రీలో 10 - 15 ఏళ్ల అనుభవం ఉండాలి.
- ఏటా ఆగస్టు 1 నుంచి మొదటి సెమిస్టర్, జనవరి 1 నుంచి రెండో సెమిస్టర్ ప్రారంభం కావాలి.
- బీటెక్ ప్రతి ఆరుగురు విద్యార్థులకు, బీఫార్మసీలో ప్రతి ఎనిమిది మంది విద్యార్థులకు ఒక కంప్యూటర్ ఉండాలి.

క్రెడిట్స్ గణన ఇలా

ఒక గంట లెక్చర్ (వారానికి)	ఒక క్రెడిట్
ఒక గంట ట్యూటోరియల్ (వారానికి)	ఒక క్రెడిట్
ఒక గంట ప్రాక్టికల్ (వారానికి)	0.5 క్రెడిట్
రెండు గంటల ప్రాక్టికల్ (వారానికి)	ఒక క్రెడిట్

ఈ నేపథ్యంలో ఇంటర్న్‌షిప్, ప్రాజెక్ట్‌వర్క్, సెమినార్లకు 15 క్రెడిట్స్ కేటాయించారు. పరీక్షల్లో అధిక శాతం అప్లికేషన్ ఓరియెంటేషన్, ప్రాక్టికల్ థింకింగ్‌తో సమాధానాలు ఇచ్చే విధంగా ప్రశ్నపత్రాలను రూపొందించే అవకాశం ఉంది.

సాంకేతికతతోపాటు.. సామాజిక స్పృహ

ఇంజనీరింగ్ విద్యార్థులకు టెక్నికల్‌తోపాటు నాన్ టెక్నికల్ అంశాలపై కూడా అవగాహన ఉండాలనే అంశానికి కూడా ప్రాధాన్యత ఇచ్చారు. ఇంజనీరింగ్ విద్యార్థులకు సామాజిక స్పృహ ఉండటం లేదనే వాదన బలంగా వినిపిస్తోంది. ఈ నేపథ్యంలో చుట్టూ ఉన్న సమాజంలో జరుగుతున్న పరిణామాలను అధ్యయనం చేయాల్సిన అవసరం ఇంజనీరింగ్ విద్యార్థులపై ఉంది. ఈ నేపథ్యంలో ఆయా అంశాలపై అవగాహన కల్పించేందుకు కొన్ని సబ్జెక్ట్‌లను చదవడం తప్పనిసరి చేశారు. ఈ క్రమంలో పర్యావరణ శాస్త్రం, భారత రాజ్యాంగం, ఎథిక్స్, ఎసెన్స్ ఆఫ్ ఇండియన్ ట్రెడిషనల్ నాలెడ్జ్ తదితర సబ్జెక్ట్‌లను ప్రవేశపెట్టారు. ఎసెన్స్ ఆఫ్ ఇండియన్ నాలెడ్జ్‌లో ఇండియన్ ఫిలాసఫీ, లింగ్విస్టిక్స్, యోగా, సంప్రదాయ కళా రూపాలు వంటి అంశాలు ఉంటాయి. తద్వారా భారతీయ సంప్రదాయం, నైతిక విలువలు, సంస్కృతి, వారసత్వం, ప్రభుత్వం - పరిపాలన వంటి విషయాలపై విస్తృత పరిజ్ఞానాన్ని పెంపొందించుకునే అవకాశం విద్యార్థులకు ఏర్పడుతుంది.

బేసిక్స్ టు.. అడ్వాన్స్‌డ్

ప్రస్తుతం ఇంజనీరింగ్ కోర్సులో సీ, సీ++, జావా వంటి అంశాలు ఉన్నాయి. ఇవి బేసిక్స్ అందిస్తాయే తప్ప ప్రస్తుతం వస్తున్న మార్పులకు సరిపోయే ఆధునిక నైపుణ్యాలను కల్పించలేవు. ఈ క్రమంలో విద్యార్థులు నూతన అంశాలపై దృష్టిసారించాలి. ఇందుకోసం ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఓటీ), ఆటోమేషన్, బిగ్ డేటా, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ తదితర అడ్వాన్స్‌డ్ సబ్జెక్ట్‌లకు ఇంజనీరింగ్ సిలబస్‌లో చోటు కల్పించారు. ఈ అడ్వాన్స్‌డ్ సబ్జెక్ట్‌ల అవసరం నేడు ప్రతి రంగంలో ఉంటోంది. కోర్సులోనే వీటిపై పరిజ్ఞానాన్ని పెంచుకుంటే ఉద్యోగ సాధన మరింత సులువుగా మారుతుంది.

సబ్జెక్ట్‌ల వారీగా క్రెడిట్స్

కేటగిరీ	క్రెడిట్స్
హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ (మేనేజ్‌మెంట్ కోర్సులతో కలిపి)	12
బేసిక్ సైన్స్ కోర్సెస్	25
ఇంజనీరింగ్ సైన్స్ కోర్సెస్ (వర్క్‌షాప్, డ్రాయింగ్, బేసిక్ ఎలక్ట్రికల్ / మెకానికల్ / కంప్యూటర్ తదితరాలు కలిపి)	24
ప్రొఫెషనల్ కోర్ కోర్సెస్	48
ప్రొఫెషనల్ ఎలక్టివ్ కోర్సెస్ (స్పెషలైజేషన్ / బ్రాంచ్)	18
ఓపెన్ సబ్జెక్ట్స్ ఎలక్టివ్స్ ఫ్రమ్ అధర్ టెక్నికల్ / ఎమర్జింగ్ సబ్జెక్ట్స్	18
ప్రాజెక్ట్ వర్క్, సెమినార్, ఇంటర్న్‌షిప్	15
మొత్తం	**160**

తప్పనిసరి సబ్జెక్టులకు (ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, ఇండియన్ కాన్‌స్టిట్యూషన్, ఇండక్షన్ ట్రైనింగ్ తదితరాలు) ఎటువంటి క్రెడిట్స్ లేవు.

సిద్ధం చేసేందుకు ఇండక్షన్ ప్రోగ్రామ్

ఇంజనీరింగ్ కోర్సులో చేరిన మొదటి సంవత్సరం విద్యార్థులను తదనుగుణంగా సిద్ధం చేసేందుకు మూడు వారాల ఇండక్షన్ ప్రోగ్రామ్‌ను నిర్వహించాలని ఏఐసీటీఈ సూచించింది. ఈ ప్రోగ్రామ్‌లో ఫిజికల్ యాక్టివిటీ, క్రియేటివ్ ఆర్ట్స్, హ్యూమన్ వాల్యూస్, లిటరరీ, ప్రొఫెషనల్ మాడ్యూల్స్, నిపుణులతో లెక్చర్స్, కాలేజ్ సమీప నివాస ప్రాంతాలకు విద్యార్థులను తీసుకెళ్లడం, ఫెమిలైజేషన్ టు డిపార్ట్‌మెంట్ / బ్రాంచ్ అండ్ ఇన్నోవేషన్ వంటి కార్యక్రమాలు ఉంటాయి.

ప్రొఫెషనల్.. ఓపెన్ ఎలక్టివ్స్

- విద్యార్థులు కేవలం తాము ఎంచుకున్న బ్రాంచ్‌కే పరిమితం కాకుండా ఇతర సబ్జెక్ట్‌ల్లో కూడా అవగాహన పెంపొందించుకునేలా చర్యలు తీసుకున్నారు. తద్వారా భిన్నమైన నైపుణ్యాలను పెంపొందించుకోవడానికి వీలవుతుంది.
- ఇందు కోసం ప్రొఫెషనల్ ఎలక్టివ్ కోర్సెస్, ఓపెన్ ఎలక్టివ్ కోర్సెస్ అనే విధానాన్ని ప్రవేశపెట్టారు.
- ప్రొఫెషనల్ ఎలక్టివ్ కోర్సెస్‌లో విద్యార్థులు తమ బ్రాంచ్ కాకుండా ఇతర ఇంజనీరింగ్ కోర్సులను అధ్యయనం చేయాలి.
- ఓపెన్ ఎలక్టివ్ కోర్సెస్‌లో విద్యార్థులు అందుబాటులో ఉన్న కోర్సుల్లో ఏదైనా కోర్సును ఎంపిక చేసుకోవచ్చు.

ఇండస్ట్రీ రెడీగా..

నూతన కరిక్యులంలో ప్రతిపాదించిన మార్పులు స్వాగతించే విధంగా ఉన్నాయి. తాము ఆశిస్తున్న నైపుణ్యాలు ఇంజనీరింగ్ విద్యార్థుల్లో ఉండటం లేదని పరిశ్రమ వర్గాలు బలంగా వాదిస్తుంటాయి. ఈ నేపథ్యంలో అటువంటి వాదనలకు చెక్ పెట్టి విద్యార్థులను ఇండస్ట్రీ రెడీగా తీర్చిదిద్దడానికి నూతన కరిక్యులం దోహదం చేస్తుంది. ఇంజనీరింగ్ అనేది ఇండస్ట్రీ రిలేటెడ్ టెక్నికల్ ఎడ్యుకేషన్. ఈ టెక్నికల్ ఎడ్యుకేషన్‌లో థియరీ కంటే ప్రాక్టికల్ నాలెడ్జ్ ఎక్కువ ఉండాలి. ఆ దిశలో ప్రాక్టికల్ క్రెడిట్స్‌ను పెంచారు. తద్వారా ప్రాక్టికల్ ఎక్స్‌పోజర్ ఎక్కువగా లభిస్తుంది. ఇందుకు థియరీ సబ్జెక్ట్స్‌ను కొన్నిటిని తగ్గించి ప్రాక్టికల్ సబ్జెక్ట్స్‌ను పెంచారు. అంతేకాకుండా సమ్మర్ ఇంటర్న్‌షిప్‌ను తప్పనిసరి చేశారు. ఇంటర్న్‌షిప్స్ కోసం కొన్ని క్రెడిట్స్ కూడా ఇస్తున్నారు. కరికుల్యమ్‌తోపాటు కాలేజీలకు కూడా ఏఐసీటీఈ కొన్ని సూచనలు చేసింది. ఫ్యాకల్టీ, విద్యార్థి నిష్పత్తిలో కూడా మినహాయింపు ఇచ్చింది.



- ప్రొ. డి. నిరంజన్ బాబు,
ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్,
బాపట్ల ఇంజనీరింగ్ కాలేజ్

జాబ్ కార్నర్

హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్

హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఏఎల్)- తాత్కాలిక ప్రాతిపదికన ఆపరేటర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- ★ మొత్తం ఖాళీలు: **131**
- ★ విభాగాల వారీగా ఖాళీలు: మెషినిస్ట్ 22, టర్నర్ 21, గ్రైండర్ 5, ఫిట్టర్ 59, ఎలక్ట్రానిక్స్ మెకానిక్ 15, ఎలక్ట్రీషియన్ 5, ఇన్‌స్ట్రుమెంటేషన్ మెకానిక్ 4
- ★ అర్హత: 60 శాతం మార్కులతో 10వ తరగతి ఉత్తీర్ణతతోపాటు సంబంధిత ట్రేడ్‌లో ఐటీఐ. ఎన్ఏసీ/ఎన్‌సీటీవీటీ సర్టిఫికెట్ ఉండాలి.
- ★ వయసు: జనవరి 1 నాటికి 28 ఏళ్లు.
- ★ ఎంపిక: రాత పరీక్ష, డాక్యుమెంట్స్ వెరిఫికేషన్ ద్వారా
- ★ కాంట్రాక్ట్ వ్యవధి: నాలుగేళ్లు
- ★ వేతనం: నెలకు రూ.40,000
- ★ దరఖాస్తు ఫీజు: రూ.200
- ★ ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఫిబ్రవరి 14, 2018.
- ★ వెబ్‌సైట్: www.hal-india.com

సతీష్ ధవన్ స్పేస్ సెంటర్

నెల్లూరు జిల్లా, శ్రీహరికోటలోని సతీష్ ధవన్ స్పేస్ సెంటర్- పలు పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.


- ★ మొత్తం ఖాళీలు: **33**
- ★ పోస్టులు: ఫైర్‌మన్ 7, క్యాటరింగ్ అటెండెంట్ 17, కుక్ 8, హిందీ టైపిస్ట్ 1,
- ★ అర్హత: టైపిస్ట్ పోస్టుకు 60 శాతం మార్కులతో డిగ్రీ. డిగ్రీ స్థాయిలో హిందీ ఒక సబ్జెక్టుగా లేదా హిందీ మాధ్యమంలో డిగ్రీ చదివి ఉండాలి. హిందీ టైపింగ్‌లో కంప్యూటర్ మీద నిమిషానికి 25 పదాల వేగం ఉండాలి. మిగిలిన పోస్టులకు 10వ తరగతి ఉత్తీర్ణత చాలు. కుక్ పోస్టుకు కనీసం అయిదేళ్ల అనుభవం ఉండాలి.
- ★ వయసు: పోస్టును అనుసరించి 18 నుంచి 35 ఏళ్లు
- ★ ఎంపిక: రాత పరీక్ష ద్వారా
- ఏ దరఖాస్తు: ఆన్‌లైన్ ద్వారా
- ★ దరఖాస్తుకు చివరి తేదీ: ఫిబ్రవరి 16, 2018.
- ★ వెబ్‌సైట్: www.shar.gov.in

యూపీఎస్సీ

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ)- పలు పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- ★ మొత్తం ఖాళీలు: **28**
- ★ పోస్టులు: అసిస్టెంట్ కమిషనర్ (క్రాప్స్) 1, ఏరోనాటికల్ ఆఫీసర్ 12, సైంటిస్ట్ (మెకానికల్) 2, జూనియర్ సైంటిఫిక్ ఆఫీసర్ 2, అసిస్టెంట్ కెమిస్ట్ 11,
- ★ దరఖాస్తు ఫీజు: రూ.25
- ★ దరఖాస్తు: ఆన్‌లైన్ ద్వారా
- ★ దరఖాస్తుకు చివరి తేదీ: ఫిబ్రవరి 15, 2018.
- ★ వెబ్‌సైట్: www.upsconline.nic.in

అసమానతల నివారణకు కమిటీలు



దేశంలో ప్రాంతీయ అసమానతలను నిర్మూలించే ఉద్దేశంతో చేపట్టాల్సిన చర్యలను సూచించడానికి కేంద్ర ప్రభుత్వం పలు కమిటీలను ఏర్పాటు చేసింది. ఆ కమిటీల సూచనల ఆధారంగా ఎన్నో చర్యలను తీసుకుంది. వాటిల్లో ముఖ్యమైన కమిటీల గురించి తెలుసుకుందాం..

దత్ కమిటీ (1967)

పారిశ్రామికాభివృద్ధి ప్రాధాన్యాన్ని గుర్తించిన ప్రభుత్వం 1951లో పరిశ్రమల, అభివృద్ధి నియంత్రణ చట్టాన్ని రూపొందించింది. ఈ క్రమంలో 1967లో ఇండస్ట్రియల్ లైసెన్సింగ్ పాలసీ ఎంక్వైరీ కమిటీ ఎస్.దత్ అధ్యక్షతన ఏర్పాటైంది. ఈ కమిటీ పారిశ్రామిక లైసెన్సింగ్ విధానాల అమలును సమీక్షించింది. ప్రాంతీయాభివృద్ధికి లైసెన్సింగ్ విధానం, పారిశ్రామిక విధాన తీర్మానం ప్రాధాన్యమివ్వలేదని పేర్కొంది. జారీ చేసిన లైసెన్సుల్లో 62 శాతాన్ని అభివృద్ధి చెందిన మహారాష్ట్ర, వెస్ట్ బెంగాల్, గుజరాత్, తమిళనాడు రాష్ట్రాలే పొందాయని పేర్కొంది.

జాతీయాభివృద్ధి మండలి కమిటీలు

దత్ కమిటీ సూచనల ఆధారంగా వెనకబడిన రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు గుర్తించడానికి పాండే కమిషన్‌ను, వెనకబడిన ప్రాంతాల్లో పరిశ్రమల స్థాపనకు విత్త, పన్నుల రాయితీలు వంటి ప్రోత్సాహకాలు నిర్ణయించడం కోసం వాంఛూ కమిషన్‌ను ఏర్పాటు చేశారు.

పాండే కమిషన్ సూచనలు

ప్రణాళికా సంఘం కార్యదర్శి బిడి పాండే అధ్యక్షతన నియమించిన పాండే కమిషన్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, అస్సాం, జమ్ము & కశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, నాగాలాండ్, గోవా, మణిపూర్, త్రిపుర రాష్ట్రాలను వెనకబడిన రాష్ట్రాలుగా గుర్తించింది. ఈ రాష్ట్రాల్లోని వెనకబడిన ప్రాంతాలను గుర్తించడానికి ఈ కమిషన్ మరికొన్ని సూచికలను నిర్దేశించింది. అవి..

- పెద్ద నగరాలు, పారిశ్రామిక కేంద్రాలకు 80 కి.మీ. కంటే ఎక్కువ దూరంలో ఉండాలి..
- ఉత్పాదక సాధనాలు, ఉద్యోగ అవకాశాలకు సంబంధించి జన సాంద్రత అధికంగా ఉండాలి.
- ద్వితీయ తృతీయ రంగాల శ్రామికులు తక్కువగా ఉండాలి.
- కర్మాగారాల్లో పనిచేసే శ్రామికులు తక్కువ కావడంతోపాటు సహజ వనరులు, గనులు, అడవుల వినియోగం అల్పంగా ఉండాలి.
- విద్యుత్, రవాణా, కమ్యూనికేషన్స్, నీటి సౌకర్యాల కొరత ఉండాలి. ఈ నేపథ్యంలో ప్రణాళికా సంఘం దేశంలో 247 వెనకబడిన జిల్లాలను గుర్తించి జిల్లాల అభివృద్ధికి చిన్న తరహా, మధ్య తరహా పరిశ్రమలు స్థాపించాలని సూచించింది.

వాంఛూ కమిషన్ సూచనలు

పాండే కమిషన్ సూచనల మేరకు వెనకబడిన ప్రాంతాల్లో పారిశ్రామికాభివృద్ధి, అవసరమైన చర్యలు చేపట్టడానికి తగిన సూచనలు చేయడానికి వాంఛూ కమిషన్‌ను నియమించారు. ఈ కమిషన్ చేసిన సూచనలు..

- వెనకబడిన ప్రాంతాల్లో స్థాపించే పరిశ్రమలకు అందించే అభివృద్ధి గ్రాంట్లు పెంచడం
- ఈ ప్రాంతాల్లో స్థాపించిన పరిశ్రమలకు అయిదేళ్ల పాటు రాబడి పన్ను, కార్పొరేటు పన్నుల మినహాయింపు ఇవ్వాలి.
- యంత్రాలు, యంత్ర సామాగ్రి దిగుమతులపై సుంకాన్ని మినహాయించాలి.
- అయిదేళ్లపాటు ఎక్సైజ్ పన్ను మినహాయింపునివ్వాలి.
- అయిదేళ్ల వరకు ముడి పదార్థాలు, తయారైన వస్తువుల మీద అమ్మకం పన్ను మినహాయింపునివ్వాలి.
- అయిదేళ్ల వరకు తయారైన వస్తువుల రవాణా వ్యయం పై సబ్సిడీ ఇవ్వాలి.

రెండు పథకాలు

పాండే, వాంఛూ కమిటీల సూచనల ఆధారంగా కేంద్ర ప్రభుత్వం 1971లో రెండు పథకాలను ప్రవేశపెట్టింది. ఎంపిక చేసిన వెనకబడిన ప్రాంతాలకు ప్రత్యేక ఆర్థిక సహాయంగా మూలధన సబ్సిడీ, రవాణా సబ్సిడీని అందించాలని నిర్ణయించింది. రూ. 50 లక్షల స్థిర మూలధనం కంటే తక్కువ మూలధనం ఉన్న పరిశ్రమల స్థాపనకు 10 శాతం సబ్సిడీని, పర్వత ప్రాంతాల పరిశ్రమల ముడి పదార్థాల ఉత్పాదక రవాణా వ్యయంపై 50 శాతం వరకు సబ్సిడీని అందించాలని సూచించింది.

కేంద్ర మూలధన సబ్సిడీ పథకం (1982 -83)

- ఈ పథకం కింద వెనకబడిన జిల్లాలను ఎ, బి, సి అనే మూడు వర్గాలుగా విభజించారు. కేటగిరీ ఎలో పరిశ్రమలు లేని 118 జిల్లాలకు 25 శాతం సబ్సిడీని అందించాలని మూలధన సబ్సిడీ గరిష్ట పరిమితి రూ.25 లక్షలుగా ఉండాలని గుర్తించారు. కేటగిరీ బిలో 55 జిల్లాలను ఎంపిక చేసి మూలధనంలో 20 శాతం అంటే రూ.20 లక్షల సబ్సిడీని అందించాలని నిర్ణయించారు. కేటగిరీ సిలో 113 జిల్లాలను ఎంపిక చేసి 15 శాతం అంటే 15 లక్షల సబ్సిడీని ప్రకటించారు.
- రాష్ట్ర ప్రభుత్వాలకు అవస్థాపనా సౌకర్యాల అభివృద్ధి వ్యయంలో 1/3 వంతు అందిస్తూ కేంద్రం ప్రత్యక్షంగా సహాయపడుతుందని పాండే, వాంఛూ కమిటీలు పేర్కొన్నాయి. పారిశ్రామిక విత్త సహాయ సంస్థ (Industrial Finance Corporation of India - IFCI), పారిశ్రామిక పరపతి, పెట్టుబడి సంస్థ మొదలైన సంస్థలు వడ్డీరేటు రాయితీలు, రుణాల చెల్లింపు వాయిదాలకు అయిదేళ్ల వెసులుబాటు ఇచ్చి ప్రోత్సాహకాలు అందించాయి.

జాతీయ వెనకబడిన ప్రాంతాల అభివృద్ధి కమిటీ

అమలు చేస్తున్న వివిధ పథకాల పని తీరులో అవసరమైన మార్పులు సూచించడానికోసం జాతీయ వెనకబడిన ప్రాంతాల అభివృద్ధి కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ సూచనలు.

- కేంద్ర, రాష్ట్ర ప్రణాళికల్లో ఉప ప్రణాళికలు రూపొందించాలి.
- వెనకబడిన ప్రాంతాలకు రూపొందించిన ప్రాజెక్టుల అమలుకు ప్రత్యేకంగా వనరులు మంజూరు చేయాలి.
- వెనకబడిన ప్రాంతాల అభివృద్ధికి కేటాయించిన వనరులను అభివృద్ధి చెందిన ప్రాంతాలకు, తేలికగా అమలు చేయగలిగే ప్రాజెక్టులకు మళ్లించకుండా రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థిక క్రమశిక్షణ పాటించే చర్యల తోపాటు ప్రాజెక్టులను సకాలంలో పూర్తి చేయాలి.
- వెనకబడిన ప్రాంతాల ప్రాజెక్టుల్లో పనిచేసే ఉద్యోగస్తులకు ప్రోత్సాహకాలను అందించడమే కాకుండా వారి కుటుంబాలకు అవసరమైన విద్య, వైద్య సదుపాయాలను ఏర్పాటు చేయాలి. ప్రాజెక్టుల అమలులో జాప్యాలు, లోటు పాట్లకు కారణమైనవారికి జరిమానాలు విధించాలి.

ఈ కమిటీ గుర్తించిన లోటుపాట్లు

- కేంద్ర మూలధన సబ్సిడీ పథకం, విత్త సంస్థల రుణాలపై రాయితీల వలన లబ్ది పొందిన జిల్లాల సంఖ్య తక్కువగా ఉంది. ఈ జిల్లాలు ఎక్కువగా అభివృద్ధి చెందడమే కాకుండా పారిశ్రామిక కేంద్రాలకు దగ్గరగా ఉన్నాయి.
- పారిశ్రామిక క్షేత్రాల స్థాపన, మెట్రోలు, పట్టణాల నుంచి పరిశ్రమలను ఇతర ప్రాంతాలకు తరలించడం
- లైసెన్సింగ్ విధానం ఆశించిన విధంగా వెనకబడిన ప్రాంతాల్లో పరిశ్రమలు స్థాపించలేకపోవడమే కాకుండా రుణాత్మక పరికరంగా మారాయి.

- లక్ష్మీజ్యోతి ఆర్. అల్లె

బోపన్న జోడీ..రన్నరప్‌తో సరి



మెల్‌బోర్న్: ఆస్ట్రేలియన్ ఓపెన్‌తో రెండో గ్రాండ్‌స్లామ్ టైటిల్ అందుకోవాలన్న భారత స్టార్ రోహన్ బోపన్న కల ఫలించలేదు. మిక్స్‌డ్ డబుల్స్ ఫైనల్లో బోపన్న-టిమియాస్ బాబోస్ (హంగరీ) జోడీ ఓడింది. బోపన్న ద్వయం 6-2, 4-6, 9-11తో మేట్ పవిక్ (క్రొయేషియా)- డబ్రోవ్‌స్కీ(కెనడా) చేతిలో ఓడి రన్నరప్‌తో సరిపెట్టుకుంది.

ఫెడెక్స్ @ 20

- ఫెడరర్‌దే ఆస్ట్రేలియన్ ఓపెన్
- ఫైనల్లో సిలిచ్‌పై విజయం
- కెరీర్‌లో 20వ గ్రాండ్‌స్లామ్ టైటిల్ సొంతం





భార్య మిర్కాతో ఫెడరర్ విజయానందం

ప్రైజ్‌మనీ
విజేత - రూ. 20.62 కోట్లు
రన్నరప్ - రూ. 10.31 కోట్లు

వయసు పెరిగిపోతోంది.. ఆటేమో దూసుకుపోతోంది.. ఆ ప్రదర్శన స్విస్ మాస్టర్‌ను ఎవరికీ అందనంత ఎత్తుకు తీసుకుపోతోంది.. గాయాలకు సవాల్ విసిరి నిరుడు ఆస్ట్రేలియన్ ఓపెన్ టైటిల్‌తో ఘనమైన పునరాగమనం.. ఆపై రికార్డుస్థాయిలో ఎనిమిదో వింబుల్డన్ ట్రోఫీ కైవసం.. ఇప్పుడు మెల్‌బోర్న్ పార్క్‌లో మళ్లీ జయకేతనం.. కెరీర్‌లో ఆరో ఆస్ట్రేలియన్ ఓపెన్, ఓవరాల్‌గా 20వ గ్రాండ్‌స్లామ్‌తో సాటిలేని ఆటగాడనిపించుకున్న వైనం.. యువ ఆటగాళ్లు తేలిపోతున్న వేళ..తోటి సీనియర్లు నడాల్, జొకోవిచ్ గాయాల గేయాలు ఆలపిస్తుండగా.. 36 ఏళ్ల ఫెడరర్ మాత్రం విజయ గీతాలు పాడుతున్నాడు.

మెల్‌బోర్న్: రోజర్ ఫెడరర్..అసమాన ప్రతిభకు నిలువెత్తు నిదర్శనం.. ఎంతటి క్లిష్టపరిస్థితుల్లోనూ పోరాటం ఆపని ధీరత్వం.. అలాంటి యోధుడు మరో యుద్ధంలో గెలిచాడు. ఆదివారం రాడ్ లేవర్ ఎరీనాలో పోటాపోటీగా జరిగిన పురుషుల సింగిల్స్ ఫైనల్లో డిఫెండింగ్ చాంపియన్ ఫెడరర్ 6-2, 6-7 (5), 6-3, 3-6, 6-1తో క్రొయేషియాకు చెందిన ఆరోసీడ్ మారిన్ సిలిచ్‌పై అద్భుత విజయం సాధించాడు. 30వ గ్రాండ్‌స్లామ్ ఫైనల్ ఆడిన ఫెడెక్స్.. ఆరోసారి ఆస్ట్రేలియన్ ఓపెన్ టైటిల్ చేజిక్కించుకున్నాడు. తద్వారా అత్యధికసార్లు ఈ ట్రోఫీ గెలుచుకున్న జొకోవిచ్ (సెర్బియా), రాయ్ ఎమర్సన్ (ఆస్ట్రేలియా) సరసన చేరాడు. ఇక మార్గరెట్ కోర్ట్, సెరెనా విలియమ్స్, స్టెఫీ గ్రాఫ్ తర్వాత 20 గ్రాండ్‌స్లామ్‌లు గెలిచిన నాలుగో ప్లేయర్‌గా ఫెడరర్ నిలిచాడు.

కెన్ రోజ్‌వాల్ తర్వాత..: ఆస్ట్రేలియాకే చెందిన కెన్ రోజ్‌వాల్ తర్వాత అతి పెద్ద వయస్సులో ఆస్ట్రేలియన్ ఓపెన్ టైటిల్ సాధించిన రెండో ఆటగాడిగా ఫెడెక్స్ (36 ఏళ్లు) రికార్డు సృష్టించాడు. 1972లో 37 ఏళ్ల వయస్సులో రోజ్‌వాల్ మెల్‌బోర్న్ పార్క్‌లో విజేతగా నిలిచాడు.

రూఫ్ మూసేసి...: శనివారం నాటి కంటే ఆదివారం భానుడు మరింత భగభగలాడాడు. సాయంత్రం ఉష్ణోగ్రత కూడా 38 డిగ్రీలు ఉండడంతో మూడు గంటల రెండు నిమిషాల మ్యాచ్‌ను రూఫ్ మూసివేసి నిర్వహించారు. తొలిగేమ్‌లోనే తన సర్వీస్‌లో సిలిచ్ ఒత్తిడి ఎదుర్కొన్నాడు. సర్వీస్ నిలబెట్టుకోలేక 0-3తో వెనుకంజలో నిలిచాడు. అయితే 1-4 స్కోరువద్ద ఎలాగోలా సర్వీస్ నిలబెట్టుకోగలిగాడు. మొత్తంగా ప్రత్యర్థి సర్వీస్‌ల్లో తడబడుతుండగా..ఓ డబు ల్ బ్రేక్‌తో కేవలం 24 నిమిషాల్లో ఫెడరర్ తొలి సెట్ చేజిక్కించుకున్నాడు. రెండో సెట్‌లో మొదటి సర్వీస్‌లో ఫెడెక్స్ సైతం రెండు బ్రేక్ పాయింట్లకోసం పోరాడగా..మూడో గేమ్‌లో సిలిచ్ కూడా ఇక్కట్లు ఎదుర్కొన్నాడు. ఈ దశలో ఇద్దరూ ఫోర్‌హ్యాండ్ షాట్లతో అలరించగా.. ఓ ఫోర్‌హ్యాండ్ విన్నర్‌తో తొమ్మిదో గేమ్‌ను కైవసం చేసుకున్న సిలిచ్ ఆపై ఫెడరర్ డబుల్ ఫాల్ట్ చేయడంతో పదో గేమ్‌లో గెలుపొందాడు. టైబ్రేకర్‌లో 3 బ్రేక్‌పాయింట్లు కాపాడుకొని రెండోసెట్ నెగ్గిన సిలిచ్.. స్కోరు సమంచేశాడు. మరోవైపు ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో ఫెడరర్ కోల్పోయిన తొలిసెట్ ఇదే కావడం గమనార్హం. ఇక మూడో సెట్‌లో సిలిచ్ సర్వీస్‌లు చేజార్చుకోవడంతో ఫెడెక్స్ 4-2 ఆధిక్యంలోకి వెళ్లాడు. అంతేకాదు..ఒక్కసారిగా గేరుమార్చిన ఫెడరర్ అదిరిపోయే ఫోర్‌హ్యాండ్‌షాట్‌తో సర్వీస్ నిలబెట్టుకొని 5-2తో మరింత ముందుకెళ్లాడు. అదేజోరులో 29 నిమిషాల్లో ఆసెట్‌ను సొంతం చేసుకున్నాడు. నాలుగో సెట్‌లో వరుసగా నాలుగు గేమ్‌లు కోల్పోయి ఆ సెట్‌ను ప్రత్యర్థికి సమర్పించుకున్న ఫెడరర్ చివరి సెట్‌లో పుంజుకున్నాడు. ఈసెట్‌లో 2-0, 3-0.. ఇలా ఆధిక్యం పెంచుకుంటూ పోయి విజయం అంచున నిలిచాడు. ఆ తరుణంలో సిలిచ్ ఓ ఫోర్‌హ్యాండ్ షాట్‌ను నెట్‌కు కొట్టడంతో డబుల్ బ్రేక్ పాయింట్లతో ఫెడరర్ మ్యాచ్‌ను సొంతం చేసుకున్నాడు. అంతే..కరతాళధ్వనులతో స్టేడియం హోరెత్తగా, ఉద్వేగంతో ఫెడరర్ కనులనుంచి ఆనందబాష్పాలు రాలాయి.

24 ఏస్‌లు..: ఈ మ్యాచ్‌లో ఏకంగా 24 ఏస్‌లు సంధించిన ఫెడరర్ 41 విన్నర్లు కొట్టి 40 అనవసర తప్పిదాలు, 4 డబుల్‌ఫాల్ట్‌లు చేశాడు. 16 ఏస్‌లు వేసిన సిలిచ్..45 విన్నర్లతో అలరించి 5 డబుల్‌ఫాల్ట్‌లు, భారీగా 64 అనవసర తప్పిదాలకు పాల్పడ్డాడు.

రోజర్ కంట కన్నీరు..

ఫైనల్ గెలిచిన వెంటనే రోజర్ ఫెడరర్ భావోద్వేగానికి లోనయ్యాడు. ట్రోఫీ అందుకుంటూ రోజర్ కన్నీరు పెట్టుకున్నాడు. కొద్దిసేపు అలాగే ఏడుస్తూ ఉండిపోయిన ఫెడరర్.. తర్వాత తేరుకొని మాట్లాడాడు. '2006లో ఇక్కడే ఫైనల్లో మార్కస్ బగ్దాతిస్‌ను ఓడించిన రాత్రికంటే నేటి రాత్రి ఎంతో మధురమైనది. ఎందుకంటే..ఈ సారి ఇక్కడ నేను ఫేవరెట్‌గా బరిలోదిగి అందుకు తగ్గట్టుగా ఆడి విజయం సాధించాను. ఈ వయస్సులోను శారీరకంగా, మానసికంగా ఇంత దృఢంగా ఉండడానికి నా భార్య మిర్కానే కారణం'అని రోజర్ అన్నాడు.

2	ఈసారి ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో ఫెడరర్ ఓడిన సెట్లు
94-13	మెల్‌బోర్న్‌లో ఫెడెక్స్ గెలుపోటముల రికార్డు
332-52	గ్రాండ్‌స్లామ్స్‌లో రోజర్ జయాపజయాల రికార్డు
9-1	సిలిచ్‌పై స్విస్ స్టార్ రికార్డు

చెన్నై సూపర్ కింగ్స్

ధోనీ (15 కోట్లు), రైనా (11), కేదార్ (7.8), జడేజా (7), డ్వేన్ బ్రావో (6.4) కర్ణ్ శర్మ (5), వాట్సన్ (4), శార్దూల్ (2.6), రాయుడు (2.2), విజయ్ (2), హర్భజన్ (2), డుప్లెసిస్ (1.6), మార్క్ ఉడ్ (1.5), బిల్లింగ్స్ (1), తాహిర్ (1), దీపక్ చాహర్ (0.80 లక్షలు), శాంట్నర్ (0.50), ఎంగిడి (0.50), ఆసిఫ్ (40), జగదీశన్ (20), కనిష్క్ (0.20), మోను సింగ్ (0.20), ధ్రువ్ షోరె (0.20), క్షితిజ్ (0.20), చైతన్య (0.20).

ఢిల్లీ డేర్‌డెవిల్స్

రిషబ్ పంత్ (15 కోట్లు), మోరిస్ (11), మాక్స్‌వెల్ (9), శ్రేయాస్ అయ్యర్ (7), రబాడ (4.2), అమిత్ మిశ్రా (4), నదీమ్ (3.2), విజయ్ శంకర్ (3.2), రాహుల్ తెవాటియా (3), షమి (3), గంభీర్ (2.8), బౌల్ట్ (2.2), మన్రో (1.9), క్రిస్టియన్ (1.5), జాసన్‌రాయ్ (1.5), నమన్ ఓఝా (1.4), పృథ్వీ (1.2), గుర్‌కీరత్ (0.75 లక్షలు), ఆవేశ్ (0.70), అభిషేక్ (0.55), జయంత్ (0.50), హర్షల్ (0.20), మన్‌జోత్ (0.20), సందీప్ లామిచనె (0.20), శయన్ ఘోష్ (0.20).

కింగ్స్ లెవెన్ పంజాబ్

అక్షర్ (12.5 కోట్లు), లోకేశ్ రాహుల్ (11), అశ్విన్ (7.6), ఆండ్రూ టై (7.2), ఫించ్ (6.2), స్టొయినిస్ (6.2), కరుణ్ (5.6), జద్రాన్ (4), అంకిత్ రాజ్‌పుత్ (3), మిల్లర్ (3), మోహిత్ (2.4), బరీందర్ (2.2), యువరాజ్ (2), క్రిస్ గేల్ (2), ద్వార్‌షుస్ (1.4), అక్షదీప్ (1), మనోజ్ తివారి (1), మయాంక్ (1), మంజూర్ (0.20 లక్షలు), పర్దీప్ సాహు (0.20), దాగర్ (0.20).

కోల్‌కతా నైట్‌రైడర్స్

నరైన్ (12.5 కోట్లు), క్రిస్ లిన్ (9.6), స్టార్క్ (9.4), ఆండ్రీ రస్సెల్ (8.5), దినేష్ కార్తీక్ (7.4); ఊతప్ప (6.4), కుల్దీప్ (5.8), పియూష్ చావ్లా (4.2), నితీష్ రాణా (3.4), నాగర్‌కోటి (3.2), శివం మావి (3), మిచెల్ జాన్సన్ (2), శుభ్‌మన్ (1.8), వినయ్ కుమార్ (1), రింకూ సింగ్ (0.80 లక్షలు), డెల్‌పోర్ట్ (0.30), సియర్‌లెస్ (0.30), అపూర్వ వాంఖడె (0.20), ఇషాంక్ (0.20).

జయ్‌దేవ్ జాక్‌పాట్!

11.5 కోట్లకు రాజస్థాన్ సొంతం

- భారత క్రికెటర్లలో టాప్
- కృష్ణప్ప గౌతమ్‌కు 6.2, ఆండ్రూ టైకి 7.2 కోట్లు
- 2.6 కోట్లతో బెంగళూరుకు సిరాజ్
- గేల్ 2 కోట్లకే పంజాబ్ సొంతం



సిరాజ్

బెంగళూరు: ఐపీఎల్ పదకొండో సీజన్‌కు అతి కీలకమైన ఘట్టం ముగిసింది. మ్యాచ్‌లకు మించిన ఉత్కంఠ రేపుతూ.. రెండు రోజుల పాటు సాగిన ఆటగాళ్ల వేలం విజయవంతంగా పూర్తయింది. మెగా లీగ్‌లో తమ సైనికులను ఎంచుకున్న జట్లు కొత్త రూపును సంతరించుకొని రెండో దశాబ్దంలోకి అడుగు పెట్టేందుకు సిద్ధమయ్యాయి. తొలి రోజు మాదిరిగానే స్వదేశీ మంత్రం జపించిన ఫ్రాంచైజీలు మరికొందరు భారత ఆటగాళ్లను ఒక్క రోజులో మిలియనీర్లను చేశాయి. టీమిండియా యువ లెఫ్టార్మ్ పేసర్ జయ్‌దేవ్ ఉనాద్కట్ కళ్లు చెదిరే రీతిలో 11.5 కోట్లకు అమ్ముడై.. భారత ఆటగాళ్లలో అత్యధిక మొత్తం దక్కించుకున్న ఆటగాడిగా నిలిచాడు. టాప్ రేటుతో బెన్ స్టోక్స్‌ను సొంతం చేసుకున్న రాజస్థాన్ రాయల్స్ అందరినీ ఆశ్చర్య పరుస్తూ జయ్‌దేవ్‌ను కూడా కొనుగోలు చేసింది. ఇక, ఆస్ట్రేలియా పేసర్ ఆండ్రూ టైని 7.2 కోట్లకు కింగ్స్ లెవెన్ పంజాబ్ దక్కించుకుంది. ఆదివారం ముగిసిన వేలంలో.. కర్ణాటకకు చెందిన ఆఫ్ స్పిన్ ఆల్‌రౌండర్ కృష్ణప్ప గౌతమ్ కోసం రాజస్థాన్ 6.2 కోట్లు చెల్లించింది.



లామిచనె

నేపాల్ అరంగేట్రం: ఐపీఎల్‌లో మరో దేశం అరంగేట్రం చేసింది. నేపాల్‌కు చెందిన 17 ఏళ్ల సందీప్ లామిచనెను ఢిల్లీ అతని ప్రారంభ ధర 20 లక్షలకు కొనుక్కొన్నది. దాంతో, ఐపీఎల్ వేలంలో అమ్ముడైన నేపాల్ తొలి క్రికెటర్‌గా రికార్డుకెక్కాడు. లెగ్ స్పిన్నర్ లామిచనె.. 2016 అండర్-19 వరల్డ్‌కప్‌లో ఆరు ఇన్నింగ్స్‌ల్లో 14 వికెట్లు పడగొట్టి వెలుగులోకి వచ్చాడు.

అఫ్ఘాన్ గన్స్ మరో రెండు.. : గతేడాది ఇద్దరు అఫ్ఘానిస్థాన్ ప్లేయర్లు ఐపీఎల్‌లో ఆడగా.. ఈ సారి ఆ సంఖ్య నాలుగుకు చేరనుంది. రషీద్ ఖాన్‌ను తొలి రోజు 9 కోట్లు కొన్న సన్‌రైజర్స్.. మహమ్మద్ నబీని కోటి రూపాయలకు మళ్లీ ఎంచుకుంది. ఇక, అదే దేశానికి చెందిన 16ఏళ్ల స్పిన్నర్ ముజీబ్ జద్రాన్‌కు పంజాబ్ 4 కోట్లు చెల్లించడం విశేషం. అతని సహచరుడు జహీర్ ఖాన్‌ను రాజస్థాన్ 60 లక్షలకు కొనుగోలు చేసింది.

గేల్ వచ్చాడోచ్..: క్రిస్ గేల్ అభిమానులకు ఎట్టకేలకు ఊరట లభించింది. తొలి రోజు ఎవరూ పట్టించుకోని గేల్‌ను చిట్టచివర్లో పంజాబ్ కొనుగోలు చేసింది. వాస్తవానికి ఆదివారం మరోసారి అతని పేరు వచ్చినప్పుడు ఏ ఒక్క ఫ్రాంచైజీ కూడా ముందుకు రాలేదు. అయితే పంజాబ్ కోరిక మేరకు గేల్‌ను మళ్లీ మూడోసారి వేలానికి తెచ్చారు. ప్రారంభ ధర 2 కోట్లకే కింగ్స్ లెవెన్ అతణ్ణి దక్కించుకుంది. ఆ సమయంలో మిగతా ఫ్రాంచైజీల సభ్యులు చప్పట్లతో పంజాబ్‌ను అభినందించారు. అదే విధంగా తొలి రోజు వేలంలో మిగిలిన స్టార్ ప్లేయర్లలో విజయ్ (2 కోట్లు, చెన్నై), వికెట్ కీపర్ పార్థివ్ పటేల్ (1.7 కోట్లు, బెంగళూరు), మిచెల్ జాన్సన్ (2 కోట్లు, కోల్‌కతా) తక్కువ ధరకే అమ్ముడయ్యారు.

కుర్రాళ్లు హాట్‌కేకుల్లా.. స్టార్లు వెలవెల: వేలంలో భారత కుర్రాళ్లు హాట్‌కేకుల్లా మారారు. స్పిన్ ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్‌ను 3.2 కోట్లకు, హైదరాబాద్ పేసర్ సిరాజ్‌ను 2.6 కోట్లకు బెంగళూరు కొనుక్కుంది. అయితే, స్టార్ ప్లేయర్లు స్టెయిన్, మోర్నీ మోర్కెల్, మలింగ, కోరె ఆండర్సన్, గప్టిల్, షాన్‌మార్ష్ మూడుసార్లు వేలానికి వచ్చినా ఎవ్వరూ పట్టించుకోలేదు.

కింగ్స్.. రాయల్స్ తగ్గేదే లేదు..: రెండు రోజుల వేలంలో రాజస్థాన్, పంజాబ్ ఫ్రాంచైజీలు భారీ మొత్తాలు చెల్లిస్తూ ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. రెండు జట్లూ ఒక్కో ప్లేయర్‌ను మాత్రమే రిటైన్ చేసుకోవడంతో వీళ్ల ఖాతాలో ఎక్కువ మొత్తం మిగిలింది. దాంతో, స్వేచ్ఛగా వేలంలో పాల్గొన్నాయి. రాజస్థాన్ ఎంచుకున్న 23 మంది కోసం 78.35 కోట్లు ఖర్చు చేయగా.. ఆరుగురికే ఏకంగా 58.9 కోట్లను ఉపయోగించడం విశేషం. ఇక, 21 మందిని ఎంచుకున్న పంజాబ్ జట్టులో స్పెషలిస్ట్ వికెట్ కీపర్ లేకపోవడం గమనార్హం. ఇక, కోల్‌కతా 19 మంది కోసం 80 కోట్ల మొత్తం వెచ్చించింది. 6.5 కోట్లు మిగిలున్న చెన్నై తప్ప అన్ని జట్లు ఖజానా మొత్తం ఖర్చు చేశాయి.

ఉనాద్కట్ కోసం ఉత్కంఠగా..

రెండో రోజు వేలంలో జయ్‌దేవ్ హైలైట్‌గా నిలిచాడు. 1.5 కోట్ల ప్రారంభ ధరతో వచ్చిన అతని రేటు అనూహ్య పరిణామాల మధ్య అమాంతం పెరిగింది. అప్పటికి చెన్నై జట్టులో ఒక్క ఫాస్ట్ బౌలర్‌గా కూడా లేడు. పంజాబ్ ప్రధాన పేసర్ కోసం ఎదురు చూస్తోంది. గతేడాది పుణె తరపున 13.41 సగటుతో 24 వికెట్లతో సత్తా చాటిన ఈ టీ-20 స్పెషలిస్ట్ కోసం చెన్నై, పంజాబ్ తీవ్రంగా పోటీ పడ్డాయి. అయితే, చెన్నై 11 కోట్లు బిడ్ చేశాక పంజాబ్ తప్పుకుంది. ఆ రేటు ఫైనల్ అవుతుందని భావిస్తుండగా.. రాజస్థాన్ మరో యాభై లక్షలు ఎక్కువ కోట్ చేసి కొనుక్కోవడంతో అంతా ఆశ్చర్యపోయారు.



జయ్‌దేవ్ ఉనాద్కట్

ముంబై ఇండియన్స్

రోహిత్ (15 కోట్లు), హార్దిక్ (11), క్రునాల్ (8.8), బుమ్రా (7), ఇషాన్ కిషన్ (6.2), పొలార్డ్ (5.4), కమిన్స్ (5.4), ఎవిన్ లూయిస్ (3.8), సూర్యకుమార్ (3.2), కటింగ్ (2.2), ముస్తాఫిజుర్ (2.2), రాహుల్ చాహర్ (1.9), ప్రదీప్ సాంగ్వాన్ (1.5), బెరెన్‌డార్ఫ్ (1.5), డుమిని(1), సౌరభ్ తివారి (0.80 లక్షలు), తేజిందర్ (0.55), ధనంజయ (50), నిదీశ్ (0.20), ఆదిత్య తారె (0.20), సిద్ధేశ్ లాడ్ (0.20), మయాంక్ మార్కండె (0.20), శరద్ లాంబ (0.20), అనుకూల్ (0.20), మొహిసిన్ (0.20).

రాజస్థాన్ రాయల్స్

స్టీవ్ స్మిత్ (12.5 కోట్లు), స్టోక్స్ (12.5), ఉనాద్కట్ (11.5), శాంసన్ (8), జోఫ్రా ఆర్చర్ (7.2), కృష్ణప్ప గౌతమ్ (6.2), బట్లర్ (4.4), రహానె (4), డార్సిషార్ట్ (4), రాహుల్ త్రిపాఠి (3.4), ధవళ్ కులకర్ణి (0.75 లక్షలు), జహీర్ (0.60), లాగ్లిన్ (0.50), బిన్ని (0.50), దుష్మంత చమీర (0.50), అనురీత్ (0.30), ఆర్యమన్ (0.30), మిథున్ (0.20), శ్రేయాస్ గోపాల్ (0.20), ప్రశాంత్ చోప్రా (0.20), జతిన్ సక్సేనా (0.20), అంకిత్ శర్మ (0.20), మహిపాల్ (0.20).

బెంగళూరు

కోహ్లీ (17 కోట్లు), డివిలీర్స్ (11), క్రిస్ వోక్స్ (7.4), చాహల్ (6), ఉమేశ్ (4.2), మెకల్లమ్ (3.6), సుందర్ (3.2), సర్ఫ్‌రాజ్ (3), సైనీ (3), డికాక్ (2.8), సిరాజ్ (2.6), కల్టర్‌నైల్ (2.2), ఎం.అశ్విన్ (2.2), గ్రాండ్‌హోమ్ (2.2), పార్థివ్ (1.7), మొయిన్ అలీ (1.7), మన్‌దీప్ సింగ్ (1.4), వోహ్రా (1.1), పవన్ నేగి (1), టిమ్ సౌథీ (1), కెజ్రోలియా (0.85 లక్షలు), అనికేత్ (0.30), పవన్ దేశ్‌పాండే (0.20), అనిరుధ జోషి (0.20).

సన్‌రైజర్స్ హైదరాబాద్

వార్నర్ (12.5 కోట్లు), మనీష్ పాండే (11), రషీద్ (9), భువనేశ్వర్ (8.5), ధవన్ (5.2), సాహా (5), సిద్ధార్థ్ కౌల్ (3.8), దీపక్ హుడా (3.6), ఖలీల్ అహ్మద్ (3), సందీప్ శర్మ (3), కేన్ విలియమ్సన్ (3), బ్రాత్‌వైట్ (2), షకీబల్ (2), యూసుఫ్ (1.9), శ్రీవత్స గోస్వామి (1), నబీ (1), జోర్డాన్ (1), బాసిల్ థంపి (0.95 లక్షలు), స్టాన్‌లేక్ (0.50), టి.నటరాజన్ (0.40),సచిన్ బేబి (0.20), బిపుల్ శర్మ (0.20) మెహ్దీ హసన్ (20), రికీ భుయ్ (0.20), తన్మయ్ అగర్వాల్ (0.20).

ఫైనల్లో సైనాకు నిరాశ



జకర్తా: ఇండోనేసియా మాస్టర్స్ టోర్నమెంట్లో ప్రారంభం నుంచి అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకున్న భారత స్టార్ షట్లర్ సైనా నెహ్వాల్ తుదిపోరులో అదేజోరు చూపలేకపోయింది. గతరౌండ్లలో తన కంటే మెరుగైన ర్యాంకర్లను చిత్తుచేసి ఫైనల్‌ఫైట్‌లో నిలిచిన ఈ హైదరాబాదీ.. టాప్‌సీడ్ తై జుయింగ్ ధాటికి వరుసగేముల్లో ఓడి రన్నరప్ టైటిల్‌తో సరిపెట్టుకుంది. ఆదివారం పూర్తి ఏకపక్షంగా సాగిన తుదిసమరంలో చైనీస్ తైపీకి చెందిన ప్రపంచ నంబర్‌వన్ తై జుయింగ్ 21-9, 21-13తో సైనాపై గెలిచి విజేతగా నిలిచింది. సైనాతో తానాడిన గత పది మ్యాచుల్లో తై జుయింగ్‌కిది 9వ విజయం కావడం విశేషం. ఆమెను సైనా చివరిసారిగా 2013 స్విస్ ఓపెన్‌లో ఓడించింది.

'టాప్' లేపిన పాక్

- మూడో మ్యాచ్‌లో కివీస్‌పై గెలుపు
- 2-1తో సిరీస్ కైవసం

మౌంట్ మాంగనుయ్ (న్యూజిలాండ్): న్యూజిలాండ్‌తో జరిగిన మూడు టీ-20 మ్యాచ్‌ల సిరీస్‌ను పాకిస్థాన్ 2-1తో కైవసం చేసుకుంది. ఈ విజయంతో టీ-20 ర్యాంకింగ్స్‌లో పాకిస్థాన్.. కివీస్‌ను వెనక్కునెట్టి అగ్రస్థానానికి ఎగబాకింది. సిరీస్ నిర్ణాయక చివరి, మూడో టీ-20లో పాకిస్థాన్ 18 పరుగులతో కివీస్‌పై విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన పాకిస్థాన్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 181 పరుగులు చేసింది. ఓపెనర్ ఫఖ్ర్ జమాన్ (46) టాప్ స్కోరర్. ఛేదనలో న్యూజిలాండ్ 6 వికెట్ల నష్టానికి 163 పరుగులు మాత్రమే చేయగలిగింది. కివీస్ తొలి టీ-20 నెగ్గగా.. పాక్ తర్వాతి రెండు మ్యాచ్‌ల్లో గెలిచింది.

హాకీ ఫైనల్లో పోరాడి ఓడిన భారత్

హామిల్టన్ (న్యూజిలాండ్): నాలుగు దేశాల ఆహ్వాన హాకీ టోర్నీ రెండో అంచె ఫైనల్లో భారత్ పోరాడి ఓడింది. తుది పోరులో వరల్డ్ నెం.3 బెల్జియంకు భారత్ గట్టి పోటీ ఇవ్వడంతో స్కోరు 4-4తో సమమైంది. దీంతో మ్యాచ్ ఫలితం పెనాల్టీ షూటౌట్‌కు దారి తీసింది. షూటౌట్‌లో విఫలమైన టీమిండియా 0-3తో పరాజయాన్ని చవి చూసింది.

రైనా వచ్చేశాడు..

సఫారీలతో టీ20 సిరీస్‌కు జట్టు ఎంపిక



న్యూఢిల్లీ: సీనియర్ బ్యాట్స్‌మన్ సురేశ్ రైనా మళ్లీ జాతీయజట్టులోకొచ్చాడు. దక్షిణాఫ్రికాతో ఆడనున్న మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌కు ఆదివారం ప్రకటించిన భారత జట్టులో రైనాకు చోటు దక్కింది. ఏడాది తర్వాత జాతీయజట్టుకు రైనా ఎంపికయ్యాడు. పేసర్ జయదేవ్ ఉనాద్కట్ కూడా ఈ సిరీస్‌కు ఎంపికయ్యాడు. శ్రీలంకతో టీ20 సిరీస్‌కు విశ్రాంతినిచ్చిన ధవన్, భువనేశ్వర్ తిరిగి జట్టులో కొచ్చారు. దాంతో దీపక్ హుడా, సిరాజ్, థంపి, వాషింగ్టన్ సుందర్ వైదొలగాల్సి వచ్చింది. స్పిన్నర్ అక్షర్ పటేల్, సౌతాఫ్రికాతో వన్డే సిరీస్‌కు ఎంపికైన శార్దూల్ ఠాకూర్‌లను కూడా టీ20లకు తీసుకున్నారు. మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్ వచ్చేనెల 18 నుంచి జరగనుంది.

టీ20 జట్టు: కోహ్లీ (కెప్టెన్), రోహిత్ శర్మ (వైస్ కెప్టెన్), ధవన్, కేఎల్ రాహుల్, రైనా, ధోనీ, కార్తీక్, హార్దిక్ పాండ్యా, మనీష్ పాండే, అక్షర్ పటేల్, చాహల్, కుల్దీప్ యాదవ్, భువనేశ్వర్, బుమ్రా, ఉనాద్కట్, శార్దూల్ ఠాకూర్.

భువీ కీలకంగా ఎదిగాడు

(కృష్ణమాచారి శ్రీకాంత్)

టీమిండియా విదేశాల్లో సాధించిన గొప్పవిజయాల్లో 'వాండరర్స్' ఒకటి. విదేశాల్లో టెస్టులాడడం కఠినసవాలే. అయితే జొహాన్నెస్‌బర్గ్‌లో పరిస్థితులు పోల్చడానికే కష్టంగా ఉన్నాయి. కానీ భారత బ్యాట్స్‌మెన్ పట్టుదలతో పోరాడారు. బంతి పదేపదే శరీరాన్ని తాకుతున్నా.. మానసికంగానూ అధైర్యపడలేదు. బౌలర్లు తమ బాధ్యతలను పూర్తిస్థాయిలో నిర్వర్తించారు. ఆమ్లా, ఎల్గర్ భాగస్వామ్యం గుబులు రేపుతున్నా.. కోహ్లీ ఏమాత్రం ఆందోళన కనబరచలేదు. అవకాశం కోసం ఓపిగ్గా ఎదురుచూశాడు. ఈ సిరీస్‌తో భువీ కీలకప్లేయర్‌గా ఎదిగాడు. బౌలింగ్‌తోపాటు బ్యాటింగ్‌లోనూ భువీ జట్టును ఆదుకున్నాడు. ఎవరో ఒక్కరు కాకుండా.. జట్టుగా ఆడితే విజయాలు దక్కుతాయనే దానికి సౌతాఫ్రికాలో భారతప్రదర్శనేఉదాహరణ. -(టీసీఎమ్)

యువకుడిని మింగిన ఎంఆర్ఐ మెషిన్



ముంబై, జనవరి 28: ముంబైలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో దారుణం జరిగింది. సిబ్బంది నిర్లక్ష్యం నిండు ప్రాణాన్ని బలిగొంది. అనారోగ్యంతో బాధపడుతున్న తన బంధువుకు తోడుగా ఆస్పత్రికి వచ్చిన రాజేశ్ మారు(32) అనే వ్యక్తి ఎంఆర్ఐ స్కానింగ్ మెషిన్‌లో ఇరుక్కుపోయి మరణించాడు. ఓ వస్త్ర దుకాణంలో సేల్స్ మాన్‌గా పనిచేస్తున్న రాజేశ్.. తన బంధువుకు ఎంఆర్ఐ స్కాన్ చేయించేందుకు శనివారం సాయంత్రం ముంబైలోని బీవైఎల్ నాయర్ చారిటబుల్ ఆస్పత్రికి వచ్చాడు. స్కానింగ్ కోసం రోగిని ఎంఆర్ఐ గదిలోకి తీసుకెళ్తుండగా వార్డు బాయ్ సూచన మేరకు ఆక్సిజన్ సిలెండర్‌ను తోసుకుంటూ రాజేశ్ కూడా వెళ్లాడు. సాధారణంగా ఎంఆర్ఐ స్కానింగ్ గదిలోకి లోహపు వస్తువులు, మెడికల్ ఇంప్లాంట్స్ వంటివి అనుమతించరు. ఎంఆర్ఐ మెషిన్‌కు ఉన్న అయస్కాంత శక్తి.. సిలెండర్‌తోపాటు రాజేశ్‌ను లాగేసింది. దీంతో అతని చెయ్యి మెషిన్‌లో ఇరుక్కుపోయింది. ఓ వైపు ఆక్సిజన్ సిలెండర్ లీకవడం, మరోవైపు మెషిన్‌లో చెయ్యి ఇరుక్కుపోవడంతో రాజేశ్ గందరగోళానికి గురయ్యాడు. ఆక్సిజన్ అధికంగా లీకవుతున్నా బయటకు వెళ్లలేకపోయాడు. ఇంతలో గది బయట ఉన్న బంధువులు పరుగన వెళ్లి రాజేశ్‌ను బయటకు తీశారు. ఆక్సిజన్ ఎక్కువ పీల్చడంతో అతని శరీరం ఉబ్బిపోయింది. తీవ్ర రక్తస్రావమయ్యింది. వెంటనే అత్యవసర విభాగానికి తీసుకెళ్లగా.. చికిత్స పొందుతూ పది నిమిషాల్లో అతను మరణించాడు. ఎంఆర్ఐ గదిలోకి సిలెండర్ తీసుకెళ్లకూడదని తాము వార్డు బాయ్‌కి చెబితే 'ఏం పర్లేదు.. రోజూ ఇలానే చేస్తాం' అని అతను చెప్పాడని రాజేశ్ బంధువులు తెలిపారు. అయినా.. మెషిన్ ఆఫ్ చేసి ఉందని, ప్రమాదమేమీ లేదని వార్డు బాయ్ చెప్పడంతో సిలెండర్‌ను తోసుకుని ఎంఆర్ఐ స్కానింగ్ గదిలోకి రాజేశ్ వెళ్లాడని వారు చెప్పారు. వైద్యుడు కూడా అక్కడే ఉన్నా అడ్డుచెప్పలేదని వారన్నారు. ముమ్మాటికీ ఆస్పత్రి సిబ్బంది నిర్లక్ష్యం వల్లే రాజేశ్ మరణించాడని బంధువులు ఆరోపించారు. ప్రమాదానికి కారణమైనవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బంధువుల ఫిర్యాదు మేరకు వైద్యుడు సిద్ధాంత్ షా, వార్డు బాయ్ విఠల్ చవాన్‌ను పోలీసులు అరెస్టు చేశారు. సహాయకురాలు సునీతపై కేసు నమోదు చేశారు. మృతుడి కుటుంబానికి మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ రూ.ఐదు లక్షల పరిహారం ప్రకటించారు.



ఇది స్పేస్ సెల్ఫీ!

ఐదురోజుల క్రితం అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం(ఐఎస్ఎస్) నుంచి బయటకు వచ్చి స్పేస్‌వాక్ చేసిన వ్యోమగామి మార్క్ వాందే హీ సెల్ఫీ తీసుకున్నారిలా..! ఐఎస్ఎస్ రోబోటిక్ హ్యాండ్ మరమ్మతు కోసం సహచరుడు స్కాట్ టింగిల్‌తో కలిసి 7 గంటల 24 నిమిషాల పాటు ఈ ఏడాదిలో తొలిసారిగా స్పేస్‌వాక్ చేశారు. ఆయన నేతృత్వంలోని బృందం సోమవారం మరోసారి స్పేస్‌వాక్ చేయనుంది.

'తత్కాల్' రద్దుపై 50% తిరిగివ్వాలి

- 'లోకల్ సర్కిల్స్' సర్వేలో 94శాతం మంది అభిప్రాయం

న్యూఢిల్లీ, జనవరి 28: సాధారణంగా ప్రయాణానికి ముందు రైలు టికెట్లను రద్దు చేసుకుంటే కొంతమొత్తాన్ని ఐఆర్‌సీటీసీ వెనక్కి ఇస్తుంది. రిజర్వేషన్ టికెట్లపై మాత్రమే ఈ సదుపాయం ఉంటుంది. కానీ తత్కాల్ టికెట్లపై ఆ అవకాశం లేదు. అందుకే ప్రయాణానికి ఆరు గంటల ముందు తత్కాల్ టికెట్‌ను రద్దు చేసుకుంటే.. టికెట్ ధరలో సగం తిరిగివ్వాలని ప్రయాణికులు కోరుకుంటున్నారు. లోకల్ సర్కిల్స్ సంస్థ 20,601 మందిపై నిర్వహించిన ఓ సర్వేలో.. 94శాతం మంది ఇదే అభిప్రాయాన్ని వెలిబుచ్చారు. రైల్వేశాఖ ఇటీవల ప్రవేశపెట్టిన ఫ్లెక్సీ-పేపై కూడా 7,873 మంది అభిప్రాయాలను తెలుసుకుంది.. 61శాతం మంది ఫ్లెక్సీ పే అమలుతో పాటు.. రద్దీ లేని సమయాల్లో రైలు టికెట్ల ధరలు తగ్గించాలని అభిప్రాయపడ్డారు. కాగా, 7,076మందిపై నిర్వహించిన మరో సర్వేలో రైళ్లలో భద్రతా ప్రమాణాలను మెరుగుపరచాలని 44 శాతం మంది కోరారు.

'యాసిడ్' బాధితులకు కేంద్ర ఉద్యోగాల్లో కోటా

న్యూఢిల్లీ, జనవరి 28: యాసిడ్ దాడి బాధితులకు బాసటగా నిలిచే నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం తీసుకుంది. వివిధ కేంద్ర ప్రభుత్వ విభాగాల్లోని ఉద్యోగాల్లో వారికి ప్రత్యేక కోటా కల్పించనుంది. వీరితోపాటు ఆటిజం, మానసిక రుగ్మత, మేధో వైకల్యం కలిగిన వారికి ఈ కోటాలో ఉద్యోగం ఇవ్వాల్సిందిగా సూచిస్తూ సిబ్బంది, శిక్షణ శాఖ (డీవోపీటీ) అన్ని కేంద్ర ప్రభుత్వ విభాగాలకు లేఖ రాసింది. ఇందుకోసం వికలాంగులకు ఇప్పటివరకు ఉన్న మూడు శాతం రిజర్వేషన్‌ను నాలుగు శాతానికి పెంచుకోవచ్చని పేర్కొంది. వికలాంగుల హక్కుల చట్టం 2016 ప్రకారం ఈ మేరకు నిర్ణయం తీసుకోవచ్చని తెలిపింది. దీంతోపాటు వికలాంగ ఉద్యోగుల పట్ల ఎవరైనా వివక్ష చూపితే.. ఫిర్యాదు అందిన రెండు నెలల్లో చర్యలు చేపట్టాలని డీవోపీటీ సూచించింది.

నానో టెక్నాలజీతో 'మెమ్రిస్టర్' ఆవిష్కరణ



న్యూఢిల్లీ, జనవరి 28: ఎలక్ట్రానిక్ యుగంలో మరో సంచలనం నమోదైంది. ట్రాన్సిస్టర్‌కు ప్రత్యామ్నాయంగా.. దాని కంటే అతి చిన్న సైజులో ఉండే 'మెమ్రిస్టర్'ను శాస్త్రవేత్తలు రూపొందించారు. ట్రాన్సిస్టర్ మాదిరిగానే సర్క్యూట్లలో ఒక సెమీకండక్టర్‌గా పనిచేసే మెమ్రిస్టర్ (మెమొరీ + ట్రాన్సిస్టర్)లో.. జ్ఞాపకశక్తి ఎక్కువగా ఉంటుందని సౌతంప్టాన్ వర్సిటీ ప్రొఫెసర్ థెమిస్ ప్రోడ్రోమకీస్ తెలిపారు. ఒక స్విచ్‌కు 128 డీఎంల మేర దీని మెమొరీ ఉంటుంది. అంటే.. దీన్ని షట్‌డౌన్ చేసినా.. తిరిగి ఆన్ చేసినప్పుడు.. గతంలో ఏయే వివరాలను భద్రపరుచుకుందో.. తిరిగి గుర్తుచేసుకోగలదు.

త్వరలో ప్రభుత్వ సోషల్ మీడియా హబ్..!

న్యూఢిల్లీ, జనవరి 28: సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ 'సోషల్ మీడియా కమ్యూనికేషన్ హబ్'ను ఏర్పాటు చేసే ప్రయత్నాల్లో ఉంది. హిందీ, ఉర్దూ, ఇంగ్లిష్‌తో పాటు తెలుగు, మలయాళం, కన్నడ, బెంగాలీ, పంజాబీ, తమిళం వంటి ప్రాంతీయ భాషల్లోనూ ఏర్పాటు చేసే సోషల్ మీడియా హబ్ జిల్లాల్లోని పరిస్థితిని తెలుసుకునేందుకు, కేంద్ర పథకాల ప్రచారానికి ఉపయుక్తంగా ఉంటుందని భావిస్తోంది. ప్రభుత్వ విధానాలపై ప్రజల అభిప్రాయాన్ని క్షేత్ర స్థాయి నుంచి సేకరించేందుకు ప్రతి జిల్లాలో కాంట్రాక్టు ప్రాతిపదికన విలేకరులను కూడా నియమించుకుంటామని అధికారులు తెలిపారు.

సైబర్ నేరాల విచారణకు సమన్వయ కేంద్రం

కాగా, ఆర్థిక నేరాలు, మతకలహాలు, అశ్లీల దృశ్యాల ప్రసారం వంటి సైబర్ నేరాలను విచారించేందుకు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఒక ఉన్నత స్థాయి సమన్వయ కేంద్రాన్ని ఏర్పాటు చేయనుంది. జిల్లాల్లోనూ ఇలాంటి కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని రాష్ట్రాలకు సూచించింది. రాష్ట్రాల్లో సైబర్ ఫోరెన్సిక్ ట్రెయినింగ్ లేబరేటరీ అండ్ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటు కోసం పోలీసు శాఖకు రూ.83 కోట్లు విడుదల చేసింది. ఈ సమన్వయ కేంద్రం ద్వారా చిన్నారుల అశ్లీల దృశ్యాలు, మత, జాతి వివక్షను ప్రచారం చేసే వెబ్‌సైట్లను నిలిపివేస్తారు. అనుమానితుల జాబితాను సిద్ధం చేసి, వారి సమాచారాన్ని సైబర్ క్రైంను విచారిస్తున్న పోలీసులకు అవసరమైన అంతరంగిక సమాచారాన్ని అందజేస్తారు.

ఐఐఎంలో కేస్ స్టడీగా బాహుబలి



అహ్మదాబాద్, జనవరి 28: దర్శకధీరుడు రాజమౌళి తెరకెక్కించిన బాహుబలి చిత్రం ఇప్పుడు విద్యార్థులకు పాఠంగా మారబోతోంది. బాహుబలి రెండు భాగాలను ఐఐఎం-అహ్మదాబాద్‌లో కేస్‌స్టడీగా తీసుకుని, పరిశోధన చేయనున్నట్టు అక్కడి ప్రొఫెసర్ భరతన్ కందస్వామి తెలిపారు. కథ ఎంపిక, సీక్వెళ్ల నిర్మాణం, మార్కెటింగ్ మంత్ర, వసూళ్లు తదితర అంశాలతోపాటు డిజిటల్ మార్కెట్‌పై విద్యార్థులకు అవగాహన కల్పిస్తామని చెప్పారు.

క్రిప్టోకరెన్సీ ఎక్స్ఛేంజ్‌పై హ్యాకర్ల దాడి

టోక్యో, జనవరి 28: బిట్‌కాయిన్స్.. క్రిప్టోకరెన్సీ.. ఇప్పుడు వీటి ట్రెండ్ నడుస్తోంది. ఆదాయపుపన్ను శాఖకు దొరక్కుండా.. వీటిపై డబ్బు ఇన్వెస్ట్ చేయడం సేఫ్ అని చాలా మంది భావిస్తుంటారు. అదంత భద్రమైంది కాదని తేలిపోయింది. హ్యాకర్ల దెబ్బకు.. బిట్‌కాయిన్ ఎక్స్ఛేంజ్‌లే కూలిపోయాయి. వాటిల్లో ఇన్వెస్ట్ చేసిన వారి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. తాజాగా.. జపాన్‌లోని 'కాయిన్‌చెక్' బిట్‌కాయిన్/క్రిప్టోకరెన్సీ ఎక్స్ఛేంజ్‌పై హ్యాకర్లు పంజా విసిరారు. 380 మిలియన్ పౌండ్ల విలువ గల క్రిప్టోకరెన్సీని తస్కరించారు. కాయిన్‌చెక్ నిర్వాహకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే.. ఆ మొత్తం వెనక్కి వస్తుందనే నమ్మకం లేదని, అదే సమయంలో.. పెట్టుబడిదారులకు వారి డబ్బు తిరిగి ఇవ్వలేమని స్పష్టం చేశారు. 2014లో మెట్‌గాక్స్ అనే ఎక్స్ఛేంజ్‌పై దాడిచేసిన హ్యాకర్లు 460 మిలియన్ డాలర్లు కొల్లగొట్టడంతో.. ఆ కంపెనీ దివాలా తీసింది.

భిక్షాటననూ ఉద్యోగంగా గుర్తిస్తారా: చిదంబరం



న్యూఢిల్లీ, జనవరి 28: ప్రధాని మోదీపై కాంగ్రెస్ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి చిదంబరం విమర్శలు గుప్పించారు. ఆదివారం వరుస ట్వీట్లతో ఆయనపై విరుచుకుపడ్డారు. దేశవ్యాప్తంగా నిరుద్యోగుల సంఖ్య పెరిగిపోతున్నా ఉద్యోగాలను సృష్టించడంపై మోదీకి కనీస అవగాహన కలగడం లేదని విమర్శించారు. 'పకోడీలు అమ్ముకోవడం కూడా ఉద్యోగమేనని ప్రధాని అంటున్నారు. అలా అయితే భిక్షాటన కూడా ఉద్యోగమే. జీవనోపాధి కోసం తప్పనిసరి పరిస్థితుల్లో బిచ్చమెత్తుకుంటున్న పేదలు, దివ్యాంగులను కూడా ఉద్యోగులుగా గుర్తించాలి' అంటూ ట్వీట్ చేశారు. కాగా.. బిచ్చగాళ్లతో పోల్చుతూ పేదలను కాంగ్రెస్ ప్రభుత్వం అవమానిస్తోందని బీజేపీ ట్వీట్ చేసింది.

జయహో నారీ!

అన్ని రంగాల్లోనూ మార్గదర్శక పాత్ర

- ఒక్క బిడ్డ.. పది మంది కొడుకులతో సమానం
- 'మన్ కీ బాత్'లో ప్రధాని మోదీ



బడ్జెట్ సమావేశాలపై అఖిలపక్ష భేటీకి హాజరైన వివిధ పార్టీల నేతలతో మోదీ

న్యూఢిల్లీ, జనవరి 28: కొత్త సంవత్సరం తొలి 'మన్ కీ బాత్'లో ప్రధాని మోదీ నారీ శక్తికి జేజేలు పలికారు. మన సమాజంలో కనిపిస్తున్న సానుకూల పరివర్తనలో తమ వంతుగా కీలక పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. వివిధ రంగాల్లో దూసుకెళ్తూ.. గొప్ప గొప్ప మైలురాళ్లను చేరుకుంటూ మహిళాశక్తిని లోకానికి చాటుతున్నారని కొనియాడారు. ఆదివారం ఆకాశవాణిలో ఆయన 'మన్ కీ బాత్' ప్రసంగం ప్రసారమైంది. మహిళాశక్తిని ప్రశంసిస్తూనే.. పద్మ అవార్డుల ప్రక్షాళనను ఆయన ప్రత్యేకంగా వివరించారు. ఈ బహుమతుల ఎంపికలో పారదర్శకతతో వ్యవహరించడం వల్ల ఈసారి సామాన్యులకు కూడా అవి దక్కాయన్నారు. 'లక్ష్మీకుట్టి.. కేరళలోని కల్లార్‌లో ఉపాధ్యాయని. అయినా దట్టమైన అడవుల్లోని గిరిజన ప్రాంతంలో తన గుడిసెలోనే ఉంటోంది. తన జ్ఞాపకశక్తిలో ఉన్న 500 రకాల మౌలికా ఔషధాలను ఆమె తయారుచేస్తోంది. ఆమె సేవలకు గాను ఈ ఏడాది ఆమెకు పద్మశ్రీ అవార్డు దక్కింది. ఐఐటీ పట్టభద్రుడు అరవింద్ గుప్తా పేరు మీరు వినే ఉంటారు. ఉన్నత విద్యను అభ్యసించి కూడా.. పనికిరాని వస్తువులతో.. చిన్న పిల్లలు ఆడుకునే బొమ్మలను తయారు చేయడానికే తన జీవితాన్ని ఆయన అంకితం చేశారు. ఆయనకు కూడా పద్మశ్రీ లభించింది. సమాజంలో పరివర్తన తీసుకొచ్చేందుకు కృషిచేస్తున్నవారిని మేం సత్కరించాం. వీరు పెద్దపెద్ద నగరాల్లోను, పేపర్లు, టీవీల్లో కనిపించరు. ప్రకాశ్ త్రిపాఠి అనే ఓ పౌరుడు ఎన్ఎం యాప్‌లో.. ఫిబ్రవరి 1న దివంగత వ్యోమగామి కల్పనా చావ్లా వర్ధంతి అని గుర్తుచేశారు. ప్రపంచవ్యాప్తంగా కోట్ల మంది యువతకు ఆమె స్ఫూర్తిగా నిలిచారని పేర్కొన్నారు. 'దశ పుత్ర్ సమాన్‌కన్యా, దశ పుత్రాన్ ప్రవర్ధయన్.. యత్ ఫలమ్ లభతే మర్త్య, తత్ లభ్యమ్ కన్యకైకయా.. అంటే ఒక్క కుమార్తె పది మంది కుమారులతో సమానం' అన్న ప్రాచీన సంస్కృత శ్లోకాన్ని ఈ సందర్భంగా ఆయన ఉటంకించారు.

ప్రాణాంతక ఔషధాల ధరలు తగ్గించాం

'దర్శన్.. కర్ణాటకలోని మైసూరువాసి. తన తండ్రి చికిత్సకు ప్రతినెలా రూ.6000 ఖర్చయ్యేది. ప్రధానమంత్రి జన ఓషధి యోజన ఉందన్న సంగతి ఆయనకు తెలియదు. దీని గురించి తెలిశాక మందుల ఖర్చు 75 శాతం తగ్గిందని దర్శన్ మై గవ్ యాప్‌లో రాశారు. ఈ విషయాన్ని మన్ కీ బాత్‌లో ప్రస్తావించాలని నన్ను కోరారు. మహారాష్ట్రకు చెందిన మంగేశ్.. ఎన్ఎం మొబైల్ యాప్‌లో ఓ వృద్ధుడు, చిన్నపిల్లాడి ఫొటోను పోస్టు చేశారు. ఆ రాష్ట్రంలోని మోర్నా నది ప్రక్షాళన ఉద్యమంలో వారు పాల్గొంటున్నారు' అని వివరించారు. కర్ణాటక నుంచి పద్మశ్రీ పురస్కారానికి ఎంపికైన సీతవ్వ జోడట్టి గురించీ చెప్పారు. ఏడేళ్ల వయసులో దేవదాసిగా మారిన ఈమె.. దేవదాసి వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడారని, మహిళాభివృద్ధి సంస్థ సీఈవో స్థాయికి ఎదిగారని అన్నారు.

అవినీతిపై పోరుకు యువత సహకరించాలి: మోదీ

న్యూఢిల్లీ, జనవరి 28: అవినీతి వ్యతిరేక పోరాటంలో ఎవరినీ వదిలేది లేదని ప్రధాని మోదీ తేల్చిచెప్పారు. అభియోగాలు రుజువై ముగ్గురు మాజీ ముఖ్యమంత్రులు (లాలూప్రసాద్ యాదవ్, జగన్నాథ్ మిశ్రా, ఓంప్రకాశ్ చౌతాలా) జైళ్లలో మగ్గుతున్నారని గుర్తుచేశారు. ఆదివారమిక్కడ ఎన్‌సీసీ ర్యాలీలో ఆయన ప్రసంగించారు. ఆధార్ వినియోగాన్ని సమర్థించారు. దీనివల్ల సబ్సిడీల దుర్వినియోగం తగ్గి.. రూ.60 వేల కోట్ల ప్రజాధనం ఆదా అయిందన్నారు. నగదు రహిత లావాదేవీలు పెరగడానికి ఎన్‌సీసీ కేడెట్లు, యువత సాయపడాలని కోరారు. ప్రతి యువకుడు/యువతి కనీసం వంద మంది ప్రజలను సంప్రదించి.. ఇది జయప్రదమయ్యేట్లు చూడాలని విజ్ఞప్తి చేశారు. నల్లధనం, అవినీతిపై పోరాటం సుదీర్ఘంగా జరపాల్సి ఉంటుందని ప్రధాని చెప్పారు.

తక్షణ తలాక్, ఓబీసీ బిల్లులపై చర్చ

ఢిల్లీలో అఖిలపక్షం భేటీ

న్యూఢిల్లీ, జనవరి 28: పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు సోమవారం ప్రారంభం కానున్న నేపథ్యంలో ఈ సమావేశాల్లో ప్రవేశపెట్టే ముసాయిదా బిల్లులపై చర్చించేందుకు ఆదివారం ఇక్కడ అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. రాజ్యసభలో ఇంకా ఆమోదం పొందని తక్షణ తలాక్ బిల్లుతోపాటు, ఓబీసీ కమిషన్‌కు రాజ్యాంగ హోదా కల్పించే బిల్లును ఈ సమావేశాల్లో ప్రవేశపెట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. తక్షణ తలాక్ బిల్లు ద్వారా ముస్లిం మహిళల ఓటు బ్యాంకు, ఓబీసీ కమిషన్‌కు రాజ్యాంగ హోదా కల్పించే బిల్లు ద్వారా వెనుకబడిన తరగతుల ఓటు బ్యాంకు సాధించవచ్చని బీజేపీ ఆశాభావంతో ఉంది. తక్షణ తలాక్ బిల్లు ఆమోదానికి ఈ సారి ఏ ఒక్క అవకాశాన్నీ వదులుకునే ప్రసక్తే లేదని పార్లమెంటరీ వ్యవహారాలశాఖ మంత్రి అనంత్‌కుమార్ చెప్పారు. అయితే రాజ్యాంగ సంస్థలపై 'దాడి', జీఎస్టీ నేపథ్యంలో వర్తకుల దుస్థితి, అత్యాచారాలు పెరిగిపోతున్న అంశాలను లేవనెత్తడం ద్వారా ప్రభుత్వాన్ని ఇరుకున పడేయాలని ప్రతిపక్షాలు ప్రణాళికలు రూపొందించాయి. గత సమావేశాలను స్తంభింపజేసిన తక్షణ తలాక్ బిల్లును ఈ సారి కూడా ప్రతిపక్షాలు తీవ్రంగా వ్యతిరేకించే అవకాశం ఉందని రాజకీయ నాయకులు చెబుతున్నారు. ఉభయసభల ప్రతినిధుల సంయుక్త సమావేశాన్ని ఉద్దేశించి రాష్ట్రపతి కోవింద్ చేసే ప్రసంగంతో బడ్జెట్ సమావేశాలు ప్రారంభమవుతాయి. అనంతరం ఉభయసభల్లో ఆర్థిక సర్వే చర్చకు రానుంది. ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ఫిబ్రవరి 1న బడ్జెట్‌ను ప్రవేశపెడతారు. బడ్జెట్ తొలి దశ సమావేశాలు ఫిబ్రవరి 9న ముగుస్తాయి. తుది దశ సమావేశాలు మార్చి 5 నుంచి ఏప్రిల్ 6 వరకు జరుగుతాయి.



అగ్గువకే భారత్‌లో నివాసం!

ఇంటి అద్దెలు, కిరాణా సరుకులు చీప్

హ్యూస్టన్, జనవరి 28: 'అబ్బా.. ఏం ధరలు? ఇంటి అద్దెలు కట్టలేకపోతున్నాం.. మార్కెట్‌కు వెళ్లి ఏ సరుకూ కొనలేకపోతున్నాం.. అన్నీ మండిపోతున్నా'యని భారత్‌లోని సగటుజీవి నిట్టూర్చడం సర్వసాధారణమే. కానీ.. ప్రపంచ దేశాలతో పోలిస్తే మన దగ్గరే ధరలన్నీ తక్కువట!! ఈ విషయాన్ని అమెరికాకు చెందిన ఓ సంస్థ తన సర్వేలో తేల్చింది. ప్రపంచంలో అతితక్కువ ఖర్చుతో నివసించడానికి అనువైన దేశాలు ఏవంటే.. రెండోస్థానంలో భారత్ ఉందని వెల్లడైంది. ఇండియాలో ఇంటి అద్దెలు, సరుకుల ధరలు అగ్గువేనని తేలింది. ఏఏ దేశాల్లో నివాసయోగ్య పరిస్థితులు ఎలా ఉన్నాయని తెలుసుకునేందుకు హ్యూస్టన్‌కు చెందిన గో బ్యాంకింగ్ రేట్స్ అనే సంస్థ ఇటీవల ఓ సర్వేను నిర్వహించింది. కొనుగోలు శక్తి, అద్దెలు, కిరాణా సరుకులు, వినియోగదారుల ధరల సూచి అనే నాలుగు ప్రధానాంశాలను పరిగణనలోకి తీసుకొని మొత్తం 112 దేశాల్లో సర్వే చేపట్టింది. ఇందులో నివాసానికి అత్యంత చౌకైన దేశంగా ప్రథమస్థానంలో దక్షిణాఫ్రికా నిలువగా, ద్వితీయస్థానంలో భారత్ ఉంది. కోల్‌కతాలో ఓ వ్యక్తి నివసించడానికి నెలకు అయ్యే ఖర్చు 285 డాలర్లు (18వేల రూపాయలు) అని, ఇండియాలోని ఇతర నగరాల్లోనూ దాదాపు ఇలానే ఉందని సంస్థ పేర్కొంది. మన పొరుగుదేశాలైన కొలంబియా 13, పాకిస్థాన్ 14, నేపాల్ 28, బంగ్లాదేశ్ 40 స్థానాల్లో నిలిచాయి. ఇక అత్యంత ఖరీదైన దేశాల జాబితాలోకి వస్తే.. ముందువరుసలో బెర్ముడా (112).. తరువాత వరుసగా బహమాస్ (111), హాంకాంగ్ (110), స్విట్జర్లాండ్ (109), ఘనా (108) నిలిచాయి.

మే 2 నుంచి జేఈఈ అడ్వాన్స్‌డ్ దరఖాస్తులు

- 14నుంచి హాల్‌టికెట్లు... 20న పరీక్ష
- జూన్ 10న ఫలితాలు
- ఏపీలో 10, తెలంగాణలో 6 పరీక్ష కేంద్రాలు

హైదరాబాద్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ప్రతిష్ఠాత్మక ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ)ల్లో ప్రవేశాల కోసం నిర్వహించే జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షకు మే 2 నుంచి దరఖాస్తులను స్వీకరించనున్నట్లు ఐఐటీ-కాన్పూర్ వెల్లడించింది. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు మే 14 నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపింది. జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షను మే 20న నిర్వహించనున్న సంగతి తెలిసిందే. జేఈఈ మెయిన్ పరీక్ష రాసిన వారిలో టాప్ 2.24లక్షల మంది విద్యార్థులు జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు అర్హత సాధించనున్నారు. గతేడాది కేవలం 2.20లక్షల మందిని అడ్వాన్స్‌డ్‌కు ఎంపిక చేయగా ఈ ఏడాది మరో 4వేల మంది విద్యార్థులను అదనంగా ఎంపిక చేయనున్నారు. ఈ ఏడాది నుంచి అడ్వాన్స్‌డ్ పరీక్షను ఆన్‌లైన్ విధానంలోనే నిర్వహించనున్నారు. పరీక్ష నిర్వహణ కోసం ఏపీలో 10, తెలంగాణలో 6 మొత్తం 16 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. తెలంగాణలో హైదరాబాద్, కరీంనగర్, ఖమ్మం, మహబూబ్‌నగర్, నిజామాబాద్, వరంగల్, ఏపీలో అనంతపూర్, ఏలూరు, గుంటూరు, కాకినాడ, కర్నూల్, నెల్లూరు, ఒంగోలు, రాజమండ్రి, తిరుపతి, విజయవాడల్లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. అడ్వాన్స్‌డ్ ఫలితాలను జూన్ 6న వెల్లడించనున్నట్లు ఐఐటీ-కాన్పూర్ ఒక ప్రకటనలో పేర్కొంది. అడ్వాన్స్‌డ్‌కు ఎంపిక చేసే 2.24లక్షల మంది విద్యార్థుల్లో ఓపెన్ కేటగిరిలో 1,13,120, ఓబీసీ కేటగిరిలో 60,480, ఎస్సీ కేటగిరిలో 33,600, ఎస్టీ కేటగిరిలో 16,800 మంది విద్యార్థులను ఎంపిక చేయనున్నారు.

ముఖ్యమైన తేదీలు	
రిజిస్ట్రేషన్(దరఖాస్తు)	02-05-2018 నుంచి 07-05-2018 వరకు
ఫీజు చెల్లించేందుకు	08-05-2018
హాల్‌టికెట్లు	14-05-2018 నుంచి 20-05-2018
అడ్వాన్స్‌డ్ పరీక్ష	20-05-2018
కీ విడుదల	29-05-2018
కీ పై అభ్యంతరాల స్వీకరణ	29-05-2018 నుంచి 30-05-2018 వరకు
అడ్వాన్స్‌డ్ ఫలితాలు	10-06-2018
సీట్ల కేటాయింపు	19-06-2018 నుంచి 15-07-2018 వరకు

మైనస్ 28 డిగ్రీల చలిలో తెలుగు విద్యార్థుల పాట్లు

గడ్డకట్టిన 'కిర్గిస్తాన్'.. ఎమర్జెన్సీ ప్రకటించిన ప్రభుత్వం



గడ్డ కట్టుకుపోయిన నది, (ఇన్‌సెట్) బిస్కెక్‌లో మంచులో కూరుకుపోయి మృతిచెందిన కుక్క

పటాన్‌చెరు రూరల్, జనవరి 28: కిర్గిస్థాన్ రాజధాని బిస్కెక్‌లో ఉష్ణోగ్రతలు పడిపోవడంతో తెలుగు విద్యార్థులు గజగజా వణికిపోతున్నారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన వందలాది మంది విద్యార్థులు బిస్కెక్‌లో వైద్య విద్య అభ్యసిస్తున్నారు. ముఖ్యంగా.. సంగారెడ్డి, పటాన్‌చెరు, ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ, ముత్తంగి తదితర ప్రాంతాల బాలికలు బిస్కెక్‌లో చదువుతున్నారు. ఉష్ణోగ్రతలు మైనస్ 28 స్థాయికి పడిపోవడంతో విద్యార్థులు హాస్టళ్ల నుంచి బయటకు రాలేక ఇబ్బందులు పడుతున్నారు. కాగా మంచులో చిక్కుకుని ఓ కుక్క మృతి చెందినా మైనస్ డిగ్రీల ఉష్ణోగ్రతలకు చెక్కుచెదరకుండా అలాగే నిలవడం గమనార్హం.

అబుధాబీలో ఆలయ శంకుస్థాపనకు మోదీ వచ్చేనా?

- యూఏఈలో పర్యటన ఖరారైనా తొలగని అనిశ్చితి

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

అబుధాబీలో హిందూ ఆలయ శంకుస్థాపనకు ప్రధాని నరేంద్రమోదీ హాజరవుతారా? లేదా? అనే విషయంపై అనిశ్చితి కొనసాగుతోంది. యూఏఈ పర్యటనలో భాగంగా ఫిబ్రవరి 11న దుబాయిలో జరిగే ప్రవాసీయుల సమావేశానికి మోదీ హాజరుకానున్నారు. ఈ క్రమంలో అబుధాబీలో జరిగే కార్యక్రమాన్ని లైవ్ స్ట్రీమ్ ద్వారా వీక్షిస్తారని అధికార వర్గాలు చెబుతుండగా.. అక్కడ ఆలయ నిర్మాణానికి భూమి పూజలో పాల్గొంటారని అనధికార వర్గాలు చెబుతున్నాయి. అబుధాబీలో గుజరాత్‌కు చెందిన స్వామి నారాయణ్ సంస్థ ఇప్పటికే ధార్మిక కేంద్రాన్ని నిర్వహిస్తుండగా, ఓ ఆలయాన్ని నిర్మించాలని కొంత కాలంగా ప్రయత్నిస్తోంది. ప్రధాని మోదీ విజ్ఞప్తి మేరకు అబుధాబీ యువరాజు షేక్ మహ్మద్‌బిన్ జాయద్ ఆలయానికి స్థలం కేటాయించేందుకు అంగీకరించారు. భారత్‌లోని వివిధ ప్రాంతా ల్లో శాఖలు కలిగిన యూఏఈ ఎక్స్ఛేంజీ అధినేత, కర్ణాటక వ్యాపారవేత్త బీఆర్.శెట్టి ఈ ఆలయ నిర్మాణానికి సారథ్యం వహిస్తున్నారు.



తిండి లేదు.. తాగేందుకు నీళ్లు లేవు.. అలాగే వారం రోజులు గడిపేశారా ఏడుగురు! ఆదుకునే వారి కోసం పసిఫిక్ సముద్రంలో ప్రాణాలు అరచేత పట్టుకుని ఎదురుచూస్తున్నారు. దక్షిణ పసిఫిక్ సముద్రంలో రెండు దీవుల మధ్య ప్రజలను చేరవేసే ఫెర్రీ ఒకటి వారం రోజుల క్రితం కిరిబాటి దీవుల సమీపంలో నీటమునిగింది. అందులో ఉన్న 50 మందిలో ఏడుగురు ఓ చిన్న డింగీ సాయంతో బయటపడ్డారు. ఆదివారం వారిని న్యూజిలాండ్ గస్తీ విమానం గుర్తించింది. ఆ సమీపంలోనే ఉన్న ఆ దేశపు నౌక వారిని రక్షించింది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao, on behalf of Aamoda Publications Pvt. Ltd., at the Aamoda press at Gollapalli road.,Dharmaram(B)Village,Dichpally Mandal, Nizamabad- 503230. Editor: K. Srinivas, Ph. Nos. 08461-245301, 245306. Fax 245307, RNI NO: AP TEL /2004/12975 .Managing Director : Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.